

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం | 2-2-2019 | పేజీలు: 20 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 59 సంచిక: 288 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 9.19 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 11.55 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ. 7.50-9.37; దుర్ముహూర్తం: ఉ. 6.53-8.22; అమృతఘడియలు: రా. 6.33-8.20; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.06 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai




బడ్జెట్ జనా'కర్షక'ం

* షరతులు వర్తిస్తాయి

ఐదేళ్ల మోదీ పాలనపై గోయల్ ప్రగతి నివేదిక







పదేళ్ల భవిష్యత్తుపై పది లక్ష్యాలతో విజన్-2030

కోట్ల మాట..
ఓట్ల వేట

చిన్న రైతుకు 6000 | మోదీ పెట్టుబడి సాయమిది

ఐదెకరాల్లోపు రైతులకే వర్తింపు.. అరెకరం ఉన్నా.. ఐదెకరాలున్నా 6 వేలే

ఏడాదికి 3 విడతల్లో చెల్లింపు.. 1.12.18 నుంచే పీఎం-కిసాన్ అమలు

భారం రూ.75 వేల కోట్లు | లబ్ధిదారులు 12 కోట్ల మంది




అసంఘటిత కార్మికులకు 3 వేలు పింఛన్!

60 సంవత్సరాలు దాటిన వారికి నెలవారీ పెన్షన్

కార్మికులు నెలకు రూ.100 చెల్లించాలి

భారం రూ.500 కోట్లు | లబ్ధిదారులు 10 కోట్ల మంది



5 లక్షల వరకు ఐటీ పడదు

పన్ను పడే ఆదాయం 5 లక్షలు దాటితే లబ్ధి లేదు

శ్లాబులన్నీ యథాతథం.. ఉద్యోగులు ఉసూరు

ప్రామాణిక తగ్గింపు మరో రూ.10 వేలతో సరి

భారం రూ.18,500 కోట్లు | లబ్ధిదారులు 3 కోట్ల మంది

ప్రత్యేక కథనాలు లోపలి పేజీల్లో...

24 లక్షల కోట్లతో ఎన్డీయే తాత్కాలిక బడ్జెట్

ఎన్నికల వేళ 25 కోట్ల మంది ఓట్లపై గురి

ఉపాధి హామీ పథకానికి రూ.60 వేల కోట్లు

రూ.3 లక్షల కోట్లు దాటిన రక్షణ బడ్జెట్.. తొలిసారి లక్ష కోట్లు దాటిన హోం పద్దు

జీఎస్టీ రాబడిలో 14% రాష్ట్రాలకే.. సినీ నిర్మాతలకూ సింగిల్ విండో క్లియరెన్స్

గోవుల రక్షణకు కామధేను పథకం.. గోకుల్ మిషన్‌కు 750 కోట్లు కేటాయింపు

ప్రత్యక్ష పన్నుల ఆదాయం నాలుగేళ్లలో రెట్టింపు.. రూ.12 లక్షల కోట్లకు చేరిక

పేరుకు అది తాత్కాలిక బడ్జెట్
...కానీ నిజానికది ఓట్ల అకౌంట్

పూర్తి స్థాయి బడ్జెట్ కాదన్నారు
...కానీ అందులో పన్ను రాయితీలు, పథకాలు

పేరుకు ఐటీ రాయితీ 5 లక్షలకు పెంపు
...కానీ ఎగువ మధ్యతరగతికి వర్తించదు

వ్యవసాయానికి రూ.6 వేల వార్షిక సాయం
...కానీ ఒక ఎకరానికి కాదు, ఒక రైతుకు

అసంఘటిత కార్మికులకు నెలకు 3 వేల పెన్షన్
...కానీ ప్రభుత్వ కేటాయింపు నామమాత్రమే



నరేంద్ర మోదీ ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' బడ్జెట్ తీరు ఇదీ! లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో... కోట్ల సంఖ్యలో ఓట్లకు గురిపెట్టి ఈ బడ్జెట్‌కు రూపుదిద్దారు. ముఖ్యంగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కారణమైన రైతులు, మధ్య తరగతి ప్రజలపై వరాల జల్లు కురిపించారు. వేతన జీవులకు వల విసురుతూ రూ.5 లక్షల వరకూ ఆదాయపు పన్ను ఉండదని ప్రకటించారు. వ్యవసాయ పెట్టుబడి కింద 2 హెక్టార్లలోపు భూమి ఉన్న రైతులకు రూ.6 వేల వార్షిక సహాయాన్ని మూడు విడతలుగా అందిస్తామని వెల్లడించారు. అసంఘటిత

మిగతా 6వ పేజీలో...



ఇది ప్రజలందరి బడ్జెట్. భారత్‌ను అభివృద్ధి పథంలో నడిపించే బడ్జెట్. 12 కోట్ల మంది రైతులు, వారి కుటుంబాలు... మూడు కోట్ల మంది వేతన జీవులు, వారి కుటుంబాలు... అసంఘటిత రంగాల్లో ఉన్న 30-40 కోట్ల మంది కార్మికులు... ఈ బడ్జెట్‌తో లబ్ధి పొందుతారు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమే. దేశంలో 'నయా మధ్యతరగతి' ఆవిర్భవిస్తోంది. -ప్రధాని మోదీ



ఈ గడ్డపై పుట్టి..

కేంద్రానికి ఊడిగం చేస్తారా?

నా రక్తం పొంగుతోంది

సిగ్గులేకుండా అన్యాయాన్ని సమర్థిస్తారా?

ప్రశ్నిస్తే నన్ను జైల్లో పెడతారా?

వ్యతిరేకంగా ఉంటే ఫినిష్ చేస్తారా?

ఎమ్మెల్యేలుగా ఉండే అర్హత మీకు లేదు

బీజేపీ నేతలపై చంద్రబాబు నిప్పులు

శాసనసభ వేదికగా కేంద్రంపై ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి అన్ని విధాలుగా అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని ప్రశ్నించకుండా.. రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్రాన్ని వెనకేసుకొస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్రంలో ఉంటూ కేంద్రానికి ఊడిగం చేస్తున్నారని అసెంబ్లీ సాక్షిగా శివాలెత్తిపోయారు. ఏమాత్రం సిగ్గులేకుండా రాష్ట్రంలో మాట్లాడుతున్నారని, తన రక్తం పొంగిపోతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు తమకు జరుగుతున్న అన్యాయంపై రోడ్డుమీదకొచ్చి పోరాడుతుంటే.. ఈ గడ్డపై పుట్టిన బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభలో

మిగతా 5వ పేజీలో...

బంద్ ప్రశాంతం

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం

రోడ్డెక్కిన ప్రజలు, ప్రజాసంఘాలు, పార్టీలు

2



ఆంధ్రకు శూన్యమే

అనేక సంస్థలకు కేటాయింపుల్లేవు

మూడు సంస్థలకు అరకొర నిధులు

పారిశ్రామిక వడ్డీ రాయితీలు సున్నా

మళ్లీ నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ నిరాశే మిగిలింది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఏపీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మాటల్లో చెబుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు... చేతల్లో మాత్రం ఆ ఉదారత చూపెట్టలేదు. పైగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు చేశారు. రాష్ట్ర హక్కులు, హామీల అమలు కోసం అధికార టీడీపీ సహా రాజకీయ పార్టీలు చేస్తున్న ఆందోళనలను

మిగతా 17వ పేజీలో...



కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ హత్య

3

కృష్ణాజిల్లా నందిగామ మార్గంలో కారులో జయరామ్ మృతదేహం

వ్యాపార వివాదాలే కారణమా?

అదుపులో జయరామ్ సోదరి









పరంజ్యోతి

ఆశాపాశ శతైర్బద్ధాః..



మిథ్య అంటే.. లేనిదని కాదు. ఉన్నట్లు కనిపించినా శాశ్వతత్వం లేనిది, తాత్కాలికమైనది. తాత్కాలికమైనదేది సత్యం కాదు. శాశ్వతం కాదు. కంటికి కనిపించేవన్నీ నిజాలుగా, శాశ్వతాలుగా భావించడం మనం చేస్తున్న మొదటి తప్పు. ఆదిమధ్యాంతరహితుడై పరమాత్మ ఒక్కడే సత్యం, నిత్యం, శాశ్వతం అని గ్రహించాలి. ఈ ప్రపంచం పరమాత్మ వ్యక్త రూపం. పరమాత్మ.. ప్రపంచం యొక్క అవ్యక్త రూపం. చిత్రమేమంటే అశాశ్వతమైన, తాత్కాలికమైన శరీరం విషయంలో మన దృక్పథం భిన్నంగా ఉంటుంది. శరీరంపై అధిక శ్రద్ధ కనబరుస్తాం. కానీ అది తప్పు. శరీరావరణతో అంతర్యంలో జ్యోతి స్వరూపంగా ఉండే పరమాత్మ ప్రతిరూపమైన ఆత్మ మాత్రమే శాశ్వతమని.. ఆత్మ ఉపాధిగా ధరించిన శరీరం అశాశ్వతమని తెలుసుకోవాలి. నిజానికి మనం వెతికేది మనలో ఉన్నదాని గురించే. అయినా పోగొట్టుకొన్నామన్న భ్రాంతిలో దాన్ని, మళ్లీమళ్లీ వెతుకుతున్నాం.

ఆశాపాశ శతైర్బద్ధాః కామక్రోధ పరాయణాః
ఈహంతే కామ భోగార్థం అన్యాయేనార్థ సంచయాన్

..అన్నాడు గీతాచార్యుడు. వందలకొద్దీ ఆశా పాశాలు బంధించగా కామక్రోధాది, అరిషడ్వర్గాలకు బానిసలై అన్యాయంగా అక్రమంగా ధనాన్ని సంపాదించి అక్రమ వర్తనులై సంచరిస్తారు కొందరు. అదంతా వారి ఇంద్రియసుఖాల కోసమే. అలాంటివారిని అనేకమందిని ఈ మిథ్యా జగత్తులో దర్శిస్తూ ఉంటాం. అట్టివారి జీవితకథలన్నీ చివరికి పరమ విషాదంగా ముగిసిపోతాయి. ఈగకు శ్లేష్మం, పందికి బురద, పురుగుకు మలం ఇష్టమైనట్లు, ఆశ, వ్యామోహాలు మనలను రంగురంగుల మిథ్యా ప్రపంచం వైపు నడిపించి, అందులో ఉంచి, బంధనాల్లో కట్టి పడేసి శాశ్వతంగా లేవకుండా చేస్తుంటాయి. ఆ సమయంలో భగవంతుడిని మరచిపోతాం. శిథిలాలయంలా మారిపోయిన శరీరం నుంచి ఎప్పుడు నిష్క్రమిద్దామా అని ఆత్మ ప్రయాణ సన్నాహంలో ఉన్నప్పుడు ఆ ప్రయత్నం చేసినా.. జీవుడి చివరి ప్రార్థన ఆలకించే ఓపిక, ఒద్దిక దానికి ఉండవు. అందుకే ఓపిక ఉన్నప్పుడే భక్తి మార్గాన్ని అనుసరించి పరమాత్మను పట్టుకోవాలి. శక్తిమంతమైన మనసుతో సదా సత్ సంకల్పాలను మాత్రమే చేస్తూ ఈ మాయామేయ జగం నిత్యమని, సత్యమని భావించక.. ఆధ్యాత్మిక ఉన్నతికై అంకితభావంతో పని చేయాలి.

- ఎస్.ఆర్.భల్లం, 9885442642



విజయవాడ బస్ స్టేషన్‌లో నిలిచిపోయిన బస్సులు



నెల్లూరులో మూతపడిన వాణిజ్య సముదాయాలు

బంద్ ప్రశాంతం

హోదా, హామీల అమలు కోసం రోడ్డెక్కిన జనం

ఆర్టీసీ డిపోల ముందు ప్రజాసంఘాలు, పార్టీల మహాధర్నాలు

- పలుచోట్ల మోదీ దిష్టిబొమ్మలు దహనం
- స్వచ్ఛందంగా విద్యాసంస్థలు, షాపులు మూత
- నల్లబ్యాడ్జీలు-చొక్కాలతో టీడీపీ నిరసనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

హక్కుల సాధన కోసం రాష్ట్ర ప్రజలు రోడ్డెక్కారు. విభజన కష్టాలు ఢిల్లీ ప్రభుత్వానికి వినిపించేలా నినదించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతోపాటు విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యే క హోదా, విభజన హామీల సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల కార్యకర్తలు శుక్రవారం బంద్‌లో పాల్గొన్నారు. నిరసనకారులు ఆర్టీసీ బస్‌డిపోల వద్దకు చేరుకుని ఆందోళన చేయడంతో ప్రజా రవాణా ఆగిపోయింది. విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. దీంతో, బంద్ ప్రశాంతంగా జరిగింది. బీజేపీ, వైసీపీ, జనసేన మినహా అన్ని పార్టీలు బంద్‌కు మద్దతిచ్చాయి. కాంగ్రెస్, తెలుగుదేశం, వామపక్షాలు ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొన్నాయి. కొన్ని చోట్ల మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు బంద్‌కు సంఘీభావం తెలియజేస్తూ నల్లచొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు, అమరావతి జేఏసీ, లారీ యజమానుల సంఘం, ప్రైవేటు బస్సుల అసోసియేషన్, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్‌కు మద్దతు పలికాయి. విజయవాడలో ప్రధాన బస్టాండ్ ఎదుట హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మహాధర్నా నిర్వహించారు. బస్సులను అడ్డుకోవద్దన్న పోలీసులతో చలసాని వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పలు బస్‌డిపోల ముందు నిరసనకారులు ధర్నా నిర్వహించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దంటూ రవాణాను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. దీంతో, మధ్యాహ్నం నుంచి బస్సులు తిరిగాయి. ఏపీజేఏసీ ఆధ్వర్యంలో విజయవాడ గొల్లపూడిలో, ఏపీఎన్జీవో ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆందోళన చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రైల్వే స్టేషన్‌లో ఆందోళన చేశారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు నల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు. అనంతపురంలో జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు, మేయర్ స్వరూప ఆధ్వర్యంలో, పెనుకొండలో ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో, ధర్మవరంలో ఎమ్మెల్యే సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. కాకినాడలో టీడీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి బంద్ పాటించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో విజయవాడ రామవరప్పాడులో నల్లచొక్కాలతో నిరసన తెలిపారు. ఒంగోలులో టీడీపీ కార్యకర్తలు మోకాళ్లపై నిలిచి నిరసన వ్యక్తం చేశారు. ఏలూరులో జనసేన కార్యకర్తలు మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.



విజయవాడ ప్రధాన బస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న చలసాని, రఘువీరా, సీపీఐ నాయకులు

రాష్ట్రానికి హోదా ఇవ్వాల్సిందే!

- కళ్లకు గంతలతో అమరావతిలో ఉద్యోగుల ర్యాలీ
- హైదరాబాద్‌లో హెచ్ఆర్సీ ఉద్యోగుల మౌన ప్రదర్శన

అమరావతి/హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ప్రభుత్వ ఉద్యోగులు కదంతొక్కారు. విభజన చట్టంలోని హామీల ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి సచివాలయ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని ర్యాలీ నిర్వహించారు. తక్షణమే ఏపీకి ప్రత్యే క హోదా, విభజన హామీలు నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ.. హోదా ఇవ్వకుండా కేంద్రం నాలుగేళ్లుగా నాటకమాడిందని విమర్శించారు. మరోపక్క, హైదరాబాద్‌లోని ఏపీ హెచ్ఆర్సీ కార్యాలయంలో 20 మంది ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో హెచ్ఆర్సీ భవనం ఎదుట మౌన ప్రదర్శన నిర్వహించారు. విభజన చట్టంలోని హామీల అమలులో కేంద్రం మొండి చేయి చూపిస్తోందని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుమార్ విమర్శించారు.



కళ్లకు గంతలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

పడిపోయిన చలసాని.. ఉద్రిక్తత



చలసానిని అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించిన పోలీసులు

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా విజయవాడ బెంజ్‌సర్కిల్‌లో కృష్ణాజిల్లా లారీ ఓనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. ధర్నా చేస్తామని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు పట్టుబట్టారు. దీనికి సెంట్రల్ జోన్ ఏసీపీ అంకినీడి ప్రసాద్ ఒప్పుకోకపోవడంతో వాగ్వాదం జరిగింది. ఏసీపీ వాదనతో సంబంధం లేకుండా చలసాని శ్రీనివాస్‌తోపాటు లారీ యూనియన్ నేతలు రోడ్డు మధ్యలోకి వచ్చారు. అడ్డుకునే క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు చలసానిని జీపు ఎక్కించే క్రమంలో తోసేయడంతో ఆయన కింద పడిపోయారు. మొత్తం 10 మందిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఢిల్లీలో ఉన్న ఎంపీ కేశినేని నాని.. ఏసీపీతో ఫోన్లో మాట్లాడారు. 'బెంజ్ సర్కిల్ సెంటర్‌లో ట్రాఫిక్ బిజీగా ఉంది. సెంటర్లో కాకుండా పక్కన ధర్నా చేసుకోవచ్చని చెప్పాం. సెంటర్లోనే చేస్తామన్నారు. అందుకే అరెస్టు చేశాం' అని ఏసీపీ చెప్పారు.



ఏపీజేఏసీ అమరావతి ఉద్యోగుల ర్యాలీ



జస్టిస్ సునీల్ చౌదరిని సత్కరిస్తున్న తాత్కాలిక సీజే ప్రవీణ్‌కుమార్

జస్టిస్ సునీల్ చౌదరికి వీడ్కోలు

- రేపు పదవీ విరమణ చేయనున్న న్యాయమూర్తి

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్ చౌదరికి జడ్జిలు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ నెల 3న ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో.. తాత్కాలిక సీజే ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం ఫుల్‌కోర్టు సమావేశమై జస్టిస్ సునీల్ చౌదరిని సత్కరించింది. తనదైన శైలిలో సునీల్ చౌదరి.. వేలాది కేసులను పరిష్కరించారని తాత్కాలిక సీజే గుర్తుచేశారు. అనంతరం ఏపీ బార్ కౌన్సిల్ కార్యాలయంలో హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ జరిగింది. తాత్కాలిక సీజే ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ ఘంటా రామారావు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ రామన్నదొర, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. సన్మానం తర్వాత జస్టిస్ సునీల్ చౌదరి మాట్లాడుతూ.. 'గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన న్యాయవాదులు ఏమాత్రం భయపడకుండా వృత్తిపట్ల శ్రద్ధతో, అంకితభావంతో కృషి చేస్తే.. అనుకున్న విజయాలను అందుకుంటారు' అని సూచించారు. కాగా, జస్టిస్ సునీల్ చౌదరి పదవీ విరమణతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 12కు తగ్గింది. ప్రకాశం జిల్లా కారంచేడులోని వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన జస్టిస్ టి.సునీల్ చౌదరి, అంచెలంచెలుగా న్యాయవాద వృత్తిలో రాణించారు. ఆంధ్రా యూనివర్శిటీ నుంచి లా పట్టా పొంది.. 1984లో న్యాయవాద వృత్తిలోకి అడుగు పెట్టారు. 1988 నుంచి హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టారు.

గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్ మార్చి 31న

- ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల రీషెడ్యూల్
- మరో 3 పోస్టుల పరీక్షల తేదీల్లో మార్పులు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గత ఏడాది జారీజేసిన నాలుగు నోటిఫికేషన్లకు సంబంధించి.. పరీక్షల తేదీలను సవరించింది. ఇందులో ప్రధానమైన గ్రూప్-1 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ తేదీని 21 రోజుల పాటు పొడిగించింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పోస్టులకు మెయిన్స్ తేదీలను, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్ పోస్టులకు స్క్రీనింగ్ టెస్ట్ తోపాటు మెయిన్స్ తేదీలను కూడా రీషెడ్యూల్ చేసింది. పరీక్షల ప్రిపరేషన్‌కు సమయం చాలదన్న అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కానీ పాలనాపరమైన కారణాల వల్ల రీషెడ్యూల్ చేసినట్లు పేర్కొంది.

హార్టికల్చర్ ఆఫీసర్స్ నోటిఫికేషన్ రద్దు :

2018 డిసెంబర్ 13న విడుదల చేసిన హార్టికల్చర్ ఆఫీసర్స్ నోటిఫికేషన్ (నెం.12/2018)ను ఏపీపీఎస్సీ రద్దు చేసింది. ఈ పోస్టుల విద్యార్హతలను అగ్రికల్చర్ అండ్ కో-ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ జనవరి 18న జీ.వో 3 ద్వారా సవరణ చేసిన నేపథ్యంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఫీజు చెల్లించిన అభ్యర్థులకు త్వరలో రిఫండ్ చేస్తామని తెలిపింది.

పరీక్షల రివైజ్డ్ షెడ్యూల్ ఇలా ...

పోస్టు పేరు	నోటిఫై చేసిన రాత పరీక్ష తేదీ	రివైజ్ అయిన పరీక్ష తేదీ
గ్రూప్-1 సర్వీసెస్ (27/2018)	10.03.2019 (స్క్రీనింగ్ టెస్ట్)	31.03.2019 (స్క్రీనింగ్ టెస్ట్)
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (09/2018)	17.02.2019 (స్క్రీనింగ్ టెస్ట్)	01.04.2019, 02.04.2019 (మెయిన్స్)
17.02.2019 (స్క్రీనింగ్ టెస్ట్)	29.04.2019, 30.04.2019 (మెయిన్స్)	ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ (10/2018)
24.02.2019 (స్క్రీనింగ్ టెస్ట్)	28.04.2019, 29.04.2019, 30.04.2019(మెయిన్స్)	10.03.2019 (స్క్రీనింగ్ టెస్ట్) 14.05.2019, 15.05.2019, 16.05.2019 (మెయిన్స్)
అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్స్ (15/2018)	03.04.2019/04.04.2019	09.05.2019/10.05.2019

ఇక అమీతుమీ!

- ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందాం: సీఎం
- అమెరికాలోని తెలుగు విద్యార్థులకు భరోసా

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం రాష్ట్ర స్థాయిలో నిరసనలు, ఢిల్లీలో ధర్మపోరాట దీక్ష, బీజేపీయేతర జాతీయ పార్టీలతో కలిసి నిరసనలు, రాష్ట్రపతికి వినతి పత్రాల కార్యక్రమాల తర్వాత.. ప్రజా క్షేత్రంలోనే ప్రధాని మోదీ/బీజేపీపై అమీతుమీ తేల్చుకుందామని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర హక్కుల కో సం పోరాడేవారికి అండగా ఉంటామన్నారు. 'ఎలక్షన్ మిషన్ -2019'పై టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, బూత్ స్థాయి కన్వీనర్లతో శుక్రవారం ఉదయం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'నేటి(శుక్రవారం) నుంచి 10 వరకు రాష్ట్రస్థాయిలో నిరసనలు, 11 నుంచి 14వరకు ఢిల్లీలో ధర్మపోరాటం. జాతీయ పార్టీలతో కలిసి నిరసనలు తెలిపి, తర్వాత ప్రజల్లోకి వెళ్తాం. మన నిరసనలు శాంతియుతంగా తెలిపాలి. ప్రత్యేక హోదా ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు ఎత్తివేశాం. సమైక్యాంధ్ర ఆందోళనల్లో పాల్గొన్న వారిపైనా కేసులు తీసేశాం' అని తెలిపారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించిన మోదీ విశాల దృక్పథం గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. అసలు బీజేపీకి విశాల దృక్పథం ఎక్కడుందని నిలదీశారు. కాపులకు 5% రిజర్వేషన్లపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని.. కాపు యువతరం టీడీపీకి అండగా ఉండాలని చంద్రబాబు కోరారు. కాగా, అమెరికాలోని తెలుగు విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం లేఖలు రాసిందని ఏపీ భవన్ ద్వారా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

లోకం తీరు



వీళ్లు మునులు కాదు... నిరుద్యోగులట సార్..! ఈ బడ్జెట్‌లో ఉచిత క్షవర పథకాన్ని ప్రవేశపెట్టాలని అడగడానికొచ్చారు!!


చలికాలం

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	32.0	16.0
హైదరాబాద్	29.6	17.1
నెల్లూరు	29.5	21.0
గుంటూరు	29.4	15.9
విజయనగరం	29.0	16.0

ఉత్తర కోస్తాలో చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో నెలకొన్న వాతావరణం ప్రభావంతో ఉత్తర కోస్తాలో చలిగాలులు వీచాయి. కోస్తా, రాయలసీమల్లో కూడా పలుచోట్ల చలి కొనసాగింది. అయితే తూర్పుగాలులతో మధ్య కోస్తాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరగ్గా ఉత్తర కోస్తాలో మాత్రం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం కళింగపట్నంలో 14 డిగ్రీలు నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో ఉత్తర కోస్తాలో చలి తీవ్రత కొనసాగుతుందని, మిగిలిన ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. తూర్పుగాలుల ప్రభావంతో కోస్తాలో మంచు కురుస్తోందని పేర్కొన్నారు.

సాధువులు, సన్యాసులు ధూమపానాన్ని త్యజించాలి



సాధువులు, సన్యాసులు ధూమపానాన్ని త్యజించాలి. మనం రాముడిని, కృష్ణుడిని పూజిస్తాం. వాళ్లెప్పుడూ జీవితంలో ధూమపానం చేయలేదు. అలాంటప్పుడు మనమెందుకు పొగ తాగాలి? నేను యువతరాన్ని ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వ్యసనం నుంచి విముక్తులను చేశాను. అలాంటప్పుడు మహాత్ములు దాన్ని ఎందుకు వదల్లేరు?

- యోగా గురు రాందేవ్ బాబా

ఈ దేశం హిందువులది



ఈ దేశం హిందువులది. అయితే, పొరుగు దేశాల నుంచి శరణార్థులుగా వచ్చినవారు ఈ దేశ పౌరులు కావొచ్చు. ఈ దిశగా తొలిసారి చట్టం చేసింది మోదీ సర్కారే. రామ మందిర నిర్మాణం కోసం మనం చేసే పోరాటాల వల్ల బీజేపీ ప్రభుత్వం ఇబ్బంది పడకూడదు. కానీ, వేగంగా మందిర నిర్మాణం జరిగేలా వారి సాయం కోరదాం.

- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 74.68	పాత ధర	రూ. 70.50
కొత్త ధర	రూ. 74.58	కొత్త ధర	రూ. 70.50
తగ్గుదల: 10 పైసలు		మార్పులేదు	



ధ్యానంతో నొప్పులు మాయం!

వాషింగ్టన్, ఫిబ్రవరి 1: రోజూ కాసేపు ధ్యానం చేస్తే ఆరోగ్యానికి మేలని చెబుతారు. తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనంలో దీనికి మరో అంశాన్ని జోడించారు. పూర్తి ఏకాగ్రతతో ధ్యానం చేస్తే దీర్ఘకాలిక నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ వివరాలను 'ఎవిడెన్స్ బేస్ట్ మెంటల్ హెల్త్' అనే జర్నల్‌లో ప్రచురించారు. రోజువారీ పనుల్లో భాగంగా కలిగే ఒత్తిళ్లు, నొప్పుల నుంచి కూడా బయటపడొచ్చని ఆ అధ్యయనంలో వివరించారు. ధ్యానం వల్ల మనిషి మానసికంగా చాలా దృఢంగా ఉంటారని తెలిపారు. ఫలితంగా ఆలోచనలు, ప్రవర్తనపై పూర్తిగా అదుపులో ఉంటాయని తేల్చారు.

స్టాటిన్ చికిత్సతో వృద్ధులకు మేలే!

వాషింగ్టన్, ఫిబ్రవరి 1: వృద్ధుల్లో గుండెపోటుకు గురయ్యేవారు ఎక్కువగా ఉంటారు. అలాంటి వారికి 'స్టాటిన్' (ఔషధాలు) చికిత్సతో ఆ ప్రమాదాన్ని తగ్గించవచ్చునని తాజా సర్వే పేర్కొంది. ఈ మేరకు పరిశోధకులు దాదాపు 1.87లక్షల మంది వృద్ధుల వైద్య నివేదికలను పరిశీలించారు. వీరిపై 28 రకాల క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. రక్తంలో కొవ్వు శాతాన్ని తగ్గించడానికి చాలామంది వైద్యులు స్టాటిన్ చికిత్సపై ఆధారపడతారు. ఇది వృద్ధులకు ప్రాణాంతక గుండెజబ్బులు రాకుండా నిరోధిస్తుందని అధ్యయనంలో తేలిందని ప్రొఫెసర్ ఆంటోనీ కీచ్ పేర్కొన్నారు.



మేము క్షేమం!

» పాక్‌లో బందీలుగా ఉన్న మత్స్యకారుల లేఖలు

లేఖలు చూసిన కుటుంబ సభ్యుల్లో సంతోషంఎచ్చెర్ల, ఫిబ్రవరి 1: పాకిస్థాన్ కోస్ట్‌గార్డులకు చిక్కిన శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుల నుంచి తొలి సందేశం వచ్చింది. తమ క్షేమ సమాచారం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు వారు లేఖలు రాశారు. తమ విడుదలకు స్థానిక అధికారులు, నేతలకు విజ్ఞప్తి చేయాలని ఉత్తరాల్లో కోరారు. శుక్రవారం లేఖలు అందుకున్న బాధిత మత్స్యకారుల కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది నవంబరు 27వ తేదీన అరేబియా సముద్రంలో చేపలు వేటాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 22 మంది మత్స్యకారులు పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కుటుంబ సభ్యులకు వారికి సంబంధించిన ఎలాంటి క్షేమ సమాచారం లేదు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కొత్తమత్స్యలేశం గ్రామానికి చెందిన సూరాడ ముగతమ్మ భర్త అప్పారావు, మరో ఇద్దరు మత్స్యకారులు కల్యాణ్, కిశోర్‌లు ఆ దేశంలో బందీలుగా ఉన్నారు. అప్పారావు రాసిన ఉత్తరంలో 22 మందినీ ఒకే గదిలో బందీలుగా ఉంచినట్లు వెల్లడించారు. 'ఎలాంటి బెంగ పెట్టుకోవద్దు. అంతా ఒకే చోటే ఉన్నాం. ఇబ్బంది లేదు. మమ్మల్ని పాకిస్థాన్ నుంచి విడుదల చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేయండి' అని ఆ ఉత్తరంలో పేర్కొన్నారు. ఊరిలోని విషయాలు, కన్నవారి క్షేమ సమాచారంతో ఉత్తరం రాయాలంటూ పాకిస్థాన్‌కు చెందిన చిరునామాను అందులో ఇచ్చారు. బందీల కుటుంబ సభ్యులందరికీ ఒకే దస్తూరితోనే ఉత్తరాలు చేరాయి.

కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ హత్య

» కృష్ణాజిల్లా నందిగామ మార్గంలో కారులో జయరామ్ మృతదేహం
» బ్యాంకింగ్, ఔషధ వ్యాపారాలను చేస్తూ.. అమెరికాలో స్థిర నివాసం
» నెల క్రితమే హైదరాబాద్‌కు రాక తానే కారు నడుపుతూ బెజవాడ వైపు..
» తల, శరీరంపై లోతయిన గాయాలు
» వ్యాపార వివాదాలే బలిగొన్నాయా?
» అదుపులో జయరామ్ సోదరి





జయరామ్ (ఫైల్), కారును పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

విజయవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ఎంఆర్ఎస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత చిగురుపాటి జయరామ్ (55) దారుణ హత్యకు గురయ్యారు. కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని ఐతవరం వద్ద రోడ్డు పక్కన కారులో శుక్రవారం తెల్లవారుజామున ఆయన మృతదేహం లభ్యమైంది. హైదరాబాద్ నుంచి ఆయన విజయవాడకు వస్తుండగా, ఈ హత్య జరిగినట్టు భావిస్తున్నారు. ఆయన కారు డ్రైవర్ సతీశ్‌ను హత్య వివరాల కోసం పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలే ఆయన హత్యకు కారణమై ఉంటాయని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. విజయవాడకు చెందిన జయరామ్...భార్య పద్మజ, ఇద్దరు పిల్లలతో కలిసి అమెరికాలోని ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తిచేసిన తరువాత, 1993లో ఆయన అమెరికా వెళ్లారు. అప్పటినుంచి దాదాపుగా అక్కడే ఉంటున్నారు. న్యూయార్క్‌లోని కోర్నెల్ వర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. ఫ్లోరిడాలోని సైప్రస్ కేపిటల్ సంస్థకు ఛైర్మన్‌గా, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు బ్యాంకింగ్, ఫార్మాస్యూటికల్ రంగాల్లో పలు వ్యాపారాలు ఉన్నాయి. కృష్ణా జిల్లా కేంద్రంగా ఏర్పాటయిన కోస్టల్ బ్యాంకుకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎంఆర్ఎస్ ఫార్మాస్యూటికల్ కంపెనీ, టెట్రాన్ కళ్ల అద్దాల తయారీ పరిశ్రమ ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో సంవృద్ధి బ్యాంక్ నడుపుతున్నారు. ఎక్స్‌ప్రెస్ టీవీ ప్రారంభించి, మీడియా రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం ఆ చానల్ మూతబడింది. జయరామ్ తన వ్యాపార కార్యకలాపాల నిమిత్తం ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. అప్పుడప్పుడు విజయవాడకు వచ్చి, తన వ్యాపారాలను చూసుకొంటున్నారు. రెండు రోజుల క్రితం విజయవాడలోని కోస్టల్ బ్యాంక్ జీఎం సాంబశివరావుకు ఫోన్‌చేసి, గేట్‌వే హోటల్‌లో గురువారం సాయంత్రానికి రూమ్ బుక్ చేయమని చెప్పారు. హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరిన జయరామ్, ఐతవరం జాతీయ రహదారి పక్కన హత్యకు గురయ్యారు. కారు వెనుక సీటులోని ఆయన మృతదేహాన్ని హైవే పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు.

ఏం జరిగిందంటే..

జయరామ్ ఫ్లోరిడా నుంచి నెలరోజుల క్రితం విజయవాడ వచ్చారు. గత జనవరి 21న జరిగిన కోస్టల్ బ్యాంక్ సమావేశంలో పాల్గొన్నారు. క్రమంగా తన మకాంను హైదరాబాద్ నుంచి విజయవాడకు మార్చే ఆలోచనలో ఆయన ఉన్నారు. తన డ్రైవర్ సతీశ్‌కు బుధవారం సాయంత్రం ఈ విషయం చెప్పారు. గురువారం ఉదయం ఇంటికి రావాలని సతీశ్‌కు చెప్పారు. అప్పుడే విజయవాడలోని సాంబశివరావుకు, హోటల్ బుకింగ్ పని ఫోన్‌లో పురమాయించారు. జయరామ్ చెప్పినట్టు, గురువారం ఉదయమే సతీశ్ ఆయన నివాసానికి వెళ్లారు. అయితే, ఇంటికి తాళం వేసి ఉంది. జయరామ్‌కు వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఉన్నారు. వాళ్లని వద్దని ఆయన బుధవారం సాయంత్రం సొంత కారులో ఇంటి నుంచి బయలుదేరారు. ఆ తరువాత ఆయన ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. ఈ క్రమంలో నందిగామ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఆయన హత్యకు గురయ్యారు. ఆయన తల, శరీర భాగాలపై బలమైన గాయాలు ఉన్నాయి.

రెండో వ్యక్తి ఎవరు?

హైదరాబాద్ నుంచి బయలుదేరిన జయరామ్ కారు, విజయవాడ వైపు వచ్చే క్రమంలో జాతీయ రహదారిపై మూడు టోల్‌గేట్లు దాటింది. గురువారం రాత్రి 8.30 గంటలకు పంతంగి టోల్ ప్లాజా దాటిన ఈ కారు చివరిగా రాత్రి 11.30 గంటలకు భీమవరం టోల్‌ప్లాజాను దాటింది. హైదరాబాద్‌లో ఇంటి నుంచి ఆయన ఒంటరిగా కారులో బయలుదేరారని కొందరు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కారు దాటిన రెండు టోల్‌ప్లాజాల్లోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. కారును తెల్లచొక్కా ధరించిన వ్యక్తి నడుపుతున్నట్టుగా పంతంగి టోల్‌ప్లాజాలోని సీసీ టీవీ పుటేజీలో కనిపించింది. ఈ పుటేజీల పరిశీలించిన పోలీసులు కారులో జయరామ్ కాకుండా మరో వ్యక్తి ఎవరో ఉన్నారని అనుమానిస్తున్నారు. జయరామ్ చుట్టూ పలు వివాదాలు ఉన్నట్టు తెలుస్తోంది. కుటుంబ పరంగాను, ఆస్తుల పరంగాను గొడవలు ఉన్నాయని సమాచారం. విజయవాడ రామవరప్పాడు రింగ్ రోడ్డుకు సమీపాన ఉన్న ఓ స్థలం విషయంలో కుటుంబ సభ్యులతో గొడవలు నడుస్తున్నాయని పోలీసులు గుర్తించారు. కేసును ఛేదించడానికి ప్రత్యేకంగా మూడు బృందాలను రంగంలోకి దింపారు. కోస్టల్ బ్యాంకు జనరల్ మేనేజర్ సాంబశివరావు, జయరామ్ సోదరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. జయరామ్ కారులో పోలీసులకు బీరు బాటిళ్లు లభ్యమయ్యాయి. అయితే, తమ సారు బీరు తాగరని డ్రైవర్ సతీశ్ చెబుతున్నారు.

ఎవరా సికా?

సికా... జయరామ్ హత్య కేసులో వినిపిస్తున్న పేరు ఇది. ఈమె జయరామ్‌కు మేనకోడలు. ఎక్స్‌ప్రెస్ చానల్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. జయరామ్ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత సికా కనిపించడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నారు. అలాగే అకౌంటెంట్‌గా పనిచేసిన రామకృష్ణను పోలీసులు విచారిస్తున్నారు. జయరామ్ హైదరాబాద్ నుంచి బయలుదేరి దసపల్లా హోటల్‌లో టిఫిన్ చేసినట్టుగా తెలిసింది. ఆ సమయంలో ఆయనతోపాటు మరో ఇద్దరు ఉన్నారని సమాచారం.

ఆదుకోకుంటే ఆత్మహత్యలే గతి!

» కేంద్ర బృందానికి డెల్టా రైతుల కన్నీటి విన్నపాలు

తెనాలి/అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెథాయ్ ధాటికి వరి పంట దెబ్బతిని పూర్తిగా నష్టపోయామని, కేంద్రం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కృష్ణా పశ్చిమ డెల్టా రైతులు కేంద్ర బృందానికి కన్నీటితో మొర పెట్టుకున్నారు. హోంశాఖ సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కేంద్ర బృందం తెనాలి, అమృతలూరు, చుండూరు, పొన్నూరు మండలాల పరిధిలో పంట దెబ్బతిన్న ప్రాంతాలను శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడింది. రైతుల గోడు చూసి చలించిన కేంద్ర బృందం సభ్యులు వారిని ఓదార్చి పంట నష్టం చూశామని, తీవ్రత అర్థమయ్యేలా కేంద్రానికి నివేదిక అందిస్తామని వివరించారు. కాగా, కేంద్రానికి సకాలంలో సానుకూల నివేదిక సమర్పించి, తగిన సహాయం అందేలా చూడాలని సీఎస్ అనిల్ చంద్ర పునేఠా బృందాన్ని కోరారు.

అమ్మానాన్నను చూడాలి..!

» 18 ఏళ్ల తర్వాత కన్నవారిని వెతుక్కుంటూ వచ్చిన యువకుడు
» ఆరేళ్ల వయసులో కిడ్నాప్ అయినట్టు వెల్లడి



యువకుడితో అర్బన్ ఎస్పీ.. చిన్ననాటి ఫొటో..

గుంటూరు, ఫిబ్రవరి 1: 'అమ్మా.. నాన్నా.. నాకు మీ ప్రేమ కావాలి. నన్ను గుర్తిస్తే నాకోసం రండి' అంటూ ఓ యువకుడు తన చిన్ననాటి ఫొటో పట్టుకొని వరంగల్ నుంచి కన్నవాళ్లను వెతుక్కుంటూ వచ్చాడు. శుక్రవారం గుంటూరు అర్బన్ ఎస్పీ విజయరావును కలిసి తన తల్లిదండ్రుల ఆచూకీ గుర్తించడంలో సహకరించాలని కోరాడు. వివరాలిలా ఉన్నాయి. నాగేంద్ర ప్రసాద్ అనే యువకుడు 18 ఏళ్ల క్రితం కిడ్నాప్‌కు గురయ్యాడు. 2001 నవంబరులో ఇంటి ముందు ఆడుకుంటున్న నాగేంద్రను ఒక మహిళ ఆటోలో ఎక్కించుకొని వెళ్లి అతనితో భిక్షాటన చేయించింది. కొన్ని రోజుల తర్వాత ఆ బాలుడిని గుంటూరు తీసుకొచ్చి అక్కడి నుంచి రైలులో వరంగల్ తీసుకెళ్లి రైల్వేస్టేషన్ దగ్గర్లో వదిలేసి వెళ్లిపోయింది. అక్కడ నాగేంద్రను ఒక రిక్షా కార్మికుడు హాస్టల్‌లో చేర్పించాడు. పది వరకూ అక్కడే చదువుకున్న బాలుడిని పైచదువుల కోసం సాయి సేవాట్రస్ట్‌కు అప్పగించారు. ట్రస్ట్ కార్యదర్శి కాళిదాసు, ట్రెజరర్ సుబ్బారావు.. అతడు చెబుతున్న గుర్తుల ఆధారంగా గుంటూరు అర్బన్ ఎస్పీని ఆశ్రయించారు. చిన్ననాటి ఫొటో తెచ్చిన యువకుడు తల్లి పేరు లక్ష్మీదేవి, తండ్రి కొండయ్య అని చెప్పాడు.

ఏపీ బార్ కౌన్సిల్ కార్యాలయం ప్రారంభం



బార్ కౌన్సిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 1: విజయవాడలో ఏపీ బార్ కౌన్సిల్ తాత్కాలిక కార్యాలయాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని న్యాయవాదులందరికీ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

సీఎంకు తూర్పుకాపుల కృతజ్ఞతలు

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా ఆ సామాజిక వర్గం నాయకులు సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణా శిబిరం డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సీఎంను గజమాలతో సత్కరించారు.

విద్యాశాఖ పథకాలపై కళాజాత

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ, ఎస్ఎస్ఏ చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచేందుకు ఏర్పాటుచేసిన కళాజాత ప్రచార రథాలను మంత్రి గంటా శ్రీనివాసరావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ రథాలు 1200 గ్రామాల్లో పర్యటిస్తాయన్నారు.

45 టీఎంసీల నీరు ఇవ్వాల్సిందే!

» కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా బేసిన్‌కు తరలిస్తున్న గోదావరి నీటిలో తెలంగాణకు 45 టీఎంసీలను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బోర్డును కోరింది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు శుక్రవారం కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి పరమేశానికి లేఖ రాశారు.

ఎన్నికల బడ్జెట్!

సార్వత్రిక ఎన్నికల ముందు సామాన్యుడిని ఆకర్షించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బడ్జెట్‌ను చక్కటి సాధనంగా ఉపయోగించుకున్నారు. పేరుకు మధ్యంతర బడ్జెట్టే అయినా పూర్తి స్థాయి బడ్జెట్‌లో తీసుకునే కీలక నిర్ణయాలే జరిగాయి. అయితే అవి ప్రజాకర్షణకు మాత్రమే పరిమితమయ్యాయి. వ్యవసాయం, విద్య, వైద్యం ఇత్యాది కీలక రంగాలకు స్పష్టమైన కేటాయింపులు ప్రకటించలేదు. విధాన నిర్ణయాలు కొన్నైనా లేవు. గత ఏ బడ్జెట్‌లోనూ లేనన్ని తాయిలాలతో రైతులు, సగటు ఉద్యోగులు, దిగువ మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకొనే ప్రయత్నం బాగా జరిగింది. ఆదాయ పన్ను పరిమితి విషయంలో ప్రతి ఏటా నిరాశ మిగిల్చిన ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో మాత్రం భిన్నంగా వ్యవహరించింది. ఊహించిన విధంగానే రైతులకు నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అసంఘటిత రంగంలోని వారికి పింఛను వచ్చింది. ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెటే.

ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6,000 అందిస్తున్నందువల్ల దాదాపు 12 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఖజానాపై రూ.75,000 కోట్ల భారం పడుతుంది. రుణాలు రద్దు చేయడం కన్నా.. రైతులకు నేరుగా నగదు అందించడం మంచిదే అయినా.. చాలామంది ఊహించిన విధంగా ఈ పథకం ఆకర్షణీయంగా లేదు. ఆశించిన దానికంటే ఈ ప్యాకేజీ చిన్నదే. పథకాన్ని అమలు చేయడం ప్రకటించినంత సులభం కాదు. సరైన భూమి రికార్డులు లభించడం పెద్ద సవాలు. దేశంలోని శ్రామికుల్లో సగానికి పైగా వ్యవసాయ రంగంపైనే జీవిస్తున్నారు. స్థూల దేశయోత్పత్తిలో వ్యవసాయ రంగ వాటా నానాటికీ తీసికట్టుగా ఉంది. వ్యవసాయ రంగ కష్టాలను తొలగించడానికి, ఉపాధి పెంచడానికి బడ్జెట్‌లో కొన్నైనా చర్యలు ప్రకటించి ఉంటే బాగుండేది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినప్పటికీ.. పన్ను శ్లాబ్‌లను మాత్రం మార్చకపోవడం గమనార్హం. ఆదాయ పరిమితిని పెంచడం వల్ల 3 కోట్ల పన్ను చెల్లింపుదారులు ప్రయోజనం పొందుతారని చెబుతున్నప్పటికీ.. స్థూలంగా ఉద్యోగులు పొందే ప్రయోజనం పెద్దగా లేదు. ఉదాహరణకు రూ.7.5 లక్షలు వార్షిక ఆదాయం కలిగిన ఉద్యోగులు స్టాండర్డ్ డిడెక్షన్ వల్ల రూ.2,000, సర్‌ఛార్జీ, విద్యాసెస్‌లో రూ.80 మేరకే ప్రయోజనం పొందారు. పోస్టాఫీసు పొదుపు పథకాలపై వచ్చే వడ్డీపై టీడీఎస్ పరిమితిని పెంచడం, అద్దె ఆదాయం పరిమితిని పెంచడం, సొంత ఇంటి ఆదాయానికి మినహాయింపును రెండిళ్లకు చేయడం వంటి కొన్ని చర్యలు ఊరట కలిగించేవే. ఇవి గృహ రంగానికి ఊతం ఇస్తాయి. అసంఘటిత రంగంలోని శ్రామికులకు మెగా పింఛను పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. నెలకు రూ.100 చెల్లిస్తే.. 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.3,000 పింఛను చెల్లిస్తారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఏమీ చెల్లించకుండానే పింఛను పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన పింఛను పథకం విధి విధానాలను పరిశీలించిన తర్వాత కానీ ఇది ఎంతమేరకు ప్రయోజనం చేకూరుస్తుందో చెప్పలేం. ఆచరణలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశమూ ఉంది. ఇక, పథకాల ద్వారా ప్రజలకు చేరే నగదు కారణంగా గ్రామీణ ప్రాంతంలో వినియోగం ఒక్కసారిగా పెరిగి, మొత్తం వినియోగానికి ఆధారం అవుతుంది. పెద్ద నోట్లరద్దు, జీఎస్‌టీ తదితర నిర్ణయాలతో ఆర్థిక వృద్ధిరేటు కుంటుపడి మోదీపై వచ్చిపడిన కళంకాన్ని తొలిగించుకోవడానికి ఈ బడ్జెట్ ఉపయోగపడవచ్చు. గత కొద్ది నెలలుగా మందగించిన వినియోగ ప్రవృత్తిని పెంచే చర్యల కోసం ఆర్థిక వ్యవస్థ ఎదురు చూస్తోంది. వినియోగం పెరగడం స్టాక్ మార్కెట్‌కు కూడా ఉత్తేజాన్ని ఇస్తుంది. దీంతో పరిశ్రమ వర్గాల మద్దతు కూడా మోదీ పొందొచ్చు.

మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు అమలులోకి వస్తే ప్రభుత్వంపై అదనపు భారం తప్పదు. దాన్ని ఏ విధంగా అధిగమిస్తారన్నది రాబోయే ప్రభుత్వాలు చూసుకుంటాయి. జీఎస్‌టీపైనే ప్రభుత్వం ఆశలన్నీ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును 3.3 శాతానికి కట్టడి చేయడం ప్రభుత్వ లక్ష్యం. రైతులకు ఆదాయ మద్దతు పథకం డిసెంబరు నుంచే అమలు చేయడం వల్ల ద్రవ్యలోటు దీన్ని మించగలదని ప్రభుత్వమే చెబుతోంది. అది ఎంతమేరకు పెరుగుతుందన్నది పెట్టుబడుల ఉపసంహరణ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంది. మొత్తం మీద ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లోని అనుభవాలను పరిగణనలోకి తీసుకుని సామాన్యులను ఆకర్షించడానికి మోదీ పెద్ద ప్రయత్నమే చేశారు. ఇది ఎంతమేరకు ఫలించిందో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు చెబుతాయి.

■ పి. చిదంబరం



'పళని' పలుకు

గడ్కరీ మాటల మర్మమేమిటి?

నితిన్ గడ్కరీ ఒక విచిత్ర రాజకీయ వేత్త. ఆయన ఆహారప్రియుడు; సొగసైన అధునాతన వస్త్రాలను ధరిస్తారు; జీవితాన్ని నిండుగా ఆస్వాదించే వ్యక్తిలా కన్పిస్తారు. తనను గురించిన ఈ విషయాలను గడ్కరీనే స్వయంగా అంగీకరించారు. బహిరంగ సభలు, సమావేశాలలో ప్రసంగించడం ఆయనకు బహు పసందైన విషయం. ఎటువంటి చింతలేని, ఎవరినీ లక్ష్య పెట్టని వ్యక్తిలా ఆయన ప్రసంగం సాగిపోతుంది సుమా!

అదే సమయంలో గడ్కరీ ఒక స్వయం సేవకుడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పెద్దలు అభిమానించే రాజకీయవేత్తలలో ఆయన ఒకరని ప్రతీతి. గడ్కరీ తన నియోజకవర్గం నాగపూర్ (మహారాష్ట్ర) బాగోగులను చక్కగా చూసుకుంటారు. ఆరెస్సెస్ ప్రముఖులు, ప్రచారకులు; తన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎవరికి ఏ పని అవసరమైనా చేసి పెడతారు. వారు సదా సంతృప్తిగా, అనుకూల వైఖరితో ఉండేలా చేస్తారు.

నితిన్ గడ్కరీ, దేవేంద్ర ఫడ్నవీస్ ఇరువురూ నాగపూర్ కు చెందినవారే. ఇరువురి రాజకీయ జీవితానికి అదే ప్రాంతం నుంచే మద్దతు లభిస్తుంది. ఇరువురికీ మద్దతునిచ్చే నాయకులు, కార్యకర్తలు ఒకే రాజకీయ, సైద్ధాంతిక కుదురుకు చెందినవారే. మహారాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని గడ్కరీ ప్రగాఢంగా ఆకాంక్షించారని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ ఆయన ఆశలను భగ్నం చేశారని మహారాష్ట్రలో ప్రజలు చెప్పుకుంటారు. విధేయుడైన దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆ ప్రతిష్ఠాత్మక ముఖ్యమంత్రి పదవికి మోదీ ఎంపిక చేశారు. అత్యున్నత అధికార ప్రాభవాన్ని సాధించుకోవాలనే గడ్కరీ ఆకాంక్షల (ఇటువంటివి ఏవైనా ఉంటే)ను, ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రి చేయడం ద్వారా, మోదీ చాలా తెలివిగా అడ్డుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే గడ్కరీ సామాన్యుడా? తన పురోగతికి ప్రధాన మంత్రి నుంచి ఎదురవుతున్న అవరోధాలను గమనించి ఆయన తన పురోగమనానికి ఒక మార్గాన్ని ఏర్పరచుకున్నారు.

తన మంత్రిత్వ శాఖల హై వేస్, రోడ్డు రవాణా; జల వనరులు, నదుల అభివృద్ధి; గంగానది పునరుజ్జీవనంకు సంబంధించిన పనుల సత్వర పూర్తిపై అమిత శ్రద్ధ చూపే కార్యదక్షుడుగా గడ్కరీకి పేరు వున్నది. ఒక మంత్రిగా ఆయన పాలనాదక్షతకు ఒక మిశ్రమ రికార్డు మాత్రమే ఉన్నది. హై వేల నిర్మాణంలో ఆయన ప్రశస్త ఫలితాలు సాధించారు; గంగానది ప్రక్షాళన ప్రచార ఊదరలో మునిగిపోయింది; జల వనరుల అభివృద్ధిలో కార్య సఫలత నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా లేదు; నీటి పారుదల ప్రాజెక్టుల వ్యవహారాలలో పురోగతి అత్యంత శోచనీయంగా ఉన్నది.

తన శాఖలకు సంబంధించని ఇతర అంశాలపై గడ్కరీ నిర్మొహమాటంగా, సూటిగా మాట్లాడటం కద్దు. గత ఏడాది మార్చిలో ఒక మీడియా సంస్థ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఇలా అన్నారు: 'అచ్చే దిన్ విషయమై మీడియా గతంలో మమ్ములను చిక్కుల్లో పెట్టింది. దయచేసి నా మాటలకు వక్ర భాష్యం చెప్పకండి. అచ్చే దిన్ అనేది లేదు... ఆ శుభ కామన ఒక విశ్వాసం మాత్రమే, మీరు విశ్వసిస్తే అచ్చే దిన్ ఉన్నట్టే'. 2018 ఆగస్టులో ఆయన రిజర్వేషన్లకై ఉద్యమం ముమ్మరమవుతున్న సమయంలో ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'రిజర్వేషన్లు ఇచ్చినప్పటికీ, భర్తీ చేయడానికి ఉద్యోగాలు లేవు. నవీన సాంకేతికతల మూలంగా బ్యాంకుల్లో ఉద్యోగాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రభుత్వ నియామకాలు నిలిచిపోయాయి'. ఎవరిని లక్ష్యంగా చేసుకుని గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు? చాలా మంది అనుమానం ఏమిటంటే ఆ వ్యాఖ్యలు (రిజర్వేషన్లను డిమాండ్ చేసిన) ఆందోళనకారులను ఉద్దేశించినవి కావని, (ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయినందుకు) మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసినవేనని!

ఇటీవల ఆచితూచిన మాటలతో చేస్తున్న ప్రకటనలతో గడ్కరీ రాజకీయ సీమలలో చిన్న తుఫానులే సృష్టించారు. ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆయనకు ఒక గొప్ప అవకాశాన్ని కల్పించాయి. అనవలసిన మాటలు ఎటువంటివైనా అనకుండా మింగివేసే అలవాటు గడ్కరీకి లేదు మరి. ఆయన ఇలా అన్నారు: 'విజయానికి చాలా మంది తండ్రులు ఉన్నారు. వైఫల్యమే అనాథ. విజయం సమకూరినప్పుడు అది నా ఘనతే అని చెప్పుకోవడానికి చాలా మంది పోటీ పడుతున్నారు. పరాజయం ఎదురయితే ప్రతి ఒక్కరూ అందుకు బాధ్యత తనది కాదని, ఇతరులదని వేలెత్తి చూపడం ప్రారంభిస్తున్నారు. ఓటమి, వైఫల్యాలకు బాధ్యత వహించే ధైర్యం నాయకులకు తప్పనిసరిగా ఉండాలి. ఓటమికి బాధ్యతను తలకెత్తుకునేవరకు సంస్థపట్ల నాయకుల విధేయత రుజువుకాని విషయమే'. 2019 జనవరి 26న గడ్కరీ మరింత దాపరికం లేకుండా మాట్లాడారు: 'స్వప్నాలను చూపించే నాయకులను ప్రజలు ఇష్టపడతారు. అయితే ఆ స్వప్నాలను సాకారం చేయనప్పుడు ప్రజలు ఆ నాయకులను నిర్మొహమాటంగా తిరస్కరిస్తారు'


ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే గడ్కరీ ఇటువంటి తీక్ష్ణ వ్యాఖ్యలు చేస్తున్నారనడంలో ఎవరికీ ఎటువంటి సందేహం లేదు. రాబోయే ఎన్నికలలో బీజేపీకి పూర్తి మెజారిటీ రాక, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పక్షంలో పార్టీ నాయకత్వానికై మోదీని గడ్కరీ సవాల్ చేస్తారని పలువురు భావిస్తున్నారు. గత డిసెంబర్ లో ఒక ప్రసంగాన్ని వెలువరిస్తూ బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పై గడ్కరీ పరోక్షంగా ధ్వజమెత్తారు. 'నేను పార్టీ అధ్యక్షుడిని అయితే, నా ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ విధి నిర్వహణను సక్రమంగా నిర్వహించకపోతే అందుకు ఎవరు బాధ్యత వహించాలి? నేను' అని గడ్కరీ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. అదే ప్రసంగంలో ప్రధానమంత్రికి కూడా ఆయన ఒక సవాల్ విసిరారు: 'సహనం మన భారతీయ వ్యవస్థకు ఒక గొప్ప బలం, విలువైన వరం. బహు చక్కగా మాట్లాడినంత మాత్రానే మీరు ఎన్నికలలో విజయం సాధించలేరు. మీరు ఎంత విద్వత్ పరులు అయినప్పటికీ ప్రజలు మీకు ఓటు వేయరు. తనకు అన్నీ తెలుసు అని అనుకునే వ్యక్తి పొరపడుతున్నారు. కృత్రిమ మార్కెటింగ్‌ను ప్రజలు నిరోధించాలి'.

భారతీయ జనతా పార్టీ లోని ఒక అసమ్మతివాది చేయగల లేదా ఒక ప్రతిపక్ష రాజకీయ వేత్త చేయగల విమర్శలన్నిటినీ నితిన్ గడ్కరీయే చేశారు. విఫల స్వప్న బేహారి అని ప్రధానమంత్రిని ఆయన అభివర్ణించారు. పార్టీకి ఎదురయిన పరాజయాలకు బాధ్యత వహించే నైతిక నిష్ఠ చూపనందుకు మందలించారు. అసహనపరుడని, కృత్రిమ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నారని ప్రధానమంత్రిపై ఆరోపణాస్త్రాలను గడ్కరీ సంధించారు. ప్రధానమంత్రిపై కేబినెట్ సహచరుడి నుంచే ఇంత తీవ్రమైన విమర్శలు!

ఇంత తీవ్రంగా మాట్లాడుతున్నప్పటికీ నితిన్ గడ్కరీని భారతీయ జనతా పార్టీ ఏమీ అనలేకపోతోంది. ఆయన చేస్తున్న విమర్శలపై బహిరంగంగా ప్రతిస్పందించడం లేదు. బీజేపీయే కాదు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సైతం గడ్కరీని మందలించడం లేదు. బహుశా సంఘ్ పరివార్‌కు చెందిన ప్రతి ఒక్కరికీ గడ్కరీ వ్యాఖ్యలపై ఎలా ప్రతిస్పందించాలో తెలియక తత్తరపడుతున్నారు. పరిస్థితిని ఎలా అదుపులో పెట్టాలో ఎవరికీ అర్థం కావడం లేదు. గడ్కరీపై చర్య తీసుకోవడానికి బీజేపీ నాయకులు ఎందుకు సంకోచిస్తున్నారు? లోక్ సభ ఎన్నికల ఫలితాలు పార్టీకి అనుకూలంగా ఉండవని భయపడుతూ తమ రాజకీయ భవిష్యత్తు గురించి కలత చెందుతున్న నాయకులు, మరీ ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ ఎంపీలు ఇంకా ఎంతోమంది ఉన్న విషయం బీజేపీ నాయకత్వానికి తెలుసు కనుకనే గడ్కరీపై చర్యకు సంకోచిస్తున్నారని నేను భావిస్తున్నాను.

2014లో బీజేపీ తన మిత్రపక్షం అప్నాదళ్ (యూపీకి మాత్రమే పరిమితం) తో కలిసి ఛత్తీస్ గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లోని మొత్తం 145 లోక్ సభా నియోజకవర్గాలలో 135స్థానాలని గెలుచుకున్నది. ఇప్పుడు ఏ అంచనా ప్రకారం చూసినా ఆ 135 స్థానాలలో కనీసం 80ని బీజేపీ కోల్పోవనున్నది. ఎన్నికల వ్యవహారాలలో అనుభవజ్ఞులైన విశ్లేషకులు ఇది ఖాయంగా చెప్తున్న మాట. 2019 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి సరిగ్గా ఇటువంటి ఫలితాలే సిద్ధించాలని నితిన్ గడ్కరీ, ఆయన మద్దతుదారులు హృదయపూర్వకంగా కోరుకుంటున్నారు. పార్టీ నాయకత్వం, ప్రభుత్వ తీరుతెన్నులపై పార్టీ శ్రేణుల్లో సణుగుడు, గొణుగుడు అంతకంతకూ పెరుగుతూ పెను ఘోషగా పరిణమిస్తున్నాయి. ఈ ఘోష గడ్కరీ, ఆయన అనుయాయులకు వీనులవిందు చేస్తోంది! ఆసన్నమయిన లోక్ సభా ఎన్నికలలో బీజేపీకి లభించే సీట్ల సంఖ్య 282 (2014లో సాధించుకున్న మెజారిటీ) కంటే గణనీయంగా తగ్గిపోగలదని నిశ్చితంగా చెపుతున్నవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా ఇదే జోస్యం చెప్పినవారు రాం విలాస్ పాశ్వాన్. అవును, ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా అవగత మువుతున్నకొద్దీ గడ్కరీ వాగ్బాణాలు మరింత పదునెక్కడమేకాదు, మరింత తరచుగా వాటిని సంధించడమూ సంభవిస్తుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)



2014లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని 145 లోక్‌సభ నియోజకవర్గాలలో 135 బీజేపీ గెలుచుకున్నది. 2019లో ఈ 135లో కనీసం 80 స్థానాలను అధికార పార్టీ కోల్పోవడం ఖాయమని పలువురి అంచనా. సరిగ్గా ఇటువంటి ఫలితాన్నే నితిన్ గడ్కరీ, ఆయన మద్దతుదారులు హృదయపూర్వకంగా ఆశిస్తున్నారు!

జనవాక్యం

వివిపై ప్రతీకార పరంపర



భీమా కోరేగాం హింసాకాండ కేసులో నిందితుడిగా పుణెలోని యరవాడ జైలులో 2018 నవంబర్ 18 నుంచి నిర్బంధాన్ని అనుభవిస్తున్న వరవరరావు మీద పోలీసులు మరొక అబద్ధపు కేసు బనాయించడం ఎంతో బాధ కలిగించింది. గడ్చిరోలి జిల్లా అహెరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుర్జాగడ్ ప్రాంతంలో 2016 డిసెంబర్‌లో జరిగిన ఘటనలకు కుట్ర చేశారనే ఆరోపణతో న్యాయవాది సురేంద్ర గడ్లింగ్‌ను, వరవరరావును యరవాడ జైలు నుంచి అహెరికి తీసుకువెళ్లి కోర్టులో హాజరు పరిస్తే, న్యాయమూర్తి 12 రోజుల పోలీసు కస్టడీకి అనుమతించారు. భీమా కోరేగాం కేసుకు ఆధారాలుగా తమ వద్ద ఉన్న (అబద్ధపు, కల్పిత) ఉత్తరాలలో ఈ ప్రాంత మావోయిస్టులకు, గడ్లింగ్, వరవరరావులతో సంబంధాలున్నాయని తేలిందని, అందువల్ల ఈ ఘటనతో సహా ఇతర ఘటనలకు కుట్రదారులుగా వీరిని గుర్తించి జనవరి 30న అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పుకొచ్చారు. ఒకసారి అరెస్టయి ఉన్నవారిని ఇలా పోలీసు కస్టడీకి కోరడం చట్టవిరుద్ధం. కస్టడీకి ఇవ్వగూడదని సుప్రీంకోర్టు, ఎన్నో రాష్ట్రాల హైకోర్టులు తీర్పులు ఇచ్చి ఉన్నాయి. గడ్లింగ్, ఇతర న్యాయవాదులు ఇదే వాదన చేశారు. కానీ, జడ్జి మాత్రం కస్టడీకి అనుమతించారు. సుర్జాగడ్‌లో గనుల తవ్వకానికి, తమను నిర్వాసితులను చేయడానికి వ్యతిరేకంగా ఆదివాసులు అక్కడ ఎంఒయు కుదుర్చుకున్న బహుళజాతి సంస్థ లాయిడ్స్ స్టీల్ అండ్ మైనింగ్ కంపెనీపై దాదాపు పది సంవత్సరాలుగా పోరాడుతున్నారు. ఈ ఆందోళనలో భాగంగానే 2016 డిసెంబర్‌లో ఆ సంస్థకు చెందిన వాహనాలను వారు తగులబెట్టారు. నాలుగైదువందల మంది ఆదివాసులు ఈ ఘటనలో పాల్గొన్నారని అప్పట్లో పత్రికలు రాశాయి. కాని, పోలీసులు నమోదు చేసిన ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో మావోయిస్టు కార్యకర్తలు కొందరితో పాటు 4050 మంది సాయుధ నక్సలైట్లు, మరొక 6070 మంది నిరాయుధ నక్సలైట్లు పాల్గొన్నారని ప్రకటించారు. ఈ వాహనాల దగ్ధం ఘటనతో వివికి గాని, గడ్లింగ్‌కు గాని సంబంధం ఉన్నదన్న ఆరోపణ అత్యంత హాస్యాస్పదమైనది. వివి ఈ ఘటన జరిగిన చోటికి 400 కిమీ దూరంలో ఉంటారు. ఆదివాసులలో సంవత్సరాల తరబడి పేరుకుపోయిన ఆగ్రహం ఫలితంగా జరిగిన ఘటనను వీరిద్దరిపై నేరారోపణగా చూపడం దారుణం. భీమా కోరేగాం కేసు సందర్భంలో వరవరరావు నవంబర్ 18 నుంచి 26 వరకు పోలీసు కస్టడీలోనే ఉన్నారు. ఆ వారం రోజులలో పోలీసులు ఆ కేసుకు సంబంధించి ఒక్క ప్రశ్న కూడా అడగకుండా ఇతరేతర విషయాల మీద ప్రశ్నలతో వేధించారు. ఇప్పుడు కూడ 2016 నాటి సుర్జాగడ్ ఘటనలపై వివిని పన్నెండు రోజుల పాటు ప్రశ్నించడానికి ఏమీ ఉండదు. వివిని మొదట ఆగస్ట్ 28న అరెస్టు చేశారు గనుక ఫిబ్రవరి 28 నాటికి చార్జిషీటు వేయకతప్పదు. చార్జిషీటు వేసినా, వేయకపోయినా ఆయనకు బెయిల్ వచ్చే అవకాశం ఉంది గనుక, బెయిల్ వచ్చినా బైటికి రాకుండా చేయడం కోసం మాత్రమే ఈ కొత్త కేసు. వివిని ఇబ్బంది పెట్టడానికి, వేధించడానికి పన్నిన పన్నాగం ఇది. డెబ్భైతొమ్మిది సంవత్సరాల వృద్ధుడిపై సాగుతున్న ఈ దుర్మార్గాన్ని ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీలవాదులు తీవ్రంగా ఖండించాలి.

– **ఎన్. దామోదర్,** హైదరాబాద్

ఓటు (ఆన్ అకౌంట్) బడ్జెట్



ప్రధాని ఒకే దేశం ఒకే ఎన్నికలు మంచివని చెప్తారు. భాజపా అధ్యక్షులు మాట్లాడుతూ స్థిరమైన పార్టీని ఎన్నుకోండి, సంకీర్ణాల్ని వద్దు, రోజుకో ప్రధాని వుంటే కష్టం అన్నారు. కానీ ఈ సారి బడ్జెట్ చూశాక ఏటేటా ఎన్నికలొస్తేనే మంచిదేమోననిపిస్తుంది. విధానాలూ, ప్రణాళికలూ, నిధులూ అంటూ వచ్చే పూర్తి బడ్జెట్ కన్నా, ఎన్నికల ముందొచ్చే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కే మెరుపులెక్కువ. అంతో ఇంతో ప్రజలు ఊరట పొందే ఊసులు, ఊరింపులు ఎక్కువ. ఎన్డీయే హయాంలోని నాలుగేళ్ల పూర్తి బడ్జెట్లు ఇచ్చిన అభయం కన్నా, నాలుగు నెలల ఖర్చులను ఉద్దేశిస్తూ వచ్చిన ఈ తాత్కాలిక బడ్జెట్ ఎక్కువ ఆశలు రేపుతోంది. ముఖ్యంగా వేతనజీవులు 2014 నుండీ ఎదురుచూస్తూ వచ్చిన పన్ను మినహాయింపులు ఈసారి రెట్టింపు చేశారు. పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచడం మంచి నిర్ణయం. పెరుగుతున్న జీవన వ్యయం నేపథ్యంలో అవసరం. అసంఘటిత కార్మికులకు పింఛను సదుపాయం కల్పించడం మరో మంచి నిర్ణయం. మన దేశంలో అసంఘటిత కార్మికులే ఎక్కువ కనుక. ఐదెకరాల లోబడి భూమి కలిగిన చిన్న రైతులకు ఏటేటా ఆరువేల రూపాయల నగదు ప్రత్యక్షంగా చేతికే అందిస్తామన్నది ఒక చిన్న సానుకూల చర్య. అది భూమిలేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు కూడా అందించాల్సిన అవసరం ఉంది. అంతకు మించి చేయాల్సినవి కనీస మద్దతు ధర పెట్టుబడి కన్నా యాభై శాతం ఎక్కువగా నిర్ణయించడం, మార్కెట్ అనుసంధానం, గోదాముల నిర్మాణం ఇంకా ఎన్నో. అయితే ఇది తాత్కాలిక బడ్జెట్ కనుక ప్రభుత్వం ఆమాత్రం రైతు గురించి ఆలోచించడమే మహద్భాగ్యం అనుకొందాం. దేశంలో నిరుద్యోగం నలభై ఐదేళ్ల రికార్డుని అధిగమించి ఆరుశాతంగా నమోదైందని అధికారిక గణాంకాలే చెప్తున్నాయి. యువత ఎక్కువగా ఉన్న దేశం నిరుద్యోగ దేశంగా మిగిలితే సామాజిక, ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తుంది. ఉద్యోగ కల్పనలో తన పరాజయాన్ని అంగీకరించి ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సింది. నిర్మాణ రంగానికి చేయూత నివ్వాల్సింది. ఆ దిశగా చర్యలు లేవు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల అమలులో ఐదేళ్ల పిమ్మట కేంద్రం ఏ స్థానంలో వుందో ఈ ఆఖరు బడ్జెట్‌లోనైనా తెలియజెప్తే బాగుండేది. ఏది ఏమైనా ఎన్నికల హామీల పూర్తి సినిమాకు ముందు ఈ బడ్జెట్ అధికారిక ట్రైలర్ ఆకర్షించింది. నీతి: అసలు బడ్జెట్‌కి వడ్డింపులెక్కువ–కొసరు బడ్జెట్‌కి ఊరింపులెక్కువ.

– **డా.డి.వి.జి.శంకరరావు,** మాజీ ఎంపీ, పార్వతీపురం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జూబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

జార్జ్: రాజీపడిన రెబెల్

■ రామచంద్ర గుహ



గతానుగతం

క్యాబ్ డ్రైవర్లతో జరిపిన సంభాషణల గురించి నేను సాధారణంగా రాయను. అయితే ఈ వ్యాసంలో నేను అందుకు మినహాయింపు ఇచ్చి తీరాలి. కొన్ని సంవత్సరాల క్రితం టొరంటోలో నేను ఒక టాక్సీలో ప్రయాణిస్తున్నాను. 'మీరు భారతీయులా' అని ఆ టాక్సీ డ్రైవర్ అడిగాడు. అవునని సమాధానమిచ్చాను. వెంటనే భావోద్వేగంతో 'జార్జ్ ఫెర్నాండెజ్ మా నాన్న, జార్జ్ ఫెర్నాండెజ్ మా నాన్న' అని అన్నాడు ఇరాన్ దేశస్థుడైన ఆ క్యాబీ 1970వ దశకంలో విద్యార్థిగా భారత్‌కు వచ్చాడు. విద్యార్జన కంటే రాజకీయాలలోనే అమిత శ్రద్ధ గల ఆ యువకుడు ఫిదాయీ గెరిల్లా అనే ఒక ఇరానియన్ గ్రూపులో సభ్యుడయ్యాడు. ఇరాన్‌లో రాచరిక వ్యవస్థను కూలదోసి సోషలిస్టు ప్రత్యామ్నాయన్ని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్న బృందమది. 1970వ దశకపు తుది సంవత్సరాలలో జార్జ్ ఫెర్నాండెజ్ కేంద్ర మంత్రి. ఆయన అధికార నివాసం అన్ని రకాల తీవ్రవాదులకు ఒక ఆశ్రయంగా ఉండేది బీజింగ్ ఆధిపత్యాన్ని ధిక్కరిస్తున్న టిబెటన్ విద్యార్థులకు జార్జ్ గృహమే నివాసం. అలాగే బర్మా సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న షాన్, కరేన్ తిరుగుబాటుదారులకూ జార్జ్ గృహమే నెలవు. ఇప్పుడు టొరంటోలో క్యాబ్ డ్రైవర్ గా జీవనోపాధి పొందుతున్న ఇరానియన్ ఫిదాయీ కూడా జార్జ్ గృహంలో ఆశ్రయం పొందిన వాడే. జార్జ్ ఆతిథ్యంలో ఆ ఇరానియన్ యువకుడు నిశ్చింతగా, తమ దేశంలో రావాల్సిన కార్మికవర్గ విప్లవం గురించి కలలుగంటూ వుండేవాడు.

1979లో ఇరాన్‌లో ఒక విప్లవం సంభవించింది. అయితే అది మితవాద విప్లవం. భారత్‌లో ప్రవాసంలో ఉన్న ఇరానియన్ సోషలిస్టు, తమ రాజు షా రెజా పహ్లవి ని ఎంతగా దుయ్యబట్టేవాడో అంతకంటే ఎక్కువగా అయతొల్లా ఖమైనీని తూష్ణీకరించేవాడు. 1979 తుది నాళ్లలో టెహ్రాన్‌లోని కొత్త ప్రభుత్వ ప్రతినిధి బృందం ఒకటి న్యూఢిల్లీ సందర్శించింది. ఆ బృందానికి పాలం విమానాశ్రయంలో వామపక్షీయులు అయిన ఇరానియన్ విద్యార్థులు నినాదాలు, ప్లకార్డులతో స్వాగతం పలికారు. వీసా నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఆ విద్యార్థులను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. ఇరానియన్ ఫిదాయీని నిర్బంధించిన జైలులో పారిశుద్ధ్యం పూజ్యం. ఆహారం విషయం మరి చెప్పనవసరం లేదు. ఒక రోజు ఉదయం జార్జ్ ఫెర్నాండెజ్ ఆ జైలుకు వచ్చారు. ఆ ఇరానియన్ విద్యార్థులందరినీ సొంత పూచీతో విడిపించి తన అధికార నివాసానికి తీసుకువెళ్ళారు.

1980లో న్యూఢిల్లీలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహజంగానే అధికార యంత్రాంగంలో ఆయన మాటకు మన్నన లేకపోయింది. భారత్‌లో ఇక మీకు రక్షణ ఉండబోదని, మరో భద్రమైన దేశానికి వెళ్ళిపోవడం మంచిదని ఆ ఇరానియన్ విద్యార్థులకు ఆయన చెప్పారు. మాజీ ఫిదాయీ ఎలాగో కెనడాకు వలసవచ్చి టాక్సీవాలాగా జీవనోపాధి పొందుతున్నాడు. జార్జ్ ఫెర్నాండెజ్‌ను ఎప్పటికీ తన తండ్రిగా గౌరవిస్తానని అతడు చెప్పాడు. న్యూఢిల్లీలో ఉచిత వసతి, భోజనం సమకూర్చడంతో పాటు జార్జ్ అతడికి మరో మహోపకారం చేశాడు. ఆ విద్యార్థిని ఆయనే గనుక జైలు నుంచి బయటకు తీసుకురాకపోయివుంటే, ఆ ఇరానియన్ యువకుడు బహుశా దశాబ్దాల పాటు విచారణలో ఉన్న ఖైదీగా భారతీయ జైలులో కునారిల్లిపోయేవాడు. వివిధ జాతులకు చెందిన విద్యార్థులను ఒక తండ్రి లాగా ఆదరించిన జార్జ్ ఫెర్నాండెజ్ ఒకప్పుడు, ఆత్మలకు స్వస్థత చేకూర్చే కేథలిక్ చర్చ్ ఫాదర్ కావాలని అభిలషించారు!



జార్జ్ ఫెర్నాండెజ్ 1930లో మంగళూరులో జన్మించారు. ఆరుగురు అన్నదమ్ములలో ఆయనే అగ్రజుడు. మత నిష్ఠాపరులైన తల్లిదండ్రులు తమ ప్రథమ కుమారుడిని బెంగళూరులోని ఒక సెమినరీలో చేర్పించారు. ఒక సంవత్సరం పాటు లాటిన్ భాషను నేర్చుకున్న జార్జ్, విద్యాలయం నుంచి పారిపోయి, ఆ తరువాత తన కన్న ఊరుకు తిరిగి వెళ్ళాడు. మంగళూరులో హోటల్ కార్మికులను సంఘటితం చేయడం ప్రారంభించాడు. అయితే ఇదెంతోకాలం సాగలేదు. జార్జ్ ఇప్పుడు తన కార్యరంగాన్ని బొంబాయికి మార్చారు. ఆ మహా నగరంలో ఆయన తొలి రోజుల గురించి సరైన సమాచారం లేదు. బొంబాయికి వచ్చిన కొద్దికాలానికే ప్రముఖ కార్మిక నాయకుడు డి'మెల్లోకు జార్జ్ సన్నిహితమయ్యారు. ఇరువురూ సోషలిస్టులు. కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాడడంలో కమ్యూనిస్టులతో ఈ ఇరువురూ పోటీపడేవారు.

మంగళూరులో పుట్టి, పెరిగిన జార్జ్, కొంకణి, తుళు, కన్నడ భాషలను ధారాళంగా మాట్లాడగలరు. ఆయనలో స్వతసిద్ధమైన భాషా ప్రావీణ్యాలు ఉండేవి. బొంబాయికి చేరిన కొద్ది కాలానికే మరాఠీ, హిందీ భాషలలో కూడా తిరుగులేని ప్రావీణ్యాన్ని ఆయన సాధించారు. కార్మిక వర్గాన్ని సంఘటితం చేసేందుకు ఆయనలోని ఈ భాషాపరమైన ప్రతిభా పాటవాలు విశేషంగా దోహదం చేశాయి.

నాకు తెలిసిన మొదటి సార్వత్రిక ఎన్నికలు 1967లో జరిగాయి. అప్పుడు నా వయస్సు 8 సంవత్సరాలు. ఆ ఎన్నికల ద్వారానే జార్జ్ దేశ వ్యాప్తంగా ప్రజల దృష్టికెక్కారు. బొంబాయిలో కాంగ్రెస్ యోధుడు ఎస్ కె పాటిల్ పై పోటీ చేసి విజయం సాధించారు. ఈ సంచలన వార్త బొంబాయికి సుదూర డెహ్రాడూన్‌లో ఉన్ననాకు ఎలా చేరిందో అలానే ధన్‌బాద్, ఢెంకనాల్ లోని బాలలకూ చేరివుంటుంది. ఎస్ కె పాటిల్ లాంటి నాయకుడిని ఎన్నికలలో మొట్టమొదటి సారి పోటీ చేసిన ఒక సామాన్య యువకుడు ఓడించడం ఒక అసాధారణ విషయం. నెహ్రూ, శాస్త్రి, ఇందిర కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక వనరులు సమకూర్చిన నాయకుడు పాటిల్. భారత దేశపు మహా సంపద్వంతమైన నగరంలో కుబేర సమానులైన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య అనుసంధాన వ్యక్తి పాటిలే. 1967 లోక్‌సభ ఎన్నికలలో ఎస్ కె పాటిల్‌ను జార్జ్ ఫెర్నాండెజ్ ఓడించడం, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలలో అమిత్ షా (బీజేపీ అధ్యక్షుడు)ను జిగ్నేష్ మేవాని లేదా కన్హయలాల్ కుమార్ ఓడించడం లాంటిదనని చెప్పవచ్చు. దీన్ని బట్టి ఆనాడు పాటిల్ ప్రాధాన్యమేమిటో నేటి తరం వారికి అర్థం కాగలదు.

జార్జ్ ఫెర్నాండెజ్ తదనంతర స్ఫూర్తిదాయక జీవితంలో ప్రముఖ ఘట్టాలు అందరికీ సుపరిచితమైనవే. అవి: 1974లో రైల్వే కార్మికుల సమ్మెకు నాయకత్వం; అత్యవసర పరిస్థితికాలంలో ఆయన ప్రదర్శించిన ధైర్య సాహసాలు; 1977లో (జైలులో ఉండగానే) బిహార్ లోని ముజాఫర్ పూర్ నుంచి లోక్ సభకు ఎన్నిక కావడం; జనతా పార్టీ ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా బహుళజాతి సంస్థలు ఐబిఎమ్, కోకా కోలాను దేశం నుంచి బహిష్కరించడం; ప్రధాన మంత్రి మొరార్జీదేశాయిని లోక్‌సభలో సమర్థిస్తూ ప్రసంగించిన మొదటి రోజునే ఆయన్ని అధికారం నుంచి కూలదోయడం; వి.పి.సింగ్ ప్రభుత్వంలో రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు కొంకణ్ రైల్వేను ప్రమోట్ చేయడం; జనతా పరివార్‌ను చీల్చి తన వర్గాన్ని మతతత్వ బీజేపీ నాయకత్వంలోని సంకీర్ణంలో భాగస్వామిని చేయడం; వాజపేయి ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా సైనిక సిబ్బంది సంక్షేమంపై విశేష శ్రద్ధ చూపడం; 2002 గుజరాత్ మారణ కాండ అనంతరం తన పార్టీ సహచరురాలు జయా జైట్లీతో కలిసి గుజరాత్ ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెప్పడం మొదలైనవి. 2004లో వాజపేయి ప్రభుత్వం ఎన్నికలలో ఓడిపోయిన అనంతరం జార్జ్ తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. ఎన్నో విషయాలు చెప్పగలిగిన వ్యక్తి మౌనంగా వుండిపోవల్సి రావడం ఎంత దురదృష్టకరం!

జార్జ్ ఫెర్నాండెజ్ అద్వితీయ వ్యక్తి. అటువంటి నాయకుడిని మనం మళ్ళీ చూడబోము. ఈ అస్తిత్వ రాజకీయాల యుగంలో మంగళూరుకు చెందిన కొంకణి భాష మాట్లాడే కేథలిక్ క్రైస్తవుడు ఒకరు లోక్‌సభ ఎన్నికలలో ముంబైలోనూ లేదా బిహార్‌లోనూ విజయం సాధించడాన్ని ఊహించగలమా? ఇక, ఈ మహోన్నతుడు తన క్రియాశీల రాజకీయ జీవితం తుదినాళ్ళలో మతతత్వ రాజకీయాలతో రాజీపడడం మాత్రం క్షమార్హం కాదు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా జరిపిన పోరాటం జార్జ్ జీవితంలో ఒక ఉత్కృష్ట ఘట్టమయితే అడ్వాణీ, మోదీ సంకుచిత రాజకీయాలను ఆమోదించడం నిస్సందేహంగా ఒక అధమ ఘట్టం. విశ్వహిందూపరిషత్, బజరంగ్ దళ్ కార్యక్రమాలనూ అంగీకరించడం మరింత గర్హనీయమైన విషయం. అధికార లాలసే జార్జ్, ఎన్డీఏలో కొనసాగేలే చేసిందని కొంతమంది విమర్శకులు భావించారు. ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకత కూడా అందుకు ఒక ముఖ్యకారణమని చెప్పవచ్చు. అత్యవసర పరిస్థితి అమలులోకివచ్చిన కొద్దికాలానికే జార్జ్ సోదరుడు మైఖేల్ (బెంగళూరులో ట్రేడ్ యూనియన్ నాయకుడు)ను అరెస్ట్ చేశారు. అయితే జార్జ్ పట్టుబడకుండా తప్పించుకున్నారు. ఒక సిక్కు మతస్థుడుగా తన తమ్ముడు, భౌతికశాస్త్రవేత్త రిచర్డ్ ఫెర్నాండెజ్‌ను కలుసుకున్నప్పుడు కూడా పోలీసులు ఆయనను పసిగట్టలేకపోయారు. జార్జ్‌ను అరెస్ట్ చేయడంలో వైఫల్యంపై ఇందిరాగాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఆదేశాల మేరకు కర్ణాటక ప్రభుత్వం, రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేని జార్జ్ సోదరుడు లారెన్స్‌ను అరెస్ట్ చేసి అమానుష చిత్ర వధలకు గురిచేసింది. అలాగే జార్జ్ స్నేహితురాలు, ప్రముఖ నటి స్నేహలతా రెడ్డిని కూడా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. జైలులో సంక్రమించిన అనారోగ్యంతో ఆమె మరణించారు. జార్జ్ తన జీవితపు తొలి దశలోనే రామ్ మనోహర్ లోహియా కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలతో అమితంగా ప్రభావితమయ్యారు. అత్యవసర పరిస్థితి కాలంలో తన కుటుంబసభ్యులు, బంధుమిత్రులను ప్రభుత్వం తీవ్ర ఇక్కట్లకు లోనుచేయడంతో ఇందిరాగాంధీ, కాంగ్రెస్ పార్టీ పట్ల ఆయనలో ద్వేషం మరింతగా తీవ్రమయింది. ఎట్టి పరిస్థితుల లోను ఇందిర కుటుంబానికి అధికారం లేకుండా చేయడమే ఆయన ధ్యేయమై పోయింది. ఇందుకు హిందూ రాష్ట్ర పేరిట ముస్లింలు, క్రైస్తవులను ఊచకోత కోసిన వారితోకూడా చేతులు కలపడానికి ఆయన వెనుకాడలేదు.

జార్జ్ ఫెర్నాండెజ్ ఒక అద్వితీయ వ్యక్తి. అటువంటి నాయకుడిని మనం మళ్ళీ చూడబోము. ఈ అస్తిత్వ రాజకీయాల యుగంలో, మంగళూరుకు చెందిన కొంకిణి భాష మాట్లాడే కేథలిక్ క్రైస్తవుడు ఒకరు లోక్ సభ ఎన్నికలలో ముంబై లోనూ లేదా బిహార్ లోనూ విజయం సాధించడాన్ని ఊహించగలమా? ఎటువంటి అహంకారంలేని రాజకీయవేత్త, నిరాడంబరుడు జార్జ్. కనుకనే బస్సు డ్రైవర్లు, రైల్వే సిగ్నల్‌మెన్ లాంటి సామాన్యులు కూడా ఆయనతో సమానస్థాయిలో ఒక సోదరుడితో మాట్లాడినట్లు మాట్లాడగలిగారు. టిబెటన్, ఇరానియన్ విద్యార్థులు ఆయన్ని ఒక తండ్రిలా గౌరవించారు. ఇటువంటి మహోన్నత లక్షణాలుగల ఈ ఉదాత్త వ్యక్తి తన క్రియాశీల రాజకీయ జీవితం తుదినాళ్ళలో దురదృష్టవశాత్తు నైతిక విరుద్ధంగా మతతత్వ రాజకీయాలతో రాజీ పడడం క్షమార్హం కాదనేది మనం విస్మరించకూడదు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)



నలుపెక్కిన అసెంబ్లీ

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బంద్‌కు సంఘీభావంగా టీడీపీ ఇచ్చిన పిలుపుతో అసెంబ్లీ శుక్రవారం నలుపు వర్ణం పులుముకొంది. సీఎం చంద్రబాబుతో సహా అత్యధిక సంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల చొక్కాలు ధరించి వచ్చారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ నలుపు చొక్కా ధరించి అసెంబ్లీకి అడుగుపెట్టని చంద్రబాబు తొలిసారి నల్ల చొక్కా ధరించి అసెంబ్లీకి వచ్చారు. స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు మాత్రం నల్ల రిబ్బన్ ధరించారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ముందుగా తెల్ల చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. సభలో పరిస్థితిని గమనించి అప్పటికప్పుడు నల్ల చొక్కాలు తెప్పించుకొని వేసుకొన్నారు.



కేంద్రానికి ఊడిగం చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాన్ని వెనుకేసుకురావడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం శాసనసభలో విభజన చట్టం అమలుపై స్వల్పవ్యవధి చర్చ జరిగింది. టీడీపీ సభ్యులతోపాటు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చర్చలో పాలుపంచుకున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న వాటితోపాటు అందులో ప్రస్తావించని అనేక పథకాలు, కార్యక్రమాలను కేంద్రం రాష్ట్రంలో అమలు చేస్తోందని, ప్రత్యేక హోదా సాధ్యం కాదంటే ముఖ్యమంత్రి అంగీకరించి ప్యాకేజీ కోరారని, ఇప్పుడేమో యూటర్న్ తీసుకున్నారని విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. రాజు వ్యాఖ్యలపై సీఎం మండిపడ్డారు. ఘాటు పదజాలంతో బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు.

ఎవరి కోసం ఇస్తారయ్యా?

'అవి ఎవరికోసం ఇస్తారయ్యా? కొత్త రాష్ట్రానికి అన్నీ ఇవ్వాలి. హైదరాబాద్, చెన్నై, బెంగళూర్, ఢిల్లీల్లో ఎన్ని సంస్థలున్నాయి. మనకెన్ని ఇచ్చారు? ఎవడబ్బ సొమ్మిది? సామాన్యుడికి ఉన్న ఆలోచన కూడా మీకు లేదా? ప్రజాప్రతినిధిగా ఉండడానికే మీకు అర్హత లేదు. నా రక్తం పొంగిపోతోంది. ఈ రాష్ట్రంలో ఉంటూ ఎవరికి ఊడిగం చేస్తారు? అడిగేవాడు లేడని మీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారా? ఏం చేస్తారయ్యా మమ్మల్ని? జైల్లోపెడతారా? వ్యతిరేకంగా ఉంటే ఫినిష్ చేస్తారా. ఇష్టప్రకారం తమాషాలాడుతున్నారు' అని సీఎం ఆవేశంగా స్పందించారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావు జోక్యం చేసుకుని.. ఆయన్ను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. సీఎం మాట్లాడుతూ.. 'నాకు ఆవేదన ఉండదా? రాష్ట్రానికి ఎన్ని కేంద్ర సంస్థలు ఇచ్చారు? తమిళనాడు, గుజరాత్‌కు ఎన్ని ఇచ్చారో పోల్చిచూడండి. మాకు రోషం లేదా? వారు కూడా రోషం ఉంటే మాట్లాడాలి' అని తీవ్ర స్వరంతో అన్నారు. ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం చెబుతున్నానని మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే మాణిక్యాలరావు అన్నారు. పదేపదే సిగ్గులేదని ఎలా గంటారన్నారు. ఈ సమయంలో సీఎం కాకినాడలో తనకు ఎదురైన అనుభవాన్ని వినిపించారు. 'నేను అక్కడకు వెళ్లినపుడు ఓ రిటైర్డ్ డీఈవో ఉన్నీసాబేగం నడవలేని పరిస్థితిలో తన కూతురును వెంటబెట్టుకుని వచ్చారు. ఆవిడ మాట్లాడుతూ ఆంధ్ర ప్రజలకు పౌరుషం లేదా? తెలుగువారిని కించపరిచేవారికి తగినబుద్ధి చెప్పి చంద్రబాబుకు అండగా నిలబడతామన్నారు. అలాంటిది నువ్వు (మాణిక్యాలరావు) ఇక్కడ కూర్చుని వారిని పొగుడుతూ ఉంటే ఏం చెప్పాలి?'ని ప్రశ్నించా రు.

ఇండియా మ్యాప్ నుంచి తీసేస్తారా?

'ఇండియా మ్యాప్ నుంచి ఆంధ్రను తీసేస్తారా? తీసేయాలనుకుంటున్నారా? ఇది కేంద్రం పెట్టిన చివరి బడ్జెట్. ఇందులోనైనా రాష్ట్రానికి కనీసం ఏదో ఒకటి చేయాల్సింది. అయితే గతం కంటే అన్యాయంగా చేశారు. గత బడ్జెట్‌లలో కనీసం ఆంధ్ర పేరైనా ఉండేది. ఇప్పుడదీ లేదు.'

ఢిల్లీలో ఇంటింటికీ తిరిగాను..

'అందరి కంటే ఎక్కువగా ఈ రాష్ట్రంలో రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక వ్యక్తిని నేనే. మోదీ ఎక్కడకు వస్తే అక్కడకు వెళ్లి కలిశా. ఎయిర్‌పోర్టుకెళ్లి కలిశాను. ఢిల్లీకి వెళ్లినప్పుడు మీ నాయకుల ఇంటింటికి తిరిగాను. గడపగడపకూ తిరిగాను.'

వాజ్‌పేయి కోసం త్యాగం..

'గోద్రా సంఘటన జరిగాక.. మోదీ కావాలా.. దేశం కావాలా? అని ఈ దేశంలో నేనే మొదటిసారిగా నాటి ప్రధాని వాజ్‌పేయిని అడిగాను. దేశం కావాలంటే మోదీని తొలగించండి.. గుజరాత్ కావాలంటే మోదీని సీఎంగా కొనసాగించండని చెప్పాను. ఆయన ప్రయత్నం చేశారు. ఆ పెద్దమనిషి కోసం త్యాగం చేశాను'

ఆయన్ను అంతకుముందు చూడలేదు

'ఈ రాష్ట్రం కోసమే బీజేపీతో పొత్తుపెట్టుకున్నాను. నేను 14 సీట్లు ఇస్తే నాలుగు గెలిచారు. అన్నీ ఎందుకు గెలవలేకపోయారు? మాణిక్యాలరావు ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఆయన్ను అంత కుముందు ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల ముందు పొత్తు కుదిరాక జరిగిన ఓ మీటింగ్‌కు మోదీతోపాటు వస్తే అక్కడ మాణిక్యాలరావు పేరు చెప్పారు. మా వాళ్లు సరిగా చేయడం లేదని ఆయన చెబితే.. పొత్తుధర్మం పాటించాలని, ఆయన్ను గెలిపించాలని టీడీపీ కార్యకర్తలకు గట్టిగా హెచ్చరికలు చేశాను. మేం నిజాయితీగా పనిచేశాం. ఇప్పుడు మీరేం చేస్తున్నారు? ఎన్నో కష్టాలు పడి కియా మోటార్స్‌ను నేను తీసుకొస్తే మోదీ వల్ల వచ్చిందంటారా?'

ఫినిష్ చేస్తారా?

'కేంద్రం వల్లే అన్యాయం జరిగితే దానికి మనమెందుకు పన్నులు కట్టాలి? మీ దగ్గర సమాధానం లేదు. మేమెందుకు భారత్‌లో భాగంగా ఉన్నామో చెప్పండి. నేను మీకు వ్యతిరేకంగా పనిచేస్తే నన్ను ఫినిష్ చేస్తారా? ఇన్‌కం టాక్స్ అని, మరోటని అంటున్నారు.'

రాష్ట్రం కోసం తగ్గాను..

'పసిబిడ్డలాంటి నవ్యాంధ్ర భవిష్యత్ నేను తగ్గాను. మోదీ నాకంటే వెనక రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటికే ఇద్దరిని ప్రధానమంత్రులను చేశాను. జ్యోతిబసు, కరుణానిధి, మూపనార్, లాలూప్రసాద్ యాదవ్, ఫరూక్ అబ్దుల్లా, బిజూ పట్నాయక్, ములాయం సింగ్ యాదవ్.. అందరూ కలిసి ప్రధాని అభ్యర్థిని మీరే నిర్ణయించాలని నాకు అధికారమిచ్చారు. అలాంటి నేను.. మోదీ వస్తే ఈ రాష్ట్రం కోసం ఎన్నో సార్లు సార్ సార్ అని సంబోధించాను. బిల్‌గేట్స్, క్లింటన్ వచ్చినపుడు కూడా మిస్టర్ అని మాట్లాడాను.'



పోలవరంలో ఏమిచ్చారు?

'ఏడు ముంపు మండలాలు విలీనం చేస్తేనే సీఎంగా ప్రమాణం స్వీకారం చేస్తానని చెప్పాను. ఆ రోజు మోదీ ఢిల్లీకి కొత్త. ఆయనకు తెలియదు కాబట్టి అంగీకరించారు. ఇప్పుడైతే ఇచ్చేవారు కాదేమో! నేను సవాల్ విసురుతున్నాను.. దేశంలోని ఏ జాతీయ ప్రాజెక్టయినా సరే.. ఈ స్థాయిలో పనులు చేస్తుంటే నేను రాజకీయాలనుంచి విరమించుకుంటాను. మీరు నిరూపిస్తారా? పోలవరం డీపీఆర్‌ను ఎందుకు అమలు చేయరు? ఎందుకు ఆమోదించరు? ఎందుకు డబ్బు ఇవ్వరు?'

రాష్ట్రంపై వివక్ష

- రాజధాని నిర్మాణానికి సాయమేదీ?
- విశాఖ రైల్వే జోన్ ఎక్కడ?
- చట్టంలో ఉన్నవే అడుగుతున్నాం
- పోలవరానికి కేంద్రం మోకాలడ్డుతోంది
- నిరసిస్తూ శాసనసభ తీర్మానం

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రపై కేంద్రం వివక్ష చూపుతోందని శాసనసభ తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని అంశాలు, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యంపై ఆందోళన ప్రకటించింది. కేంద్రం తీరును తీవ్రంగా నిరసిస్తూ శుక్రవారం సభ తీర్మానం చేసింది. తీర్మానం సారాంశమిదీ..

చేయాల్సినవెన్నో..

'విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇవ్వాలి. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుచేయాలి. దుగరాజపట్నం వద్ద ఓడరేవు రావాలి. పరిశోధనా సంస్థలను ప్రారంభించాలి. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన ఇంకా పూర్తికాలేదు. విభజన బిల్లును రాజ్యసభలో ఆమోదింపజేయడానికి అప్పటి ప్రధాని ఆరు హామీలతో ప్రకటన చేశారు. అందులో ముఖ్యంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, 2014-15 ఏడాదికి రెవెన్యూ లోటు భర్తీ, బుందేల్‌ఖండ్, కోరాపుట్-బోలంగీర్-కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయం ఉన్నాయి. రైల్వేజోన్ ఇవ్వడం కుదరదంటున్నారు. ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటున్నారు. ఓడరేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారు. విద్యాసంస్థల శాశ్వత భవనాల నిర్మాణాల కోసం అరకొర నిధులు కేటాయించారు. దీనినిబట్టి చూస్తే ఈ సంస్థలు వచ్చే ఇరవై ఏళ్లకైనా పూర్తవుతాయా అనే సందేహం కలుగుతోంది. విజయవాడ, గుంటూరులకు డ్రైనేజీ కోసం ఇచ్చిన నిధులను కూడా రాజధానికి ఇచ్చినట్లు చూపుతున్నారు. ఇది శోచనీయం. యూసీలు ఇచ్చినా ఇవ్వలేదని ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇస్తున్న సాయమూ నామమాత్రమే. ఇచ్చిన రూ.350కోట్లను రాజ్యాంగ విరుద్ధంగా వెనక్కి తీసుకున్నారు. బుందేల్‌ఖండ్ తరహా సాయం చేయలేదు.'

కక్షపూరిత ధోరణిని ఖండిస్తున్నాం..

'రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న కక్షపూరిత ధోరణిని శాసనసభ తీవ్రంగా ఖండిస్తోంది. పోలవరం రాష్ట్రానికి జీవనాడి.. ప్రజల చిరకాల స్వప్నం. కానీ ఏడు ముంపు మండలాలను ఆంధ్రకు బదలాయించిన తర్వాత కేంద్రం నుంచి అందాల్సిన సాయం మందగించడం దురదృష్టకరం. ఈ ప్రాజెక్టుపై రాష్ట్రం ఖర్చుచేసిన రూ.3,818 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేయాల్సి ఉంది. సవరించిన డీపీఆర్‌ను ఆమోదించకుండా కాలయాపన చేస్తూ ప్రాజెక్టు పురోగతికి మోకాలడ్డుతోంది. హోదా బదులు దాంతో సమానమైన ప్రయోజనాలు కలిగించే ప్రత్యేక సాయాన్ని ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రత్యేక సాయం నుంచి మనకు నిధులు రాకపోగా.. హోదా ఉన్న రాష్ట్రాలకు పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగిస్తోంది. రాష్ట్రాలకు ప్రత్యేకహోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం ఎక్కడా చెప్పలేదు. అది తమ పరిధిలోని అంశం కాదని ఆర్థిక సంఘం అధ్యక్షుడు, సభ్యులు బహిరంగంగా వెల్లడించారు. హోదా ఇవ్వొద్దని ఆర్థిక సంఘం చెప్పనప్పుడు.. హోదా ఉన్న రాష్ట్రాలకు రాయితీలు, ప్రోత్సాహకాలు కొనసాగిస్తున్నప్పుడు.. మాకు మాత్రం ఎందుకు నిరాకరిస్తున్నారు?'

ప్రజల్లో తీవ్ర ఆగ్రహం..

'చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలు అసంపూర్తిగా, ఆలస్యంగా జరగడం పట్ల ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. సీఎం 29 సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది. చట్టపరంగా దక్కాల్సిన అంశాల పట్ల కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని శాసనసభ తీవ్రంగా పరిగణిస్తోంది. సహకార సమాఖ్య వ్యవస్థలో కేంద్రానికి అన్ని రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికీ బాధ్యత ఉంది. ముఖ్యంగా ఆంధ్ర ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, అన్యాయంగా విభజన జరిగి కష్టాల్లో ఉన్న రాష్ట్రం పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువగా ఉండాలి. రాష్ట్రం నిలదొక్కుకుని దక్షిణ భారతంలో ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేవరకు కేంద్రం చేయూతనందించాలి. అందుకు భిన్నంగా వివక్షపూరిత ధోరణిలో వ్యవహరించడం దుర్మార్గం. చట్టంలోని లేనివి, పార్లమెంటు సాక్షిగా ప్రధాని ఇచ్చిన హామీల్లో లేనివీ రాష్ట్రం అడగడం లేదు. విభజన చట్టంలోని అంశాలు, ఆనాటి ప్రధాని ప్రకటించిన రాయితీలతో ప్రత్యేక హోదా, న్యాయమైన డిమాండ్లను ఇప్పటికైనా గుర్తించి న్యాయం చేయాలని, సత్వరమే అమలుచేయాలి.'

బీజేపీ వర్సెస్ టీడీపీ



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, టీడీపీ సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శలు రువ్వుకున్నారు. కేంద్రం రాష్ట్రానికి ఎంతో మేలు చేసిందని బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు పలు అంశాలను ప్రస్తావించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన పార్టీ ఈరోజు వారితోనే పొత్తు పెట్టుకుందని.. రాష్ట్రాన్ని విభజించిన పార్టీతో స్నేహం చేస్తున్నారని విమర్శించారు. పవిత్ర పసుపురంగును వదిలేసి నల్లరంగు చొక్కాలు ధరించడం చూసి ప్రజలు నివ్వెరపోతున్నారని అన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం చెప్పారు. బీజేపీ నుంచి ఆకుల సత్యనారాయణ ఎందుకు బయటకుపోయారని ప్రశ్నించారు. దీనిపై విష్ణుకుమార్‌రాజు దీటుగా సమాధానం ఇచ్చారు. టీడీపీ నుంచి మేడా మల్లికార్జునరెడ్డి ఎందుకు వెళ్లిపోయారో సమాధానం చెబితే బదులిస్తానన్నారు. మంత్రి అచ్చెన్న బదులిస్తూ.. 'ఇక్కడి నీళ్లుతాగి, గాలి పీల్చి కేంద్రాన్ని పొగుడుతారా? రాజకీయాలు మాట్లాడటానికి వేరే వేదిక ఉంది బయటకెళ్లి మైకుపెట్టుకొని మాట్లాడండి. ఇక్కడ మాట్లాడే అర్హత లేదు. ఇలాంటివి ఇక్కడ మాట్లాడనివ్వం' అని హెచ్చరించారు. స్పీకర్ జోక్యం చేసుకొని జాగ్రత్తగా మాట్లాడాలని మంత్రికి సూచించారు. మంత్రి వ్యాఖ్యలపై విష్ణుకుమార్ రాజు అభ్యంతరం చెప్పారు. బెదిరిస్తే, ప్రతిపక్షం నోరునొక్కితే పరిష్కారం లభిస్తుందా అని ప్రశ్నించారు. బీజేపీకి ఇక్కడ డిపాజిట్లు కూడా రావని మంత్రి కాలువ శ్రీనివాసులు అన్నారు. రాజు స్పందిస్తూ.. మరో 3నెలల్లో ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలుస్తుందన్నారు. హోదా విషయంలో యూటర్న్ ఎందుకు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఆయన మాట్లాడుతున్న సమయంలో కొందరు టీడీపీ సభ్యులు వ్యక్తిగత కామెంట్లు చేశారు. తీవ్ర అసహనానికి గురైన రాజు.. ఆ ఎమ్మెల్యేకే మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు.



హోదా ఇవ్వనన్నది మోదీయే





మేమెప్పుడూ వద్దనలేదు.. సమాన ప్యాకేజీ అంటేనే సరేనన్నాం

- 350 కోట్లివ్వడానికి మనసు రాలేదు
- 3 లక్షల కోట్లిస్తామంటే నమ్ముతారా?
- కాలుతున్న కడుపుకి అన్నం పెట్టరా?
- బీజేపీ నేతలపై మండలిలో టీడీపీ ఆగ్రహం
- తీర్మానం కాపీలు చించిన మాధవ్, వీర్రాజు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదాను తామెప్పుడూ వద్దనలేదని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. 'హోదా ఇవ్వడం కుదరదని.. 2017 తర్వాత దేశంలో ఏ రాష్ట్రానికి హోదా ఉండదని ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. హోదాకు సమాన ప్రయోజనాలు కల్పించేలా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారు. ఇందుకు చంద్రబాబు సరేనన్నారు. కానీ 2017 తర్వాత ఈశాన్య, కొండ ప్రాంత రాష్ట్రాలకు హోదా కొనసాగించారు. మనల్ని మాత్రం మోదీ, జైట్లీ దారుణంగా మోసం చేశారు' అని ధ్వజమెత్తారు. శాసనమండలిలో శుక్రవారం విభజన హామీలు, విభజన చట్టం అమలుపై చర్చ సందర్భంగా రభస చోటుచేసుకుంది. హోదా రాకపోవడానికి చంద్రబాబే కారణమని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. తక్షణమే ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, వాటిని రికార్డుల నుంచి తొలగించాలని టీడీపీ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. ఈ సమయంలో మాధవ్, మరో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు.. టీడీపీ సభ్యులైన బీద రవిచంద్ర, సత్యనారాయణరాజు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటా మాటా పెరగడంతో తమ స్థానాలను వదిలి పోడియం వద్దకు చేరుకుని ఒకరి పైకి ఒకరు దూసుకురాగా.. మండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్, విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, మంత్రి ఫరూక్ వారిని అడ్డుకుని శాంతింపజేశారు. విభజన హామీల అమలుపై యనమల సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. బీజేపీ ఎమ్మెల్సీలిద్దరూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. తీర్మానం ప్రతులను చించిపడేసి మండలి నుంచి వాకౌట్ చేశారు. అనంతరం మండలి తీర్మానాన్ని ఆమోదించింది.

350 కోట్లే ఇవ్వలేదు..

ఇటీవల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రానికి వచ్చినపుడు రూ.3 లక్షల కోట్ల విలువైన రోడ్లు ఇచ్చినట్లు ప్రకటించారని, ఆ విషయాన్ని పట్టించుకోకుండా కేంద్రం వెనక్కి తీసుకున్న రూ.350 కోట్లను, పోలవరానికి ఇవ్వాల్సిన రూ.3,500 కోట్లను అడుగుతారెందుకని వీర్రాజు అంతకుముందు ప్రశ్నించారు. దీనిపై యనమల తీవ్రంగా స్పందించారు. 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.350 కోట్లను రాష్ట్ర ఖాతాలో వేసినట్లే వేసి వెనక్కి తీసుకున్న కేంద్రానికి అది తిరిగివ్వడానికి ఇంతవరకు మనసు రాలేదు. అలాంటిది రూ.3 లక్షల కోట్లు ఇస్తామంటే రాష్ట్ర ప్రజలు నమ్ముతారా? ఆ రూ.350 కోట్లు రాయలసీమ జిల్లాలకు చెందినవి. కానీ సీమ ప్రయోజనాల కోసమంటూ బీజేపీ ఉద్యమించాలని చూడడం వింతగా ఉంది' అని ఎద్దేవాచేశారు. హామీలపై చర్చించాలంటే బీజేపీ ఎమ్మెల్సీలు మోదీ గొప్పతనం గురించి, కర్ణాటక, ఒడిశా గురించి మాట్లాడుతున్నారని కేశవ్ విరుచుకుపడ్డారు. కాలుతున్న కడుపుకి మీరెంత అన్నం పెట్టారని నిలదీశారు. మోదీ ప్రభు త్వం నిధుల న్నిటినీ నీరవ్ మోదీ, చోక్సీలాంటి వాళ్లకు కట్టబెట్టి దేశాలు దాటించేస్తుందని డొక్కా ఎద్దేవా చేశారు.

మోదీ ప్రధాని కావడం ఓర్వలేకే: మాధవ్

ఇల్లిల్లూ తిరిగి పాచిపనులు చేసుకునే తల్లి కుమారుడు, బీసీ వర్గానికి చెందిన వ్యక్తి, ఒక చాయ్‌వాలా ప్రధాని కావడం ఓర్చుకోలేకనే చంద్రబాబు విభజన హామీల పేరుతో దుమ్మెత్తిపోస్తున్నారని మాధవ్ ఆరోపించారు. 'చాయ్‌వాలాల కంటే అధ్వానంగా బతుకుతున్న గిరిజనులకు మీరేం చేశారు మాధవ్? కనీసం మా కోసం విభజన చట్టంలో పెట్టిన గిరిజన యూనివర్సిటీని ఇప్పటివరకు తీసుకురాలేకపోయారు' అని టీడీపీ ఎమ్మెల్సీ సంధ్యారాణి కౌంటర్ ఇచ్చారు. నిరాడంబరంగా ఉండే పేద ప్రధాని మోదీపై విమర్శలు చేయడం తగదని బీజేపీ ఎమ్మెల్సీలు అనడంతో.. 'ఒక్క పూట సూటుబూటూ కళ్లజోడు కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసే వ్యక్తి పేద ఎలా అవుతాడు..?' అంటూ ఎమ్మెల్సీలు శమంతకమణి, బీద రవిచంద్ర నిలదీశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రూ.95 వేల కోట్లు రావాలంటూ లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ, రూ.75,000 కోట్లు రావాలంటూ పవన్ కల్యాణ్ నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికలు ఏకపక్షమని మాధవ్ పేర్కొన్నారు. యనమల స్పందిస్తూ.. కేంద్రం మనకివ్వాల్సిన రెవెన్యూలోటు, గ్రాంట్లు సక్రమంగా ఇచ్చుంటే ప్రస్తుతం మిగులులో ఉండేవాళ్లమని స్పష్టం చేశారు. అన్ని వనరులూ ఉన్న కేంద్రమే రూ.50 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. చర్చకు యనమల సమాధానం చెప్పేటపుడు వీర్రాజు మాటమాటకు అడ్డుపడుతూ పెద్దగా అరిచారు. 'అధ్యక్షా.. పీ టాబ్లెట్లు తెప్పించి వీర్రాజుకివ్వండి' అని యనమల కోరారు. 'నేను ఎంత పెద్దగా అరచినా నా బీపీ సాధారణ స్థాయిలోనే ఉంటుంది.. టాబ్లెట్లు అవసరం లేదు' అని వీర్రాజు అన్నారు.









నీ అందం నా అందం చూసి

ఓటేయలేదు

- జోన్ కోసమే బీజేపీకి విశాఖవాసుల పట్టం
- చివరి బడ్జెట్‌లోనూ ఏపీకి నిరాశే
- విష్ణు స్థానంలో నేనుంటే రాజీనామా: అచ్చెన్నాయుడు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'విశాఖ ప్రజలు నీ అందం, నా అందం చూసి... నీ ముఖం, నా ముఖం చూసి బీజేపీని గెలిపించలేదు. బీజేపీ విశాఖకు రైల్వే జోన్ ఇస్తుందని గెలిపించారు. కానీ, చివరి బడ్జెట్‌లో కూడా విశాఖకు రైల్వేజోన్ కేటాయించే ప్రస్తావనే లేదు. రైల్వేజోన్ తేలేకపోతున్నందుకు నేనే విష్ణు స్థానంలో ఉంటే రాజీనామా చేసేవాడిని' అని మంత్రి అచ్చెన్నాయుడు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును ఉద్దేశించి అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే లేకపోవడం దారుణమని విచారం వ్యక్తం చేశారు. విభజన చట్టం అమలు, కేంద్ర ప్రభుత్వం వివక్షపూరిత ధోరణిపై అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా చర్చకు సమాధానమిస్తూ... ఇప్పటికే పలు పర్యాయాలు సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ఈసారైనా అసెంబ్లీలో చేసిన తీర్మానానికి కేంద్రం చలిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ప్రత్యేకహోదా, విభజన చట్టం అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత తీరు పట్ల అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో 16 మంది సభ్యులు మాట్లాడారని వారికి అభినందనలు తెలిపారు. నాలుగున్నరేళ్లలో విభజన చట్టంపై ఎన్నో సార్లు చర్చించామని, ఎన్నోసార్లు రాష్ట్రానికి న్యాయం చేయాలని కేంద్రాన్ని అడిగామన్నారు. అయినా ఎలాంటి స్పందనా లేదన్నారు. ఢిల్లీలో తెలుగువారి ఆత్మగౌరవాన్ని 36 ఏళ్లక్రితం కాంగ్రెస్ తాకట్టుపెడితే, స్వర్గీయ ఎన్టీఆర్ కేంద్రంపై తెలుగు ప్రజల కోసం పోరాటాలు చేశారని, నేడు కాంగ్రెస్ కంటే బీజేపీ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఎక్కువగా దెబ్బతీసిందని ఆయన మండిపడ్డారు. కేంద్రం సహకరించకపోయినా సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం తప్పా? అని మంత్రి ప్రశ్నించారు. 'ప్రత్యేక హోదా మా పేటెంట్ హక్కు' అంటున్న ప్రతిపక్షనేత జగన్ పాదయాత్రలో ఒక్కరోజైనా కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి నిలదీశారు. దేశంలో ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయని, మోదీని గద్దెదించాల్సిన సమయం ఆసన్నమైందని అచ్చెన్నాయుడు అన్నారు. కేంద్రం చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మోదీ చేసిన అన్యాయంపై ఐదు కోట్ల ఆంధ్రులు ఒకే మాట మీద నిలిచి రాష్ట్రం కోసం పోరాటం చేస్తున్న సీఎం చంద్రబాబును నిండు హృదయంతో ఆశీర్వదించాలని మంత్రి కోరారు.

బీజేపీయేతర రాష్ట్రాలకే ఉపాధి బకాయిలెక్కువ

- రాష్ట్రాన్ని చీల్చేసినట్లు తీర్మానాన్ని చించేశారు: లోకేశ్

"బీజేపీయేత రాష్ట్రాలకే కేంద్రం ఎక్కువ ఉపాధి నిధులు బకాయి పడింది. ఈ పథకం నిర్వహణలో ముందున్న రాష్ట్రాల్లో బీజేపీ పాలిత రాష్ట్రం ఒక్కటీ లేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఉపాధి నిధులు రూ.6449 కోట్లు బకాయీ ఉంది. అందులో బీజేపీయేతర రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్‌కు రూ.3170 కోట్లు, ఆంధ్రకు రూ.1673 కోట్లు, కేరళకు రూ.603 కోట్లు బకాయిలున్నాయి. రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతూ మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చించివేయడం ఏమిటి? దానికి మీరు అనుకూలమో... వ్యతిరేకమో చెప్పండి. ఏదీ చెప్పలేకపోతే మౌనంగా ఉండండి. రాష్ట్రానికి కేంద్రం న్యాయం చేయాలని తీర్మానం ప్రతిపాదిస్తే మీకెందుకు నొప్పి? రాష్ట్రాన్ని చీల్చేసినట్లు తీర్మానాలను చించేశారు' అని మంత్రి నారా లోకేశ్ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో మరోమంత్రి కాల్వ శ్రీనివాసులు ఆట్లాడుతూ మోదీ నయవంచనకు రాష్ట్రంలోని బీజేపీ నేతలు నిస్సిగ్గుగా మద్దతు తెలపడం విచారకరమని అన్నారు. వైసీపీతో జతకట్టడంతో మోదీ ఆలోచనను జగన్ ఆచరిస్తున్నారని విమర్శించారు. మంత్రి జవహర్ మాట్లాడుతూ.. 'కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికిచ్చిన హామీలను అమలు చేస్తుందన్న ఆశలు లేవు. నల్ల దుస్తులతో నిరసన వ్యక్తం చేస్తున్నాం. ప్రభుత్వంపై కేంద్రం కక్ష్యపూరిత చర్యలు చేపట్టింది' అని అన్నారు.

మోదీ కేడీ... ప్రజలకు భారంగా మారారు

- ఆయన మనసు మకిలి పట్టింది.. అందుకే నల్ల దుస్తులతో నిరసన: టీడీపీ ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో విభజన హామీల అమలుపై జరిగిన చర్చలో పలువురు ఎమ్మెల్యేలు కేంద్రం తీరును ఎండగట్టారు. 'మోదీ కేడీ అని దేశమంతా మారుమోగుతుంది. ప్రధాని ప్రజలకు భారంగా మారారు' అని గొల్లపల్లి సూర్యారావు అన్నారు. 'నేను ఎంపీగా ఉన్నప్పుడు ప్రధాని వాజ్‌పేయి ఎప్పుడు కావాలంటే అప్పుడే అపాయింట్‌మెంట్ ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు' అని గద్దె రామ్మోహన్‌రావు అన్నారు. 'ప్రధాని మనసు మకిలపట్టి నల్లగా మారింది. అందుకే నల్ల దుస్తులతో నిరసన చేపట్టాల్సి వచ్చింది' అని శ్రావణ్ కుమార్ అన్నారు. 'ఆలోచనే పెట్టుబడిగా, రాజధానికి మొదటి కూలీగా సీఎం పనిచేస్తుంటే... కేంద్రం నియంత్రత్వ ధోరణి అవలంబిస్తోంది' అని ప్రభుత్వ విప్ యామినీబాల అన్నారు. 'వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చిన రూ.350 కోట్లు వెనక్కి తీసుకోడం దుర్మార్గం' అని చీఫ్‌విప్ పల్లె రఘునాథ్ రెడ్డి దుయ్యబట్టారు. 'కాంగ్రెస్ కన్నా ఏపీ ప్రజానీకానికి బీజేపీ ప్రధాన శత్రువు. మోదీ ప్రభుత్వం ఎన్ఐఏ, సీబీఐ, ఈడీను దిగజార్చింది' అని విప్ కూన రవికుమార్ అన్నారు. ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, ప్రభాకర్ చౌదరి, చాంద్‌బాషా, జీవీఎస్ ఆంజనేయులు తదితరులు మాట్లాడారు.

రాష్ట్రానికి లక్షల కోట్లు ఇచ్చాం

- అవన్నీ అవాస్తవాలంటూ ప్రచారం: విష్ణుకుమార్‌రాజు, మాణిక్యాలరావు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో తమ వాదనలను కొనసాగించారు. 'సాగరమాల ప్రాజెక్టు కింద కేంద్రం రూ.1,64,700 కోట్లు రాష్ట్రానికి ఇచ్చింది. 108 ప్రాజెక్టుల్లో 53 ప్రాజెక్టులు 2020 కల్లా పూర్తవుతాయన్నారు. వీటన్నింటినీ అవాస్తవాలుగా ప్రచారం చేస్తున్నారు' అని బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని వైసీపీ నేత జగన్ పోరాటం మొదలుపెట్టగానే రాజకీయంగా వెనుకబడిపోతామన్న భయంతోనే టీడీపీ యూటర్న్ తీసుకొని ఇప్పుడు నల్లచొక్కాలు ధరించి విచిత్రంగా వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ లబ్ధికోసం నల్లచొక్కాలు ధరించారని, మేలుచేస్తోన్న కేంద్రంపై బురదచల్లుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌తో జతకట్టిన టీడీపీ తమకు మిత్రద్రోహం చేసిందని దుయ్యబట్టారు. కాగా, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీజేపీ ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పి. మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్నివిధాలా సహకరిస్తున్నా కూడా మోదీ ప్రభుత్వంపై టీడీపీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. 'రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్లతో పనులు చేపట్టినట్లు గడ్కరీ చెప్పారు' అని మాణిక్యాలరావు అన్నారు.

కోట్ల మాట.. ఓట్ల వేట

(మొదటి పేజీ తరువాయి)

రంగ కార్మికులు నెలకు 100 రూపాయలు చెల్లిస్తే 60 ఏళ్ల వయసు తర్వాత నెలకు రూ.3,000 కనీస పెన్షన్ ఇచ్చే కొత్త పథకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశ పెట్టాలనేది సంప్రదాయమే తప్ప, అలాంటి నిబంధన ఎక్కడ ఉందని తొలుత ప్రశ్నించిన సర్కారు... తుదకు ఓటాన్ అకౌంట్‌కే మొగ్గు చూపింది. వాస్తవానికి ఓటాన్ అకౌంట్ అంటే కొత్త ప్రభుత్వం వచ్చి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే లోగా రానున్న మూడు నెలల కాలంలో చేయబోయే ఖర్చులకు పార్లమెంటు అనుమతి తీసుకోవడం! కానీ ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ఓటాన్ అకౌంట్ పేరుతో దాదాపు పూర్తి స్థాయి బడ్జెట్‌ను వండి వార్చారు. గతేడాది రూ.24.5 లక్షల కోట్ల బడ్జెట్ సమర్పించగా ఈసారి రూ.27.8 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పైగా కొత్త పథకాలు, పన్ను రాయితీలు, కేటాయింపులు యథేచ్ఛగా ప్రకటించారు. "సాధారణంగా మధ్యంతర బడ్జెట్‌లో పన్ను ప్రతిపాదనలు ఉండకూడదు. కానీ వేతన జీవులకు ఏడాది ప్రారంభంలో పన్నులపై స్పష్టత అవసరం. వాటిని వాయిదా వేయకూడదు" అంటూ ఆయన ఐటీ రాయితీ ప్రకటన చేశారు. ఎన్నికల తర్వాత తాయిలాలు ప్రకటిస్తే ఉపయోగమేముంది, ముందే ప్రకటించాలన్న తమ మనోగతాన్ని పరోక్షంగా వెల్లడించారు. బడ్జెట్లో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ నోట్ల లెక్కలు వినిపించగా, బడ్జెట్‌పై స్పందిస్తూ ప్రధాని మోదీ ఓట్ల లెక్కలు వినిపించారు. 12 కోట్ల మంది రైతులు, 3 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు, 30 కోట్ల మంది కార్మికులకు ఈ బడ్జెట్ వల్ల ప్రయోజనం కలుగుతుందంటూ తమ లక్ష్యమేమిటో చెప్పకనే చెప్పారు.

రూ.5 లక్షల వరకూ ఆదాయపు పన్ను ఉండదంటూ పీయూష్ గోయల్ ప్రకటించినప్పటికీ పన్నుకు అర్హమైన ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న వర్గాలకు మాత్రమే దానివల్ల లాభం కలుగుతుంది. ఆ ఆదాయం రూ.5 లక్షలు దాటిన వారంతా గతంలో మాదిరిగా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందే. ఎందుకంటే ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిలో గానీ, పన్ను శ్లాబుల్లో గానీ కేంద్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. ఐటీ మినహాయింపు రూ.5 లక్షలకు పెంచారని భావించిన ఎగువ మధ్య తరగతి ప్రజలు దీనితో నిరాశ చెందారు. ఇక రెండు హెక్టార్లలోపు భూమి ఉన్న రైతులకు ఏటా రూ.6 వేల సహాయాన్ని మూడు విడతల్లో అందించనున్నట్లు గోయల్ వెల్లడించారు. అయితే ఇది ఒక ఎకరానికి రూ.6 వేలు కాదు.. ఒక రైతుకు రూ.6 వేలు! అంటే అయిదెకరాలు ఉన్న రైతుకు కూడా రూ.6 వేలే లభిస్తుంది. తెలంగాణలో రైతు బంధు పేరిట ఎకరాకు ఏటా రూ.10 వేల పెట్టుబడిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. దీనికింద అయిదెకరాలు ఉన్న రైతుకు ఏటా రూ.50 వేల సహాయం అందుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇటీవల రైతులకు ఎకరానికి ఏటా రూ.5 వేల సహాయం అందించే పథకాన్ని ప్రకటించి దానిని కౌలుదారులకు కూడా వర్తింపజేశారు. వీటితో పోలిస్తే కేంద్రం ఇచ్చేది స్వల్పమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ పథకం ఉత్తరాదిలో బీజేపీకి కొంత లబ్ధి చేకూర్చవచ్చని, దక్షిణాదిలో దీని ప్రభావం తక్కువగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వచ్చే 2019-20 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి, వెనుక తేదీ అయిన 2018 డిసెంబరు నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ప్రకటించడం గమనార్హం. ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో తొలి విడత సొమ్ము వేయడం ద్వారా ఓట్లు కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమనే విమర్శలు వినిపించాయి. ఇక అసంఘటిత రంగ కార్మికుల పెన్షన్ పథకం ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనని, నెలకు రూ.100 చెల్లిస్తే 60 ఏళ్ల వయసు వచ్చాక రూ.3,000 కనీస పింఛను ఇవ్వడం కేవలం కంటి తుడుపేనని కార్మిక సంఘాలు విమర్శించాయి. గోవుల సంరక్షణ కోసం ప్రకటించిన కామధేను పథకం కూడా ఓటు బ్యాంకు లక్ష్యంగా ప్రవేశపెట్టిందేననే వ్యాఖ్యలు వినిపించాయి.

తాత్కాలిక బడ్జెట్‌పై సుప్రీంలో పిల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 : తాత్కాలిక బడ్జెట్‌పై ఎంఎల్ శర్మ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తాత్కాలిక బడ్జెట్‌కు రాజ్యాంగంలో చోటు లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ఇదొక మోసపూరిత బడ్జెట్ అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో నిస్సారమైన పిల్‌లు దాఖలు చేసినందుకు సుప్రీంకోర్టులో ఆయన చీవాట్లు ఎదుర్కొన్నారు. కాగా తాత్కాలిక బడ్జెట్‌పై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ఇది ఎన్నికల బడ్జెట్ కాంగ్రెస్ ఆరోపించింది.

నెగిటివ్ మార్కులు వద్దు!

- పోటీ పరీక్షలపై మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏ రకమైన పోటీ పరీక్షల్లోనూ నెగిటివ్ మార్కులను లెక్కించకూడదని మద్రాస్ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరేళ్ల కిందట ఐఐటీ పోటీపరీక్షలు రాసిన నెల్సన్ ప్రభాకరన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ మేరకు ఆదేశించింది. నెల్సన్ ప్రభాకరన్ 2013లో ఐఐటీ పరీక్షలు రాశారు. 72 మార్కులు వచ్చాయి. అయితే నెగిటివ్ మార్కులు ప్రాతిపదికన 25 మార్కులు తగ్గించి, 47 మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ప్రకటించారు. ఈ కారణంగా 50 మార్కులు సాధిస్తేనే రాయగలిగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అతను అర్హత కోల్పోయాడు. తనకు న్యాయం చేయాలంటూ నెల్సన్ హైకోర్టుని ఆశ్రయించాడు. జవాబు పత్రాన్ని పరిశీలించిన న్యాయమూర్తులు నెగిటివ్ మార్కుల కారణంగానే అతను అడ్వాన్స్ పరీక్షకు అర్హత కోల్పోయినట్లు భావించారు. దీంతో పోటీ పరీక్షల్లో నెగిటివ్ మార్కుల ప్రస్తావన ఉండరాదంటూ న్యాయమూర్తి జస్టిస్ మహదేవన్ ఆదేశించారు.

నిరసనలు కొనసాగించండి: ఎంపీలతో బాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "ఈ బడ్జెట్‌లో కూడా మనకు అన్యాయం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు ఏమీ ప్రకటించలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా మర్చిపోయింది. కాబట్టి పార్లమెంటులో పోరాటాన్ని కొనసాగించండి. ఎక్కడా తగ్గొద్దు" అని టీడీపీ ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. శుక్రవారం రాత్రి ఢిల్లీలో ఆయన ఎంపీలతో సమావేశమయ్యారు. బడ్జెట్‌పై 11వ తేదీన ఢిల్లీలో తలపెట్టిన దీక్షపై చర్చించారు. అయితే, శాఖలవారీగా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన అంశాలను గుర్తించి వాటిని సాధించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. సభలో సమన్వయంతో మెలగాలని ఎంపీలకు చెప్పారు. ఈ నెల 4వ తేదీన మరోసారి తాను ఢిల్లీ వస్తున్నానని, ఆ రోజు దీక్ష సన్నాహాలపై చర్చిద్దామని అన్నట్లు సమాచారం. కాగా, ఈ సందర్భంగా పార్లమెంటరీ పార్టీ నేత సుజనాచౌదరి విలేకరులతో మాట్లాడుతూ... రానున్న 10 రోజులు ఏయే రూపాల్లో పార్లమెంటులో నిరసనలు తెలపాలన్నదానిపై చర్చించామని, కార్యాచరణను రూపొందించుకున్నామని వెల్లడించారు. 'ఈ నెల 10వ తేదీన ఏపీకి మోదీ వస్తున్నారు. ఆయన ఎందుకు వస్తున్నారో తెలియదు. కానీ ఆ రోజు నిరసనలు తెలుపుతాం' అని వ్యాఖ్యానించారు.

సునీల్ అరోరాతో భేటీ

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోరాను శుక్రవారం రాత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈవీఎంలపై వ్యక్తమవుతున్న అనుమానాలపై వివరించినట్లు సమాచారం. దాదాపు 20 నిమిషాలపాటు సమావేశమయ్యారు.

'ఫ్రంట్'పై చర్చలు కొనసాగుతున్నాయి

- బీజేపీయేతర పార్టీలు ఏకంకావాలి: చంద్రబాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీయేతర ఫ్రంట్ ఏర్పాటుపై చర్చలు జరుగుతున్నాయని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం ఢిల్లీలో వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు భావసారూప్యంగల పార్టీలతో కూటమి ఏర్పాటుకు చర్చలు సాగుతున్నాయని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు సమైక్యం కావాల్సిన ప్రజాస్వామిక ఒత్తిళ్లు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే బీజేపీయేతర పార్టీల మధ్య 4 దఫాలు చర్చలు జరిగాయన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రాంతీయ పార్టీలపై ఉన్న రాజకీయ ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఎన్నికల ముందు ఎన్నికల తర్వాత కూటములు ఏర్పడిన సందర్భాలు గతంలో కూడా ఉన్నాయని చెప్పారు. 'చూద్దాం.. భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు జరుగుతాయో' అని ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు.

రాఖీకట్టినా తప్పుగానే చూస్తారు

- అమర్ సింగ్‌తో తన బంధంపై అందాల నటి జయప్రద వ్యాఖ్య
- ఆయనను గాడ్‌ఫాదర్‌గా భావిస్తా



ముంబై, ఫిబ్రవరి 1 : రాజకీయ నాయకురాలిగా మారిన అందాల నటి జయప్రద... ఎస్పీ మాజీ నేత అమర్‌సింగ్‌తో తన సంబంధంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. అమర్‌సింగ్‌ను తన గాడ్‌ఫాదర్‌గా ఆమె అభివర్ణించారు. అయితే, తాను అమర్‌సింగ్‌కు రాఖీ కట్టినా, జనం తమకు తోచినట్టు మాట్లాడుకొంటుంటారని జయప్రద వ్యాఖ్యానించారు. ముంబైలో జరుగుతున్న క్వీన్స్‌లైన్ లిటరేచర్ ఫెస్టివల్‌లో శుక్రవారం జయప్రద పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్ సింగ్‌తో తనకున్న రాజకీయ అనుబంధాన్ని, ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో తన ప్రత్యర్థి, ఎస్పీ సీనియర్ నేత అజమ్ ఖాన్ వల్ల తాను పడిన బాధలను ఆవేదన స్వరంతో ఈ సందర్భంగా వెల్లడించారు. "నా అభివృద్ధికి చాలామంది సహకరించారు. వారిలో అమర్ సింగ్‌ను గాడ్‌ఫాదర్‌లా భావిస్తాను" అని పేర్కొన్నారు. అజమ్ ఖాన్‌తో జరిపిన పోరాటంలో, ఒక దశలో తనపై యాసిడ్ దాడికి కూడా ఆయన ప్రయత్నించారని ఆమె తీవ్ర ఆరోపణ చేశారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలతో అల్లరి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులు తట్టుకోలేక ఒకసారి ఆత్మహత్యాయత్నం కూడా చేసినట్టు తెలిపారు. ఆ సమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీగా ఉన్న తనకు, అధినేత ములాయం సింగ్ సహా ఏ ఒక్క నాయకుడూ కనీసం సానుభూతి తెలపలేదన్నారు. అప్పుడు అమర్ సింగ్ డయాలసిస్ చేయించుకొంటూ.. దూరంగా ఉన్నారన్నారు. ఆస్పత్రి నుంచి తిరిగి రాగానే అమర్ సింగ్ తనను కలిసి ధైర్యం చెప్పారని తెలిపారు. పురుషస్వామ్య రాజకీయాల్లో ఒక మహిళ నిలదొక్కుకోవాలంటే నిజంగా యుద్ధమే చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.


అమెరికాలో మనోళ్లకు నోటీసులు!

అరెస్టయిన వారిని విడిపించేందుకు తెలుగు సంఘాల ప్రయత్నాలు.. నకిలీ వర్సిటీతో విద్యార్థులకు వలేస్తారా?

- అధికారులపై ఇమ్మిగ్రేషన్ లాయర్ల ఆగ్రహం
- విద్యార్థుల తప్పేమీ లేదని వాదన
- సమస్య పరిష్కారానికి భారత్ ప్రయత్నం
- స్టింగ్ ఆపరేషన్‌పై అమెరికాలో చర్చ

అమెరికా ఇమ్మిగ్రేషన్ స్టింగ్ ఆపరేషన్‌లో చిక్కుకున్న విద్యార్థులకు ఇమ్మిగ్రేషన్ శాఖ గురువారం నోటీసులు జారీ చేసింది. "ఫార్మింగ్‌టన్ విశ్వవిద్యాలయాన్ని మూసివేశారు. మీ సెవిస్ ఐడీ రద్దయింది. మళ్లీ సెవిస్ కోసం ఫైల్ చేయండి లేకపోతే అమెరికా విడిచి వెళ్లిపోండి " అని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులు ఇస్తున్న నేపథ్యంలో అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో జైళ్లలో ఉన్న వారిని విడిపించటానికి భారత రాయబార కార్యాలయం చర్యలు చేపట్టింది. అమెరికాలో ఉన్న ఆరు కాన్సుల్ జనరల్ కార్యాలయాల అధికారులు.. తెలుగు సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారు. జైళ్లలో ఉన్న విద్యార్థులను నేరుగా వెళ్లి కలుస్తున్నారు. "జైళ్లలో ఉన్న విద్యార్థులను లాయర్లు నేరుగా కలవటానికి వీలు లేదు. కాన్సుల్ జనరల్ కార్యాలయ అధికారులకు ఆ అధికారం ఉంటుంది. అందువల్ల వారు అమెరికా విదేశాంగ శాఖ, అంతర్గత భద్రతా శాఖ అధికారులతో మాట్లాడి జైళ్లలో ఉన్న విద్యార్థులను కలుస్తున్నారు. వారికి సహాయ సహకారాలు అందించటానికి ప్రయత్నిస్తున్నారు" అని తానా ప్రతినిధి అశోక్ కొల్లా వెల్లడించారు. స్టింగ్ ఆపరేషన్‌లో చిక్కుకున్నవారిని భారత్‌కు తిరిగి పంపకుండా ఉండేలా చర్యలు తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నామన్నారు. జైళ్లలో ఉన్నవారిని విడిపించటంతో పాటు నోటీసులు అందుకున్న విద్యార్థులను భారత్‌కు తిప్పిపంపకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దీంతో పాటు ప్రత్యామ్నాయ విశ్వవిద్యాలయాల్లో సీట్లు దొరికేలా ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

కాగా, బుధవారం జరిపిన దాడుల్లో కొందరు విద్యార్థులు దొరికిపోతే.. మరి కొందరు తప్పించుకున్నారు. వీరు తమ ఫోన్లను స్విచ్ఛాప్ చేసి ఉంచారు. వీరికి కోర్టు ముందు హాజరయ్యేలా ఇమ్మిగ్రేషన్ శాఖ నోటీస్ టూ అప్పియర్ (ఎన్‌టీఏ)లు జారీ చేసే అవకాశముంది. అయితే వీరిని అరెస్ట్ చేసే అవకాశాలు తక్కువ ఉన్నాయని శ్రీనివాస్ అనే అటార్నీ తెలిపారు. నోటీసులు అందుకున్నవారు తమ లాయర్లతో ఇమ్మిగ్రేషన్ అధికారుల వద్దకు వెళ్తే సరిపోతుందన్నారు. మరోవైపు అమెరికా అధికారులు అరెస్టు చేసిన విద్యార్థులకు కాన్సులర్ యాక్సెస్ కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ చెప్పారు. వీలైనంత త్వరగా అమెరికా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.



January 29, 2019

Student and Exchange Visitor Program

Notice to Student

విద్యార్థులకు పోలీసులు జారీచేసిన నోటీసులు

లాయర్ల ఆగ్రహం

విద్యార్థి వీసా దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు అధికారులు.. విద్యార్థులను ఇబ్బందిపెట్టే పద్ధతిని (నకిలీ యూనివర్సిటీతో ఎరవేయడం) అనుసరించడంపై ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంతా విద్యార్థి వీసాలతో చట్టబద్ధంగానే అమెరికాకు వచ్చారని.. పనిచేసుకునే అవకాశం ఉండడంతోనే వర్సిటీ మార్పు చేసుకుని ఫార్మింగ్టన్ వర్సిటీలో చేరారని తెలిపారు. కొన్ని రకాల కోర్సుల్లో చేరితే మొదటి రోజు నుంచీ ప్రాక్టికల్ ట్రైనింగ్ కింద ఉద్యోగం చేసే అవకాశం ఉంటుందని.. అలా అనుకుని వారు చేరారని, ఇదేమీ అసాధారణం కాదని.. అట్లాంటాకు చెందిన ఇమ్మిగ్రేషన్ లాయర్ రవి మన్నం వివరించారు. మరికొందరేమో చట్టబద్ధంగా తమ మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసుకుని, ఉద్యోగ వీసా కోసం ఎదురుచూస్తున్నారని.. ఆ వీసా వచ్చేలోగా తాత్కాలికంగా ఈ వర్సిటీలో చేరారని ఆయన పేర్కొన్నారు. అయితే.. ప్రభుత్వ న్యాయవాదులు మాత్రం ఈ వాదనను తిరస్కరిస్తున్నారు. విద్యార్థులందరూ తాము చేస్తున్నది తప్పేనని తెలిసీ ఆ పని చేశారని వాదిస్తున్నారు. మరోవైపు నకిలీ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, వీసా దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిని పట్టుకోవటంపై అమెరికాలో విమర్శలు చెలరేగుతున్నాయి. దీనివల్ల అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "అంతర్జాతీయ విద్యార్థులపై ఈ స్టింగ్ ఆపరేషన్ ప్రభావం ఉంటుంది. వారు ప్రత్యామ్నాయాలు చూసుకోవటం మొదలుపెడతారు" అని రెడ్డి అండ్ న్యూమ్యాన్ అనే లా సంస్థ పార్ట్‌నర్ న్యూమ్యాన్ వ్యాఖ్యానించారు. దీని ప్రభావం అమెరికా వర్సిటీలపై తప్పనిసరిగా పడుతుందని అంతర్జాతీయ ఆన్‌లైన్ విద్యార్థి రిక్రూట్‌మెంట్ సంస్థ స్టడీపోర్టల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ చద్దా పేర్కొన్నారు. ఈ సంఘటన వల్ల విశ్వవిద్యాలయాల గురించి ఆన్‌లైన్‌లో లభించే సమాచారం సరైనది కాదనే వాదన నిజమనుకోవాల్సి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ విశ్వవిద్యాలయానికి ఒక వెబ్‌సైట్ ఉంది. అమెరికాలో కాలేజీలను, కెరీర్ స్కూళ్లకు అక్రిడేషన్లు ఇచ్చే రియల్ అక్రిడేటర్ కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని గుర్తించింది. ఒక మంచి విశ్వవిద్యాలయానికి ఉండాల్సిన లక్షణాలన్నీ దీనికి ఉన్నాయి. అలాంటప్పుడు నకిలీ విశ్వవిద్యాలయమని ఎలా గుర్తించాలి? ఒక వేళ ఎవరైనా నకిలీ విశ్వవిద్యాలయం అని తెలిసి కూడా చేరారంటే- వారికి భవిష్యత్తులో ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో తెలియనట్లే లెక్క" అని చద్దా వ్యాఖ్యానించారు. కాగా.. తాము సృష్టించిన నకిలీ యూనివర్సిటీలో చేరిన విద్యార్థుల్లో 130 మందిని బుధవారం నాడు తెల్లవారుజామున అరెస్టు చేసినట్టు అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) తెలిపారు. వారిపై సివిల్ ఇమ్మిగ్రేషన్ అభియోగాలు నమోదు చేసినట్టు చెప్పారు. విద్యార్థులను చేర్పించిన 8 మంది తెలుగువారిపై మాత్రం క్రిమినల్ అభియోగాలు దాఖలు చేశామని ఐసీఈ అధికార ప్రతినిధి కారిస్సా కర్టెల్ వెల్లడించారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరింత మందిని అరెస్టు చేయనున్నట్టు చెప్పారు. మరోవైపు.. ఫార్మింగ్టన్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను అమెరికా అంతర్గత భద్రత విభాగం అధికారులు షట్‌డౌన్ చేశారు. బాధిత విద్యార్థులెవరైనా ఉంటే తమకు సమీపంలోని అంతర్గత భద్రత దర్యాప్తు విభాగం తాలూకా స్థానిక కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

- సెంట్రల్‌డెస్క్, స్పెషల్ డెస్క్



భారతీయులకే ఎందుకు ఇబ్బంది?

- మంచి విద్యాసంస్థల్లో చదివినవారికి రాచబాటే
- పేరుగొప్ప కాలేజీల్లో చదివినవారికే సమస్య
- సబ్జెక్టుపై పట్టు లేకున్నా వెళ్లాలన్న ఆసక్తి
- అడ్డదోవలు తొక్కి అందరికీ చెడ్డ పేరు



ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లే విద్యార్థుల్లో చైనీయులది అగ్రస్థానం కాగా మనది రెండో స్థానం. అయితే అక్కడ ఇబ్బందులను ఎదుర్కోవడంలో మాత్రం భారతీయులు అందరికంటే ముందు ఉంటున్నారు. కారణం ఏమై ఉంటుందన్నది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. తప్పుడు మార్గాలను అనుసరించైనా అమెరికాలో కాలుపెట్టాలన్న కొందరి ఆకాంక్షే వారిని ఇబ్బంది పాలు చేయడంతోపాటు, మనకు చెడ్డపేరు తెస్తోందని నిపుణులు చెబుతున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. ఐఐటీ, ఎన్ఐటి, ఐఐఎంలు, వివిధ యూనివర్సిటీ కాలేజీల నుంచి డిగ్రీ కోర్సులు చేసే విద్యార్థులకు అమెరికాలో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అలా కాకుండా.. పేరుకు మాత్రమే నడిచే కాలేజీల్లో చేరేవారి ప్రమాణాలు ఒకింత తక్కువగా ఉంటాయి. సబ్జెక్టుపై పరిపూర్ణమైన పట్టు, అర్హతలు లేనప్పటికీ అమెరికా వెళ్లి చదువుకోవాలని, అక్కడే స్థిరపడాలని ఉంటుంది. దీంతో అడ్డదారులు తొక్కుతున్నారు. దీనికితోడు తమ పిల్లలు అమెరికా వెళ్లి తీరాలన్న కొంతమంది తల్లిదండ్రుల ఆకాంక్ష కూడా వారిని ఇక్కట్ల పాలు చేస్తోంది. నిజానికి.. ఎక్కువ మంది విద్యార్థులను ఆకట్టుకోవాలన్నదే అమెరికాలోని యూనివర్సిటీల లక్ష్యం. విదేశీ విద్యార్థులతో ఆదాయం సమకూర్చుకోవాలని అవి భావిస్తుంటాయి. అయితే విదేశీ విద్యార్థులు పద్ధతి ప్రకారం రావాలని మాత్రమే అక్కడి ప్రభుత్వం కోరుకుంటోంది. ఉదాహరణకు అక్కడ చదువుకునే విద్యార్థులకు వారానికి ఇరవై గంటలు, అదీ క్యాంపస్‌లోనే పని చేసుకునే అవకాశం(వర్క్ పర్మిట్) కల్పిస్తారు. విద్యార్థిగా ఉన్నప్పుడు బయట పని చేయడం చాలా వరకూ నిషిద్ధం. చదువుకునేందుకు ఎఫ్-1 వీసాతో వచ్చి బయట పని చేయడమంటే అమెరికన్ల ఉద్యోగావకాశాలకు గండికొట్టడమే. కానీ, కేవలం ధనార్జనే ధ్యేయంగా వెళ్ళే వ్యక్తులు ఏదో అనామక వర్సిటీలో చేరి, ఆ తర్వాత వేరే దగ్గర పనిచేసుకుంటున్నారు. వీరికే ఇలాంటి ఇబ్బందులు వస్తున్నాయి. తద్వారా భారతీయులందరికీ చెడ్డ పేరు వస్తోంది.

ఎవరెంతకాలం ఉండొచ్చు?

సక్రమ మార్గంలో స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథ్స్) కోర్సుల్లో చేరే విద్యార్థులు కోర్సు చేసేంతవరకు ఉండొచ్చు. ఆ తర్వాత కూడా ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) కోసం ఒక ఏడాది, ఆ తర్వాత ఉద్యోగంతో మరో రెండేళ్లు ఉండొచ్చు. నాన్‌స్టెమ్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు మాత్రం ఉద్యోగ కాలం ఒక ఏడాది మాత్రమే ఉంటుంది. రాజమార్గంలో స్టెమ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు ఎకాఎకిన అయిదేళ్లుండొచ్చు. ఈ పద్ధతిలో సజావుగా ప్రవేశించే విదేశీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని ప్రిన్స్‌టన్ రివ్యూ- మాన్య ఎడ్యుకేషన్ ఆంధ్ర, తెలంగాణ రీజనల్ హెడ్ కె.హెచ్.వాసుదేవ్ చెబుతున్నారు.

- ఎడ్యుకేషన్ డెస్క్

ఒకే సెల్‌లో 30 మంది!

- రోజుకు ఒక్కసారే ఫోన్ చేసుకునే అవకాశం
- అమెరికా జైలులో తెలుగు విద్యార్థుల దీన గాథ
- తానా ప్రతినిధి అశోక్ వెల్లడి



అశోక్

అమెరికా అధికారుల అండర్ కవర్ ఆపరేషన్‌లో అరెస్టు అయి.. జైలులో ఉన్న తెలుగు విద్యార్థుల పరిస్థితి దుర్భరంగా ఉంది. భారతీయ కాలమాన ప్రకారం శుక్రవారం రాత్రి దాకా 121 మంది తెలుగు విద్యార్థులను దేశం నుంచి తిప్పి పంపివేయటానికి ఇమిగ్రేషన్ అధికారులు కేసులు పెట్టారు. వీరంతా అమెరికాలోని పలు రాష్ట్రాలకు చెందినవారు. డెట్రాయిట్‌లో ఎక్కువగా 29 మంది.. న్యూయార్క్‌లో 30 మందిని అరెస్టు చేశారని తానా ప్రతినిధి అశోక్ తెలిపారు. డెట్రాయిట్‌లోని జైలులో ఉన్న ఒక విద్యార్థి తమ దీనగాథను ఫోన్‌లో వివరించారని ఆయన చెప్పారు. "ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని ఎప్పుడూ అనుకోలేదు. మమల్ని కుల్హాన్ కౌంటీ జైలులో నిర్బంధించారు. ఒక సెల్‌లో మొత్తం 30 మందిని ఉంచారు. ఇంకో సెల్‌లో మన తెలుగు అమ్మాయిని ఒక అమెరికన్‌తో కలిపి ఉంచారు. మాకు జైలు భోజనం పెడుతున్నారు. బయట వాళ్లతో మాట్లాడటానికి రోజుకు ఒకసారి మాత్రమే అనుమతిస్తున్నారు. అలా నాకు మీతో మాట్లాడటానికి అవకాశం దొరికింది. మమల్ని అరెస్ట్ చేస్తున్నారని తెలిసిన తర్వాత... కొందరం డబ్బులు సేకరించి ఒక అటార్నీని పెట్టుకున్నాం. కానీ ఆ అటార్నీ ఈ రోజు వచ్చి బెయిల్ రాదని చెప్పింది. ఈ కేసులో బెయిల్ ఇవ్వబోమని.. అలాంటి కేసులు పెట్టామని చెప్పారట. ఆమె కూడా తాను ఏమీ చేయలేనని చేతులెత్తేసింది. మాకు ఇండియన్ ఎంబసీ అధికారులే సాయం చేయాలి. అంతకన్నా ప్రత్యామ్నాయం లేదు" అని వాపోయాడని అశోక్ వెల్లడించారు. వారి విషయంలో భారత ప్రభుత్వం కల్పించుకోవాలని.. చురుగ్గా వ్యవహరించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

-స్పెషల్ డెస్క్

తెలుగు విద్యార్థుల విషయంలో స్పందించండి

- వారి పట్ల సానుభూతితో వ్యవహరించండి
- యూఎస్ కాన్సుల్ జనరల్ హడ్డాకు కేటీఆర్ విజ్ఞప్తి



ప్రగతి భవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అమెరికాలో అరెస్టైన విషయమై స్పందించాలని యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డాను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ప్రగతి భవన్‌లో కేటీఆర్‌ను యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా అమెరికాలో తెలుగు విద్యార్థుల విషయాన్ని కేటీఆర్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, పూర్తి సహకారం అందించాలని విన్నవించారు. సమావేశంలో భాగంగా అమెరికా-తెలంగాణ వ్యాపార, వాణిజ్య సంబంధాల గురించి ప్రత్యేకంగా చర్చించినట్లు కేథరిన్ హడ్డా తెలిపారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన కేటీఆర్‌కు ఆమె అభినందనలు తెలిపారు. చొరవ, ఉత్సాహం చూపించే కేటీఆర్‌కు ఆ పదవి సరిగ్గా సరిపోతుందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశం గురించి కేటీఆర్, కేథరిన్ హడ్డా వేర్వేరుగా ట్విటర్‌లో పోస్టులు చేశారు.

నకిలీ కన్సల్టెన్సీల దందా

- అలాంటివాటితో జరభద్రం: నిపుణులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉండే డాలర్ డ్రీమ్స్‌ను సొమ్ము చేసుకునేందుకు హైదరాబాద్ మహానగరంలో లెక్కకు మిక్కిలిగా నకిలీ కన్సల్టెన్సీలు పుట్టుకొచ్చాయి. విద్యార్థులను, ఉన్నత చదువులు పూర్తి చేసి ఎలాగైన అమెరికా వెళ్లాలనుకునే నిరుద్యోగులను టార్గెట్ చేసి డబ్బులు దండుకుంటున్నాయి. అందినకాడికి వసూలు చేస్తూ రాత్రికిరాత్రే బోర్డు తిప్పేస్తున్నాయి. వీరంతా చాలా నమ్మకంగా ఉచ్చులోకి దించుతారు. అలాంటి కన్సల్టెన్సీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. దరఖాస్తు నింపేటప్పుడే వారి స్థాయి ఏమిటో తెలిసిపోతుందని నిపుణులు చెబుతున్నారు. అలా ఏదైనా అనుమానం వస్తే వెంటనే అక్కడి నుంచి బయటపడాలని.. గుడ్డిగా విశ్వసించవద్దని సూచిస్తున్నారు. కొన్ని కన్సల్టెన్సీలు తప్పుడు మార్గంలో అమెరికా పంపిస్తామని చెబుతాయని.. వారి మాటలు విని అలా అమెరికాకు వెళ్లి దొరికిపోతే కష్టమని హెచ్చరిస్తున్నారు. "ఒక కన్సల్టెన్సీని ఎన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు? విద్యార్థుల్లో సదరు కన్సల్టెన్సీకి ఎలాంటి పేరుంది? తదితర వివరాలు తెలుసుకున్న తర్వాతే ముందుకెళ్లాలి. లేదా ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా ఇబ్బందే" అని ఐఎస్ఎం ఫోకల్ పాయింట్‌కు చెందిన రామారావు సూచించారు. కాగా.. విద్యార్థులను, నిరుద్యోగులను అమెరికా పంపే కన్సల్టెన్సీలపై ప్రస్తుతం ఎలాంటి నియంత్రణా లేదని.. వాటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని విజన్ ఓవర్సీస్ డైరెక్టర్ ఎ.సాయికృష్ణ అభిప్రాయపడ్డారు.

5లోపు స్వచ్ఛందంగా వెళ్లిపోవడం ఉత్తమం

- లాయర్లందరూ అదే సూచిస్తున్నారు

ఇప్పటికే వందల మంది విద్యార్థులు సాయం కోసం మమ్మల్ని సంప్రదిస్తున్నారు. అధికారులు అరెస్టు చేస్తారనే భయంతో వారంతా తమ ఇళ్లకు కూడా వెళ్లట్లేదు. రోడ్ల మీదే తిరుగుతున్నారు. తెలిసిన వాళ్లని ఆశ్రయిస్తున్నారు. అలాంటివారు ఇంకా చాలా మంది ఉన్నట్టు సమాచారం. ఇలా ఎఫ్-1 వీసా కోసం ఫార్మింగ్టన్ యూనివర్సిటీలో చేరి.. మొదటి రోజునే సీపీటీ (కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రైనింగ్) తీసుకున్న వాళ్లు, రెండో ఎమ్మెస్ చేసేవాళ్లు ఉన్నపళంగా.. లేదా ఫిబ్రవరి 5 లోపు వెళ్లిపోతే మంచిదని ఇమ్మిగ్రేషన్ లాయర్లు సూచిస్తున్నారు. న్యాయవాదులను సంప్రదించి, వారి సలహా తీసుకుని.. సమీపంలోని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాలకు వెళ్లి స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోతామని చెప్తే (వాలంటరీ డీపోర్టేషన్).. అందుకు ఇమ్మిగ్రేషన్ అధికారులు అంగీకరించే అవకాశం ఉంది. ఇక, ఇప్పటికే అరెస్టయిన తెలుగు విద్యార్థులందరికీ.. ఏపీ, తెలంగాణ అనే తేడా లేకుండా సాయం చేయాలని, అవసరమైతే లాయర్ ఫీజులు కూడా 'ఏపీఎన్నార్టీ అత్యవసర నిధి' నుంచి ప్రభుత్వం తరఫునే ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఏపీఎన్నార్టీకి ఆదేశాలు జారీ చేశారు.

- సాగర్ దొడ్డపనేని, ఏపీఎన్నార్టీ మీడియా సమన్వయకర్త

ఐటీ మినహాయింపుతో మధ్యతరగతికి లబ్ధి

కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రశంసించారు. ఈ బడ్జెట్ రైతులు, పేదలకు అనుకూలమైనదేకాకుండా వృద్ధికి ఊతాన్నిచ్చే విధంగా ఉందని ఆయన ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచిన ఫలితంగా అనేక మంది మధ్యతరగతి ప్రజలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. వీరి కొనుగోలు శక్తి కూడా పెరుగుతుందని, ఇది భావి భారతానికి చాలా ముఖ్యమైనదన్నారు.



రియల్ ఎస్టేట్‌కు జోష్!

'అందుబాటు' గృహ ప్రాజెక్టులకు పన్ను ప్రోత్సాహకాల పొడిగింపు

అమ్ముడుపోని ఫ్లాట్లపై లెక్కించే అద్దెకు రెండేళ్ల వరకు పన్ను రాయితీ

రెండో సొంతింటికీ పన్ను ఊరట.. ఆనందంలో రియల్టీ వర్గాలు



న్యూఢిల్లీ: విక్రయాలు మందగించిన దేశీయ స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చేందుకు ఈసారి బడ్జెట్‌లో కేంద్రం పలు నిర్ణయాలు ప్రకటించింది. తద్వారా బిల్డర్లతోపాటు గృహ కొనుగోలుదారులకూ లబ్ధి చేకూరనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలులోకి రానున్న ఈ ప్రోత్సాహకాలు గృహ డిమాండ్ పునరుద్ధరణకు దోహదపడనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రియల్టీ రంగంలో జోష్ పెంచే బడ్జెట్ ప్రకటనలు..

- అందుబాటు ధరల్లో లభించే గృహాల నిర్మాణదారులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కల్పించిన పన్ను ప్రోత్సాహకాలను వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) వరకు పొడిగించారు. దేశంలో అందుబాటు గృహాల సరఫరా మరింత పెరిగేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. ఐటీ చట్టంలో సెక్షన్ 80-ఐబీఏ ప్రకారంగా 'అందుబాటు' గృహ నిర్మాణదారులకు కొన్ని షరతులకు లోబడి లాభాల్లో 100 శాతం రాయితీ కల్పించింది.
- గృహ ప్రాజెక్టుల్లో అమ్ముడుపోని ఇళ్లపై లెక్కించే ఊహాజనిత అద్దెపై ఇక రెండేళ్లపాటు పన్ను మినహాయింపు లభించనుంది. ప్రాజెక్టు పూర్తయిన ఏడాది చివరి నుంచి రెండేళ్ల వరకు ఈ రాయితీ వర్తించనుంది. ప్రస్తుత నిబంధన ప్రకారం ఏడాది వరకే పన్ను రాయితీ లభిస్తోంది. మందగమనం కారణంగా ఫ్లాట్లు అమ్ముడుపోని ప్రాజెక్టులతో ఇబ్బందిపడుతున్న రియల్టర్లకు ఇది ఊరటనిచ్చే నిర్ణయమే. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో నిర్మించిన గృహ ప్రాజెక్టుల్లో ఇంకా అమ్ముడుపోని యూనిట్లు 6-7 లక్షల వరకు ఉండొచ్చని కన్సల్టింగ్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి.
- ఐటీ చట్టంలో సెక్షన్ 54 ప్రకారం.. స్థిరాస్తి విక్రయం ద్వారా ఆర్జించిన రాబడిని తిరిగి మరో ఇల్లు కొనుగోలు కోసం ఇన్వెస్ట్ చేసిన పక్షంలో మూలధనంపై లాభాల పన్ను (క్యాపిటల్ గెయిన్ టాక్స్) మినహాయింపు కల్పిస్తున్నారు. తాజాగా రూ.2 కోట్ల వరకు మూలధన లాభాన్ని తిరిగి రెండు ఇళ్లపై ఇన్వెస్ట్ చేసేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, జీవితకాలంలో ఈ ప్రయోజనం కేవలం ఒకసారే వర్తిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.
- సొంత అవసరాల కోసం కొనుగోలు చేసే రెండో ఇంటిపై లెక్కించే ఊహాజనిత అద్దెకు సైతం పన్ను రాయితీ కల్పించారు. ప్రస్తుతం ఒకటి కంటే ఎక్కువ ఇళ్లున్న వారు మిగతా వాటికి లెక్కించే ఊహాజనిత అద్దెపై పన్ను చెల్లించాలి.
- టీడీఎస్ పరిధిలోకి వచ్చే కనీస అద్దె ఆదాయం పరిమితిని రూ.1.80 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెంచారు.

గృహ కొనుగోలుదారులకు జీఎస్‌టీ ఊరట?

ఇళ్ల కొనుగోలుదారులకు జీఎస్‌టీ భారం నుంచీ ఊరట కల్పించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను పరిశీలించి, తగిన ప్రతిపాదనలు చేసేందుకు మంత్రుల బృందాన్ని (జీఓఎం) ఏర్పాటు చేయాలని జీఎస్‌టీ మండలిని కోరడం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లోని గృహ కొనుగోలుపై 12 శాతం, అందుబాటు గృహాల కొనుగోలుపై 8 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయి, బిల్డర్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా పొందినట్లయితే జీఎస్‌టీ చెల్లించాల్సినక్కర్లేదు. అయితే, గృహాలకు డిమాండ్ పెరిగేందుకు జీఎస్‌టీ భారాన్ని తగ్గించాలని రియల్టీ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.



గృహ కొనుగోలుదారులకు జీఎస్‌టీ తగ్గించాలన్న ప్రతిపాదన ఎంతో ప్రోత్సాహకరం. అమ్ముడుపోని గృహాలపై రెండేళ్లపాటు పన్ను మినహాయింపు నిర్ణయాన్నీ స్వాగతిస్తున్నాం.

- గీతాంబర్ ఆనంద్, క్రెడాయ్



మరిన్ని పన్ను ప్రోత్సాహకాలు వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచనున్నాయ్.

- జాక్సీ షా, క్రెడాయ్ ప్రెసిడెంట్



ఈ బడ్జెట్ టెక్నాలజీ వినియోగం, విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చింది. లక్ష డిజిటల్ గ్రామాలు, ఎలక్ట్రానిక్ టాక్స్ రిటర్న్ అసెస్‌మెంట్, కస్టమ్స్ లావాదేవీల డిజిటైజేషన్, సీఎస్‌సీలకు మద్దతు వంటివి ఆహ్వానించదగిన చర్యలు. అయితే ప్రభుత్వం ఏంజెల్ టాక్స్‌పై స్పష్టతనివ్వలేదు. స్టార్టప్‌లకు ఇది ప్రధానమైన సవాలుగా ఉంది. నేషనల్ సెంటర్ ఫర్ ఆర్టిఫీషియల్ ఇంటెలీజెన్స్ ప్రకటన నేపథ్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలీజెన్స్ డెవలప్‌మెంట్, అమలులో భారత్ కీలకంగా మారనుంది".

- బీవీఆర్ మోహన్ రెడ్డి, సైయెంట్



ఆరోగ్య భారత్‌కు సంబంధించి ప్రభుత్వానికి ఉన్న అంకిత భావంపై మధ్యంతర బడ్జెట్ దృష్టిసారించింది. ఆరోగ్య సంరక్షణ విషయంలో పట్టణాలు, గ్రామాల మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చేందుకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాన్ని కూడా తెలియజేసింది. ఇక ఆర్టిఫీషియల్ ఇంటెలీజెన్స్‌కు సంబంధించిన జాతీయ కేంద్రాన్ని ప్రకటించడం చాలా పెద్ద సానుకూల అంశం. అనేక రకాల వ్యాధులకు డాక్టర్లు చికిత్స అందించేందుకు అవసరమైన సాధనాలను రూపొందించడంలో ఆర్టిఫీషియల్ ఇంటెలీజెన్స్ ఎంతగానో దోహదపడుతుంది. ఈ దిశగా అపోలో ఇప్పటికే ముందడుగు వేసింది.

- సంగీతా రెడ్డి, అపోలో హాస్పిటల్స్



ఎన్నికల ఏడాది నేపథ్యంలో ఊహించిన విధంగానే బడ్జెట్ ఉంది. ఇది ప్రజల బడ్జెట్. ఈ బడ్జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, మధ్య ఆదాయ వర్గాలకు ఉపశమనం కల్పిస్తుంది. రక్షణ బడ్జెట్‌ను పెంచడం వల్ల దేశ భద్రత మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది. సులభతరమైన విధానాల మూలంగా పన్ను వసూళ్లు పుంజుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

- సంజయ్ సింగ్, సీఐఐ తెలంగాణ



ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నిర్మాణ పరిశ్రమకు మంచి రాయితీలు లభించాయి. వీటి మూలంగా అనుబంధ రంగాలైన రియల్ ఎస్టేట్ వంటి వాటికి కూడా ప్రయోజనం కలుగుతుంది. బిల్డింగ్ మెటీరియల్ రంగానికి సంబంధించి జీఎస్‌టీ తగ్గింపు, అందుబాటు ధరల్లో గృహాల కేటగిరీకి సంబంధించి ఆదాయ పన్ను ప్రోత్సాహకాల ప్రకటనలను ఆశిస్తున్నాం.

- అశ్విన్ రెడ్డి, అపర్ణ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్



బడ్జెట్‌లో ఇన్ని పన్ను రాయితీలు ఊహించలేదు. పన్ను రాయితీలతో పాటు ఆర్థిక కార్యకలాపాలకు ఊతం ఇచ్చే చర్యలూ తీసుకున్నారు. ఇవన్నీ కచ్చితంగా దేశంలో వినియోగాన్ని పెంచుతాయి.

- అరుంధతీ భట్టాచార్య



ముమ్మాటికీ ఇది ఎన్నికల సంవత్సర బడ్జెట్టే. అయినా ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంపుతో పట్టణ ప్రాంతాల్లో గిరాకీ పుంజుకుంటుంది. చిన్న రైతుల కోసం ఉద్దేశించిన ఆదాయ మద్దతు పథకంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ వినియోగం కోలుకుంటుంది.

- కిరణ్ మజుందార్ షా, బయోకాన్



బడ్జెట్ ప్రతిపాదనలతో గ్రామీణ ప్రజలు, మధ్య తరగతి ప్రజల చేతుల్లోకి మరింత ఆదాయం రానుంది. ఈ చర్యలు టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషిన్ల డిమాండ్ వినియోగ వస్తువుల డిమాండ్‌ను మరింత పెంచుతాయి.

- విజయ్ మన్‌సుఖాని, ఎండీ, మిర్క్ ఎలక్ట్రానిక్స్

2019-20 మధ్యంతర బడ్జెట్ రైతులు, మధ్య తరగతి ప్రజలపై ఎక్కువగా దృష్టి పెట్టింది. ఈ చర్యలు దేశంలో వినియోగాన్ని మరింత పెంచుతాయి.

-కమల్ నంది, ప్రెసిడెంట్, సీఈఏఎంఏ



అంచనాలు చేరని జీఎస్‌టీ వసూళ్లు

లక్ష కోట్ల రూపాయలు తగ్గాయి

2019-20 లక్ష్యం రూ. 7.61 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జీఎస్‌టీ వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. బడ్జెట్ టార్గెట్‌తో పోల్చితే రూ.లక్ష కోట్లు తగ్గాయి. 2018-19 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి జీఎస్‌టీ ద్వారా రూ.7.43 లక్షల కోట్లను రాబట్టుకోవాలని నిర్ధేశించుకుంది. అయితే ఏప్రిల్-జనవరితో ముగిసిన పది నెలల కాలానికి జీఎస్‌టీ వసూళ్లు రూ.6.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20) జీఎస్‌టీ వసూళ్ల అంచనాలను ప్రభుత్వం సవరించింది. 2019-20లో జీఎస్‌టీ వసూళ్లు రూ.7.61 లక్షల కోట్లుగా ఉంటాయని అంచనా వేస్తోంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్‌టీ వసూళ్లు రూ.13.48 లక్షల కోట్లకు చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటి వరకు ఈ వసూళ్లు రూ.9.71 లక్షల కోట్లుగా మాత్రమే ఉన్నాయి.

సగటున నెలకు రూ.97,100 కోట్ల వసూళ్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌ట వసూళ్లు సగటున నెలకు రూ.97,100 కోట్లుగా ఉన్నాయని 2019-20 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ.89,700 కోట్లుగా ఉన్నాయి. రేట్ల తగ్గింపు, మినహాయింపులు, రెవెన్యూ ట్రెండ్స్ ప్రోత్సాహకరంగా ఉండటం జీఎస్‌టీ వసూళ్లు పెరగటానికి దోహదపడ్డాయన్నారు. జీఎస్‌టీ అమలు చేసిన తొలి ఐదేళ్లలో ఏటా 14 శాతం రెవెన్యూలు కచ్చితంగా పెరుగుతూ రాష్ట్ర ప్రభుత్వాల రెవెన్యూలు మెరుగుపడనున్నాయని గోయల్ వెల్లడించారు. 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చింది. జీఎస్‌టీ కారణంగా పన్ను పరిధి పెరగటమే కాకుండా గరిష్ఠ వసూళ్లు, సులభతర వాణిజ్యానికి బాటలుపడ్డాయన్నారు.

2018-19లో జీఎస్‌టీ వసూళ్లు

బడ్జెట్ అంచనా (రూ.లక్షల కోట్లలో)	వాస్తవ వసూళ్లు (ఏప్రిల్-జనవరి కాలానికి)
7.43	6.43
కేంద్ర, రాష్ట్రాల వసూళ్ల టార్గెట్	వాస్తవ వసూళ్లు
13.48	9.71

నెలవారీ వసూళ్లు.. (రూ.కోట్లలో)

ఏప్రిల్	1,03,000
మే	94,016
జూన్	95,610
జూలై	96,483
ఆగస్టు	93,960
సెప్టెంబరు	94,442
అక్టోబరు	1,00,710
నవంబరు	97,637
డిసెంబరు	94,725
జనవరి	1,00,000

తొలగిన అగాథం..

రోజువారీ కార్యకలాపాలు, అసెస్‌మెంట్స్ కోసం పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వం మధ్య ఏర్పడుతున్న అగాధాన్ని తొలగించిందని గోయల్ తెలిపారు. జీఎ స్‌టీ ద్వారా ఆన్‌లైన్‌లో రిటర్నుల దాఖలు, ఈ-వే బిల్లు పద్ధతి ద్వారా జోక్యం లేకుండా పోయిందన్నారు. వస్తు సేవల పన్ను చట్టం ద్వారా రాష్ట్రాల మధ్య వస్తు సరఫరా మరింత వేగం పుంజుకుందని గోయల్ తెలిపారు. ఆరంభంలో జీఎస్‌టీ పన్ను రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉండగా అనంతర కాలంలో వాటిని గణనీయంగా తగ్గించుకుంటూ వచ్చినట్లు చెప్పారు. రేట్ల తగ్గింపుతో వినియోగదారులకు ఏటా రూ.80,000 కోట్ల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రస్తుతం పేద ప్రజలు, మధ్య తరగతి ప్రజానీకం వినియోగిస్తున్న ఉత్పత్తుల పన్ను రేట్లు సున్నా నుంచి 5 శాతం పన్ను పరిధిలో ఉన్నాయని గోయల్ తెలిపారు. ట్రేడర్ ఫ్రెండ్లీ చర్యల ద్వారా 35 లక్షలకు పైగా చిరు వ్యాపారులు, తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు లబ్ధి పొందారన్నారు. తాజాగా 90 శాతం జీఎ స్‌టీ పన్ను చెల్లింపుదారులను త్రైమాసిక రిటర్నులు దాఖలు చేసేందుకు అనుమతించనున్నట్లు తెలిపారు.

కామెంట్

నాలుగేళ్ల సంస్కరణల ఫలం



- కె.నరసింహమూర్తి, ఆర్థిక నిపుణుడు

ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో జనరంజకంగా ఉంది. గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు సాధించిన విజయానికి ఇది తార్కాణం. నల్లధనం మీద పోరాటానికి తీసుకున్న చర్యలు, డీమానిటైజేషన్, జీఎస్‌టీ వంటి సంస్కరణల మద్దతుతో ప్రభుత్వ ఆదాయం సుమారు రెట్టింపయింది. ఐదేళ్ల క్రితం రూ.12 లక్షల కోట్లున్న ప్రభుత్వ వార్షికాదాయం ఈ సంస్కరణల ప్రభావంతో రూ.24 లక్షల కోట్లకు పెరిగింది. ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.లక్ష కోట్ల జీఎస్‌టీ, మరో రూ.లక్ష కోట్ల ఇతర ఆదాయం సమకూరుతోంది. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడం, జీడీపీలో విత్త లోటు 3.4 శాతానికే పరిమితం కావడం శుభ పరిణామాలు. ముడిచమురు ధరలు అదుపులో ఉన్నందు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం రైతుకి కాస్తంత నిరాశే కలిగించినా సగటు వినియోగదారునికి ఎంతో ఊరట కలిగింది. రెండు హెక్టార్లకన్నా తక్కువ భూమి ఉన్న రైతులకు సంవత్సరానికి రూ.6,000 మూడు విడతలుగా ఇవ్వడం ఎంతో సానుకూలమైన చర్య. గతంలో అమలుపరిచిన రుణ మాఫీ, వడ్డీమాఫీ వంటి చర్యలు పెద్ద రైతులకే ఉపయోగపడ్డాయి. కాని బడ్జెట్‌లో ప్రకటించిన ఈ ఆదాయ మద్దతు పథకం 12 కోట్ల మంది చిన్న రైతులకు లబ్ధి చేకూరుస్తుంది. ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టం జరిగిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ, సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు 3%, చిన్న పరిశ్రమలకు 2 శాతం వడ్డీ రాయితీ వంటివి ఆ 2రంగాలపై ఆధారపడిన వారికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయి. వ్యవసాయ అనుబంధ రంగాలు, పశుసంవర్ధకంవంటి రంగాలకు ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుంది. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు, స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేలకు పెంచడం వేతన జీవులకు పెద్ద ఊరట. ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయం మీద టీడీఎస్‌ను రూ.40 వేలకు పెంచడం ప్రయోజనం కలిగించేదిగా ఉంది. అవ్యవస్థీకృత రంగంలో రూ.15 వేలకన్నా తక్కువ ఆదాయం ఉన్న కార్మికులకు రిటైర్మెంట్ తర్వాత నెలకి రూ.3,000 పెన్షన్ ప్రకటించడం సామాజిక సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద చర్య. మొత్తం మీద వృద్ధికి దోహదపడుతూనే అన్నివర్గాలకు ఎంతో కొంత ప్రయోజనం సమకూర్చే బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌కి 90 శాతం మార్కులు వేయవచ్చు. తెలుగు రాష్ట్రాలు రెండింటికీ విభజన సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కొన్ని చర్యలుండవచ్చని ఆశ పడిన వారికి నిరాశే మిగిలిందనేది కొసమెరుపు.

ఐదేళ్లలో 5 లక్షల కోట్ల డాలర్లు..

- 8 ఏళ్లలో 10 లక్షల కోట్ల డాలర్లు
- భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్థిక మంత్రి అంచనా

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్ల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఆ తర్వాత ఎనిమిదేళ్లలో 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చన్నారు. గత ఐదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనా కాలంలో భావితరం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని, ఇవి అధిక వృద్ధికి దోహదపడతాయని చెప్పారు. భారత్ గాడిలో పడిందని, అధిక వృద్ధి, సంపద సృష్టి దిశగా దూసుకుపోతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారీ ఆర్థిక వ్యవస్థ భారత్ మారిపోయిందని, గత ఐదేళ్ల కాలంలో ఇంతకు ముందటి ప్రభుత్వాల్లో లేని విధంగా అధిక జీడీపీ వృద్ధి నమోదైందని ఆయన చెప్పుకొచ్చారు. 2013-14 సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండేదని, ఇప్పుడు మాత్రం ఆరో స్థానానికి చేరుకుందని గుర్తు చేశారు. రెండంకెల ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వం కట్టడి చేసిందని, ద్రవ్య నిల్వను పూర్వ స్థాయికి చేర్చిందని తెలిపారు.

మౌలికానికి పెద్ద పీట

- రోజుకు 27 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం
- పీఎంజీఎస్‌వైకు రూ.19,000 కోట్లు



దేశాభివృద్ధిలో కీలకంగా ఉండే మౌలిక సదుపాయాల రంగానికి అత్యంత ప్రాధాన్యతిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ ఇప్పటికే దూసుకుపోతోందని, దేశంలో రోజుకు 27 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ప్రపంచంలో ఏ దేశం కూడా ఈ స్థాయిలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టటం లేదన్నారు. జాతీయ రహదారులతో పాటు రైల్వేలు, వాటర్‌వేస్, ఎయిర్‌వేస్ (డిజీవేస్) విభాగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను వచ్చే ఎనిమిదేళ్లలో 10 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. నిలకడైన వృద్ధిని సాధిస్తూ నిర్దేశిత లక్ష్యాలను అందుకుంటూ వస్తున్నామన్నారు.

- ఉడాన్ పథకం కింద ప్రస్తుతం 100 విమానాశ్రయాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. తాజాగా సిక్కింలో పాక్యాంగ్ విమానాశ్రయాన్ని ప్రారంభించాం. చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతున్నాం.
- 2019-20లో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)కు రూ.19,000 కోట్లు కేటాయింపు
- ఈశాన్య రాష్ట్రాల్లో కనెక్టివిటీ పెంచేందుకు ప్రాజెక్టుల అభివృద్ధి. అరుణాచల్ ప్రదేశ్‌కు ఈ మధ్యనే ఎయిర్ కనెక్టివిటీ. సదుపాయం. మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాలకు రైల్వే నెట్‌వర్క్
- రైల్వేలకు 2018-19 అత్యంత సురక్షిత సంవత్సరంగా నిలిచింది. బ్రాడ్ గ్రేజ్ రైల్ నెట్‌వర్క్‌లో అన్‌మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్స్ లేవు
- మేకిన్ ఇండియాకు అనుగుణంగా సెమీ హైస్పీడ్ 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' ప్రారంభం
- అంతర్గత జల రవాణాకు అత్యంత ప్రాధాన్యం. వారణాసి-కోల్‌కతా మధ్య ఫ్రైట్ కంటైనర్ రవణా ప్రారంభం

విత్తలోటు కట్టు తప్పుతుంది



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం విత్తలోటు నిర్దేశించుకున్న స్థాయికి కుదించడంలో చతికిలపడింది. ఈ ఏడాది విత్తలోటు 3.4 శాతం ఉండవచ్చునని పీయూష్ గోయల్ ప్రకటించారు. గత బడ్జెట్‌లో నిర్ణయించిన లక్ష్యం 3.3 శాతం. అయితే రైతాంగానికి ఆదాయ మద్దతు కోసం సవరించిన అంచనాల్లో ప్రకటించిన రూ.20 వేల కోట్లు, 2019-20లో రూ.75 వేల కోట్లు కేటాయించడం వల్ల విత్తలోటు పెరుగుతోంది. ఈ భారం మీద వేసుకోకపోయి ఉంటే అది ఈ ఏడాది 3.1 శాతానికి, 2019-20లో 3.3 శాతానికి పరిమితమై ఉండేదే. ఏమైనా ఏడేళ్ల క్రితం 6 శాతం ఉన్న విత్తలోటును మా హయాంలో సవరించిన అంచనా 3.4 శాతానికి కుదించగలిగాం.

మిగతా బ్యాంకులకూ 'పీసీఏ' ఊరట

త్వరలోనే మిగతా 8 ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీసీఏ) ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు చర్యల (పీసీఏ) నుంచి ఊరట లభించనుందని ఆర్థిక మంత్రి గోయెల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.1.30 లక్షల కోట్ల నల్లధనం వెలికితీత

పెద్ద నోట్ల రద్దుతోపాటు నల్లధన నియంత్రణకు ఇతర చర్యల ద్వారా రూ.1.30 లక్షల కోట్ల అక్రమ సొమ్మును పన్ను పరిధిలోకి తీసుకురావడం జరిగిందని పీయూష్ గోయెల్ పేర్కొన్నారు. ఈ చర్యల్లో భాగంగా రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తులను జప్తు లేదా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

రూ.3 లక్షల కోట్ల బకాయిల రికవరీ

బడా కార్పొరేట్ డిఫాల్టర్ల నుంచి ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బకాయిలను రికవరీ చేసింది. ఐబీసీతో మొండి బకాయిల రికవరీ పుంజుకుంది.

'ఉపసంహరణ' లక్ష్యం రూ.90 వేల కోట్లు

ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.90 వేల కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. గత ఏడాది నిర్ణయించుకున్న లక్ష్యం రూ.80 వేల కోట్ల కన్నా ఇది 12.5 శాతం అధికం. ఈ ఏడాది జనవరి 29 నాటికి సమీకరించిన మొత్తం రూ.35,532.66 కోట్లు. గత ఏడాది ప్రభుత్వం రూ.లక్ష కోట్లు సమీకరించగలిగింది. ఏడేళ్లలో ఇంత భారీ సమీకరణ ఇదే తొలిసారి.

ఈవీల్లో మనదే పై చేయి

స్వచ్ఛ ఇంధనాల రవాణా విభాగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంధనం స్టోరేజి డివైస్‌లు ఇందుకు ప్రధాన చోదకశక్తి కానున్నాయి. ప్రజలు విద్యుత్ వాహనాలు వినియోగించినట్టయితే భారీ మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం ఆదా అయి దేశం స్వయంసమృద్ధం అవుతుంది. 2030 నాటికి మొత్తం వాహనాల అమ్మకాల్లో ఈవీల వాటా 30 శాతం ఉంటుందని అంచనా.

అదుపులో ద్రవ్యోల్బణం

మెరుగైన వృద్ధిరేటును సాధిస్తున్నప్పటికీ ద్రవ్యోల్బణం అదుపులో ఉంచడంలో ప్రభుత్వం విజయం సాధించింది. ద్రవ్యోల్బణం నడ్డి విరిచి సగటున 4.6 శాతానికి తీసురాగలిగింది. 2009-14 సంవత్సరాల మధ్య కాలంలో ఈ సగటు 10.1 శాతం ఉండేది. ద్రవ్యోల్బణం అప్రటిత పన్ను. ఇది సగటు మానవుని కుంగదీస్తుంది. మేం ధరలు అదుపు చేయకపోయి ఉంటే ఆహారం, రవాణా, వినియోగ వస్తువులు, గృహ రంగాల వినియోగదారులు అదనంగా 30 నుంచి 40 శాతం చెల్లింపుల భారాన్ని మోయాల్సివచ్చేది.

రూ. 28,000 కోట్లు

- ఆర్‌బీఐ నుంచి కేంద్రం ఆశిస్తున్న డివిడెండు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని(2018-19)కి ఆర్‌బీఐ నుంచి రూ.28,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను ఆశిస్తున్నట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. 2018-19లో ఆర్‌బీఐ నుంచి ఇప్పటికే రూ.40 కోట్లు అందుకున్నట్లు బడ్జెట్ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గార్గ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ, ప్రభుత్వ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి డివిడెండ్ అంచనాను కేంద్రం రూ.54, 817.25 కోట్ల నుంచి రూ.74,140.37 కోట్లకు పెంచింది.

టెలికాం నుంచి రూ.41,519 కోట్ల రాబడి

వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో టెలికాం రంగం నుంచి రూ.41,519.76 కోట్ల రాబడి వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో టెలికాం రంగం నుంచి రాబడి రూ.48,661.42 కోట్లు రావొచ్చని భావించినప్పటికీ రూ.9,416.42 కోట్లు తగ్గి రూ.39,245 కోట్లకు చేరవచ్చని భావిస్తున్నారు. లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగ చార్జీల ద్వారా టెలికాం రంగం నుంచి ప్రభుత్వానికి రాబడి వస్తుంది. భారత టెలికాం రంగ నియంత్రణ సంస్థ (ట్రాయ్) వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 2018 జూలై-సెప్టెంబరులో టెలికాం కంపెనీల స్థూల రాబడి 12.86 శాతం తగ్గి రూ.66,361.7 కోట్ల నుంచి రూ.57,827.24 కోట్లకు చేరుకుంది.

సింగరేణి రూ.1,850 కోట్ల పెట్టుబడులు

రానున్న ఆర్థిక సంవత్సరం (2019-20)లో కొత్త గనులు, ప్రాజెక్టుల కోసం రూ.1850 కోట్లను సింగరేణి పెట్టుబడులు పెట్టనుంది. కేంద్ర బడ్జెట్‌లో ఈ అంశంపై పీయూష్ గోయల్ ప్రకటన చేశారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఒడిశాతో పాటు పలు రాష్ట్రాల్లో కొత్త గనులు తవ్వాలని, మరోవైపు ప్రస్తుతం ఉన్న ఓసీలను లాంగ్‌వాల్‌లుగా మార్చాలని, కొత్త యంత్రాలను ప్రవేశపెట్టాలని సింగరేణి ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.1,850 కోట్లు వెచ్చించనుంది. ఈ పెట్టుబడులను సింగరేణి కాలరీస్ స్వయంగా సమకూర్చుకోవాల్సిందే. లాభాలు, రుణాల రూపేణా ఈ నిధులను సింగరేణి సమీకరించనుంది.

212.74 సెన్సెక్స్	62.70 నిఫ్టీ	75 బంగారం	170 వెండి (కిలో)	రూపాయి (ఒక డాలరుకు)	ముడి చమురు
36,469.43	10,893.65	33,375	40,445	71.25	61.29
		మేలిమి 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)		17 పైసలు	

డాక్టర్ రెడ్డీస్ లాభం ఆకర్షణీయం

మూడో త్రైమాసికంలో రూ.485 కోట్లు

» 45 శాతం వృద్ధి.. వర్ధమాన మార్కెట్ల అండ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్ధమాన మార్కెట్లలో వ్యాపార వృద్ధి ఆకర్షణీయంగా ఉండడంతో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించింది. అంతర్జాతీయ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ ప్రమాణాలకు (ఐఎఫ్ఆర్ఎస్) అనుగుణంగా ఏకీకృత ప్రాతిపదికన 2018 డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు రూ.485 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదేకాలం లాభం రూ.334 కోట్లతో పోలిస్తే 45 శాతం పెరిగిందని కంపెనీ వెల్లడించింది. అయితే.. 2018-19 రెండో త్రైమాసికంలో ఆర్జించిన రూ.503 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం 4 శాతం తగ్గింది. సమీక్ష త్రైమాసికానికి ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.3,806 కోట్ల నుంచి రూ.3,850 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఆదాయంలో నికర లాభం వాటా 12.6 శాతానికి పెరిగిందని, ఏడాది క్రితం ఇది 8.8 శాతం ఉందని కంపెనీ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) సౌమెన్ చక్రవర్తి తెలిపారు. భారత్, వర్ధమాన దేశాల్లో ఆకర్షణీయమైన వృద్ధి కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కూడా మంచి పనితీరును కొనసాగించగలిగామని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ, సహ చైర్మన్ జీవి ప్రసాద్ చెప్పారు. కొత్త ఔషధాల విడుదల ఊపందుకుందని, వ్యయ నియంత్రణ చర్యలు ఫలితాలను ఇస్తున్నాయన్నారు. స్థిరంగా లాభాల వృద్ధిని సాధించే దిశగా కంపెనీ పయనిస్తోందని వివరించారు. 2018-19 మూడో త్రైమాసికానికి మార్కెట్ వర్గాల అంచనాలకు మించి ఫలితాలను ప్రకటించడమేకాక.. వరుసగా మూడు త్రైమాసికాలుగా నికర లాభం పెరుగుతూ వస్తోంది.



ఆర్థిక ఫలితాలు ప్రకటిస్తున్న సౌమెన్ చక్రవర్తి (ఎడమ)

జనరిక్ ఔషధాల వ్యాపారం

సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయంలో ప్రపంచ జనరిక్ ఔషధాల వ్యాపార ఆదాయం రూ.3,135 కోట్లు ఉంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసిక ఆదాయం రూ.3,010 కోట్లతో పోలిస్తే 4 శాతం పెరిగింది. కంపెనీకి ప్రధాన మార్కెట్ అయిన ఉత్తర అమెరికాలో ఆదాయం 8 శాతం క్షీణించి రూ.1,607 కోట్ల నుంచి రూ.1,483 కోట్లకు పరిమితమైంది. యూరప్ మార్కెట్లో స్వల్పంగా ఒక శాతం వృద్ధితో రూ.203 కోట్లకు చేరిందని కంపెనీ తెలిపింది. వర్ధమాన మార్కెట్ల ఆదాయం ఆకర్షణీయంగా 31 శాతం పెరిగి రూ.774 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.590 కోట్లు ఉంది. దేశీయ మార్కెట్‌లో కూడా కంపెనీ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.612.6 కోట్ల నుంచి రూ.674.1 కోట్లకు చేరింది. ఇతర విభాగాల్లో ప్రొప్రైటరీ ఉత్పత్తుల ఆదాయం 52 శాతం క్షీణించి రూ.251 కోట్ల నుంచి రూ.121 కోట్లకు పరిమితమైంది. కంపెనీ మొత్తం విక్రయాల్లో ఉత్తర అమెరికా వాటా 39 శాతం ఉన్నాయి.



బడ్జెట్ దన్నుతో ర్యాలీ

213 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 500 పాయింట్ల లాభం

ముంబై: బడ్జెట్ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లో తీవ్ర హెచ్చుతగ్గులు చోటు చేసుకున్నాయి. మార్కెట్ ఇంట్రాడేలో భారీగా పెరిగిన తర్వాత నష్టాల్లోకి జారుకున్నా చివరకు పుంజుకుంది. మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించిన తాయిలాలు ఇందుకు బాగా దోహదం చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఒక దశలో 500 పాయింట్ల లాభంతో 36,778.14 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. ఆ వెంటనే అమ్మకాల ఒత్తిడితో 36,221.32 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని చేరినా, వెంటనే కోలుకుని 212.74 పాయింట్ల లాభంతో 36,469.43 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 62.70 పాయింట్ల లాభంతో 10,893.25 పాయింట్ల వద్ద ముగిసింది. రైతులు, మధ్యతరగతి వర్గాలు ముఖ్యంగా వేతన జీవుల కోసం ఆర్థిక మంత్రి ప్రకటించిన తాయిలాలు శుక్రవారం మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. ఈ తాయిలాలతో జీడీపీలో ద్రవ్య లోటు 3.4 శాతానికి పెరిగే అవకాశం ఉన్నా మార్కెట్ పెద్దగా పట్టించుకోలేదు. బీఎస్ఈ సెక్టోరియల్ ఇండెక్స్‌ల్లో ఆటో, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ ఇండెక్స్‌లు 2.63 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి.

మెటల్, మైనింగ్, బ్యాంకింగ్ ఇండెక్స్‌లు మాత్రం అమ్మకాల ఒత్తిడితో నీరసించాయి. సెన్సెక్స్ షేర్లలో హీరో మోటోకార్ప్, మారుతీ, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ కంపెనీల షేర్లు 7.48 శాతం వరకు లాభాలతో ముగిశాయి. మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సెన్సెక్స్ షేర్లలో వేదాంత షేరు అత్యధికంగా 17.82 శాతం నష్టపోయింది. బ్యాంకింగ్ షేర్లలో యెస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకుల షేర్లు 4.68 శాతం వరకు నష్ట పోయాయి.

పరిగెత్తిన జెట్ ఎయిర్‌వేస్ షేరు

జెట్ ఎయిర్‌వేస్ షేర్లు శుక్రవారం హాట్‌హాట్‌గా ట్రేడయ్యాయి. పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఈ కంపెనీని గట్టెక్కించేందుకు ఇతిహాద్ ఎయిర్‌లైన్స్ సమర్పించిన ప్రణాళికకు ఆమోదం లభించిందన్న వార్తలు ఇందుకు దోహదం చేశాయి. దీంతో ఒక దశలో 19 శాతం వరకు దూసుకుపోయిన ఈ షేరు బీఎస్ఈలో చివరికి 7.79 శాతం లాభంతో రూ.255.90 వద్ద ముగిసింది.

డీహెచ్ఎఫ్ఎల్‌లో కొనసాగిన నష్టాలు

డీహెచ్ఎఫ్ఎల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి శుక్రవారం కొనసాగింది. దీంతో బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు మరో 17.96 శాతం నష్టంతో రూ.111.45 వద్ద ముగిసింది.

ఏడాది గరిష్ఠ స్థాయిలో డాక్టర్ రెడ్డీస్ షేరు

మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడంతో డాక్టర్ రెడ్డీస్ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. శుక్రవారం ఒక దశలో రూ.2,810కి చేరిన ఈ షేరు చివరికి 2.32 శాతం లాభంతో రూ.2,786.90 వద్ద ముగిసింది.



నేను ఇవ్వాల్సింది తక్కువ..
జప్తు చేసింది ఎక్కువ

ఇదేమి న్యాయం: మాల్యా

న్యూఢిల్లీ: భారత్‌లో ఏడాపెడా తన గ్రూప్ కంపెనీల ఆస్తులను జప్తు చేయడంపై పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ముద్ర పడిన లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు వడ్డీతో కలిపి తాను చెల్లించాల్సింది రూ.9,000 కోట్లు అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో సహా భారత అధికారులు తన గ్రూప్ కంపెనీలకు చెందిన రూ.13,000 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్టు ట్వీట్ చేశారు. 'అధికారులు ఇప్పటి వరకు రూ.13,000 కోట్ల విలువైన మా గ్రూప్ కంపెనీ ఆస్తులు జప్తు చేశారు. అయినా ప్రభుత్వ రంగ బ్యాంకులకు నేను రూ.9,000 కోట్లు ఎగనేసి పారిపోయానని చెబుతున్నారు. న్యాయం ఎక్కడుంది? ఇది స్థిరమైన చర్చేనా' అని ట్వీట్ చేశారు. తన నుంచి రుణాల వసూలు పేరుతో భారతీయ బ్యాంకులు లాయర్ల ఖర్చుల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేయడాన్నీ మాల్యా తప్పు పట్టారు. ఇందుకు ఎవరు జవాబుదారీ? అని ప్రశ్నించారు. ఇవే బ్యాంకుల లాయర్లు, బ్రిటన్‌లో తన లాయర్ల కోసం ఖర్చు చేస్తున్న ఫీజులను ప్రశ్నించడాన్నీ మాల్యా తప్పు పట్టారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం తీసుకున్న రూ.9,000 కోట్ల బ్యాంకు రుణాల ఎగవేత కేసులో మాల్యా ప్రధాన నిందితుడు.

ఎస్‌బీఐ లాభం రూ.4,709 కోట్లు

మొండి బకాయిలు తగ్గుముఖం

స్టాండలోన్ లాభం రూ.3,955 కోట్లు

ముంబై: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆశావహ ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికా(అక్టోబరు-డిసెంబరు)కి బ్యాంక్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.4,709.15 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఎస్‌బీఐ రూ.1,886.57 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.84,350.11 కోట్లకు చేరుకుంది. 2017లో ఇదే సమయానికి ఆదాయం రూ.74,190.87 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలానికి ఎస్‌బీఐ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) వార్షిక ప్రాతిపదికన 10.35 శాతం నుంచి 8.71 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 5.61 శాతం నుంచి 3.95 శాతానికి జారుకున్నాయి. మొండి బకాయిల నష్టాన్ని పూడ్చుకునేందుకు మూడో త్రైమాసికంలో బ్యాంకు రూ.14,143.74 కోట్ల కేటాయింపులు జరిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి రూ.17,963.77 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. ఎన్‌పీఏల భారం కాస్త తగ్గడంతో బ్యాంక్‌కు కేటాయింపులు తగ్గించుకునే వెసులుబాటు లభించింది. గత త్రైమాసికంలో రూ.4,532 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి మళ్లాయని బ్యాంక్ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు.



అక్టోబరు-డిసెంబరు కాలానికి ఎస్‌బీఐ స్టాండలోన్ (అనుబంధ విభాగాలు మినహాయించి) లాభం రూ.3,954.81 కోట్లుగా నమోదైంది. అంతక్రితం సంవత్సరంలో ఇదే సమయానికి రూ.2,416.37 నష్టం ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 21.4 శాతం పెరిగి రూ.22,691కోట్లకు చేరుకుంది. బ్యాంక్ రుణాలు 12.1 శాతం వార్షిక వృద్ధి నమోదు చేసుకున్నాయి.

నష్టాల్లో షేరు

ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో బీఎస్ఈలో వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి ఎస్‌బీఐ షేరు ధర 3.09 శాతం తగ్గి రూ.284.30కు చేరింది.

మా డేటా భద్రం

డేటా లీక్ వార్తలను ఎస్‌బీఐ ఖండించింది. కస్టమర్ డేటా అంతా సురక్షితంగా ఉందని స్పష్టం చేసింది. వినియోగదారులకు సంబంధించిన సమాచారం భద్రంగా ఉందని, దీనిపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. బ్యాంక్ సర్వర్లన్నీ పూర్తి స్థాయిలో రక్షణలో ఉన్నాయని, ఎవరు కూడా ఇందులోకి చొరబడలేదని పేర్కొం ది. ఎస్‌బీఐ క్విక్ సర్వీస్‌కు చెందిన సర్వర్ల నుంచి డేటాను తీసుకున్నట్లు యూఎస్‌కు చెందిన టెక్‌క్రంచ్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

టెలికం రంగంలోకి ట్రాన్స్‌కో


మరింత చౌకగా టీవీ, ఫోన్, ఇంటర్నెట్ సేవలు!.. ప్రతిపాదనకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్.. ఏపీ ఫైబర్‌గ్రిడ్‌కు గట్టి పోటీ

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టెలికం రంగంలోకి అడుగు పెట్టేందుకు మరో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఆసక్తి చూపుతోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్‌గ్రిడ్ లిమిటెడ్(ఏపీఎస్ఎఫ్ఎల్) రాష్ట్రంలో ఫైబర్ నెట్ సేవలు అందిస్తోంది. నెలకు రూ.149 కే 250 టెలివిజన్ చానళ్లు, ఫైబర్‌నెట్ టెలిఫోన్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు వారిలో వారు ఎంతసేపైనా ఇంటర్‌కమ్ తరహాలో ఉచితంగా మాట్లాడుకునే సదుపాయం, 15 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్‌నెట్ సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఏపీఎస్ఎఫ్ఎల్ సేవలు ప్రారంభమైనా వ్యాపార తరహా విధానాన్ని అమలు చేయకపోవడం.. ప్రైవేటు టెలికం సంస్థల తరహాలో పోటీ తత్వంతో కనెక్షన్లపై దృష్టి సారించకపోవడంతో కమర్షియల్ ఆపరేషన్లలో ఏపీఎస్ఎఫ్ఎల్ తడబాటుపడుతోంది. ఇలాంటి తరుణంలో ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీ ట్రాన్స్‌కో) కూడా టెలికం రంగంలోకి అడుగుపెట్టాలని నిర్ణయించింది. ఆలోచన వచ్చిందే తడవుగా టెలికం రంగంపై ట్రాన్స్‌కో జేఎండీ దినేశ్ పరుచూరి నేతృత్వంలోని అధికారుల బృందం అధ్యయనం చేసింది. టెలికం టవర్లు, విద్యుత్ స్తంభాలు, సబ్‌స్టేషన్ల ఆధారంగా టెలికం, ఇంటర్నెట్ సేవలు అందించేందుకు అవసరమైన 'ఆప్టికల్ గ్రౌండ్ వైర్'(ఓపీజీడబ్ల్యూ)ను ఇప్పటికే ట్రాన్స్‌కో వేసింది. దాని సాయంతోనే రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తోంది. అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమాచార వ్యవస్థను వేగవంతంగా చేరవేయడంలో ఓపీజీడబ్ల్యూ బాగా ఉపయోగపడుతుంది. ఈ సాంకేతికతనే ఏపీఎస్ఎఫ్ఎల్ వినియోగిస్తోంది. ఇంతటి విలువైన ఓపీజీడబ్ల్యూ వ్యవస్థను ఒక్క విద్యుత్ సరఫరా కోసమే కాకుండా బహుళ సేవలకూ వినియోగించడం వల్ల ట్రాన్స్‌కోను ఆర్థికంగా బలోపేతం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. తమ ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో, ఓపీజీడబ్ల్యూను లీజుకు ఇచ్చేందుకు ట్రాన్స్‌కో సిద్ధమైంది. ఆసక్తి ఉన్న ప్రఖ్యాత టెలికం కంపెనీలకు ఆహ్వానం పలకనుంది.

ఎయిర్‌సెల్
శివశంకరన్ ఆస్తుల జప్తు


న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో ఎయిర్‌సెల్ మాజీ ప్రమోటర్ శివశంకరన్‌కు చెందిన కంపెనీ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం కింద శివ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, కరేబియన్ దీవుల్లోని బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో ఉన్న ఎక్సెల్ సన్‌షైన్ లిమిటెడ్‌లకు చెందిన ఆస్తులను జప్తు చేస్తూ ఈడీ ప్రొవిజనల్ ఉత్తర్వులను జారీ చేసింది. చెన్నైలోని టీనగర్, ఎంఆర్‌సీ నగర్‌లోని భూములు, కార్యాలయాలు సహా మ్యూచువల్ ఫండ్స్, డిపాజిట్లను జప్తు చేస్తున్నట్లు ఈడీ తెలిపింది. జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.224.6 కోట్లుగా ఉందని తెలిపింది. చెన్నైలోని ఐడీబీఐ బ్యాంక్ శాఖ నుంచి శివశంకరన్ సహా మరికొందరు రూ.470 కోట్లు రుణం తీసుకుని చెల్లించకపోవటంతో కేంద్ర దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన కేసు ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈ ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,280	33,800	34,400	33,660	33,330
క్రితం ముగింపు	34,210	---	34,330	33,650	33,200
22 క్యారెట్లు	31,740	31,130	31,640	31,210	31,860
క్రితం ముగింపు	31,680	---	31,580	31,210	31,730
వెండి (కిలో)	41,300	41,800	41,700	41,400	43,800
క్రితం ముగింపు	41,400	---	41,500	41,400	44,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.55 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	395	చిత్తూరు	423
వరంగల్	397	చెన్నై	430
విజయవాడ	395	నమక్కల్	420
గోదావరి	395	బెంగళూరు	425
విశాఖపట్నం	395	ముంబై	450

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	83
కరీంనగర్	79	గుంటూరు	84
వరంగల్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	88
కర్నూలు	80	నెల్లూరు	88
విశాఖపట్నం	83	అనంతపురం	87
గోదావరి	81		

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)


ACI INFOCOM .6(.6)83
ADITYA SPIN. 4.97(5.23)4167
AGRO TECH FO 573.5(556.4)1356
AISHWARYA TE 2.5(2.53)3900
ALPHAGEO (I) 449.65(464.6)1215
ALU FLUORIDE 93.25(89.5)6194
AMAR RAJA BA 767.3(744.5)17897
ANDHRA BANK 25.5(25.35)97069
ANDHRA CEMEN 4.74(4.63)6835
ANDHRA PETRO 57.7(57.85)41351
ANJANI PORTL 108.05(113)2043
ASTRA MICRO 77.55(78.6)8687
AUROB.PHARMA 798.55(786.3)90367
AVANTEL LTD 221(215.45)1187
AVANTI FEEDS 346.55(356.75)218086
B.N.RATHI SE 24(24.35)506
BALAJI AMINE 403.85(421.75)2200
BAMBINO AGRO 188.9(177.85)2296
BARTRONICSIN 6.51(6.41)1700
BCG 3.08(3.12)84919
BHAGIRA.CHEM 420.5(421.9)3290
BHAGYA INL 33.1(33.05)216
BHARATFIN 948.9(946.15)33959
CAMBRIDGE 45(45.25)572
CCHHL 6.95(6.65)9601
CCL PRODUCTS 270.4(268)4298
CELESTIAL 6.79(6.6)9432
CIL SECURITS 14.99(14.5)42
COROM INTER 455.05(448.6)7605
CUBEX TUBING 13.96(13.38)2660
CYBERMATE 1.8(1.86)45685
CYIENT 608.55(607.2)3856
DANLAW TECH. 85.8(84.15)839
DECAN CEMENT 379(385)400
DIAMONPOWER 1.43(1.37)3284
DIVI'S LAB. 1531.75(1505.2)25329
DIVYA.GRANIT 92.05(94)1400
DQ ENT 7(6.94)2716
DR.REDDY'S 2786.9(2723.75)88656
EMPEE SUGARS 1.32(1.34)300
EVEREST ORG. 172.85(177)11979
FACOR ALLOYS 2.03(1.88)41556
FIRSTOBJ 8.86(8.45)2854
GATI LTD. 72.7(74)58103
GAYATRI PROJ 170.8(170.8)1362
GENNEX LAB 3.19(3.18)88740
GMR INFRASTR 15.05(15.25)1072533
GODAVARI DRU 22.3(22.35)89
GOLDSTONE EN 13.91(13.25)6053
GRANULES (I) 89.1(91.1)102127
GVK POWERINF 6.55(6.57)240793
HBL P SYS 26.6(26.25)8770
HERITGFOOD 491.75(491.65)1627
HIND.FLUROCA 14.65(15.4)779
INCAP LTD. 38(40)200
IPAPPM 474.25(476.55)18643
IVRCL LTD .9(.92)38761
KAKATIYA CEM 172.05(179.3)3579
KALLAM 16.8(17.3)1849
KAVERI SEED 595.8(599.4)68775
KCP LTD 85.8(87.15)941
KERNEX MICRO 24(24.3)2861
KNR CONST 206.85(206.7)5721
KREBS BIOCHM 101.75(97.15)359
LOKESH MACH 41.6(41.5)1522
LOTUS CHOC 24.7(23.7)246
MADHUCON PRJ 5.71(5.81)8845
MOLD-TEK TEC 43(45.7)2948
MOSCHIP SEMI 20.65(20.15)29810
MSR INDIA 9.08(8.65)3135
N C L IND. 119.05(119)183
NACLIND 27.25(27.25)1380
NATCO PHARM 693.2(691.2)7411
NCC 79.25(79.6)1232771
NEHA INTER. 4.28(4.28)453
NETTLINX LTD 42.8(42.9)19154
NEULAND LAB. 538.25(528.75)1942
NIHAR INFO 11.85(11.35)108
NILE LTD. 309.15(312.65)2487
NTL 1.4(1.4)1000
OIL COUNTRY 13.59(13.9)9192
OLECTRA 219.05(226.3)22792
PADMALAYA TE 2(2.09)2628
PALRED 38.25(37.75)6112
PANYAM CEMEN 10.26(10.9)5711
PENNAR STEEL 35.65(35.9)21914
PHYTOCHEM I. 41.1(37.3)6358
PITTIENG 57.1(58.55)11971
POKARNA LTD 172.75(179.8)1314
PRAJAY ENGS. 8.17(8.29)200
PREMIER EXPL 232.5(237.6)4637
PRSMJOHNSN 67.4(71.65)28497
RAIN 114.3(119.85)106698
RAJ PACKAGIN 27.5(27.55)70
REG.CERAMIC 3.71(3.9)51
RESTILE CER. 4.29(4.1)4611
SAGAR CEM. 599.5(583.8)841
SAMKRG PIST. 178.5(177.5)2064
SANGHI IND. 56.5(56.7)6914
SATVAH.ISPAT 9.68(9.84)18308
SAVEN TECHNO 24.55(25.25)11630
SIBAR AUTO 27.7(27.45)5
SMPL .39(.39)100
SMS PHARMACE 67.9(67.2)1543
SREE RAYALA 146.5(149.1)1245
STEEL EXCH 10.56(11)9784
SUJANA INDUS .29(.3)365
SURANATP 4.44(4.46)101
SURYACHAKRA .3(.29)11300
SURYLAK.COTT 37.6(38.9)392
SUVEN LIFE S 194.6(192.9)25788
TAJ GVK HOTL 177.65(183.25)375
TANLA 37.6(39)22123
TCI INDUS. 910(910)1
TRANSCORP IN 23.95(23.9)665
TRANSGENE BI 5.24(5.34)6000
TRANSPORT CO 280.9(277.05)786
USHER AGRO 2.5(2.41)391
VICEROY HOTE 2.98(3.13)11366
VIJAY TEXTIL 35.6(37.15)2733
VIMTA LABS 253.55(263.45)1210
VIRAT CRANE 28(28.5)118
VIRINCHI 72.9(72.6)11602
VISAKA IND. 371.35(373.25)1964
VISTA PHARMA 25.1(25)5578
VIVIMED LABS 23.9(25.1)29181
VST INDUS. 3234.45(3220.45)215
WATERBASE 151(160.3)221479
XLENERGY 1.03(1.01)100
ZEN TECH 75.1(75.3)3288
ZENOTECH 24.45(25.15)7190

ఎన్ఎస్ఈ-500 (NSE)

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 594.5(588.95)11255
AARTIIND 1632.35(1625.65)37009
ABAN 66.5(67.15)321734
ABB 1272.2(1272.3)97864
ABFRL 208.95(209.5)659499
ABGSHIP 1.85(1.8)37076
ACC 1415.55(1423.35)568663
ADANIENT 143(137.15)7091209
ADANIPORTS 338.45(338.65)3119675
ADANIPOWER 44.2(45.5)11033520
ADANITRANS 215.15(213.4)85059
AEGISCHEM 199.5(189.9)365778
AHLUCONT 275.3(280)17189
AIAENG 1599.85(1607.2)11876
AJANTPHARM 982.8(1020.65)801470
AKZOINDIA 1729.55(1759.85)3455
ALBK 44.4(45.15)4853011
ALLCARGO 103.45(105.55)43290
ALOKTEXT 3.8(3.85)2210097
AMARAJABAT 769.6(744.95)473123
AMBUJACEM 212.5(209.9)3350137
ANANTRAJ 33.9(33.4)377415
ANDHRABANK 25.45(25.25)858446
APARINDS 614.85(621.7)20976
APLLTD 591.85(593.65)23201
APOLLOHOSP 1341.25(1325.65)530789
APOLLOTYRE 207.85(204.35)1670882
ARVIND 88.45(88.15)1493066
ASHIANA 111.8(114.35)55179
ASHOKA 121.15(119.7)166368
ASHOKLEY 83.55(81.3)65021097
ASIANPAINT 1457.2(1412.6)2077539
ASTRAL 1106.9(1131.2)37427
ASTRAZEN 1653.95(1601.7)7075
ATUL 3512.2(3466.2)5512
AUROPHARMA 797.8(787.8)1212130
AXISBANK 717.25(722.7)13792059
BAJAJ-AUTO 2602.75(2554.55)1028186
BAJAJCON 354.8(354.1)27699
BAJAJELEC 467(458.2)158772
BAJAJFINSV 6096.95(6091.9)311984
BAJAJHIND 7.9(8.05)2365742
BAJAJHLDNG 2865.9(2847.05)16406
BALKRISIND 820.9(810.6)533172
BALLARPUR 3.55(3.65)434344
BALMLAWRIE 186.9(188.2)24264
BALRAMCHIN 102.6(101.9)1158751
BANKBARODA 111.1(112.45)16494373
BANKINDIA 94.85(102.8)25180357
BASF 1347.6(1352.7)3474
BATAINDIA 1143.95(1118.6)447755
BBTC 1205.95(1205.25)66041
BEML 799.2(794.15)1652856
BERGEPAINT 325.4(318.75)973395
BFUTILITIE 196.35(200.75)242094
BGRENERGY 53.4(54.6)46045
BHARATFIN 947.8(946.3)448069
BHARATFORG 495.45(493)1723141
BHARTIARTL 311.85(306.4)8331159
BHEL 64.35(64.7)6031620
BIOCON 666.25(648.3)1520377
BIRLACORPN 487.05(486.1)36078
BLISSGVS 144.3(156.2)11587500
BLUEDART 3182.2(3188.85)2027
BLUESTARCO 600.35(595.4)16742
BOMDYEING 114.4(112.3)1515447
BOSCHLTD 19316.15(18851.7)14994
BPCL 341(345.45)2722370
BRFL 7.9(7.9)44339
BRIGADE 211.1(210.45)90699
CADILAHC 323.6(318.95)657757
CANBK 238.05(250.15)5884645
CARERATING 998.45(990.55)48978
CASTEXTECH .95(.95)641341
CASTROLIND 160.8(158.65)1136674
CCL 269.9(268.05)22769
CEATLTD 1104.25(1086.05)724235
CENTRALBK 30.9(31.1)255198
CENTURYPLY 167.45(162.45)93493
CENTURYTEX 791.65(793.6)413461
CERA 2433(2430)6709
CESC 694.9(693.9)203538
CHAMBLFERT 173(176.05)900513
CHENNPETRO 238(242.15)252838
CHOLAFIN 1216.35(1172.3)663420
CIPLA 521.35(517.3)1380838
CLNINDIA 385.65(387.8)7943
COALINDIA 223.2(224.65)2820146
COLPAL 1293.45(1280.1)481876
COROMANDEL 456.75(449.85)215902
CORPBANK 25.9(26.2)179820
COX&KINGS 154.65(155.6)35744
CRISIL 1659.85(1648.65)9488
CUB 189.45(191)1712175
CUMMINSIND 795.9(788.2)478554
CYIENT 606.65(609.5)32686
DABUR 451.85(443.65)6034606
DBCORP 179.1(176.25)62644
DBREALTY 25.55(25.55)131392
DCBBANK 177.25(178.15)1214209
DCMSHRIRAM 336.7(335.6)53312
DEEPAKFERT 117.9(117.05)1220540
DELTACORP 233.05(230.9)485039
DEN 71.7(71.5)1713095
DENABANK 12.2(12.5)1793897
DHANUKA 437.95(420.95)29800
DHFL 111.2(135.9)94989171
DISHTV 24.4(23.65)30105361
DIVISLAB 1532.35(1506.2)609053
DLF 165.7(164.85)13045972
DREDGECORP 406.7(409)371707
DRREDDY 2791.25(2720.8)1450995
DYNAMATECH 1366.6(1370.45)387
ECLERX 1038.4(1074.35)61240
EDELWEISS 146.9(154.05)3003971
EICHERMOT 19663.4(19005.75)185717
EIDPARRY 200.75(202.4)59614
EIHOTEL 194.55(201.85)292772
ELECTCAST 21.45(21.25)120477
ELGIEQUIP 240(240.1)82374
EMAMILTD 414.5(410.9)111967
ENGINERSIN 115.45(112.6)941460
EROSMEDIA 76.05(77.1)456225
ESCORTS 677.95(659.6)5112096
ESSDEE 15.55(15.4)8427
ESSELPACK 108.2(108.75)144406
EVEREADY 215.25(214.1)48415
EXIDEIND 227.05(226.9)3205387
FCONSUMER 43.55(41.55)2524217
FDC 166.35(164.7)7016
FEDERALBNK 86.25(85.9)9968361
FINCABLES 415.65(415.2)29944
FINPIPE 512.45(513.65)12039
FLFL 426.8(426.6)34600
FORTIS 135.2(135.2)617588
FSL 50.75(49.05)1874161
GAIL 333.5(332.15)3367974
GATI 72.8(73.8)282029
GDL 108.3(102.9)198162
GEPIL 774.2(771.85)4392
GESHIP 300.45(302.75)58638
GET&D 296.7(293.6)14284
GILLETTE 6504.15(6500.05)2790
GLAXO 1407.55(1409.25)10985
GLENMARK 661.85(651.65)398672
GLOBOFFS 13.15(13.3)6819
GMDCLTD 83.95(85.2)69395
GMRINFRA 15.05(15.2)20712433
GODFRYPHLP 942.75(929.3)223978
GODREJCP 710.65(709.3)3093553
GODREJIND 505.6(503.3)262427
GODREJPROP 750.1(741.9)288164
GPPL 85(84.95)115364
GRANULES 89.2(91.35)829138
GREAVESCOT 122(122.65)165088
GREENPLY 131(129.1)55360
GRINDWELL 540.4(542)5581
GRUH 211.6(208.6)10011134
GSFC 96.15(97.1)2564417
GSKCONS 7491.25(7330.85)19022
GSPL 177.45(176.05)179429
GUJFLUORO 881(863.05)34502
GULFOILLUB 890(905.85)46933
GVKPIL 6.55(6.55)1206455
HATHWAY 32(32)1913785
HAVELLS 737.15(713.45)1938051
HCC 12.3(12.35)3399592
HCL-INSYS 19.95(20)401293
HCLTECH 1043.85(1005.2)3230111
HDFC 1961.25(1922.35)4867443
HDFCBANK 2090.45(2079.95)3913547
HDIL 26.85(26.25)7003357
HEIDELBERG 147.1(148.05)44947
HEROMOTOCO 2807.25(2613.95)3296513
HEXAWARE 349.6(342.6)2930714
HFCL 22.55(22.8)1386340
HIMATSEIDE 197.75(201.3)74791
HINDALCO 211.4(208.5)10475839
HINDCOPPER 45.95(46.35)306758
HINDPETRO 234(233.5)2759440
HINDUNILVR 1799.3(1763.25)2342251
HINDZINC 254.7(260.2)5094566
HMT 17.9(17.5)1655
HMVL 115.95(116.1)7323
HONAUT 21695.35(21391.4)466
HOTELEELA 13.35(13.65)139340
HSIL 259.1(247.65)369883
HTMEDIA 39.6(40.15)70765
IBREALEST 75.1(73.6)3783830
IBULHSGFIN 678.65(664.7)11316643
ICICIBANK 354.65(364.45)25605469
ICRA 2997.9(3046.8)634
IDBI 52.75(55.4)4644706
IDEA 30.9(30.1)16952172
IDFC 38.6(39.6)3261181
IFBIND 797.75(816.6)5567
IFCI 13.5(13.6)3423812
IGARASHI 506.15(521.05)9760
IIFL 419.1(429.8)100705
IL&FSTRANS 7.25(7.45)909127
INDHOTEL 143.75(142.05)1255454
INDIACEM 81.35(84.25)6523784
INDIANB 224(225.4)1180493
INDOCO 177.45(184.4)17159
INDUSINDBK 1515.15(1505.55)1547424
INEOSSTYRO 626.85(628.3)609
INFRATEL 296.2(292.25)2258242
INFY 757.05(749.55)6276585
INGERRAND 576.6(586.2)9587
INOXLEISUR 260.65(259.55)239525
INOXWIND 68.05(68)48196
INTELLECT 171.35(180.7)436654
IOB 13.7(13.7)409378
IOC 137.2(136.85)5092724
IPAPPM 473.6(477)134138
IPCALAB 760.6(769.45)55003
IRB 145(144.75)1450004
ITC 280.85(278.65)18353829
J&KBANK 39.2(41)691958
JAGRAN 101.05(102.85)97986
JAICORPLTD 100.15(100.9)1142960
JBCHEPHARM 309.7(317.2)57644
JBFIND 17.95(18.55)54335
JCHAC 1795.5(1803)4443
JETAIRWAYS 255.15(238.05)27955595
JINDALPOLY 250(247.45)30848
JINDALSTEL 129.7(135.1)12565471
JISLJALEQS 59.25(61)18900531
JKCEMENT 712.15(708.8)5627
JKIL 106.6(105.95)653043
JKLAKSHMI 299.25(298.05)177219
JKTYRE 92.1(90.8)375714
JMFINANCIL 79.7(77.35)1619584
JPASSOCIAT 6.75(6.5)41871705
JPINFRATEC 3.15(3)711497
JPPOWER 1.85(1.8)1961953
JSWENERGY 67.95(66.85)756513
JSWHL 2680.3(2715.55)1629
JUBILANT 714.4(703.45)398633
JUBLFOOD 1357.95(1258.45)6091028
JUSTDIAL 476.05(476.95)1024629
JYOTHYLAB 184.95(183.95)324929
KALPATPOWR 370.3(367.75)30674
KANSAINER 457.9(446.35)149094
KEC 247.75(244.95)253288
KESORAMIND 68.85(71.2)177381
KIRLOSENG 172.15(172.65)9423
KITEX 102.5(103.05)74915
KOLTEPATIL 269.25(264.75)242804
KOTAKBANK 1255.7(1255.75)2189154
KPIT 114.55(114.3)1785983
KRBL 359.05(333.8)507126
KSCL 595.9(600.7)853182
KSK 1.15(1.2)134653
KTKBANK 118(120)2289610
KWALITY 6.55(6.55)957645
L&TFH 130.3(131.45)4709841
LAKSHVILAS 62.95(67.3)1724417
LAOPALA 212.5(212.7)17225
LAXMIMACH 5401.75(5375.95)1105
LICHSGFIN 460.15(448.85)4376608
LT 1324.6(1314.3)2515736
LUPIN 883.1(875.7)1032450
M&M 688.4(680.05)8005192
M&MFIN 416.6(404.5)3461426
MAGMA 102.95(97.95)209392
MAHINDCIE 241.75(235.5)89185
MAHLIFE 382.3(387.7)61926
MANAPPURAM 93.8(92.2)1853774
MANPASAND 73.05(75.15)147974
MARICO 376.45(366.75)2559709
MARKSANS 25.3(25.55)475805
MARUTI 6962.3(6641.15)2545419
MAYURUNIQ 381.45(372.85)5538
MCLEODRUSS 97.6(97.05)142111
MERCK 3296.95(3305.05)10669
MHRIL 201.35(205.8)23488
MINDACORP 144.85(140.65)52186
MINDTREE 899.65(894.05)803302
MMTC 26.45(26.75)638158
MOIL 161.35(161.45)85228
MONSANTO 2614.7(2598.8)2761
MOTHERSUMI 139.3(140.6)7502159
MOTILALOFS 629.75(635.8)214783
MPHASIS 1009.75(1002.65)236768
MRF 61275.7(61289.2)7551
MRPL 67.5(67.85)676602
MTNL 13.7(13.8)2004191
MUTHOOTFIN 492.55(499.45)1079351
NATCOPHARM 691.4(692.4)145415
NATIONALUM 59.15(59.6)4668687
NAUKRI 1730.35(1747.35)159969
NAVKARCORP 46.65(46.15)337779
NCC 79.3(79.55)15029574
NETWORK18 36.3(36.55)174583
NHPC 25.4(25)4206762
NIITTECH 1319.45(1310.75)972719
NITINFIRE 1.35(1.4)124781
NLCINDIA 63.9(64.35)219521
NMDC 95.35(96.9)5332170
NTPC 140.15(139.7)5916171
OBEROIRLTY 454.2(444.65)666607
OFSS 3794.8(3801.05)27907
OIL 171.55(167.65)1423978
OMAXE 213.2(212.25)233490
ONGC 141.8(141.25)5260578
ORIENTBANK 94.75(95.7)8806608
ORIENTCEM 69.95(72.15)18917
ORISSAMINE 769.75(766.8)7858
PAGEIND 24039.05(23370)48386
PARSVNATH 6.15(6.4)97639
PCJEWELLER 71.55(73)6048011
PEL 2155.3(2032.45)1071248
PERSISTENT 618.8(602.1)249875
PETRONET 221.1(227.65)6930637
PFC 104.25(103.55)5088501
PFIZER 3039.25(3037.15)17067
PFS 15(14.9)257764
PGHH 9898.6(9908.75)4569
PHOENIXLTD 623.9(602.9)116523
PIDILITIND 1122.8(1119.75)944639
PIIND 847.55(852.5)132967
PNB 73.9(77.5)25916009
POWERGRID 190.2(188.6)5329604
PRAJIND 128.85(131.3)2493690
PRESTIGE 200.9(199.9)934274
PRSMJOHNSN 67.45(71.45)189329
PTC 76.5(78.15)652198
PUNJLLOYD 2.6(2.7)1332308
PURVA 72.5(71.65)187580
PVR 1569.6(1605.35)858713
RADICO 427.65(409.65)647799
RAIN 114.15(119.9)577380
RAJESHEXPO 618.6(607.1)243162
RALLIS 161.2(160.35)388924
RAMCOCEM 602.3(600.7)192840
RAMCOSYS 234.4(230.05)17682
RATNAMANI 874.65(881.45)19863
RAYMOND 742.65(754.35)374709
RCF 60.85(63.25)2900227
RCOM 11.6(11.75)56418188
RECLTD 125.05(124.7)3450556
REDINGTON 72.6(73.4)278573
RELAXO 747.75(734.15)10751
RELCAPITAL 189.1(193.95)5981760
RELIANCE 1249.95(1227.15)9228965
RELINFRA 267.1(268.95)3108550
RENUKA 10.1(10.25)365074
REPCOHOME 394.45(400.6)465797
RIIL 312.45(313.85)126473
RKFORGE 495.6(486.15)14171
RNAVAL 11.8(11.85)2524831
ROLTA 5(5.25)490902
RPOWER 26.4(26.5)7711767
RTNPOWER 3.6(3.6)723429
RUCHISOYA 7.2(6.9)501315
SADBHAV 196.1(196.25)29954
SADBHIN 92.35(85.55)91885
SAIL 46.25(47)11071914
SANOFI 6533.2(6464.65)6523
SBIN 284.4(293.65)60015958
SCHAEFFLER 5393.95(5267.15)1542
SCHNEIDER 91.55(92.1)15831
SCI 40.25(40.75)212811
SHARDACROP 322.45(315.85)16816
SHILPAMED 382.8(380.1)4964
SHK 168.55(168.85)106621
SHOPERSTOP 512.95(512.55)32056
SHREECEM 15782(15714.7)39190
SHRIRAMCIT 1729.6(1713.45)99983
SIEMENS 1031.1(1030.1)236484
SIMPLEXINF 155.95(157.3)111139
SINTEX 9.8(9.75)1220768
SITINET 6.35(6.45)160339
SJVN 24.95(24.2)903485
SKFINDIA 1909.4(1920.05)15784
SMLISUZU 591.15(596)8935
SNOWMAN 30.9(31.4)209200
SOBHA 478.45(472)197936
SOMANYCERA 345.15(339.15)12427
SONATSOFTW 326.6(321.05)147318
SOUTHBANK 13.1(13.15)12649268
SPARC 157.95(157.05)692099
SREINFRA 28.7(29.5)2541174
SRF 1966.45(2011.35)335740
SRTRANSFIN 1047.1(1015.35)2001341
STAR 445.8(461.35)2506519
STCINDIA 117.05(117.55)105360
SUNDARMFIN 1412.9(1404.15)109906
SUNDRMFAST 526.9(527.9)68587
SUNPHARMA 423.25(423.45)3950126
SUNTV 532.15(530.1)1629734
SUPREMEIND 1004.1(994.5)60799
SUVEN 193.6(193.6)108582
SUZLON 4.9(4.7)34746141
SWANENERGY 97.8(97.25)175360
SYMPHONY 1205(1161.25)11216
SYNDIBANK 37.3(36.9)6898256
SYNGENE 595.7(578.2)53602
TAKE 136.6(139.8)48999
TATACHEM 668(674.3)398868
TATACOFFEE 89.35(90.15)142466
TATACOMM 498.95(495.95)439432
TATAELXSI 889.3(874)498559
TATAGLOBAL 204.1(203.8)948332
TATAMOTORS 181.65(181.2)14931422
TATAMTRDVR 94.1(93.65)2296335
TATAPOWER 71.5(71.3)3343602
TATASPONGE 760.85(751.35)58343
TATASTEEL 474.7(476.7)5015994
TATASTLBSL 29.35(30)448536
TBZ 58.75(58.55)53611
TCS 2029.95(2014.1)3064163
TECHM 746.6(731.9)2260029
TEXRAIL 56(56.85)559363
THERMAX 1095.75(1095.55)10647
THOMASCOOK 219.2(222.6)127396
TIDEWATER 5120.85(5082.3)327
TIMKEN 570.65(565.2)10581
TITAN 991.55(995.8)3424938
TNPL 212.2(219.8)42558
TORNTPHARM 1798.7(1818.8)245242
TORNTPOWER 246.75(247.3)839941
TREEHOUSE 3.95(4.05)17838
TRIDENT 65.5(66.75)323753
TRITURBINE 105.9(106.4)74246
TTKPRESTIG 7773.45(7678.6)4506
TTML 3.65(3.6)1122853
TV18BRDCST 32.6(32.6)2496185
TVSMOTOR 516.65(500)2508725
TVSSRICHAK 2352.65(2339.55)1405
TVTODAY 352.95(351.8)14056
UBL 1447.15(1428.8)288391
UCOBANK 19(19.05)383347
UFLEX 250.75(252.15)41132
ULTRACEMCO 3483.65(3519.35)745604
UNICHEMLAB 199.4(203.05)56774
UNIONBANK 81.45(82.75)10592499
UNITECH 1.5(1.55)8063245
UPL 779.85(786.5)2960388
VAIBHAVGBL 669.2(664.85)53819
VAKRANGEE 45.05(42.95)594701
VEDL 162.15(197.35)98562137
VIDEOIND 2.75(2.75)95415
VIJAYABANK 43.2(44)3468270
VINATIORGA 1579.2(1578.75)12942
VIPIND 496.2(479.9)351663
VOLTAS 553.65(541.1)1915869
VRLLOG 268.85(273.5)14294
VSTIND 3212.45(3214.3)3451
VTL 1086.4(1077.3)6932
WABAG 295.7(298.5)98891
WABCOINDIA 6189.2(6228.4)2175
WELCORP 103.9(104.05)493260
WELSPUNIND 59.4(60.2)242211
WHIRLPOOL 1539.75(1509.7)50676
WIPRO 371.55(369.2)3366604
WOCKPHARMA 449.75(441.45)805950
WONDERLA 288.9(282)24171
ZEEL 354.4(380.2)24540656
ZEELEARN 27.75(27.55)291086

వంటిల్లు



పాలక్ ఝలక్!

ఆకుకూరల్లో పాలకూర శ్రేష్ఠం! త్వరగా ఉడకటంతోపాటు తేలికగా జీర్ణమవుతుంది. పైగా ఈ ఆకుకూర పోషకాల నిలయం కూడా! ఇన్ని సుగుణాలున్న పాలకూరతో వెరైటీగా పరాటాలు, సూపులు, రైస్‌లాంటివి చేసుకోవచ్చు!

పాలక్ టొమాటో కర్రీ

కావలసిన పదార్థాలు:
పాలకూర - 2 కప్పులు, టొమాటోలు - 3, ఉల్లిపాయలు - 2, పచ్చిమిర్చి - 4, పసుపు - అర టీస్పూను, అల్లంవెల్లుల్లి పేస్ట్ - అర టీస్పూను, కారం - అర టీస్పూను, ఉప్పు - సరిపడా, కొత్తిమీర - కొద్దిగా

తయారీ విధానం:
- బాండీలో నూనె వేడి చేసి, ఉల్లిముక్కలు వేసి వేగించాలి.
- పచ్చిమిర్చి కూడా వేసి వేగించి, అల్లంవెల్లుల్లి పేస్ట్, పసుపు కలపాలి.
- నిమిషంపాటు వేగించి, పాలకూర తరుగు వేయాలి.
- నాలుగు నిమిషాలు ఉడికించి, టొమాటో ముక్కలు వేసి కలపాలి.
- టొమాటో ముక్కలు మెత్తబడేంత వరకూ ఉడికించి, కారం, ఉప్పు వేసి కలపాలి. తర్వాత అర కప్పు నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించాలి.
- చివర్లో కొత్తిమీర చల్లి స్టవ్ నుంచి దింపేయాలి.
- ఈ కూరను వేడి అన్నంలో కలుపుకుని తింటే బాగుంటుంది.



పాలకూర సూప్

కావలసిన పదార్థాలు: పాలకూర తరుగు - 2 కప్పులు, ఉల్లిముక్కలు - పావు కప్పు, వెల్లుల్లి తరుగు - 1 టీస్పూను, సెనగపిండి - 1 టేబుల్ స్పూను, జీలకర్ర పొడి - పావు టీస్పూను, బిరియాని ఆకు - 1, వెన్న - ఒక టిన్నర టీస్పూను, ఉప్పు, మిరియాల పొడి - కొద్దిగా, క్రీమ్ - తగినంత.

తయారీ విధానం:
- బాండీలో వెన్న వేసి, బిరియాని ఆకు వేసి వేగించాలి.
- వెల్లుల్లి తరుగు వేసి దోరగా వేగించాలి. తర్వాత ఉల్లి ముక్కలు వేసి మెత్తబడేవరకూ వేగించి, పాలకూర తరుగు చేర్చాలి.
- ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. మెత్తబడిన తర్వాత సెనగపిండి వేసి తిప్పి, రెండు కప్పుల నీళ్లు పోయాలి. మరిగేవరకూ ఆగి, తర్వాత మంట తగ్గించి 4 నిమిషాలపాటు ఉడికించాలి.
- జీలకర్ర పొడి వేసి కలిపి మంట తీసేయాలి. చల్లారిన తర్వాత బ్లెండర్‌లో వేసి తిప్పాలి. బ్లెండర్‌లో వేసే ముందు బిరియాని ఆకు తీసేయాలి.
- సూప్ మరీ చిక్కగా ఉంటే పావు కప్పు నీళ్లు కలుపుకోవచ్చు.
- తర్వాత ఈ సూప్‌ను తిరిగి బాండీలో వేసి 3 నిమిషాలపాటు చిన్న మంట మీద ఉడికించి దింపాలి. వేడిగా ఉన్నప్పుడే బౌల్స్‌లో నింపి, క్రీమ్ వేసి సర్వ్ చేయాలి.





పాలక్ రైస్

కావలసిన పదార్థాలు:
పాలకూర తరుగు - 4 కప్పులు,
అన్నం - 2 కప్పులు, ఉల్లి తరుగు - 1 కప్పు,
టొమాటో గుజ్జు - అర కప్పు,
జీలకర్ర - 1 టీస్పూను, వెల్లుల్లి రెబ్బలు - 15,
ఉప్పు - తగినంత, నూనె - 2 టేబుల్ స్పూన్లు,
అల్లం తరుగు - అర టీస్పూను
పచ్చిమిర్చి - 3

తయారీ విధానం:
- పాలకూర శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి.
- బాండీలో నూనె పోసి, వేడయ్యాక ఉల్లి ముక్కలు, వెల్లుల్లి, జీలకర్ర వేసి వేగించాలి. మాడిపోకుండా చూసుకోవాలి.
- తర్వాత టొమాటో తరుగు, అల్లం తరుగు, పచ్చి మిర్చి ముక్కలు వేసి కలుపుతూ వేగించాలి.
- ఉప్పు వేసి కలపి, పచ్చివాసన పోయేంతవరకూ పాలకూరను వేగించాలి. దాంతో మిశ్రమమంతా కర్రీలా తయారవుతుంది.
- తర్వాత అందులో అప్పటికే ఉడికించి పెట్టుకున్న అన్నం వేసి, తిప్పి పొయ్యి నుంచి దింపేయాలి.
- రుచి కోసం కొత్తిమీర చల్లుకోవచ్చు.
- వేడి వేడి పాలక్‌రైస్‌ను కర్రీ లేకుండానే తినేయొచ్చు.

పాలక్ పరాటా

కావలసిన పదార్థాలు:
గోధుమ పిండి - 2 కప్పులు
పాలకూర - పావు కిలో
పచ్చిమిర్చి - 2
వాము - పావు టీస్పూను
నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - తగినంత
నూనె - పరాటా కాల్చడానికి సరిపడా.

తయారీ విధానం:
- పాలకూర శుభ్రంగా కడిగి, నీళ్లలో 6 నిమిషాల పాటు మరిగించాలి.
- నీటిని వడగట్టి పాలకూరను, ఆ వడగట్టిన నీటిని కూడా పక్కన పెట్టుకోవాలి.
- పాలకూరను బ్లెండర్‌లో వేసి మెత్తగా చేసుకోవాలి.
- గోధుమపిండిలో ఉప్పు, వాము, నెయ్యి, పాలకూర ముద్ద వేసి కలుపుకోవాలి.
- పాలకూర ఉడికించిన నీరు చేరుస్తూ ముద్దగా పిసుక్కోవాలి.
- పిండిని పరాటాగా వత్తుకుని నెయ్యి పూసి, నలుచదరంగా మడిచి, రెండోసారి పరాటా వత్తుకోవాలి.
- ఇలా తయారుచేసి పెట్టుకున్న పరాటాల మీద నూనె పోస్తూ పెనం మీద రెండు వైపులా కాల్చి సబ్జీతో తింటే ఎంతో రుచిగా ఉంటాయి.





పాలకూర వేపుడు

కావలసిన పదార్థాలు:
పాలకూర కట్టలు - 4
ఉల్లిముక్కలు - 1 కప్పు
సెనగపిండి - ఒకటిన్నర టేబుల్ స్పూను
ఉప్పు - తగినంత
నూనె - 2 టేబుల్‌స్పూన్లు
ఆవాలు - 1 టీస్పూను
జీలకర్ర - 1 టీస్పూను
మినప్పప్పు - 2 టీస్పూన్లు
ఎండుమిర్చి - 4
పచ్చిమిర్చి - 4
వెల్లుల్లి - 6 (కచ్చాపచ్చాగా దంచాలి)
కరివేపాకు - 2 రెమ్మలు

తయారీ విధానం:
- పాలకూర సన్నగా తరిగి పెట్టుకోవాలి.
- బాండీలో నూనె పోసి, వేడయ్యాక ఆవాలు వేసి వేగించాలి.
- ఆవాలు చిటపటలాడాక, జీలకర్ర, ఎండుమిర్చి, మినప్పప్పు వేసి వేగించాలి.
- పప్పు ఎర్రగా వేగాక, వెల్లుల్లి, పచ్చి మిర్చి ముక్కలు, కరివేపాకు వేసి చక్కగా కలిపి వేగించాలి.
- తర్వాత ఉల్లి ముక్కలు వేసి రంగు మారేంత వరకూ వేయించాలి.
- తర్వాత ఉప్పు, పసుపు వేసి కలపాలి.
- చివర్లో పాలకూర వేసి 10 నిమిషాల పాటు వేయించాలి.
- ఉడికిన తర్వాత సెనగపప్పు పొడి వేసి కలిపి వేడిగా వడ్డించాలి.

ఔరా... అంజీరా!

గుడ్‌ఫుడ్

అంజీరా పండును అత్తిపండు అని కూడా అంటారు. దీనిని పండుగా తినొచ్చు. డ్రైఫ్రూట్‌గా కూడా తినొచ్చు. ఇందులో విటమిన్లు, పీచుపదార్థాలు, ఖనిజలవణాలు మెండుగా ఉంటాయి. దీనిని ఔషధ ఫలమంటారు. నిత్యం మూడు నాలుగు అంజీర పండ్లు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతాం. అవేమిటంటే...



- వీటిల్లో పీచు అధికం. జీర్ణవ్యవస్థకు మంచిది.
- రక్తపోటును నియంత్రించే పొటాషియం, సోడియం అంజీరాలో పుష్కలంగా ఉంటాయి. అందుకే రోజూ తింటే అధికరక్తపోటు అదుపులోకి వస్తుంది.
- రక్తహీనత ఉన్నవాళ్లు నిత్యం అంజీర తింటే మంచిది. ఇందులో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచే పోషకాలు ఎక్కువగా ఉంటాయి.
- బరువు తగ్గాలనుకునే వారికి అంజీర చాలా మంచిది. ఒక కప్పు అంజీరా పండు ముక్కల్ని భోజనానికి ముందు తినడం వల్ల పొట్ట తొందరగా నిండిపోతుంది. దాంతో అతిగా తినే సమస్య తగ్గుతుంది. కొలెస్ట్రాల్ సమస్య ఉండదు. బరువూ తగ్గుతాం.
- హృద్రోగాలతో బాధపడేవారు ఆహారంలో అంజీరను కూడా చేరిస్తే మంచిది. ఇందులోని పెక్టిన్ అనే పదార్థం శరీరంలోని వ్యర్థాలను తొలగించి గుండెకు మేలుచేస్తుంది.
- రోజుకు రెండు అంజీర పండ్లు తింటే శరీరంలోని అనేక అనారోగ్య సమస్యలు తగ్గుతాయి.
- పిల్లలు లేనివాళ్లు, పిల్లల్ని కనాలనుకుంటున్న వాళ్లు నిత్యం ఆహారంతో పాటు అంజీరను కూడా తినాలి. ఇందులోని జింక్, మెగ్నీషియం, మాంగనీస్ ఖనిజాలు సంతాన సాఫల్యతను పెంచడానికి సహకరిస్తాయి.
- అన్ని వయసుల వాళ్లకు మలబద్ధకం సమస్యను దూరం చేస్తుంది. రోజూ ఈ పండును ఉదయం, రాత్రి పిల్లలకు తినిపిస్తే వాళ్లలో మలబద్ధకం సమస్య తగ్గిపోతుంది. రక్తహీనత సమస్య తలెత్తకుండా చిన్నతనం నుంచే పిల్లల్ని రక్షించుకోవచ్చు. ఆరోగ్యకరమైన శరీర ఎదుగుదల కూడా పిల్లల్లో ఉంటుంది.



- శరీరంలో ఎనర్జీని పెంచే పోషకాలు ఇందులో అధికంగా ఉన్నాయి.
- శరీరంలోని అధిక వేడిని ఇవి తగ్గిస్తాయి.
- పాలపదార్థాలు పడనివారు రోజూ అంజీరాను డైట్‌తో పాటు తీసుకుంటే శరీరానికి కావాల్సిన కాల్షియం, ఐరన్ అందుతాయి.
- అజీర్తి, గొంతు నొప్పి, కడుపులో తీవ్రమైన మంటతో బాధపడేవారు రోజుకు నాలుగైదు అంజీరాలను తింటే మంచి ఫలితం ఉంటుంది.
- వీటిల్లోని పొటాషియం వల్ల రక్తప్రసరణ క్రమబద్ధమవుతుంది.
- నోటి దుర్వాసనతో బాధపడేవారు రాత్రి పడుకోబోయే ముందు రెండు అంజీర పళ్లను తింటే సమస్య పరిష్కారమవుతుంది.
- అంజీరా పండు తింటే విటమిన్-ఎ, బి, బి12 అధిక మొత్తంలో లభ్యమవుతాయి.
- అంజీరాలు ఎముకలను దృఢంగా చేస్తాయి.

ఆర్గానిక్ చక్లీ

ఫుడ్ బాస్కెట్



రసాయనాలు లేకుండా నూటికి నూరు శాతం సేంద్రియ పద్ధతిలో తయారుచేసిన చక్లీ ప్యాకెట్ ఇది. మనదేశంలో గుర్తింపుపొందిన ఆర్గానిక్ ఫామ్స్ నుంచి రసాయనరహితంగా పండించిన పదార్థాలతో ఈ చక్లీలను తయారుచేస్తారు. పిల్లలు, పెద్దలు వీటిని హాయిగా తినొచ్చు. వీటివల్ల జీరవ్యవస్థ పాడవదు. రుచిలో సైతం ఇవి ఏమాత్రం తీసిపోవు. కరకరలాడుతూ నోరూరిస్తాయి.

న్యూట్రీ పాట్ కుక్కర్!

కిచెన్ కార్నర్



వంట చేయడానికి సహజంగానే చాలా టైమ్ పడుతుంది. అయితే అలాంటి కష్టం లేకుండా ఆ పనిని 'న్యూట్రీ-పాట్ కుక్కర్' సులువుగా చేస్తుంది. ఇది ఎలక్ట్రిక్ ప్రెషర్ కుక్కర్ లాంటిది. దీనికి అన్ని కుక్కర్ల మాదిరి ప్రెషర్ రిలీజ్ వాల్వ్ కూడా ఉంటుంది. ఇది స్టీమర్, వామర్, రైస్‌కుక్కర్‌గా పనిచేస్తుంది. అయితే సాధారణ ప్రెషర్ కుక్కర్‌కు దీనికి ముఖ్యమైన తేడా ఒకటి ఉంది.

న్యూట్రీ-పాట్‌కు మైక్రోప్రాసెసర్ కంట్రోల్ ఉంటుంది. ఇందులో తగిన మేర హీట్, టైమ్, ప్రెషర్‌ను అందించే సౌకర్యం ఉంది. సాధారణ కుక్కర్‌లో వండినపుడు వంటకాల్లో పోషకవిలువలు తగ్గిపోతుంటాయి. న్యూట్రీ-పాట్‌తో ఆ సమస్య ఉండదు. పోషకవిలువలు పోకుండా వంట రెడీ అవుతుంది. కంట్రోల్ ప్యానల్‌లో ముందే సెట్ చేసిన డిషెస్ (అన్నం/పులావ్/కిచిడి/బిర్యానీ/చికెన్ కర్రీ, మటన్ కర్రీ/దాల్ / రాజ్మా చోలె/ వెజ్ కర్రీ/సూప్/ కేక్, సాంబార్/ బేబీ ఫుడ్) ఏవి వండుతున్నారో దాన్ని బట్టి ప్యానల్ అడ్జస్ట్‌మెంట్లు చేసుకుని వాటిని రుచిగా, పోషకాలు పోకుండా వండుకుని తినొచ్చు.

ఇందులోని మిగతా ఆప్షన్లలో స్లో కుక్కింగ్, స్టీమింగ్, వేపుడు, మాన్యువల్ మోడ్, రీహీటింగ్‌లు కూడా ఉన్నాయి. ఎన్నో పరికరాలతో కలిపి చేసే ఈ వంటలన్నింటినీ న్యూట్రీ-పాట్ ఒక్కదానితో ఇట్టే చేసేయచ్చు. దీని అల్యూమినియం డిజైన్ కూడా చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. దీని ధర 6,999/- రూపాయలు.

కిడ్ సైంటిస్ట్

ఏడ్చే రూపాయి!

కావలసినవి: రూపాయి బిళ్ల, తడిసిన దూది.

విధానం: రూపాయి నాణెం తీసుకుని ప్రేక్షకులకు చూపించండి. రూపాయి చక్కగా మెరుస్తుంటుంది. కళ్ల నీళ్లు కార్చకుండా పొడిగా ఉంటుంది. ఎడమ చేతిని మీ ఎడమ చెవి దగ్గర పెట్టండి. కుడి చేతితో రూపాయి బిళ్లను పట్టుకొని ఎడమచేయి మోచేతి మీద రూపాయి నాణెన్ని నొక్కి బాగా రుద్దండి. అంటే దాన్ని బాధపెడుతున్నారన్నమాట.

■ ప్రేక్షకుల ధ్యాస అంతా రూపాయి మీద ఉంటుంది. మీ చెవి వెనుక నుంచి దాచిఉంచిన తడిసిన దూదిని తీయండి. చేతిలో దాన్ని దాచి పెట్టి కుడిచేతిలోని ఉన్న రూపాయిని ఎడమచేతిలోకి మార్చండి.



■ దూదిని మీ వేలుతో నొక్కితే నీళ్ల బొట్టు బొట్టు రాలుతాయి. రూపాయి ఏడుస్తున్నట్టు ఉంటుంది. నీళ్లు కారడం అయిపోయాక దూదిని ప్రేక్షకులకు కనిపించకుండా కిందకు జారవిడిచి రూపాయి నాణేన్ని వారికి చూపించండి.

ఎలా పనిచేస్తుంది?

లేజర్ కటింగ్

లేజర్ కిరణాల గురించి విన్నారు కదా! ఈ కిరణాలతో ఎంతటి లోహాన్ని అయినా సరే కేకును కోసినట్టుగా తేలికగా ముక్కలు చేయవచ్చు. నిజమా! అని ఆశ్చర్యపోతున్నారా! అవును నిజంగానే అలా కోయవచ్చు.



■ భూతద్దం పెట్టి దాని గుండా సూర్యకిరణాల్ని కాగితం మీద పడేలా చూస్తే కాగితం కాలుతుంది.

■ అలాగే ఇనుప వస్తువులను ముక్కలుగా కొయ్యడానికి మరింత బలమైన కిరణం కావాలి. సాధారణంగా ఒక కిరణం మరొక కిరణం మీదుగా పోతూ కిరణంలోని శక్తిని హరిస్తుంది. అదే లేజర్‌లో అయితే కిరణాలన్నీ ఒకే మార్గంలో తీక్షణంగా ప్రవాహశక్తిగా ప్రసరింపజేస్తే అది ఎంత కఠినమైన లోహాన్ని అయినా సరే కోసి వేస్తుంది.

■ ఈ కిరణాలను భూమి మీద ఎంత దూరమయినా పంపగలిగే వీలుంది. అలాగే వాతావరణం దాటి అంతరిక్షంలోకి పంపవచ్చు. లేజర్ కటింగ్‌ను పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారు.



ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు. ఇందుకు మంచి ఉదాహరణ హైదరాబాద్‌లోని కృష్ణానగర్‌కు చెందిన తమీమా ఫాతిమా. ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఆపద్బాంధవిగా ఉపయోగ పడే సురక్షా బ్యాండ్‌ను తయారు చేసి అందరి చేత శభాష్ అనిపించుకుంది.

సురక్షా బ్యాండ్‌ను చూపిస్తున్న తమీమా

ఆవిష్కరణ అదుర్స్

ఎగ్జిబిషన్‌కు వెళ్లినపుడు పిల్లలు తప్పిపోతే... ఆఫీసు నుంచి ఇంటికి బయలుదేరిన మహిళలకు అనుకోని ప్రమాదం ఎదురైతే...తమీమా ఫాతిమా తయారుచేసిన సురక్షా బ్యాండ్ చేతికి ఉంటే చాలు. సురక్షితంగా పిల్లలు మీ చెంతకు చేరుకుంటారు. మహిళలు ఏ ఇబ్బంది లేకుండా ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేస్తారు. 'సురక్షా బ్యాండ్'ను తయారుచేసిన తమీమా ఫాతిమా ఏ ఇంజినీరింగ్ విద్యార్థినో, స్టార్టప్ సీఈఓనో అనుకుంటే పొరపాటే. తను ప్రస్తుతం కృష్ణానగర్‌లోని సాయికృపస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఫాతిమా తయారు చేసిన సురక్షా బ్యాండ్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉంచేందుకు ఎంపిక యింది.

చెల్లెలు తప్పిపోవడంతో...

తమీమాకు సురక్షా బ్యాండ్ తయారుచేయాలనే ఆలోచన రావడానికి ఆమె చెల్లెలు తబీన్ కారణం. "ఒకరోజు మా కుటుంబసభ్యులందరం కలిసి మా బంధువుల ఇళ్లకు వెళ్లాం. ఆ సమయంలో మా చెల్లెలు తబీన్(8) ఆడుకునేందుకని బయటకు వెళ్లి దారి మరిచిపోయింది. చెల్లెలు కనిపించకపోయే సరికి ఆందోళన చెందాం. అంతటా వెతికాం. ఈలోగా ఒక వ్యక్తి తబీన్‌ను గుర్తించి, నంబర్ తెలుసుకుని ఫోన్ చేశాడు. కానీ అతనికి అక్కడ అడ్రస్ చెప్పటం తెలియటంలేదు. మా చెల్లెలు కూడా అడ్రస్ చెప్పలేకపోయింది. అప్పుడే ఈ ఆలోచన తట్టింది. తప్పిపోయినప్పుడు ఇంట్లో వాళ్లకి ఎక్కడున్నది తెలిసేలా సమాచారం చేరితే బాగుంటుంది కదా అనిపించింది. ఆ ఆలోచనతోనే సురక్షా బ్యాండ్ తయారు చేసేందుకు సిద్ధమయ్యాను" అని వివరిస్తోంది తమీమా.

పాఠశాలలో అవకాశం

ఆలోచనైతే వచ్చింది గానీ ఎలా మొదలుపెట్టాలి? ఒక పరికరం తయారుచేయాలంటే ఏమేం అవసరం? అవన్నీ ఎలా సమకూర్చుకోవాలి? ఇలాంటి అంశాలు ఏమీ తెలియవు. అదే సమయంలో స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం తమీమాకు కలిసొచ్చింది. ఆ అవకాశాన్ని తమీమా చక్కగా ఉపయోగించుకుంది. "వైజ్ఞానిక ప్రదర్శన కోసం 'ఇన్‌స్పైర్ మనక్' వారు కొత్త ఐడియా కాన్సెప్ట్‌లు చెప్పమని అడిగారు. మా పాఠశాల ప్రిన్సిపల్ కె. అంజనా రావు, ఫిజిక్స్ టీచర్ సంతోష్ గారు ఆ విషయం చెప్పగానే నా మనసులో ఉన్న ఆలోచన వారితో పంచుకున్నాను. వారు బాగుంది అని నా ఐడియాను ఇన్‌స్పైర్ మనక్ వారికి పంపటం, వారు ఓకే చెప్పి కొంత నగదు పంపటంతో నేను పరికరం తయారు చేయడానికి మార్గం సుగమమైంది" అని తన అనుభవాన్ని పంచుకున్నారు తమీమా. టీచర్ల సహకారం దొరకడంతో తమీమా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పరికరం ఎలా తయారుచేయాలో యూట్యూబ్‌లో చూసి సమాచారం సేకరించుకుంది.


"ముందుగా యూట్యూబ్‌లో సమాచారం కోసం వెతికాను. వాడేందుకు అనువుగా ఉంటుందనే ఉద్దేశంతోనే బ్యాండ్‌ను ఎంచుకున్నాను. సందేహాలు వచ్చిన చోట మా సైన్స్ టీచర్ సంతోష్ నాకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లు, క్రిస్టల్ ఏసీ, ఓల్టేజ్ రెగ్యులేటర్ తదితర వస్తువులను అమీర్‌పేట, కోటి, గుజరాత్‌గల్లీ తదితర ప్రాంతాలు తిరిగి తెచ్చుకున్నాను. ఆరు నెలల తరువాత అనుకున్న విధంగా సురక్షా బ్యాండ్ తయారైంది. ఈ నమూనాను అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ పాఠశాలలో ఇన్‌స్పైర్ పేరిట నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించాను. చాలా మంది నా పరికరాన్ని చూసి మెచ్చుకున్నారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయటం నాకు ఎంతో సంతోషానిచ్చింది" అని తన ఆనందాన్ని పంచుకుంది తమీమా.

ఎన్నో ప్రయోజనాలు

సురక్షా బ్యాండ్‌ను నానో టెక్నాలజీతో చాలా చిన్నగా చేతికి కట్టుకునే అందమైన వస్తువులా తయారు చేసి ఉపయోగించుకోవచ్చు. ట్రాఫికింగ్‌ను అరికట్టేందుకు ఉపకరిస్తుంది. అటవీ ప్రాంతాలలో సంచరించే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. సురక్షా బ్యాండ్ తయారు చేయడానికయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. పదిమందికీ ఉపయోగపడే ఇలాంటి పరికరాలను తమీమా మరెన్నో తయారుచేయాలని కోరుకుంటూ మనమూ ఆల్ ద బెస్ట్ చెబుదామా!

● **రమేష్**
యూసుఫ్‌గూడ, హైదరాబాద్

'బ్యాండ్'తో భద్రం



చేతికి ధరించిన సురక్షా బ్యాండ్‌కు ఒక బటన్ ఉంటుంది. ఆపద సమయంలో ఆ బటన్‌నొక్కితే చాలు. మీరు ఎంచుకున్న స్నేహితులకు, పోలీసులకు సంక్షిప్త సందేశం వెళుతుంది. అంతేకాదు, అందులో రూట్‌మ్యాప్ కూడా ఉంటుంది. అంటే మీరు ఎక్కడున్నారో వాళ్లకు కరెక్ట్‌గా తెలుస్తుంది. సురక్షా బ్యాండ్ గ్లోబల్ సిస్టమ్ మొబైల్ కమ్యూనికేషన్(జీఎస్ఎం), గ్లోబల్ పొజిషన్ సిస్టమ్(జీపీఎస్)లతో అనుసంధానం చేశారు. ఈ బ్యాండ్‌లో ఆన్ బటన్, రీసెట్ బటన్ ఉంటాయి. దీనిలో కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్లు, పోలీస్ డిపార్ట్‌మెంట్ ఫోన్ నెంబరు ఫీడ్ చేసుకోవాలి. బయటకు వెళ్లే సమయంలో బ్యాండ్ వేసుకుంటే చాలు. ఉపయోగించడం చాలా సులువు.

కనుక్కోండి?



1. ఇందులో రాయడానికి పనికివచ్చే వస్తువులు ఎన్ని ఉన్నాయి?
2. బాగా ప్రాచుర్యంలో ఉన్న ఒక కథకు సంబంధించిన బొమ్మ ఒకటుంది. ఆ బొమ్మ ఏదో? ఆ కథ ఏమిటో గుర్తించగలరా?
3. కుందేలు తనకిష్టమైన క్యారెట్ల కోసం వెతుకుతోంది. క్యారెట్లు ఎక్కడున్నాయి?
4. గుడ్లగూబను చూసి ఎలుక దాక్కుండిపోయింది. ఎలుక ఎక్కడుందో కనుక్కోండి?
5. ఈ క్యాండిల్‌ను ఎలా వెలిగించారో చెప్పగలరా?
6. ఇక్కడొక కూరగాయ ఉంది. వెతికి పట్టుకోగలరా?
7. ఈ బొమ్మలో ఇంగ్లీష్ అక్షరం P తో మొదలయ్యే పేర్లు ఎన్ని ఉన్నాయి?

జవాబులు:

7. ఇవి. Pelican, Pigeon, Princes
Parrot, Paper, Pen


చేసేయండి!

పేపర్ ప్లేటుతో సీతాకోకచిలుక


వివిధ రంగుల్లో ముచ్చటగొలిపే సీతాకోకచిలుకను తయారుచేద్దామిలా...

కావలసిన వస్తువులు:
రెండు తెల్లని పేపర్ ప్లేట్లు, రంగు పెన్నులు లేదా పెయింట్లు, కత్తెర, స్టేప్లర్

తయారీ విధానం:



■ ఒక పేపర్ ప్లేటు అడుగు భాగాన సీతాకోకచిలుక బొమ్మను గీయండి. ఈ బొమ్మను రకరకాల రంగులతో నింపి, చక్కగా అలంకరించండి.
■ మరో పేపర్ ప్లేటును తీసుకొని, దాన్ని సరిగ్గా మధ్యకు కత్తిరించండి.
■ బొమ్మలో చూపించిన విధంగా, కత్తిరించిన రెండు సమాన భాగాల నుంచి ఒక అంగుళం ముక్కను కత్తిరించండి.
■ సీతాకోకచిలుక బొమ్మ వేసిన పేపర్ ప్లేటును బొమ్మలో చూపించిన విధంగా సగానికి మడతపెట్టండి.
■ బొమ్మ వెనుక వైపులో ఇంకో ప్లేటు నుంచి కత్తిరించిన సగం ముక్కల్ని బయటి అంచువైపు స్టేపిల్ చేయండి.
■ అప్పుడు మీ చేతివేళ్లు పెట్టడానికి వీలుగా మధ్యలో ఖాళీ ఏర్పడుతుంది.




■ మీ చేతివేళ్లను ఆ ఖాళీలో పెట్టి కదిలిస్తే, అటువైపు సీతాకోకచిలుక రెక్కలాడిస్తూ ఉంటుంది.

అవునా!



గోల్డ్‌ఫిష్‌లు పరారుణ, అతినీలలోహిత కాంతిని కూడా చూడగలవు.

తెలుసుకుందాం!



ఆర్థికమంత్రి హోదాలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ.

డైలీ సుడోకు - 440

9					1		2	
	5		3	9		1		
3						6		
5			2	4				
	7						8	
				7	6			5
		9						4
		1		8	4		3	
	8		7					6

ఎలా పూరించాలి?
ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 439 సమాధానం

4	5	7	9	6	1	3	8	2
6	3	8	4	2	5	7	1	9
1	2	9	3	7	8	5	4	6
3	4	5	7	8	6	9	2	1
7	8	1	5	9	2	4	6	3
9	6	2	1	4	3	8	7	5
2	7	3	6	5	4	1	9	8
5	9	6	8	1	7	2	3	4
8	1	4	2	3	9	6	5	7

కథ



వి అండ్ యస్?


శ్రుతీ హాసన్


విజయ్ సేతుపతి

వి ఫర్ విజయ్ సేతుపతి! ఎస్ ఫర్ శ్రుతీ హాసన్! ఇటీవల తెలుగులోనూ విడుదలైన రజనీకాంత్ 'పేట'లో ప్రధాన పాత్రలో నటించిన విజయ్ సేతుపతి, ప్రస్తుతం తెలుగులో చిరంజీవి 'సైరా నరసింహారెడ్డి'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. నాలుగైదు తమిళ చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. అవి కాకుండా మరో కొత్త చిత్రానికి విజయ్ సేతుపతి సంతకం చేశారు. ఎస్.పి. జననాథన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో సేతుపతికి జోడీగా శ్రుతీ హాసన్ నటించనున్నారని చెన్నై టాక్. తమిళంలో ఈమె నటించిన చివరి చిత్రం 'సింగం 3' 2017లో విడుదలైంది. ఆమె నటించిన సినిమాలు థియేటర్లలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. తెలుగులో నటించిన 'కాటమరాయుడు', హిందీలో 'బెహన్ హోగీ తెరి' చిత్రాలూ 2017లో విడుదలయ్యాయి. ఆ తర్వాత ఓ తమిళ టీవీ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విజయ్ సేతుపతి విషయానికి వస్తే... 'స్కెచ్' ఫేమ్ విజయ్ చందర్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించనున్న సినిమాలో రాశీ ఖన్నా కథానాయికగా నటించనున్నారు.



నేనూ రాజకీయాల్లో ఉన్నా!

- మమ్ముట్టి



ముప్పై ఎనిమిదేళ్లగా సినిమా రంగంలో ఉన్నాను. ఇది కూడా పెద్ద రాజకీయ వ్యవస్థే. కాబట్టి రాజకీయాల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదు. నేనూ రాజకీయాల్లో ఉన్నట్లే" అని మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి అన్నారు. స్వాతికిరణం (1992), 'సూర్యపుత్రులు' (1996) తెలుగు చిత్రాల్లో నటించిన ఆయన 23 ఏళ్ల తర్వాత 'యాత్ర' సినిమాతో మళ్లీ తెలుగు తెరపై కనిపించబోతున్నారు. ఇందులో ఆయన వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాత్ర పోషించారు. మహి.వి.రాఘవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని విజయ్ చిల్లా నిర్మించారు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా. ఈ సందర్భంగా మమ్ముట్టి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే...

రాజకీయ నేపథ్యంలో సినిమాలు చేయడం నాకు కొత్తేమీకాదు. మలయాళంలో చాలానే చేశా. కానీ బయోపిక్‌లో నటించడం ఇదే మొదటిసారి. బయోపిక్ అంటే ఓ వ్యక్తి పుట్టుక నుంచి పూర్తిగా అతని జీవితం గురించి చెప్పడం. కానీ 'యాత్ర' పూర్తి స్థాయి బయోపిక్ కాదు. వైఎస్సార్ జీవితంలో పాదయాత్ర లాంటి కీలక ఘట్టాలను తీసుకుని చేసిన సినిమా. ఆ ప్రయాణంలో ఆయన ఏం చేశారు, జనాలకు ఎలా దగ్గరయ్యారు. ఏం సాధించారు అన్న విషయాలను ఇందులో చెబుతున్నాం. పేదరికానికి రంగులేనట్టే భావోద్వేగానికి భాషతో సంబంధం ఉండదు. నాకు భాష సమస్య ఉన్నప్పటికీ దీనిలో భావోద్వేగాలకు బాగా కనెక్ట్ అయ్యా. రాజశేఖరరెడ్డి రైతులు, పేదల పాలిట గొప్ప నేత అని విన్నాను. సినిమా కోసం ప్రత్యేకంగా ఎలాంటి పరిశోధనలు చేయలేదు. ఆయన్ని అనుకరించే ప్రయత్నమూ చేయలేదు. మహి చెప్పినట్లు చేశానంతే. ఈ సినిమా కోసం వైఎస్ కుటుంబీకులను నేను కలవలేదు. సొంతంగా డబ్బింగ్ చెప్పుకొన్నా. నేను 375 చిత్రాల్లో నటిస్తే అందులో 70 సినిమాలు కొత్త దర్శకులతో చేసినవే. మహి చేసింది రెండు చిత్రాలే. అనుభవం ఉందా లేదా అన్నది నేను పట్టించుకోలేదు. వారితో పోల్చుకుంటే మహి అనుభవం ఉన్న దర్శకుడు. 'దళపతి'లో నా క్యారెక్టర్ చూసి మహి నాతో ఈ క్యారెక్టర్ చేయించాడట. ఆ సినిమా అంటే నాకూ ఇష్టమే.

నచ్చిన పాత్ర కుదిరితే..

అప్పుడప్పుడు తెలుగు సినిమాలు చూస్తా. ఈ మధ్యన 'రంగస్థలం', 'భరత్ అనే నేను' చూశా. నాలుగేళ్లుగా గమనిస్తే తెలుగు పరిశ్రమలో చాలా మార్పులు కనిపించాయి. కొత్త తరహా కథలొస్తున్నాయి. 'స్వాతి కిరణం' తర్వాత తెలుగులో సినిమా చేయడానికి ప్రాపర్ కథ కుదరలేదు. ఇతర భాషల్లో చాలా సినిమాల్లో నటించా. నచ్చిన కథ కుదిరితే తప్పకుండా తెలుగు సినిమా చేస్తా. నాకు డ్రీమ్ రోల్స్ ఏమీ లేవు. నేను పోషించే ప్రతి పాత్రా నాకు డ్రీమ్ రోలే.

ఇద్దరికీ పోటీ అందులోనే..

నా అబ్బాయి దుల్కర్ సల్మాన్‌తో కలసి సినిమాల్లో నటించలేదు. మంచి స్క్రిప్ట్ దొరికితే తప్పకుండా నటిస్తాను. మేమిద్దరం బ్రదర్స్‌లా ఉన్నామని అంటున్నారు. మా అబ్బాయితో నాకు నటనలో పోటీ లేదు. కానీ నా భార్యకు ప్రేమను పంచడంలో మాత్రం ఇద్దరం పోటీ పడతాం.

దృక్పథం మారుతోంది

- రకుల్

"ఒకప్పుడు నా ప్రయత్నమంతా సినిమా పరిశ్రమలో ఎలాగైనా నిలదొక్కుకోవాలనే. కానీ మనిషి ఆశాజీవి కదా. ఒక కోరిక తీరగానే మరోదానివైపు పరుగులు తీస్తుంటాడు. నేనూ అందుకు అతీతం కాదు. నా దృక్పథంలోనూ చాలా మార్పు వచ్చింది" అని అంటున్నారు రకుల్. ఆమె నటించిన 'దేవ్' ఈ నెల 14న విడుదల కానుంది. రకుల్ మాట్లాడుతూ "ఒకప్పుడు నాకు కథల నెరేషన్ గురించి పెద్దగా తెలిసేది కాదు. నేను సినిమా పరిశ్రమలో పుట్టి పెరగలేదు. ఒక రకంగా చెప్పాలంటే హై స్కూల్లో ఉన్నప్పటి నుంచే సినిమాలు చూడటం మొదలుపెట్టా. అందుకే ఈ రంగంలోకి రాగానే ముందు ఇక్కడి వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించా. అంతా అవగాహనకు వచ్చాక కూడా నా ఇష్టాయిష్టాల గురించి ప్రత్యేకంగా ఆలోచించలేదు. కొత్తల్లో 'కథ బావుంది' అనిపిస్తే చాలు... అంగీకరించేదాన్ని. ఎందుకంటే ఇక్కడ నిలదొక్కుకోవడం ముఖ్యం. ఓ హిట్ తెచ్చుకోవడం అంతకన్నా కీలకం. అలా నా ఖాతాలో హిట్లు పడ్డ తర్వాత... నా దగ్గరకు వచ్చిన కథల్లో నాకు నచ్చే విషయాలేంటి? నచ్చని అంశాలేంటి? అని ఆలోచించడం మొదలుపెట్టా. ఇప్పుడు ఇష్టాయిష్టాలతో పాటు ప్రాధాన్యాలు కూడా మారుతున్నాయి" అని చెప్పారు.

గ్రీకు నేలపై... 2020లో!

అమీ జాక్సన్ పెళ్లి తేదీ ఖరారు కాలేదింకా. పెళ్లి వేదిక మాత్రం ఖరారు అయినట్టే! గ్రీకు నేల గ్రీస్‌లో అమీ జాక్సన్ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారని ఆమె సన్నిహితుల కథనం! అయితే... పెళ్లికి బోల్డంత సమయం ఉందింకా! వచ్చే ఏడాది అనగా... 2020 ప్రథమార్ధంలో అమీ జాక్సన్, జార్జ్ పనాయొటోతో క్రైస్తవ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారట. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన నిశ్చితార్థం జరిగిన విషయాన్ని అమీ తెలిపారు. బ్రిటన్‌లో వ్యాపారవేత్త అయిన జార్జ్, ఆమె కొన్ని రోజులుగా ప్రేమలో ఉన్నారు. ఇద్దరూ విహారయాత్రలకు వెళ్తున్నారు. అలా ఓసారి గ్రీస్ దేశం వెళ్లినప్పుడు అక్కడ మైకోనోస్ సముద్రతీర ప్రాంతం అమీకు బాగా నచ్చిందట! అందుకని, అక్కడే వివాహం చేసుకుందామని ప్రియుడితో చెప్పగా... ఆయన అంగీకరించారట! పెళ్లి తర్వాత అమీ జాక్సన్ భారతీయ చిత్రాలకు దూరం అవుతారని, బ్రిటన్‌లో సెటిల్ అవుతారని హిందీ పరిశ్రమ వర్గాల భోగట్టా.

ఇకపై అంతా 'సింగిల్ విండో'లోనే!

ఇంతకు పూర్వం కేవలం అంతర్జాతీయ సినిమాకు మాత్రమే అందుబాటులో ఉన్న 'సింగిల్ విండో' సిస్టమ్‌ను ఇప్పుడు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్‌కు కూడా కేంద్రం అందుబాటులోకి తీసుకురానుంది. దీనికి సంబంధించి కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ బడ్జెట్‌లో ప్రకటించారు. "ప్రస్తుత సమాజంలో ఉపాధి కల్పనలో సినిమా రంగం కీలక పాత్ర వహిస్తోంది. అందువల్లనే భారతీయ నిర్మాతలకు వెసులుబాటుగా ఉంటుందని సినిమా షూటింగులకు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాం. ఈ అనుమతులన్నీ సెల్ఫ్ డిక్లరేషన్ మీద ఆధారపడి ఉంటాయి. పైరసీ వల్ల జరిగే నష్టాన్ని పరిగణించి సినిమాటోగ్రఫీ యాక్ట్‌లో యాంటీ కేమ్‌కార్డింగ్ ను జత పరుస్తున్నాం" అని అన్నారు.

ప్రేమ 20-20!


అరవింద్,మోహన్

అరవింద్, 'మిస్ టీన్ కెనడా' (2012) మోహిని జంటగా రూపుదిద్దుకొంటున్న చిత్రం 'లవ్ 20-20'. మెక్విన్ గ్రూప్ (అమెరికా) సహకారంతో మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల, జో శర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెంథిల్‌కుమార్ దర్శకుడు. బెంగళూరు, నాగర్హోలే నేషనల్ పార్క్, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, ఇడుక్కి (కేరళ), హైదరాబాద్‌లో ఇంతవరకూ షూటింగ్ చేశామని నిర్మాతలు చెప్పారు. శుక్రవారం నుండి ఈ చిత్రం షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వారం రోజుల పాటు అక్కడ షూటింగ్ చేస్తామని నిర్మాతలు తెలిపారు. 'సరికొత్త ప్రేమకథాంశంతో రూపుదిద్దుకొంటున్న సినిమా ఇది. ప్రత్యేకంగా యూత్‌కు కనెక్ట్ కావాలనే 'లవ్ 20-20' అనే టైటిల్ పెట్టాం. ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేస్తాం' అని వారు చెప్పారు. ఈ చిత్రానికి పాటలు: కిట్టు విస్సాప్రగడ, సంగీతం: సత్యన్, ఛాయాగ్రహణం: సెంథిల్‌కుమార్, లైన్ ప్రొడ్యూసర్: వి.సాగర్.

దైవం... నేరం!


చాందిని, దిలీప్‌కుమార్

దిలీప్‌కుమార్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'దిక్సూచి'. శైలజ సముద్రాల, నరసింహరాజు నిర్మాతలు. పద్మనవ్ భరద్వాజ్ స్వరకర్త. హైదరాబాద్‌లో బుధవారం పాటల్ని విడుదల చేశారు. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ "ఇది డివోషనల్ క్రైమ్ థ్రిల్లర్. దైవం... నేరం... అంశాల మేళవింపుతో ఉత్కంఠభరితంగా, ఎటువంటి వల్గారిటీ లేకుండా కుటుంబమంతా కలిసి చూసేలా చిత్రాన్ని రూపొందించాను. 1970 నేపథ్యంలో కథ సాగుతుంది. బాలనటుడిగా 30కు పైగా చిత్రాలు చేశా. ఈ చిత్రంతో హీరోగా వస్తున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో 'బిత్తిరి' సత్తి, నటి చాందిని తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కి అంకితం

"ఇంజనీరింగ్ చదివి కూడా చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ, అది కూడా దొరకక కొందరు క్యాబ్ డ్రైవర్లుగా పని చేస్తూ జీవితం సాగిస్తున్నారు. ఈ విషయాలన్నీ ఇంజనీరింగ్ చేసి, ఓ చిన్న ఉద్యోగం చేస్తున్న కుర్రాడితో ట్రావెల్ చేసి తెలుసుకున్నా. ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కి ఈ చిత్రాన్ని అంకితమిస్తున్నాం" అని దర్శకుడు ఆర్. రఘురాజ్ అన్నారు. ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేస్తూ ఆయన దర్శకత్వం వహించిన చిత్రం '4 లెటర్స్'. దొమ్మరాజు ఉదయకుమార్, హేమలత నిర్మాతలు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "ఉదయ్‌కిరణ్ హీరోగా 'కలుసుకోవాలని' సినిమా చేశా. ఆ తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రమిది. ప్రీ ప్రొడక్షన్‌తో కలిపి 75 రోజుల్లో ఫస్ట్ కాపీ తీసుకొచ్చా. '4 లెటర్స్' తెలుగులో కమ్‌బ్యాక్ సినిమా అవుతుంది. కొత్త తరహా లవ్‌స్టోరీ, చక్కని సందేశం, ఎమోషన్స్, కామెడీ అన్ని అంశాలు ఉండేలా సినిమా తీశా" అని అన్నారు. "ఈ సినిమాతో మా అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తున్నా. ఇందులో హీరో తండ్రికీ, హీరోయిన్‌కి, తన తల్లికి, హీరోకి, అతని ఫ్రెండ్స్‌కి పూర్, లవ్, రిచ్, ఫెయిల్, పాస్ అనే పదాలంటే నచ్చవు. వాటి చుట్టూ కథ నడుస్తుంది' అని నిర్మాత ఉదయ్‌కుమార్ తెలిపారు.


రఘురాజ్, ఉదయ్‌కుమార్

'మా ప్రయాణం సక్సెస్'

హీరో ప్రియాంత్



'మా తొలి ప్రయత్నం సక్సెస్ అయింది. థియేటర్లు పెద్దగా దొరకనందున మొదట కేవలం 30 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు నుంచి మరో 22 థియేటర్లు పెంచుతున్నాం' అని చెప్పారు ప్రియాంత్. ఆయన హీరోగా, యామినీభాస్కర్ నాయికగా నటించిన చిత్రం 'కొత్తగా మా ప్రయాణం'. రమణ మొగిలి దర్శకుడు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ప్రియాంత్ మాట్లాడుతూ ' మేం నిర్మించిన చిన్న సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమా చూసినవాళ్లు కథ, కథనం బాగున్నాయని అంటున్నారు. ఒక ఆడ, మగ కలసి ఉండాలంటే వాళ్లిద్దరికి తప్పనిసరిగా పెళ్లయి ఉండాలి. అలా కాకపోతే సమాజపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో సినిమాలో చూపించాం. మా చిత్రం ఇంకా ఎక్కువమందికి రీచ్ అవ్వాలనే థియేటర్ల సంఖ్య పెంచుతున్నాం' అని చెప్పారు.



నర్సీపట్నంలో రియల్టీ బూమ్

విశాఖతో పోటీ పడుతున్న ధరలు

సెంటు రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షలు



విశాఖ జిల్లాలోని నర్సీపట్నంలో స్థిరాస్తి ధరలు విశాఖపట్నంతో పోటీపడుతున్నాయి. ప్రశాంతమైన వాతావరణం, సమీపంలోనే అన్ని వసతులు, తక్కువ జీవన వ్యయం ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో పని చేసే ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఇక్కడే ఉంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఉద్యోగులూ రిటైర్మెంట్ తర్వాత ఇక్కడ సెటిల్ అయ్యేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రస్తుతం నర్సీపట్నం పట్టణ కేంద్రంలో సెంటు భూమి రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షలు పలుకుతోంది. నర్సీపట్నంలో నెలకొన్న రియల్టీ బూమ్‌పై ఈ వారం ప్రత్యేక స్టోరీ..

(నర్సీపట్నం, ఆంధ్రజ్యోతి)

నర్సీపట్నం. విశాఖ జిల్లాలో ఏజెన్సీకి ముఖద్వారంగా నిలిచిన పురాతన పట్టణం. బ్రిటిష్ కాలం నుంచే ఇది రెవెన్యూ డివిజన్ కేంద్రంగా కొనసాగుతోంది. ఏడేళ్ల క్రితం మేజర్ పంచాయతీ స్థాయి నుంచి పురపాలక సంఘం స్థాయికి ఎదిగింది. అప్పటి నుంచి పట్టణ అభివృద్ధి ఊపందుకుంది. దీనికి తోడు విశాఖ జిల్లాను రెండుగా విభజిస్తే నర్సీపట్నం జిల్లా కేంద్రం కానుందనే ప్రచారం ఊపందుకుంది. దీంతో ఇక్కడ రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం నర్సీపట్నం దాని సమీప ప్రాంతాల్లోని ఇళ్ల స్థలాల ధరలు విశాఖ సిటీతో పోటీ పడుతున్నాయి.

ఉద్యోగుల ఆసక్తి

విశాఖ గ్రామీణ జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే నర్సీపట్నంలో జీవన వ్యయం తక్కువ. శాంతి భద్రతల సమస్యా పెద్దగా లేదు. దీంతో ఉద్యోగులు ఎక్కువగా ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం పట్టణ జనాభాలో ఎక్కువ మంది ఉద్యోగులే. దీన్నిబట్టి నర్సీపట్నంపై ఉద్యోగులు ఎంతగా ఆసక్తి పెంచుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏజెన్సీలోని వివిధ మండలాలకు చెందిన గిరిజన ఉద్యోగులు ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణ పరిధిలోని శారదానగర్, శివపురం, బీసీ కాలనీ, పెదబొడ్డేపల్లి తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు వెలిశాయి. భార్యాభర్తలు ఇరువురు ఉద్యోగులుగా ఉన్న అనేక మంది, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి బ్యాంకు రుణాలతో నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో భవనాలు నిర్మించుకుంటున్నారు.

పెరుగుతున్న అపార్ట్‌మెంట్ సంస్కృతి

పంచాయతీలుగా ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో ఒకటి రెండు ప్రాంతాల్లోనే కొద్ది స్థాయిలో అపార్ట్‌మెంట్లు కనిపించేవి. గ్రేడ్-2 మున్సిపాలిటీగా స్థాయి పెరిగిన తర్వాత బహుళ అంతస్థుల నిర్మాణాలు ఊపందుకున్నాయి. మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లోనూ అపార్ట్‌మెంట్ల నిర్మాణం జోరందుకుంది. ఈ ప్రాంతంలో పని చేస్తున్న ఇతర ప్రాంతాల ఉద్యోగులూ, పదవీ విరమణ తర్వాత నర్సీపట్నంలో స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పట్టణ జనాభాలో కేవలం 40 శాతం మంది మాత్రమే స్థానికులు. మిగతా 60 శాతం మంది స్థానికేతరులే కావడం గమనార్హం.

రూ.25 లక్షల వరకు ఫ్లాట్ ధర

ప్రస్తుతం పట్టణంలోని అపార్ట్‌మెంట్లలో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల విలువ ఆయా ప్రాంతాలను బట్టి రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షలు వరకు పలుకుతోంది. జీఎస్‌టీ తర్వాత 18 శాతం పన్ను విధించడంతో కొద్దికాలంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం మందగించింది. అయితే గతంలో డీటీపీసీ అనుమతులతో పంచాయతీల్లో నిర్మించిన గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో మాత్రం నిర్మాణాలు ఉపందుకున్నాయి.

చుక్కలంటిన భూముల ధర

నర్సీపట్నం ఏజెన్సీ ముఖద్వారంగా పేరొందడం, ఇక్కడి నుంచే ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుండం, అనేక మంది ఇక్కడే స్థిరాస్తులు సమకూర్చుకోవడానికి ఆసక్తి చూపడంతో ఈ ప్రాంతంలో భూములు, ఇళ్ల స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన ఏడేళ్లలో స్థలాల విలువ మూడు రెట్లకు పైగా పెరిగింది. పట్టణ నడిబొడ్డుగా పేర్కొనే ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో సెంటు భూమి ధర రూ.30 లక్షలకు పైగా ఉంది. ధనికులు, ఉన్నత ఉద్యోగుల నివాస ప్రాంతాల్లోనూ సెంటు ఇళ్ల స్థలం ధర గత ఏడేళ్లలో రూ.5 లక్షలు నుంచి రూ.25 లక్షలు వరకు పెరిగింది. రామారావుపేట, కొత్తవీధి, వెలమవీధి, వెంకునాయుడుపేట, శివపురం తదితర ప్రాంతాల్లోనూ సెంటు భూమి ధర రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ పెరగడం గమనార్హం.

శివార్లలోనూ 'రియల్' జోరు

ఇక బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. దీంతో ఈ ప్రాంతాల్లో సెంటు రూ.4 లక్షలు వరకూ పలుకుతోంది. నర్సీపట్నం మున్సిపాలిటిలో ప్రధాన రోడ్లను ఆనుకొని ఉన్న స్థలాల విలువ రోజు రోజుకీ పెరుగుతోంది. అయినా ఎంత ధరకైనా కొనేందుకు పలువురు సిద్ధపడుతున్నారు. విశాఖ జిల్లాను రెండుగా విభజిస్తే కచ్చితంగా నర్సీపట్నమే జిల్లా కేంద్రం అవుతుందని స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజల నమ్మకం. దీంతో నర్సీపట్నం శివారు ప్రాంతాల్లోనూ భూములు, ఇళ్ల స్థలాల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మున్సిపాలిటీ సరిహద్దుల్లోని పంచాయతీల్లోనూ లేఔట్లు వేస్తున్నారు. లేఔట్లకు సంబంధించి ఇటీవల మున్సిపల్ శాఖ నిబంధనలు కాస్త కఠినతరం అయ్యాయి. దీంతో వాటి నుంచి మినహాయింపు పొందేందుకు మున్సిపాలిటీ సమీప పంచాయతీల్లో వ్యవసాయ, మెట్ట భూములను కొనుగోలు చేసి లేఔట్లు వేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు.

ఇదీ పట్టణ ముఖచిత్రం

2011 డిసెంబరు 31న ప్రభుత్వం మూడు మేజర్ పంచాయతీలు నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి ప్రాంతాలను విలీనం చేసి నర్సీపట్నంను గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మున్సిపాలిటీ ప్రస్తుతం 41.95 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, 16,168 నివాస గృహాలు, సుమారు లక్ష జనభాతో విస్తరించి ఉంది. విశాఖ ఏజెన్సీలో మరో ఊటీగా పేరొందిన ప్రముఖ పర్యాటక కేంద్రం లంబసింగి, కాఫీ తోటలకు పేరొందిన గూడెంకొత్తవీధి, యాపిల్స్, డ్రాగన్ ఫ్రూట్స్, స్ట్రాబెర్రీ వంటి పంటలు పండించే చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రానికి నర్సీపట్నం ముఖద్వారం.



పెరిగిన వ్యాపారం

నర్సీపట్నం ప్రాంతంలో కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. ప్రస్తుతం 200 మందికి పైగా మధ్యవర్తులు, పెట్టుబడిదారులు ఈ రంగంలో ఉన్నారు. గతంలో ఫైనాన్స్ వ్యాపారం చేసే వారు, ఉద్యోగులు రియల్ వ్యాపారానికి మారారు. వీరు రెండు పార్టీల వద్ద రెండు శాతం చొప్పున కమీషన్ తీసుకుంటూ పెట్టుబడి లేని వ్యాపారాన్ని లాభసాటిగా కొనసాగిస్తున్నారు. కొందరు పెట్టుబడిదారులు ముందుగా సొంత డబ్బుతో స్థలాలను కొనుగోలు చేసి డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారు. మరికొందరు ఇన్వెస్టర్లు అత్యవసర అవసరాల కోసం భూములు, స్థలాలు విక్రయించే వారి నుంచి అగ్రిమెంటు ప్రాతిపదికన ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత అధిక ధరలకు విక్రయించి, థర్డ్ పార్టీలకు భూముల యజమానులతో నేరుగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

పాత భవనాలకు ఆధునిక ఎలివేషన్లు

పెరుగుతున్న ప్రాధాన్యం.. నిర్మాణంలో ఆధునిక పద్ధతులు

సొంత ఇల్లు ప్రతి ఒక్కరి ఒక కల. మధ్య తరగతి నుంచి ఉన్నత తరగతి వరకు, వారి వారి ఆర్థిక పరిస్థితి, అభిరుచులను బట్టి ఇల్లు నిర్మించుకోవాలని ఆశిస్తారు. ఇంటి నిర్మాణంతో పాటు దాని అంతర్గత నిర్మాణం, అందులో ఉండే సౌకర్యాలూ ముఖ్యమే. బయట నుంచి కూడా ఇల్లు అందంగా కనిపించాలి. ఇటీవల దీనికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. బయటి నుంచి ఇంటిని అందంగా చూపించడంలో ఎలివేషన్‌ది ప్రధాన పాత్ర.

ప్రత్యేక డిజైన్లు

ఒకప్పుడు తాపీ మేస్త్రీ సూచించిన ఎలివేషన్‌కు తగ్గట్టు భవనాలను నిర్మించేవారు. ఇప్పుడు నగరాలు, పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ఎలివేషన్ కోసం ప్రత్యేక డిజైన్లను రూపొందించుకుంటున్నారు. బిల్డింగ్ నిర్మాణం ప్రారంభంలోనే ప్రత్యేక డిజైన్‌ను ప్లాన్ చేసుకుని దాని ప్రకారం నిర్మాణంలోనే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒకప్పుడు కేవలం ఐరన్ మెష్‌తో డిజైన్ చేసి ఎలివేషన్‌ను రూపొందించి అందమైన రంగులు దిద్దడమే గొప్పగా ఉండేది.

ఇప్పుడు వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం వ్యాపార సముదాయాలకు, గృహ నిర్మాణాలకు కూడా ఎలివేషన్‌కు ప్రత్యేక అందాన్ని తీసుకొస్తోంది. ఏసీపీ-అల్యూమినియం షీట్లు వచ్చిన తర్వాత భవనాల ఎలివేషన్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ఈ షీట్లతో భవనాల ఎలివేషన్‌ను చేయడం వల్ల, బయటి నుంచి చూసే వారికి భవనం రిచ్‌గా కనిపిస్తుంది. దీంతో చాలామంది ఈ షీట్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఇతర పద్ధతులు

గత నాలుగేళ్ల నుంచి పెట్రో బ్రిక్ స్టోన్స్, మెటల్, గ్లాసులతో ఎలివేషన్లు చేయించుకోవడం సాధారణమైంది. నాణ్యత దృష్ట్యా ఎక్కువ మంది ఏసీపీ అల్యూమినియం షీట్లనే వినియోగిస్తున్నారు. ఈ షీట్లు వినియోగించి ఎలివేషన్ చేస్తే, భవనం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. దీంతో వ్యాపార సముదాయాలు దీన్ని తప్పనిసరి చేసుకున్నాయి. ఇందుకు అడుగుకు రూ.200 నుంచి రూ.350 వరకు ఖర్చవుతుంది. ముందు అల్యూమినియం బీడును బిగించి, తర్వాత దానికి అల్యూమినియం షీట్లను అంటిస్తారు. దీనికి జీవిత కాలంలో మరలా పెయింట్ వేసే అవసరం ఉండదు. గతంలో వినియోగించిన గమ్ చిప్స్, మెటల్ స్టోన్స్ వంటివి రంగు వెలిసిన తరువాత ప్రత్యామ్నాయం లేక వాటిని పూర్తిగా తొలగించాల్సి వచ్చేది. దీంతో ఎక్కువ మంది అల్యూమినియం షీట్ల ద్వారా ఎలివేషన్స్‌కే ఆసక్తి చూపిస్తున్నారు.

ఎక్కువ అద్దెలు



ఇటీవల పాత భవనాలకు మరమ్మతులు చేసేటప్పుడు కూడా కొత్త ఎలివేషన్లను రూపొందిస్తున్నారు. దీనివల్ల భవనం అందంతో పాటు విలువ పెరిగి ఎక్కువ అద్దెలు వస్తున్నాయి. దీంతో భవనాల యజమానులు సక్రమంగా ఉన్న ఎలివేషన్ తొలగించి ఆధునిక ఎలివేషన్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

-ఉమాశంకర్, ఇంజనీర్, గుంటూరు

10 శాతం వరకు ఖర్చు

భవన నిర్మాణ వ్యయంలో 10 శాతం వరకు ఎలివేషన్ కోసం యజమానులు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు వైపు ఉన్న భవనాల ఎలివేషన్ కోసం ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ కూడా వాస్తును పాటిస్తున్నారు. దక్షిణం వైపు ఎలివేషన్ వస్తే ఒక వైపు ఎత్తు ఉండేలా ప్రాధాన్యత ఇస్తున్నారు. తూర్పు వైపున ఎలివేషన్ వస్తే వాస్తు రీత్యా ఇంకా అదనంగా కేటాయిస్తున్నారు.



ఇళ్ల కొనుగోలుకు సంబంధించి ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాల అభిరుచులు మారిపోతున్నాయి. అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ కొనే బదులు, ఏదైనా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో విల్లా కొనుక్కోవడం స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు రాజధాని అమరావతి ప్రాంతంలో ఈ మార్పు కనిపిస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ విల్లాల నిర్మాణం జోరందుకుంది. ఒక్కో విల్లా ధర రూ.90 లక్షల నుంచి రూ.6 కోట్లున్నా కొనుగోలుదారులు వెనుకాడటం లేదు. విజయవాడ పరిసర ప్రాంతాలు, రాజధాని అమరావతి ప్రాంతంలో జోరందుకున్న విల్లాల నిర్మాణంపై ఈ వారం స్పెషల్ స్టోరీ...

డబ్బు కొద్దీ విల్లాలు

ప్రస్తుతం విజయవాడ చుట్టుపక్కల ప్రదేశాలతో పాటు జాతీయ రహదారికి సమీపంలో విజయవాడ- గుంటూరుల మధ్య వివిధ సంస్థలు విల్లాలను నిర్మిస్తున్నాయి. అమరావతిని రాజధానిగా ప్రకటించక ముందే, రాజధాని గ్రామాల్లో ఒకటైన ఉండవల్లి పరిధిలో ఒక నిర్మాణ సంస్థ విల్లాలు నిర్మించింది. విల్లాల ధర వాటిని నిర్మించే ప్రాంతంతో పాటు విల్లా విస్తీర్ణం, వాటిల్లో కల్పించే వసతులపై ఆధారపడి ఉంటుంది. ఈ విల్లాల్లో మరీ ఆర్భాటం లేకుండా, 180 చదరపు గజాల నుంచి 200 చదరపు గజాల్లో, స్టాండర్డ్ నిర్మాణ సామగ్రితో, త్రీ బెడ్‌రూంలతో నిర్మిస్తున్నారు. వీటి ధర రూ.90 లక్షల నుంచి రూ.1.40 కోట్ల వరకూ ఉంది. ఇంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో, సువిశాలమైన 4 లేదా 5 బెడ్‌రూంలు, అంతర్గత లిఫ్టులు, ఖరీదైన నిర్మాణ సామగ్రి, ఇటాలియన్ మార్బుల్, భారీ అద్దాలు, ప్రత్యేకంగా ఫ్యామిలీ లివింగ్ రూమ్, హోం థియేటర్, రిక్లైనబుల్ రూఫ్, బార్ రూమ్, సర్వెంట్ క్వార్టర్ వంటి వసతులతో ఉండే విల్లాల ధరలు రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు పలుకుతున్నాయి.



అపార్ట్‌మెంట్ కంటే విల్లానే ముద్దు

రాజధాని ప్రాంతంలో పెరుగుతున్న ఆసక్తి.. రూ.6 కోట్ల వరకు ధర

(ఆంధ్రజ్యోతి, అమరావతి)

అమరావతి చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లతో పాటు ఇండిపెండెంట్ విల్లాలకూ చక్కటి ఆదరణ లభిస్తోంది. అపార్ట్‌మెంట్లతో పోలిస్తే ధర ఎక్కువైనా కొనుగోలుదారులు వెనకాడడం లేదు. పెరుగుతున్న ఈ డిమాండ్‌తో విజయవాడ, అమరావతి ప్రాంతంలో ఇప్పటికే అనేక గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు వచ్చాయి. ఇవి ఎక్కువగా ఎగువ మధ్య తరగతి, ఉన్నతాదాయ వర్గాలకే అందుబాటులో ఉన్నాయి. అయినా విల్లాల కోసం ఎంక్వైరీలు రోజురోజుకీ పెరుగుతుండడం, వాటికి గల డిమాండ్‌ను సూచిస్తోంది.

వీరి నుంచే డిమాండ్

కొన్ని ప్రముఖ సంస్థలు తమ ఉన్నతాధికారుల నివాసాల కోసం లేదా గెస్ట్ హౌస్‌ల కోసం విల్లాలనే ప్రిఫర్ చేస్తున్నాయి. పలువురు ప్రవాసాంధ్రులు కూడా వీటినే ఇష్టపడుతున్నారు. నగరంలోని అపార్ట్‌మెంట్ల జీవితంతో విసిగి పోయి, ఊరికి కాస్త దూరంగానైనా ఇండిపెండెంట్ ఇళ్లల్లో ఉండాలనుకునే కుటుంబాలూ, విల్లాల వైపు మొగ్గు చూపుతున్నాయి. విడిగా ఏదైనా ఇండివిడ్యువల్ హౌస్ కొనుక్కుంటే నిర్వహణ, భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయి. అదే గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లోని విల్లాలైతే ఎలాంటి ఇబ్బందులుండవు. గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే విల్లాలకు భారీ క్లబ్ హౌస్‌లు, వాకింగ్ ట్రాక్‌లు అదనపు ఆకర్షణలుగా ఉంటున్నాయి.



మధ్య తరగతికీ అందుబాటులో!

రాబోయే రోజుల్లో ఉన్నత శ్రేణి విల్లాలతో పాటు మధ్యతరగతి వర్గాలూ కొనగలిగేలా, తక్కువ విస్తీర్ణముండే ప్లాట్లలోనూ విల్లాల నిర్మాణం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొన్ని రియల్టీ కంపెనీలు ఇప్పటికే ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం అమరావతికి చుట్టుపక్కల ప్రాంతాల్లోనే విల్లాల నిర్మాణం కనిపిస్తోంది. త్వరలో రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లోనూ వీటి నిర్మాణం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

విల్లాల ప్రాజెక్టులివే

- రాజధాని గ్రామాల్లో ఒకటైన ఉండవల్లిలో ప్రముఖ రియల్టర్ గద్దె రాజలింగ్, 240 గజాల నుంచి 330 చదరపు గజాల విస్తీర్ణంలో 19 విల్లాలు నిర్మించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు పక్కన, రాజధాని నగరం ప్రారంభమవుతున్న ప్రాంతంలో 'మిస్తీ ద ఫస్ట్ అవెన్యూ' పేరుతో ఈ ప్రాజెక్ట్ నిర్మితమైంది. ట్రిప్లెక్స్ విల్లాలుగా, సుమారు 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 5 బెడ్‌రూమ్‌లతో ఉండే వీటి ధర సుమారు రూ.4 కోట్లు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న బంగళాలు సిద్ధమయ్యే వరకు, వారు ఉండేందుకు ఈ విల్లాలనే ఎంపిక చేశారు. ప్రస్తుతం వీటిని న్యాయమూర్తుల అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు.
- విజయవాడ శివార్లలో, రెండు జాతీయ రహదారులను కలిపే తాడిగడప- ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు దగ్గర, కేఎంవీ ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ 'వివాన్' పేరుతో 61 విల్లాల నిర్మాణం చేపట్టింది. అత్యాధునిక వసతులతో 255, 300 చదరపు గజాల్లో నిర్మిస్తున్న ఈ విల్లాలపైనా కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. చక్కటి ఎలివేషన్‌తో నిర్మిస్తున్న వీటి ధర చదరపు అడుగుకు రూ.8,000 వరకు (మొత్తం ధర రూ.3 కోట్లు) చెబుతున్నారు.
- విజయవాడ- గుంటూరుల మధ్య, జాతీయ రహదారిపై కాజ టోల్‌గేట్ పక్కన, రామకృష్ణ హౌసింగ్ సంస్థ 'వెనూజియా' పేరిట మరో ప్రాజెక్టు వెలిసింది. ఇందులో భారీ ఐటీ టవర్లు, హైరైజ్ అపార్ట్‌మెంట్లే కాకుండా విల్లాలూ ఉన్నాయి. ఒక్కొక్కటి 200 చదరపు గజాల్లో ఉన్న వీటిని ఎగువ మధ్య తరగతి కొనుగోలుదారులను లక్ష్యంగా చేసుకుని నిర్మించారు. చుట్టూ మొక్కలు పెంచుకునేందుకు స్థలంతో పాటు బాల్కనీ, 3 బెడ్‌రూమ్‌లతో ఉన్న ఈ విల్లాల్లో స్టాండర్డ్ సామగ్రినే వాడారు. ఈ ప్రాజెక్టులో ఒక్కో విల్లా ధర ఇంచుమించు రూ.1.20 కోట్ల వరకు ఉంది.
- విజయవాడ- గుంటూరు హైవేకు సమీపాన, తాడేపల్లిలో జి ఆదిశేషగిరిరావు 60 విల్లాలు నిర్మించారు.
- కాజ దగ్గర సాహితి గ్రూప్ 180-500 చదరపు గజాల విస్తీర్ణంలో కొన్ని విల్లాలు నిర్మిస్తోంది. ఎగువ మధ్యతరగతి వారిని లక్ష్యంగా చేసుకుని వీటిని నిర్మిస్తున్నారు. వీటి ధర స్థల విస్తీర్ణాన్ని బట్టి రూ.1.40 కోట్ల నుంచి ప్రారంభమవుతున్నాయి.
- విజయవాడ శివార్లలోని గొల్లపూడిలో ఒక స్థానిక రియల్టీ సంస్థ మొత్తం 30 విల్లాలను 180-200 చదరపు గజాల్లో నిర్మించింది. వీటి ధర రూ.95 లక్షలకు అటుఇటుగా ఉంది.

ఈవీఎంలపై అనుమానాలు

సోమవారం ఈసీకి ప్రతిపక్షాల ఫిర్యాదు.. నివృత్తి బాధ్యత ఎన్నికల కమిషన్‌దే

- వీవీప్యాట్‌ల లెక్కింపునకు అనుమతించాలి
- నిరుద్యోగం, సాగు సంక్షోభంపై ఉమ్మడి పోరు: రాహుల్
- దేశాన్ని కాపాడుకుంటాం: చంద్రబాబు


ఢిల్లీలో శుక్రవారం జరిగిన అఖిలపక్ష భేటీలో రాహుల్‌గాంధీ, చంద్రబాబు, శరద్‌పవార్, శరద్‌యాదవ్, కనిమొళి, రాజా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) దుర్వినియోగంపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అనుమానాలను నివారించేందుకు పారదర్శకమైన ఓట్ల లెక్కింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ, చంద్రబాబు సహా 21 పార్టీల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో వారు ఈవీఎంలతో పాటు కేంద్ర బడ్జెట్‌లో రైతులకు, నిరుద్యోగులకు జరిగిన అన్యాయం, దేశంలోని వివిధ సంస్థలపై చర్చించారు. సోమవారం సాయంత్రం 5:30 గంటలకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి.. ఈవీఎంల దుర్వినియోగంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివారించేందుకు 2019 ఎన్నికల్లో మొత్తం వీవీప్యాట్‌లను లెక్కించేందుకు అనుమతించాలని డిమాండ్ చేయనున్నారు. సమావేశం అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఈవీఎంలపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనన్నారు. వీవీప్యాట్‌లను లెక్కించాలని డిమాండ్ చేస్తామన్నారు. వ్యవసాయంతోపాటు దేశంలో దారుణంగా ఉన్న నిరుద్యోగం గురించి తాము పోరాడాలని నిర్ణయించామని, ఆ తర్వాత సీబీఐ, ఐబీ వంటి సంస్థలను దుర్వినియోగపరచడం గురించి ప్రజలకు తెలియజేస్తామని ఆయన చెప్పారు. దీంతోపాటు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో మోదీ అవినీతి గురించి ప్రజలకు వెల్లడిస్తామన్నారు. తమ వద్ద మోదీ ప్రభుత్వంపై ఎక్కుపెట్టాల్సిన ఆయుధాలు ఎక్కువే ఉన్నాయని, ప్రజలు ఆయనపై మరో రెండునెలల్లో సర్జికల్ దాడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ.. ఈవీఎంల విషయంలో ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్నాయనే విషయాన్ని అన్ని పార్టీలూ ఆమోదించాయని చెప్పారు. ఈవీఎంలపై ఎన్నికల కమిషన్ చర్య తీసుకోవాలన్నారు. ఓటు వేసిన వారికి తమ ఓటు ఎవరికి పడిందో తెలుసుకునే హక్కు ఉందని ఆయన అన్నారు. సోమవారం తమ అభ్యర్థనపై ఈసీ ఏ నిర్ణయం తీసుకుంటుందన్న దాన్ని బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐతో పాటు పలు సంస్థలు భ్రష్టుపట్టాయని, రాజకీయ ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు వాటిని దుర్వినియోగం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. తమ లక్ష్యం భారతదేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే అని చంద్రబాబు అన్నారు. దీనిపై జాతీయస్థాయిలో భావసారూప్యంగల పార్టీలు కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించామన్నారు.

ఏపీలో పొత్తు లేదు

రాష్ట్రస్థాయిలో ఒక్కో రాష్ట్రంలో అక్కడి పరిస్థితులను బట్టి పొత్తులు ఉంటాయని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ప్రతిపాదన ఏమీ లేదని పునరుద్ఘాటించారు. జాతీయస్థాయిలో కలిసి పోరాడాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ తరపున ఇంకా ఆంటోనీ, గులాంనబీ ఆజాద్, మల్లిఖార్జున్ ఖర్గే, అహ్మద్ పటేల్, తెలుగుదేశం తరపున ఇంకా టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు సుజనా చౌదరి, ఎంపీ సీఎం రమేశ్, ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, మాజిద్ మెమన్, తృణమూల్ ఎంపీ డెరెక్ ఓబ్రైన్, ఎస్‌పీఎంపీ, సీపీఎం, లోక్ తాంత్రిక్ జనతా దళ్, నేషనల్ కాన్ఫరెన్స్, బీఎస్పీ, ఆర్‌జేడీ, డీఎంకే, ఆర్‌ఎల్‌డీ, సీపీఐ, జేడీఎస్, ఆర్‌ఎస్‌పీఎంపీఎన్‌కే, జేవీఎం, టీజేఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఈవీఎంలను సీళ్లు తెరిచి చూస్తున్న బెల్ అధికారులు, మధ్యలో కలెక్టర్.

వికారాబాద్ ఈవీఎంలు తెరిచారు!


- బెల్ ఇంజనీర్లు వాటిని పరిశీలించారు
- కోర్టు కేసు ఉంటే ఎలా తెరుస్తారు?
- కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ అభ్యంతరం

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

కొడంగల్, పరిగి, వికారాబాద్... ఈ మూడు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు ఈవీఎంల రిగ్గింగ్ వల్లే ఓడిపోయామని ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లు కోర్టు పరిశీలనలో ఉండగానే బెంగళూరు నుంచి వచ్చిన బెల్ ఇంజనీర్లు వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఉంచిన ఈ మూడు నియోజకవర్గాల ఈవీఎంలను తనిఖీ చేయడం వివాదాస్పదమైంది. లోక్‌సభ ఎన్నికల కోసం ఈవీఎంలను సన్నద్ధం చేసేందుకు వాటిని తనిఖీ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్ సమక్షంలో శుక్రవారం ఈ తనిఖీ ప్రక్రియ జరిగింది. ఎలాంటి వివాదాలు లేని అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను పరిశీలించాల్సి ఉండగా కోర్టు పరిధిలో ఉన్న వికారాబాద్ ఈవీఎంలను తనిఖీ చేయడంపై వికారాబాద్ నుంచి ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 20 మంది బెల్ అధికారులు వచ్చి వందకు పైగా ఈవీఎంలను ఓపెన్ చేశారని చెబుతున్నారు. తన పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించిన తరువాత కూడా వికారాబాద్ ఈవీఎంలను ఎలా తెరుస్తారని కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ ప్రశ్నించారు. ఈ విషయమై న్యాయ పోరాటం చేస్తానని ఆయన శుక్రవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'తో వ్యాఖ్యానించారు. అధికారుల తీరును నిరసిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

బ్యాలెట్‌కు వెళ్లేది లేదు


- ఈవీఎంల్లో అక్రమాలకు తావులేదు: ఈసీ



కోల్‌కతా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఈవీఎంల పనితీరుపై విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ మళ్లీ బ్యాలెట్ పేపర్‌కు వెళ్లేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా స్పష్టం చేశారు. రెండు దశాబ్దాలుగా వినియోగిస్తున్న ఈవీఎంల సామర్థ్యంపై తమ అభిప్రాయం చెప్పే అధికారం రాజకీయ పార్టీలకు ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికలపై అధికారులతోనూ, రాజకీయ పార్టీలతోనూ రెండు రోజులుగా సమాలోచనలు జరిపిన అరోరా శుక్రవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంల లోపాలకు, అక్రమాలకు మధ్య తేడా ఉందన్నారు. విపక్షాలు దీన్ని గుర్తించకుండానే విమర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవీఎంలలో ఎలాంటి లోపం లేకుండా తయారు చేశామని, అక్రమాలకు అవకాశం లేకుండా రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ వీవీప్యాట్‌లను వినియోగిస్తామన్నారు. మరోవైపు వీవీప్యాట్‌లను మరింత పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌పై ఎన్నికల కమిషన్‌కు బాంబే హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. వీవీప్యాట్‌ల్లో రెండు దశల్లో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని పిటిషనర్ అభిప్రాయపడ్డారు.

అహ్మద్ పటేల్‌పై పిటిషన్ అప్పుడే ఎలా వచ్చింది!?

- ఎవరో చాలా ఆత్రుతతో ఉన్నారు: సుప్రీం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ రాజ్యసభ ఎన్నికకు సంబంధించి దాఖలైన పిటిషన్ ముందుగానే విచారణకు రావడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కేసు తుది విచారణను నాన్-మిస్లేనియస్ రోజుల్లో (మంగళ-గురువారాల మధ్య) చేపడతామని గతంలో ఆదేశాలు ఇచ్చామని, శుక్రవారం తమ ముందుకు రావడం ఎలా సాధ్యమైందో రిజిస్ట్రీని అడిగి తెలుసుకుంటామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్‌శర్మతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పటేల్ తరపు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబ్బల్, అభిషేక్ మను సింఘ్వీ సైతం ఈ వ్యవహారంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ఎలా సాధ్యమైందో తమకు తెలియడం లేదని కోర్టుకు విన్నవించారు. దీనిపై బెంచ్ మాట్లాడుతూ, ఈ కేసును సమగ్రంగా విచారించాల్సి ఉన్నందున తుది విచారణ ఫిబ్రవరి 13న చేపడతామని గతంలో వ్యాఖ్యానించామని గుర్తుచేసింది.

నేటి నుంచి గేట్

- 2, 3, 9, 10వ తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- అరగంట ఆలస్యంగా వచ్చినా అనుమతి
- మార్చి 16న ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్‌ఐటీలతో పాటు ఇతర విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీలో ప్రవేశానికిగాను గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 2, 3, 9, 10వ తేదీల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఐఐటీ మద్రాస్ ఏర్పాట్లు చేసింది. రోజూ రెండు దశల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మొదటి విడత ఉదయం 9:30 నుంచి 12:30 గంటల వరకు, రెండో దశ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షకు విద్యార్థులు అరగంట ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది పరీక్షకు హాజరుకానున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1.30 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. ఈ పరీక్ష కోసం తెలుగు రాష్ట్రాల్లో బాపట్ల, చీరాల, గూడురు, గుంటూరు, కడప, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొల్లం, కొత్తగూడెం, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, వరంగల్, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, చిత్తూరు నగరాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నుంచి స్టాటిస్టిక్స్ పేపర్‌ను అదనంగా చేర్చారు. ఫలితాలను మార్చి 16న విడుదల చేయనున్నట్లు ఐఐటీ మద్రాస్ పేర్కొంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, క్యాలిక్యులేటర్లు తీసుకురాకూడదు. ఫుల్ షర్ట్స్, షూస్ ధరించకూడదు. హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఫొటో ఐడీ తీసుకురావాల్సి ఉంటుంది.

జేఈఈ మెయిన్ పేపర్-2లోనూ

తెలుగు విద్యార్థుల హవా

- 1.4 లక్షల్లో మనోళ్లకే 100 పర్సంటైల్


నారాయణ


రఘు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్క్, బి.ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దేశవ్యాప్తంగా ఇద్దరికే 100 పర్సంటైల్ రాగా.. వారిద్దరూ తెలుగు విద్యార్థులే కావడం గమనార్హం. ఏపీకి చెందిన గొల్లపుడి లక్ష్మీనారాయణ, గుడ్ల రఘునందన్‌రెడ్డి 100 పర్సంటైల్ సాధించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 10 వేల మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 1,45,386 లక్షల మంది హాజరయ్యారు. రెండో దశ పరీక్షను ఏప్రిల్ 6- 20వ తేదీల్లో నిర్వహించిన అనంతరం విద్యార్థులకు ర్యాంకులు విడుదల చేస్తారు.

అబ్ కీ బార్.. చార్ సౌకే పార్

- లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ కొత్త నినాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: 'అబ్‌కీ బార్.. చార్ సౌకే పార్' (ఈసారి 400కు పైగా సీట్లు).. ఇది వచ్చే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ కొత్త నినాదం. ఆ పార్టీ 2019 ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు 2014లో ఎన్డీయే 336 స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ సొంతంగా 282 సీట్లు కైవసం చేసుకుంది. ఈ సారి 400 స్థానాలకు తగ్గకుండా సాధించి రికార్డు నెలకొల్పాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. 2014లో గుజరాత్ సీఎం నరేంద్ర మోదీని ఎన్డీయే ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకొచ్చి 'అబ్ కీ బార్ మోదీ సర్కార్' అనే నినాదంతో ప్రజలను ప్రసన్నం చేసుకుంది. 1984 తర్వాత 2014లో కేంద్రంలో ఓ పార్టీ పూర్తి మెజారిటీ సాధించడం ఇదే తొలిసారి. మోదీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలన చూసిన దేశ ప్రజలు మళ్లీ ఆయన్నే ప్రధానిగా కోరుకుంటున్నారని బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై పడదన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని సీనియర్లకు ఆదేశం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రులు, సీనియర్ నాయకులు అనారోగ్యానికి గురికావడం పట్ల బీజేపీ అధిష్ఠానం ఆందోళన చెందుతోంది. ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో చురుకైన పాత్ర పోషిస్తూ కార్యకర్తలను ఉత్సాహపరచాలని అగ్రనాయకులను ఆదేశించింది. అరుణ్ జైట్లీ సహా ఆరుగురు మంత్రులు, సీనియర్ నాయకులు దేశ, విదేశాల్లో చికిత్స పొందుతున్నారు. పార్టీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఇటీవల ఎయిమ్స్‌లో చేరారు. అయినా ప్రధాని మోదీ పోస్టింగ్‌లను రీ ట్వీట్ చేస్తూ సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాల్లో పర్యటించి నాయకుల్లో ఉత్సాహం నింపారు. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతున్నప్పటికీ దేశంలోని పరిణామాలపై ఎప్పటికప్పుడు అభిప్రాయాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. మనోహర్ పర్రీకర్ ప్రాణాంతక కేన్సర్‌తో బాధపడుతున్నప్పటికీ గోవా సీఎంగా రాష్ట్రాన్ని సమర్థంగా పాలిస్తూ విపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నారు. కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ కూడా తుది శ్వాస విడిచే వరకూ ట్విటర్‌లో చురుకుగా వ్యవహరించారు. సీనియర్ మంత్రి రవిశంకర్ ప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్‌లాల్ కూడా ఆస్పత్రిలో చిక్సిత పొందుతూనే ట్విటర్‌లో పోస్టింగ్‌లు పెట్టారు.

'పోలార్ వర్టెక్స్'కు

21 మంది బలి

- అమెరికాను భయపెడుతున్న చలిపులి

వాషింగ్టన్, ఫిబ్రవరి 1 : ధ్రువప్రాంత ఉష్ణోగ్రతల ప్రభావం(పోలార్ వర్టెక్స్)తో అమెరికా పశ్చిమ మధ్య ప్రాంతం గజగజా వణుకుతోంది. ఉష్ణోగ్రతలు మైనస్ 30 డిగ్రీలకు పడిపోవడంతో చలికి తాళలేక కాలేజీ విద్యార్థి(18) సహా ఓ బాలుడు మృతిచెందారు. ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో థర్మోస్టాట్ సరిగ్గా పనిచేయకపోవడంతో అందులో నివసించే మహిళ కన్నుమూసింది. దీంతో ఇటీవల కాలంలో చలి పులి దెబ్బకు మృతిచెందిన వారి సంఖ్య 21కి చేరింది. మరెంతోమంది హైపోథెర్మియా సమస్యతో ఆస్పత్రుల్లో చేరారు. చికాగో, ఇల్లినాయిస్, ఇండియానా, లోవా, కన్సస్, మిచిగాన్, మిన్నెసోటా, నెబ్రస్కా, నార్త్ డకోటా, ఒహియో, సౌత్ డకోటా, విస్కాన్‌సిన్ ప్రాంతాల్లో ధ్రువ ప్రాంత చలిగాలుల ప్రభావం అధికంగా ఉండటం గమనార్హం. కాగా, గత గురువారం ఇల్లినాయిస్‌లోని మౌంట్ కరోల్ ప్రాంతంలో మైనస్ 38 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పటివరకు అమెరికా పశ్చిమమధ్య ప్రాంతంలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే.

మనమే మార్గదర్శి

- అన్నీ తెలుగు రాష్ట్రాల పథకాలే
- ఎన్నో ఏళ్ల ముందే ఇంతకంటే మెరుగ్గా అమలు
- రైతుబంధు, దీపం, పింఛను పథకాల కాపీ
- పేరు మార్చి ఆరోగ్యశ్రీ పథకం తెచ్చిన మోదీ
- డిజిటలీకరణలోనూ మనమే టాప్

హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఈసారే కాదు.. ప్రతీ బడ్జెట్లో కేంద్రం ప్రవేశపెడుతున్న అనేకానేక సంక్షేమ పథకాలు పూర్తిగా తెలుగు రాష్ట్రాల నుంచి కాపీ కొడుతున్నవే. ఎన్నో ఏళ్ల కిందటే దక్షిణాదిలో వివిధ రాష్ట్రాలు అమలు చేసిన పథకాలను ఇప్పుడు ఉత్తరాది నేతలు తమ పద్దుల్లో చేరుస్తున్నారు. శుక్రవారం నాడు ప్రకటించిన- రైతులకు రూ 6000 పెట్టుబడి సాయం పథకం అక్షరాలా తెలంగాణ సర్కారు అమలు చేసిన రైతుబంధు పథకమే! ఇక్కడ ఎకరాకు ఒక పంటకు రూ 4వేల (ఇపుడు 5వేలకు పెంచుతున్నారు) రూపాయలు నేరుగా రైతు అకౌంట్లో జమ చేస్తుంటే కేంద్రం దాన్ని అనుసరించి 5ఎకరాల లోపు వారికి ఏడాదికి రూ 6వేలు ఇస్తామని చెబుతోంది. ఇక్కడ కేసీఆర్ ప్రభుత్వం రైతుకు రూ 10వేలు చెల్లిస్తుంటే అంతకంటే చాలా తక్కువగా కేంద్రం ఇవ్వజూపుతోంది. ఇక మోదీ అమలు చేస్తూ ఘనంగా చెప్పుకొంటున్న ఉజ్వల పథకం ఏనాడో తెలుగునాట అమలైన దీపం పథకానికి కాపీ. దాదాపు పద్దెనిమిదేళ్ల కిందట అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం అమలు చేసిన దీపం పథకాన్ని ఇపుడు ఉజ్వల స్కీం పేరుతో అక్కడ అమలు చేస్తున్నారు. గ్రామీణ పేద, రైతుకుటుంబాలకు వంటగ్యాస్ పొయ్యిలను అందజేసిన ఘనత తెలుగురాష్ట్ర నేతల సొంతం. ఇక ఆరోగ్య పథకాల్లో ఆయుష్మాన్ భారత్ అద్భుతమని చెప్పుకొన్న బీజేపీ... వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం దాదాపు పదేళ్లకిందట అమలు చేసిన ఆరోగ్య శ్రీ పథకం నుంచి కొన్ని అంశాలను కాపీ కొట్టి తెచ్చినది. ఇక పెన్షన్ స్కీములన్నీ దాదాపుగా ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కాపీ కొట్టినవి. డిజిటలీకరణలో తెలుగు రాష్ట్రాలు ఏనాడో ముందడుగు వేశాయి. స్వయం సహాయ పథకాలకు కూడా తెలుగురాష్ట్రాలే మార్గదర్శి. వ్యవసాయదారులు, ఉద్యోగులు, మహిళలు మొదలైన వారి విషయంలో కేంద్రం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలన్నీ మన నుంచి తీసుకొన్నవే!



శభాష్ పీయూష్..!

"లక్ష్య శుద్ధిలేని అవివేకపు ప్రజాకర్షణ కావాలా? లేక ద్రవ్య క్రమశిక్షణ పాటించాలా? అన్నదానిపై భారతావని, పార్టీలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయమిది. ఎన్నికల్లో గెలవడానికి బుద్ధిహీనమైన ప్రజాకర్షణ అవసరం లేదని 2014 ఎన్నికలు నిరూపించాయి" అని 2014లో ఎన్నికల్లో గెలిచాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు. కానీ ఐదేళ్లు తిరిగేసరికి ఆయన పార్టీ అదే జనాకర్షణ మంత్రం పఠించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు హిందీబెల్ట్ రాష్ట్రాల్లో ఓడిపోయాక బీజేపీకి మరో గత్యంతరం లేకపోయింది. ఈ క్రమంలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన పీయూష్ బీజేపీ నుంచి పూర్తి మార్కులు సాధించారు. బీజేపీ కోరుకున్న రీతిలో ప్రసంగించడంలో సఫలమయ్యారు. ఆదాయపుపన్నుకు సంబంధించిన ప్రతిపాదనలను వ్యూహాత్మకంగా ప్రసంగం చివర్లో దట్టించి నాటకీయంగా వదలడం బీజేపీ ఎంపీలను తెగ ఉత్సాహపర్చింది. మూడే వర్గాలు- రైతులు, మధ్యతరగతి, చిన్న వ్యాపారులు.. వీరే టార్గెట్‌గా ప్రతిపాదనలు రూపొందించి పార్లమెంట్లో చదివేశారు. శభాష్ అనిపించుకున్నారు.

రియల్ ఎస్టేట్‌కు ఊతం!

రెండో ఇంటిపై అద్దె ఆదాయం లెక్కకురాదు

అద్దె 2.4 లక్షలు దాటితేనే టీడీఎస్ వర్తింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: మందగమనంతో ఉన్న రియల్‌ఎస్టేట్ రంగానికి తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తన బడ్జెట్లో వరాల వర్షం కురిపించారు. అమ్ముడుపోని ఇళ్లపై అద్దెకు ఇచ్చే పన్ను మినహాయింపును ఏడాది నుంచి రెండేళ్లకు పెంచారు. ఎనిమిది ప్రధాన నగరాల్లో ఏడు లక్షల ఫ్లాట్లు అమ్ముడుపోకుండా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఒక ఆస్తి అమ్మకం ద్వారా వచ్చిన సొమ్ముపై లాంగ్ టర్మ్ కేపిటల్ గెయిన్స్ పన్ను కట్టకుండా ఉండాలంటే మరో ఆస్తి కొనుక్కోవాలని ప్రస్తుత నిబంధనలు చెబుతున్నాయి. ఇప్పుడు అదే సొమ్మును రెండు ఆస్తుల కొనుగోలుకు కూడా వినియోగించవచ్చని తాజా బడ్జెట్లో ప్రతిపాదించారు. ఈ విధంగా రూ.2 కోట్ల వరకు కేపిటల్ గెయిన్స్ పన్ను పడకుండా తప్పించుకోవచ్చు. ఈ సౌకర్యాన్ని జీవితంలో ఒకసారి మాత్రమే ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుత నిబంధనల ప్రకారం అద్దెకు ఇచ్చిన ఇంటిపై యజమానికి ఏడాదికి రూ.1.8 లక్షలకు మించిన ఆదాయం వస్తే కిరాయిదారు దాని మీద పన్ను సొమ్మును మినహాయించుకొని, మిగిలిన సొమ్మును అద్దెగా యజమానికి చెల్లించాలి. పన్ను మొత్తాన్ని తానే ఆదాయ పన్ను శాఖకు జమ చేయాలి. అంటే, ఇంటి అద్దె నెలకు రూ.15 వేలు దాటితే కిరాయిదారు టీడీఎస్ అస్త్రాన్ని ప్రయోగించాలి. ఇది అనేక తలనొప్పులకు, యజమాని-కిరాయిదారు మధ్య ఘర్షణకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్లో టీడీఎస్ పరిమితిని రూ.2.4 లక్షలకు పెంచారు. అంటే, నెలవారీ అద్దె రూ.20 వేలు దాటితే కానీ టీడీఎస్ వర్తించదు. దాంతో ఎక్కువ మంది ఇంటి యజమానులకు ఊరట లభించనుంది. రియల్ ఎస్టేట్ జీఎస్టీ మీద అధ్యయనానికి కమిటీ వేయాలని జీఎస్టీ మండలిని కోరినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం నిర్మాణంలో ఉన్న ఇంటి విక్రయంపై 12%, గృహనిర్మాణ పథకాల కింద నిర్మించిన ఇళ్లకు 8% జీఎస్టీ వసూలు చేస్తున్నారు. పూర్తయిన ఇళ్లపై జీఎస్టీ ఉండదు. ఈ జీఎస్టీని తగ్గించాలని రియల్ ఎస్టేట్ కోరుతోంది. రెండో సొంత ఇల్లు ఉంటే దాన్ని సొంతంగా వినియోగించుకుంటున్నా దానిపై ఇప్పటిదాకా అద్దెపై ఆదాయ పన్ను చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం చాలా కుటుంబాలు ఉద్యోగం, పిల్లల చదువు, తల్లిదండ్రులు వేరుగా ఉండటం వంటి కారణాల వల్ల రెండో ఇంటిని సొంతానికే వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండో ఇంటిపై ఆదాయానికి పన్ను చెల్లించనక్కరలేదని తాజా బడ్జెట్లో ప్రకటించారు. మూడో ఇంటికి మాత్రం అద్దె ఆదాయానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

కార్మికుల కంటే గోవులకే ఎక్కువ!

- పింఛనుకు 500 కోట్లు.. గోరక్షణకు 750 కోట్లు
- కేంద్ర చిత్తశుద్ధికిదే నిదర్శనం: సీఐటీయూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికులకు ప్రకటించిన పింఛను పథకంపై కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాయి. ఈ పథకం గురించి బడ్జెట్‌లో ప్రకటన మాత్రమే చేశారని.. దానికే పీయూష్ గోయల్ గొప్పలు చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశాయి. పింఛన్ పథకం కంటే గోరక్షణకే అధిక నిధులు కేటాయించారని సీఐటీయూ ధ్వజమెత్తింది. "పథకానికి రూ.500 కోట్లు కేటాయించడమే మోదీ సర్కారు తీరుకు, దేశంలోని 40 కోట్లకు పైగా ఉన్న అసంఘటితరంగ కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. కార్మికులు క్రమం తప్పకుండా 60 ఏళ్లు వచ్చే వరకు తమ వాటా చెల్లిస్తేనే పింఛన్ అందుకుంటారు. ఎక్కువ మంది కార్మికులకు ఇది అసాధ్యం" అని సీఐటీయూ అధ్యక్షురాలు హేమలత శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ పథకం కంటే అధికంగా గోరక్షణకు రూ.750 కోట్లు కేటాయించడాన్నిబట్టే కేంద్ర ప్రకటన వెనక ఉన్న మోసపూరిత ఉద్దేశాన్ని అర్థం చేసుకోవచ్చని ధ్వజమెత్తారు. "పింఛన్ తీసుకోవడానికి కార్మికులు కనీసంగా ఎన్నేళ్లు తమ వాటా చెల్లించాలి? అసంఘటిత రంగ కార్మికులకు నిరంతరాయంగా ఉపాధి ఉండదు. అలాంటప్పుడు వారి వాటా చెల్లింపులో అంతరాయం ఏర్పడితే పరిస్థితి ఏంటి? దాన్ని ప్రభుత్వం భర్తీ చేస్తుందా? తరచుగా ఉద్యోగాలు మారే కార్మికులను ఎలా రిజిస్టర్ చేస్తారు?" అని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రశ్నించారు. ఇది ఎన్నికల బడ్జెట్ అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ విమర్శించారు. అసంఘటితరంగ కార్మికులకు ఈపీఎఫ్‌వో ఇప్పటికే వివిధ పథకాల కింద పింఛన్లు అందజేస్తోందని, వాటి కవరేజీని లేదా నగదు మొత్తాన్ని పెంచడంపై సర్కారుకు స్పష్టత లేదని ఆరోపించారు. అలాంటప్పుడు ఈ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని అన్నారు.


పట్టాలు తప్పి బోల్తాపడిన దయోదయా ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్, వెనుక బోగీ

పట్టాలు తప్పిన దయోదయా ఎక్స్‌ప్రెస్

- డ్రైవర్, పలువురు ప్రయాణికులకు గాయాలు

జైపూర్, ఫిబ్రవరి 1 : జబల్‌పూర్ - అజ్మీర్ మార్గంలో దయోదయా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అజ్మీర్‌కు 15 కిలోమీటర్ల దూరంలోని సంగనీర్ రైల్వే స్టేషన్ శివార్లలో ఈ ప్రమాదం జరిగినట్లు వాయవ్య రైల్వే అధికారవర్గాలు తెలిపాయి. రైలు ఇంజిన్, దాని వెనుక బోగీ పట్టాలు తప్పి బోల్తాపడినట్లు గుర్తించారు. ఈ దుర్ఘటనలో డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. దీంతో ఈ మార్గం మీదుగా వెళ్లే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయగా, కొన్నింటిని దారి మళ్లించారు. విశాఖపట్నం - భగత్ కీ కోఠీ(జోధ్‌పూర్) ఎక్స్‌ప్రెస్‌ను రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్, భగత్ కీ కోఠీ స్టేషన్ల మధ్య తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు.



అబద్ధాల బడ్జెట్.. పెట్టుబడిదారులకే లబ్ధి



ఇది పూర్తిగా అబద్ధాల కోరు బడ్జెట్. పెట్టుబడిదారులకు మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఉంది. ప్రజాభీష్టం ఏమాత్రం లేదు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను అబద్ధాలు రూపుమాపలేవు. ప్రజలు బీజేపీ గిమ్మిక్కులను అర్థం చేసుకోవాలి. తప్పుడు విధానాలు అవలంబించే బీజేపీకి బుద్ధి చెప్పాలి. *- మాయావతి, బీఎస్పీ అధ్యక్షురాలు*

ఇది రెండో సర్జికల్ స్ట్రైక్..



మధ్యంతర బడ్జెట్ ఎన్డీయే సర్కారు చేపట్టిన రెండో సర్జికల్ స్ట్రైక్ లాంటిది. మొదటి సర్జికల్ స్ట్రైక్ బుల్లెట్లతో దేశ బాహ్య శత్రువులపై జరిపింది అయితే.. రెండో సర్జికల్ స్ట్రైక్‌ను బ్యాలెట్ రూపంలో విపక్షాలపై విసిరే పంజా లాంటిది ఈ బడ్జెట్. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే 400 సీట్లలో విజయం సాధించడం.. తిరిగి మోదీ సర్కారు అధికారంలోకి రావడం ఖాయం. *- రాం విలాస్ పాసవాన్, కేంద్ర మంత్రి*



అంతరిక్ష రంగానికి 10 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో అంతరిక్ష రంగానికి ఏకంగా రూ.10,252 కోట్లు కేటాయించారు. గత మూడేళ్లలో ఇదే అత్యధిక కేటాయింపు. రానున్న దశాబ్ద కాలంలో అంతరిక్ష పరిశోధనలను పెంచుతామని ఆర్థిక మంత్రి పియూష్ గోయెల్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. గగన్‌యాన్‌ను ప్రయోగించడం ద్వారా ఇతర దేశాల ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించే వేదికగా భారత్ నిలిచిందన్నారు. 2022 నాటికి భారత వ్యోమోగాములను కూడా అంతరిక్షంలోకి పంపించి చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. పునర్వినియోగ అంతరిక్ష వాహనాన్ని తయారు చేయడంపై ఇస్రో కసరత్తు చేస్తోందన్నారు.

ఆటలో గెలిచేదెవరు?





వరాలతో దూకుడు పెంచిన మోదీ.. 30 కోట్ల ఓటర్లను ప్రభావితం చేసే ప్రతిపాదనలు

కీలక ఓటుబ్యాంకులపై రాయితీల వల.. కాంగ్రెస్ ఎజెండాపై యుద్ధానికి ముందే దెబ్బ


గాంధీల ప్రచారానికి ఇక ఆయుధాలు కరువు?.. ఓట్ల వేటలో రాహుల్ దారెటు?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పీయూష్ గోయెల్ మధ్యంతర పద్దు పేరుతో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ ప్రసంగం ముగియగానే ఇది "మోదీ బచావో యోజనా బడ్జెట్" అనీ, "ప్రధానమంత్రి రీఎలక్షన్ యోజనా" అనీ చాలా మీడియా సంస్థలో వచ్చిన వ్యాఖ్యానాలు వచ్చాయి. తరచి చూస్తే గోయల్ ఓ దేశ బడ్జెట్‌ను కాకుండా ఓ ఎన్నికల ర్యాలీ ప్రసంగపాఠాన్ని వినిపించినట్లు కొందరు అభిప్రాయపడ్డారు. ఎందులోనూ పూర్తి స్పష్టత లేకుండా, పైపై మెరుగులతో, నాటకీయంగా సాగిన ఆ ప్రసంగం..బీజేపీ శ్రేణులకు మాత్రం కర్ణపేయంగా మారింది.

ఎన్నికల అవసరాలను పూర్తిగా గుర్తెరిగి- గురి చూసి సంధించిన మోదీ బాణం విపక్ష శ్రేణుల్లో కొంత కలకలం రేపిందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బీజేపీకి సంప్రదాయంగా వస్తున్న ఓటుబ్యాంకు మధ్యతరగతి, పట్టణ ప్రాంత ప్రజానీకం! వారిని సంతృప్తి పరిచేలా కొన్ని వరాలను మధ్యంతర బడ్జెట్లో ప్రకటించారు తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్! కాస్త మాయ చేసినా- ఆదాయపు పన్ను విషయంలో చేసిన ప్రకటనలు సూటిగా ఉద్యోగవర్గాలను తాకేవే. మధ్యతరగతి ఎక్కువగా ఉండే పట్టణప్రాంతాన్ని సంతృప్తి పరిచేలా జీఎస్టీ రేట్ల హేతుబద్ధం, త్వరలో కొత్త ఇళ్ల నిర్మాణ జీఎస్టీని తగ్గించే అవకాశాలున్నాయన్న హామీ.. మొదలైనవి బీజేపీకి సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తాయని అంటున్నారు. నోట్ల రద్దు, బ్యాంకుల సంక్షోభం వల్ల నష్టపోయినది మధ్యతరగతి కాబట్టి ఆ వర్గాలకు చేరువయ్యేందుకు మోదీ చేసిన ప్రయత్నం ఓట్లను రాబడుతుందని కూడా అంచనా వేస్తున్నారు. ఇక ఆగ్రహంగా ఉన్న రైతులను చల్లబర్చేందుకు ప్రకటించిన 6000 రూపాయల పెట్టుబడి సాయం ఆచరణలోకి ఎలా తెస్తారు, విధివిధానాలేంటన్న చర్చ పక్కన పెడితే కొంతవరకూ గ్రామీణ ఓట్లను కొల్లగొట్టడానికి మోదీ చేసిన ప్రయత్నం ఎన్నికల్లో సానుకూలంగా మారుతుందని కూడా చెబుతున్నారు. దీంతో పాటు అసంఘటిత రంగ కార్మికులకు పింఛను పథకం కూడా కొంతవరకూ సత్ఫలితాల్నిస్తుందని బీజేపీ వర్గాలు ఆశావహంగా ఉన్నాయి. ఓ రకంగా ఈ బడ్జెట్ మోదీ ఆత్మవిశ్వాసాన్ని బయటపెట్టింది... ఎన్నికలకు ముందు రాహుల్‌కు గట్టి ఆయుధాలు లేని పరిస్థితి కల్పిస్తోంది. శుక్రవారం నాడు మిగిలిన విపక్ష నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన- వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగం, రాఫెల్, వ్యవస్థల అవినీతి మొదలైనవే ముఖ్యాంశాలవుతాయని చెప్పారు. అంటే జనాకర్షక పథకాల్లో మోదీ ముందంజలో ఉన్నట్లు ఆయన పరోక్షంగా చెప్పారు. మరి రాహుల్ చెబుతున్న నిరుద్యోగం, రాఫెల్ ఎంతవరకూ ఓట్లు రాబడతాయో సందేహమేనని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

రైతులపై నజర్

ఈ బడ్జెట్‌కు ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రెండు మెగా ప్రకటనలు చేశారు. ఒకటి: దేశవ్యాప్త రైతు రుణ మాఫీ. రెండు: పేదలకు కనీస ఆదాయ పథకం. ఈ రెంటినీ దాటేస్తూ మోదీ తాయిలాలు విదిల్చారు. రైతుకు సొమ్మును నేరుగా ఖాతాలో వేయడం ఎంత ప్రయోజనకారి అవుతుందో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నిరూపించడంతో ఆయన ఆ దారిని ఎంచుకున్నారు. రుణమాఫీ కేవలం 10 శాతం రైతులకు మాత్రమే ఊరటనిస్తుందని కొన్ని వారాలుగా ప్రభుత్వ నేతలు, మంత్రులు, మోదీ కూడా కొట్టిపారేస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ తాయిలాలు ఎన్నికల సమరోత్సాహంలో ఉన్న కాంగ్రెస్‌కు జవాబు చెప్పలేని స్థితిని కల్పించాయి. ఈ ప్రసంగం ముగిసిన వెంటనే అనేక చర్చావేదికల్లో మీ పథకం కంటే మా జాతీయ ఉపాధి హామీ పథకం గొప్పదనీ, రైతుల మాట సరే కౌలు దార్లు, వ్యవసాయ కూలీలకు ఏం ఇచ్చారనీ కాంగ్రెస్ వాదిస్తోంది. అయితే ఇది పెద్దగా రైతాంగానికి పట్టదని, ఎంత సొమ్ము అకౌంట్లో పడింది, పండిన పంటకు ఎంత మద్దతు ధర ఇస్తారన్నదే కీలకమని బీజేపీ అభిప్రాయం. కాంగ్రెస్ ఎన్ని లెక్కలు వినిపించినా ఇన్‌కంటాక్స్ ఎంత తగ్గించుకోడానికి అవకాశం ఉందన్నదే మధ్యతరగతి ఆలోచిస్తుందని బీజేపీ అంటోంది.



పెరగనున్న సబ్సిడీల భారం


గత ఏడాది కన్నా 30 వేల కోట్లు అదనంగా కేటాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రభుత్వంపై సబ్సిడీల భారం మరింత పెరగబోతోంది. ఎరువులు, ఆహార పదార్థాలు, పెట్రోలియం ఉత్పత్తుల సబ్సిడీలకుగాను గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈసారి రూ.30 వేల కోట్లకు పైగా అదనంగా కేటాయించడమే ఇందుకు కారణం. ఈ మూడు రంగాల్లో కలిపి సబ్సిడీలకు 2018-19లో రూ.2,66,206 కోట్లు కేటాయించగా.. తాజా బడ్జెట్‌లో దానిని రూ.2,96,684 కోట్లకు పెంచారు. ప్రత్యేకించి పెట్రోలియం ఉత్పత్తుల సబ్సిడీలకే రూ.12,645 కోట్లు పెరిగాయి. ఈ రంగానికి గత బడ్జెట్‌లో రూ.24,833 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.37,478 కోట్లకు పెంచారు. ఇక ఆహార పదార్థాల సబ్సిడీలకు 12,922 కోట్ల కేటాయింపులు పెరిగాయి. గత ఏడాది ఇది రూ.1,71,298 కోట్లుగా ఉండగా.. ఈసారి రూ.1,84,220 కోట్లు కేటాయించింది. కాగా ఎరువులకు సబ్సిడీ కింద గత ఏడాది (రూ.70,075 కోట్ల) కన్నా ఈసారి 4వేల కోట్లకు పైగా అదనంగా రూ.74,986 కోట్లు కేటాయించడం గమనార్హం.

ఏ వర్గానికి ఎంత లబ్ధి!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వేతనజీవులకు పన్ను రాయితీ! అన్నదాతకు నగదు బదిలీ! అసంఘటిత కార్మికులకు మెగా పెన్షన్ స్కీం! సమాజంలోని దాదాపు అన్ని వర్గాలనూ సంతృప్తిపరచడానికి బడ్జెట్లో ప్రయత్నించారు. ఆ వివరాలు..

ఉద్యోగులు



ఐదు లక్షల వరకూ పన్ను ఆదాయంపై రిబేటు ఇచ్చారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.40 వేల నుంచి రూ.50 వేలకు పెంపు. బ్యాంకు, పోస్టాఫీసు డిపాజిట్ల వడ్డీపై టీడీఎస్ రాయితీ రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంపు. గ్రాట్యుటీ పరిమితి రూ.10 లక్షల నుంచి 30 లక్షలకు పెంపు

ఇళ్ల యజమానులు



అద్దెల ఆదాయంపై టీడీఎస్ పరిమితి రూ.1.8 లక్షల నుంచి రూ.2.4 లక్షలకు పెంపు. ఇప్పటి వరకూ ఒక ఇంటిపై ఉన్న క్యాపిటల్ గెయిన్స్ రిబేటు రెండు ఇళ్లకు వర్తింపు.

రైతులు



పెట్టుబడి సాయం ఒక్కో రైతుకు ఏడాదికి రూ.6000. విపత్తుల్లో నష్టపోయిన రైతులకు అదనంగా 2% వడ్డీ రాయితీ.

చిరుద్యోగులు



అసంఘటిత రంగంలోని కార్మికులు నెలకు రూ.100 చొప్పున చెల్లిస్తే.. 60 ఏళ్లు దాటిన తర్వాత వారికి నెలకు రూ.3000 చొప్పున పింఛను. ఈ పథకం ద్వారా 10 కోట్లమంది లబ్ధి పొందుతారని బడ్జెట్లో ప్రకటిస్తే.. 30-40 కోట్లమంది లబ్ధి పొందుతారని మోదీ చెప్పడం విశేషం.

గ్రామీణ ప్రాంతాలు



గ్రామ సడక్ యోజన కింద గ్రామీణ రోడ్లకు రూ.19 వేల కోట్ల కేటాయింపు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.60 వేల కోట్లకు పెంపు.

నష్టపోయేది వీళ్లే..

ఈ ఏడాది బడ్జెట్‌తో రైతులకు, పన్ను చెల్లింపుదారులకు, గ్రామీణ భారతానికి, అసంఘటిత కార్మికులకు, రియల్ ఎస్టేట్‌కు, ఆటోమొబైల్ సంస్థలకు లాభం చేకూరనుంది. అయితే, బడ్జెట్ కొందరికి తీవ్ర నష్టాన్ని మిగల్చనుంది.

బాండ్ హోల్డర్లు




మోదీ ప్రభుత్వం ఈ ఏడాది కూడా ద్రవ్యలోటు లక్ష్యాన్ని మించి పోయింది. ఈ నేపథ్యంలో మూడీస్ లాంటి సంస్థలు భారత్‌కు రేటింగ్ తక్కువగా ఇస్తే బాండ్ హోల్డర్లు భారీ నష్టాన్ని చవిచూసే అవకాశం ఉంది. రెవెన్యూను పెంచే కొత్త పథకాలేవీ బడ్జెట్‌లో లేవని ఇప్పటికే మూడీస్ ప్రకటించింది.

ప్రతిపక్షాలు



రైతులు, మధ్యతరగతికి అనువుగా, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలకు ఊతమిచ్చేలా బడ్జెట్ ఉండటం మోదీ ప్రభుత్వానికి కలిసొచ్చే అంశం. ఎన్నికలలోగా కొత్త పథకాలను అమలు చేస్తే ప్రతిపక్ష పార్టీలు మరింత నష్టపోయే అవకాశం ఉంది.

రైతు కూలీలు



ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఏటా రూ.6వేలు అందిస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే, భూమి లేని రైతు కూలీలకు ఎలాంటి సహాయం అందబోదు.

రక్షణ రంగం



గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం 21వేల కోట్లనే ఎక్కువగా రక్షణ రంగానికి కేటాయించింది. గత ఏడాది 2.85 లక్షల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది 3.06 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో ఎక్కువగా కొత్త ఆయుధాల కొనుగోలుకు, ఖర్చులకే పోతోంది. ఇక, ఆర్మీ ఉద్యోగుల జీతాలు పెంచుతామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం సరిపోదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేంద్రంలోనూ మత్స్యశాఖ

» చేపల ఉత్పత్తిలో రెండోస్థానంలో భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: చేపల ఉత్పత్తిలో భారత్‌దే రెండోస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న చేపల్లో మన వాటా 6.3శాతంగా ఉంది. దేశీయంగా ఏటా సగటున 7శాతం వృద్ధి నమోదవుతోంది. క్షేత్రస్థాయిలో 1.45 కోట్ల మందికి ఈ రంగం జీవనోపాధి కల్పిస్తోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రంగానికి మరింత అండగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సుస్థిర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మత్స్యశాఖను ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మత్స్యశాఖ కూడా కీలక 'గ్రోత్ ఇంజిన్'గా మారిన నేపథ్యంలో చేపలసాగు చేస్తున్న వారికి కూడా రైతులతో సమాన గౌరవం కల్పిస్తామని ప్రకటించింది.



చేపలసాగు చేస్తున్న రైతులకు ఇప్పటికే కిసాన్ క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తెచ్చిన కేంద్రం... ఈ సారి వాటి ద్వారా పొందే రుణాలపై 2శాతం చొప్పున వడ్డీ రాయితీని ప్రకటించింది. రుణాలన్నీ సక్రమంగా తిరిగి చెల్లించిన మత్స్యరైతులు అదనంగా మరో 3శాతం వడ్డీ రాయితీ పొందుతారని గోయల్ వివరించారు. ఈ రుణాలు పొందే ప్రక్రియను సైతం ప్రభుత్వం సరళీకరించింది.

ఎన్నికల నిర్వహణకు 666 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వాటి నిర్వహణకు బడ్జెట్‌లో న్యాయశాఖకు అదనంగా రూ.666.66 కోట్లు కేటాయించారు. ఎన్నికల సంఘం న్యాయ శాఖ కిందకే వస్తున్నందున ఆ శాఖకు ఈ మొత్తాన్ని కేటాయించారు. ఎన్నికల నిర్వహణ, రవాణా, భద్రత కోసం ఈ మొత్తాన్ని వాడనున్నారు. వీటికి అదనంగా ఎన్నికల సంఘానికి రెవెన్యూ సెక్షన్ కింద రూ.12.14 కోట్లు, ఓటర్ల అవగాహన కోసం 16.67 కోట్లు అందజేయనున్నారు.

పరిశో'ధనం'

వచ్చే నాలుగేళ్లలో 'రైజ్'కు లక్ష కోట్లు.. విద్యా రంగానికి రూ.93,847 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: విద్యా రంగం పునరుత్తేజానికి మధ్యంతర బడ్జెట్‌లో 'రైజ్ 2022' పేరిట పథకం ప్రకటించారు. ముఖ్యమైన వైద్య, ఇతర విద్యా సంస్థల్లో పరిశోధనలకు, వాటి కోసం సదుపాయాల కల్పనకు వచ్చే నాలుగేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేయాలన్నదని 'రైజ్ (ఆర్ఐఎస్ఈ) లక్ష్యం. ఈ బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.93,847 కోట్లు కేటాయించారు. ఇది మునుపటి (రూ.85,010 కోట్లు) కంటే 10% అధికం. పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిచ్చారు. ఇంతకుముందు రూ.350.23 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.608.87 కోట్లకు పెంచారు. రెండు పూర్తిస్థాయి 'ప్లానింగ్, ఆర్కిటెక్చర్ స్కూల్స్ (ఎస్పీఏ)' ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఐఐటీలు, ఎన్ఐటీల్లో కూడా 18 కొత్త ఎస్పీఏలను స్వయం ప్రతిపత్తితో నెలకొల్పాలని సంకల్పించింది. విద్యలో నాణ్యత పెంపొందించడంలో టెక్నాలజీ పాత్ర చాలా కీలకమంటూ 'బ్లాక్ బోర్డు' నుంచి 'డిజిటల్ బోర్డు'కు మళ్లడమే లక్ష్యమని ప్రకటించారు. అన్ని పాఠశాలల్లో 'ఆపరేషన్ డిజిటల్ బోర్డు' అమలు కోసం విధి విధానాల రూపకల్పనకు ఉన్నతస్థాయి కమిటీని నియమించామని తెలిపారు. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు 'దీక్ష' పేరిట డిజిటల్ పోర్టల్ ప్రారంభించామని చెప్పారు.

రూ.కోట్లలో	
మొత్తం	93,847.64
ఉన్నత విద్య	37,461.01
పాఠశాల విద్య	56,386.63



ఐఐటీ, ఐఐఎంలకు కోత


ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్‌లకు బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. యూజీసీ, ఏఐసీటీఈలకూ తగ్గించేశారు. 2019 విద్యా సంవత్సరం నుంచే పేదల కోటా అమలు చేయాలని, దీని కోసం దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు, వర్సిటీల్లో 25% సీట్లు పెంచాలని నిర్ణయించిన సమయంలో కేటాయింపులు తగ్గించడం గమనార్హం. ఐఐఎంలకు గతంతో పోలిస్తే 60% కోత పెట్టారు.

ఆయుష్మాన్ భారత్‌కు అరకొర!

రూ. 6,500 కోట్లు కేటాయింపు
ఆరోగ్య రంగం పెదవివిరుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: గత రెండు బడ్జెట్లలో కంటే ఈసారి ఆరోగ్య రంగానికి కేటాయింపులు పెరిగాయి. మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకానికి రూ.6,400 కోట్లతో సరిపెట్టడం గమనార్హం. ఈ స్కీంకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తారన్న వైద్య రంగం ఆశలపై బడ్జెట్ నీళ్లు చల్లింది. ఆరోగ్య రంగానికి రూ.61,398 కోట్లు కేటాయించారు. ఇది 2018-19 కంటే 16 శాతం అధికం. ఆయుష్మాన్ భారత్ పథకంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు రూ.250 కోట్లు కేటాయించారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం కింద 2022 నాటికి 1.5 లక్షల సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా మారుస్తారు. వీటిలో బీపీ, షుగర్, కేన్సర్, వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించేలా చూస్తారు. దీనికి 1,350.01కోట్లు కేటాయించారు. జాతీయ ఆరోగ్య పథకానికి రూ.31,745 కోట్లు కేటాయించారు. కేన్సర్, డయాబెటిస్, కార్డియో-వాస్క్యులర్ వ్యాధి, స్ట్రోక్ నివారణ కార్యక్రమానికి నిధులను తగ్గించేశారు.

కీలక రంగాలు.. కేటాయింపులు



తడిసిన తారాజువ్వ



ఈ బడ్జెట్ తడిసిన తారాజువ్వ లాంటిది. అది వెలగదు. రైతులకు మూడు విడతల్లో రూ. 6 వేలు ఇస్తామన్నారు. అంటే.. నెలకు రూ. 500. ఆ మొత్తంతో రైతులు గౌరవప్రదంగా బతకగలరా?

- శశిథరూర్, కాంగ్రెస్ ఎంపీ

సమ్మిళిత వృద్ధి భేష్



దేశ ఆర్థిక వ్యవస్థలో సమ్మిళిత వృద్ధి బాగుంది. భారత్ ఆర్థికంగా బలపడుతోంది. అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి పియూష్‌గోయల్‌కు నా అభినందనలు.

- ముక్తార్ అబ్బాస్ నక్వీ, కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి

5 లక్షల వరకు ఐటీ లేదు

రిబేటుతో ఊరటనిచ్చిన గోయల్.. శ్లాబులన్నీ యథాతథం.. ఉద్యోగుల ఉసూరు

- 5 లక్షల పైబడి పన్ను పడే ఆదాయం ఉంటే లబ్ధి లేదు
- ప్రామాణిక తగ్గింపు మరో 10 వేలతో సరి
- వడ్డీపై ఇక 40 వేల వరకు నో టీడీఎస్
- గ్రాట్యుటీ పరిమితి 30 లక్షలకు పెంపు
- రెండో ఇంటికి నోషనల్ అద్దె ఇక రద్దు
- అద్దెపై టీడీఎస్ పరిమితి 2.4 లక్షలకు పెంపు
- మూలధన లాభంతో ఇక 2 ఇళ్లు కొనొచ్చు
- జీవితకాలంలో ఒకేసారి ఈ అవకాశం
- 5 లక్షలు దాటిన వారికి పూర్తి బడ్జెట్‌లో ఊరట: మంత్రి
- ఉసూరుమన్న ఉద్యోగులను ఊరుకోబెట్టే యత్నం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఒక్క ప్రకటన.. దాదాపు రెండు నిమిషాల పాటు 'మోదీ.. మోదీ.. మోదీ...' అంటూ అధికార పక్ష సభ్యుల హర్షధ్వానాలు. దేశవ్యాప్తంగా కూడా మధ్య తరగతి వేతన జీవుల్లో ఆనందాతిరేకాలు. కానీ ఆ ఆనందం ఒక్క అరగంటలోనే ఆవిరైపోయింది. అంత రాగం తీసి ఇచ్చింది ఇంతేనా.. అంటూ వారంతా ఒక్కసారిగా డీలా పడిపోయారు. ఆదాయ పన్నుకు సంబంధించి మంత్రి పీయూష్ గోయల్ చేసిన ప్రకటన ఇంత సందిగ్ధానికి దారి తీసింది. మొత్తంగా చూస్తే వేతన జీవులకు వచ్చే ఊరట బహు స్వల్పమని కాసేపటికే తేలిపోయింది. పన్ను వేయదగ్గ ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న వారు ఇకపై ఆదాయ పన్ను చెల్లించనక్కర్లేదన్నది పీయూష్ చేసిన ప్రకటన. పైకి ఆదాయ పన్ను పరిమితిని పెంచినట్లు కనిపించిన ఈ ప్రకటన వెనుక ఉన్న లోగుట్టును చూస్తే.. ఆయన పెంచింది ఐటీ శ్లాబును కాదు.. రూ.5 లక్షల వరకు పన్ను వేయదగ్గ ఆదాయం ఉన్న వారికి రిబేటును మాత్రమే. ఈ విషయంలో మంత్రి పదాలను జాగ్రత్తగా ఏర్చికూర్చి వాడారు. "పన్ను వేయదగిన ఆదాయం రూ.5 లక్షల దాకా ఉన్న వారికి పూర్తి స్థాయి పన్ను రాయితీ ఇస్తున్నాం. అంటే వారు ఇకపై ఆదాయపు పన్ను కట్టాల్సిన అవసరం లేదు. పీఎఫ్, నిర్దిష్ట పొదుపు పథకాలు, బీమా వంటి వాటిలో మదుపు చేసేవారి స్థూల ఆదాయం రూ.6.5 లక్షల దాకా ఉన్నా కూడా ఆదాయ పన్ను కట్టాల్సిన పని లేదు. ఇంటి రుణంపై వడ్డీ, విద్యా రుణాలపై వడ్డీ, జాతీయ పింఛను పథకం, ఆరోగ్య బీమా వంటి వాటిని కూడా కలుపుకొంటే అంతకన్నా ఎక్కువ స్థూల ఆదాయం ఉన్నా కూడా ఆదాయ పన్ను కట్టక్కర్లేదు. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న 3 కోట్ల మంది మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు రూ.18,500 కోట్ల మేరకు లబ్ధి చేకూరుతుంది" అని మంత్రి ప్రకటించారు. వాస్తవానికి.. పన్ను వేయదగిన ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉన్న వారికి ప్రభుత్వ నిర్ణయం ఉపశమనం కలిగించేదే. కానీ.. ఆ ఆదాయం 5 లక్షలు దాటిన వారికి మాత్రం ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ఎలాంటి ఉపయోగమూ లేదు. ఎందుకంటే ప్రభుత్వం పన్ను మినహాయింపు పరిమితిని ఇప్పుడున్న రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు రెట్టింపు చేయలేదు. కేవలం పన్ను రిబేటును మాత్రం పెంచింది. గత ఏడాది ఈ రిబేటు రూ.2,500 ఉండగా.. దాన్ని రూ.12,500కు పెంచుతూ ఆర్థిక బిల్లులో ప్రతిపాదన పెట్టింది. పన్ను శ్లాబులను మాత్రం యథాతథంగా ఉంచింది. దీని ప్రకారం.. పన్ను వేయదగిన ఆదాయం రూ.5 లక్షలకు మించి ఉండే ఉద్యోగులు ఎప్పటిలాగానే రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా 5 శాతం పన్ను, ఆ పైన ఆదాయానికి 20% పన్ను కట్టి తీరాల్సిందే. ఈ విషయం తెలిశాక ఆ పరిధిలోకి వచ్చే చాలా మంది హతాశులయ్యారు. ప్రభుత్వం పన్ను మినహాయింపు పరిధిని రెట్టింపు చేయలేదని.. కేవలం రిబేటు మాత్రమే ఇచ్చిందని, పన్ను వేయదగిన ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉన్నవారికి మాత్రమే ఆ రిబేటు వర్తిస్తుందని తెలిసి లబోదిబోమన్నారు. ప్రభుత్వం వారికి కలిగించిన ఉపశమనమల్లా.. ప్రామాణిక తగ్గింపును రూ.10 వేల మేర పెంచడం మాత్రమే. తాత్కాలిక బడ్జెట్ కాబట్టి పూర్తి మార్పుల జోలికి వెళ్లడం లేదంటూనే, ప్రామాణిక తగ్గింపు సహా మరికొన్ని మార్పులనూ మంత్రి పార్లమెంటు ముందుకు తేవడం గమనార్హం.



పన్ను పరిమితి పెంపు కాదు..
రాయితీ పెంపు

ఈసారి బడ్జెట్‌లో పన్ను మినహాయింపు పరిమితి 5 లక్షల దాకా పెంచుతారని అందరూ అనుకున్నారు. బడ్జెట్ ప్రసంగంలో పీయూష్ గోయల్ రూ.5లక్షలు అన్నప్పుడు.. పన్ను పరిమితిని రెట్టింపు చేశారని భావించారు. కానీ, వాస్తవంగా పన్ను పరిమితిని పెంచలేదు. ఇంతకు ముందు రూ.2500గా ఉన్న పన్ను రాయితీని రూ.12,500కు పెంచారంతే. ఉదాహరణకు.. ఒక వ్యక్తి పన్ను చెల్లించదగిన ఆదాయం రూ.6.5 లక్షలుంటే అందులో రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా 5 శాతం పన్ను, మిగతా లక్షన్నరపై 20 శాతం పన్ను కట్టాల్సిందే. పన్ను చెల్లించదగిన ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన టాక్స్ రిబేట్‌తో ఉపశమనం.

-కుందేరు గోపాల్, చార్టర్డ్ అకౌంటెంట్, విజయవాడ

పీయూష్ పిల్లిమొగ్గలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: బడ్జెట్లో రెండు పెద్ద పథకాలను ప్రకటించిన ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్.. వాటిపై విమర్శలు రావడంతో పిల్లిమొగ్గలు వేశారు. వేతన జీవులకు రూ.5 లక్షల వరకూ పన్ను ఆదాయంలో ఊరట అని బడ్జెట్లో ప్రకటించారు. తీరా, పన్ను ఆదాయం ఐదు లక్షలు దాటితే, ఎటువంటి మినహాయింపు వర్తించదని, ఎప్పట్లాగే ఆదాయ పన్ను కట్టక తప్పదనే నిజం బయటపడింది. దాంతో, పీయూష్ విలేకరులతో మాట్లాడుతూ, ఇది మధ్యంతర బడ్జెట్ మాత్రమేనని, పూర్తిస్థాయి బడ్జెట్లో పన్ను ఆదాయం ఐదు లక్షలు దాటిన వారికి ఊరట ఉండవచ్చని చెప్పారు. ఇక, రైతులకు ఏడాదికి రూ.6000 పెట్టుబడి సాయం ఇస్తామని బడ్జెట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో, రైతుకు రోజుకు రూ.17 మాత్రమేనా!? ఇది ఏ మూలకు!? అని రాహుల్ ప్రశ్నించారు. దాంతో, ఎన్డీటీవీతో మాట్లాడిన గోయల్.. రైతులకు గౌరవ సూచకంగానే దీనిని ఇస్తున్నామని, ఇది కూడా ప్రాథమిక చర్య మాత్రమేనని వ్యాఖ్యానించారు.

ఈ శ్లాబులు యథాతథం!

ఆదాయం (రూ.లలో)	పన్ను
0 నుంచి 2.5 లక్షలు	నిల్
2.5 లక్షల పైన- 5 లక్షల లోపు	5%
5 లక్షలపైన- 10 లక్షల లోపు	20%
10 లక్షల పైన	30%

-మహిళలు, సీనియర్ సిటిజన్లు, సూపర్ సీనియర్ సిటిజన్లకు మినహాయింపు పరిమితులు మరింత అధికంగా ఉన్నాయి.

ఐటీ.. మార్పులివీ..

సెక్షన్ 87ఏలో ఇప్పటిదాకా ఉన్న రూ.2,500 పన్ను రిబేటును రూ.12,500 వరకు పెంచారు.

ప్రామాణిక తగ్గింపును ప్రస్తుతమున్న రూ.40 వేల నుంచి రూ.50 వేలకు పెంచారు.

బ్యాంకులు, పోస్టాఫీసుల వంటి వాటిలో చేసే డిపాజిట్లపై వచ్చే వడ్డీ రూ.10 వేలు దాటితే ఇన్నాళ్లూ దానికి మూలం వద్ద పన్ను (టీడీఎస్) కట్టాల్సి వచ్చేది. ఇప్పుడా మొత్తాన్ని రూ.40 వేలకు పెంచారు.

గ్రాట్యుటీ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు.

సొంత ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన మూలధన లాభం రూ.2 కోట్ల లోపు ఉంటే, ఇకపై ఆ సొమ్ముతో 2 నివాస గృహాలు కొనుగోలు చేసేందుకు అనుమతిస్తారు. ఇప్పటిదాకా ఒక్క ఇంటికే ఈ అవకాశం ఉండేది.

చెల్లించే అద్దె నుంచి టీడీఎస్ మినహాయించాల్సిన పరిమితిని రూ.2.4 లక్షలకు పెంచారు. ఇప్పటిదాకా ఈ పరిమితి రూ.1.8 లక్షలుగా ఉంది.

సొంత నివాసంగా వాడుకునే ఇళ్లు రెండు ఉన్నప్పుడు, రెండో దానిపై పరిగణించే 'రాదగు అద్దె'కు ఇకపై ఆదాయ పన్ను చెల్లించనక్కర్లేకుండా మినహాయింపు ఇచ్చారు.

5 లక్షల వారికే పెద్ద ఊరట!

ఆదాయం	ఇప్పటిదాకా పన్ను	ఇకపై
2.5 లక్షల వరకు	నిల్	నిల్
3 లక్షల వరకు	2,600	నిల్
4.5 లక్షల వరకు	10,400	నిల్
5 లక్షల వరకు	13,000	నిల్

కాస్త దాస్తే 60 వేల జీతానికీ ఓకే!


ఉదాహరణకు గోపాల్ అనే ఉద్యోగికి నెలకు రూ.60 వేల వరకు జీతభత్యాలు ఉన్నా మారిన మినహాయింపుల తర్వాత పన్ను పరిధి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. కాకుంటే ఆయన పిల్లల ఫీజులు, సెక్షన్ 80సీ పరిధిలోకి వచ్చే పథకాల్లో పొదుపు చేయడం వంటివి చేయాల్సి ఉంటుంది.

జీతం	7,20,000
80సీ మినహాయింపులు	(-) 1,50,000
ప్రామాణిక తగ్గింపు	(-) 50,000
ఆరోగ్య బీమా, వైద్య ఖర్చులు	(-) 25,000
పన్ను పడే ఆదాయం	4,95,000
రూ.5 లక్షల లోపు పూర్తి రిబేటు ఇస్తున్నందున పడే పన్ను	00

వారికి ప్రధాన బడ్జెట్‌లో ఊరట!

రూ.5 లక్షలకు పైబడిన వారిపై గోయల్ స్పందన

శ్లాబు మార్చకుండా, రిబేటు పెంపుతో సరిపెట్టడంపై ఉసూరుమన్న వేతన జీవులను ఊరుకోబెట్టేందుకు మీడియా సమావేశంలో మంత్రి పీయూష్ ప్రయత్నించారు. రూ.5 లక్షలకు పైబడి పన్ను ఆదాయం గల పన్ను చెల్లించే వారికి ఊరట కల్పించే అంశాన్ని ప్రధాన బడ్జెట్‌లో ప్రభుత్వం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. తాత్కాలిక బడ్జెట్ కావడంతో తనకు చాలా పరిమితులున్నాయని, జూలైలో పెట్టే పూర్తి బడ్జెట్‌లో అన్ని రకాల మినహాయింపులను ఇచ్చే వెసులుబాటు ఆర్థిక మంత్రికి ఉంటుందని వివరించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోనే తదుపరి ప్రభుత్వం కూడా ఏర్పడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.



ఏ శ్లాబులో ఎందరికి లబ్ధి? 2017-18 అసెస్‌మెంట్ సంవత్సరం లెక్కల ప్రకారం చూసినప్పుడు రూ.5 లక్షల ఆదాయం వరకు రిబేటు రూపంలో పన్ను ఊరట లభించే వ్యక్తిగత అసెసీల సంఖ్య ఇలా ఉంది..

ఆదాయం (లక్షల్లో)	ఎందరు అసెసీలు
2.5-3.5	30,09,390
3.5-4	15,93,322
4-4.50	16,86,545
4.5-5	16,67,740

పన్ను ఆదాయం.. (రూ. కోట్లలో)

	2017-18 వాస్తవ	2018-19 బ.అం	2018-19 స.అం	2019-20
కార్పొరేట్ పన్ను	5,71,201	6,21,000	6,71,000	7,60,000
ఆదాయపన్ను	4,30,772	5,29,000	5,29,000	6,20,000
సంపద పన్ను	63.43	---	---	---
కస్టమ్స్ సుంకం	1,29,029	1,12,500	1,30,038	1,45,388
కేంద్ర ఎక్సైజ్ సుంకం	2,58,833	2,59,600	2,59,612	2,59,600
సేవా పన్ను	81,228	---	9,283	---
జీఎస్‌టీ	4,42,561	7,43,900	6,43,900	7,61,200
ఇతరత్రా	4,720	5,241	5,342	5943
మొత్తం	19,18407	22,71,241	22,48,175	25,52,131
విపత్తు శాఖ వాటా	-3515	-2,500	-2,315	-2480
రాష్ట్రాల వాటా	-6,73,005	-7,68,412	-7,36,879	-8,44,605
రాష్ట్రాల వాటా(సవరణ)		-19,679	-24,574	
నికర పన్ను ఆదాయం	12,42,488	14,80,650	14,84,407	17,05,046

అసాధారణ 'పన్ను' మార్పులు!

- తాత్కాలిక బడ్జెట్‌లోనూ మోదీ మార్కు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తాత్కాలిక బడ్జెట్‌లోనూ మోదీ మార్కు కనిపించింది. ఎన్డీయే సర్కారు తాజా బడ్జెట్‌లో అసాధారణ నిర్ణయాలు తీసుకుంది. 2019-20కి గాను ప్రవేశపెట్టింది తాత్కాలిక బడ్జెట్ అయినప్పటికీ ముందెన్నడూ లేని విధంగా ప్రత్యక్ష పన్నుల విధానంలో భారీ మార్పులు ప్రకటించారు. ఒక తాత్కాలిక బడ్జెట్‌లో ఇంతటి భారీ స్థాయిలో మార్పులు గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదు. వాస్తవానికి మోదీ సర్కారు జులై 2014లో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లోనే పన్నుల విధానంలో భారీ మార్పులు చేశారు. తాజా బడ్జెట్‌లో పీయూష్ గోయల్ రూ.5 లక్షలు ఆదాయం కలిగిన వారికి పూర్తిగా పన్ను రిబేటు, స్టాండర్డ్ మినహాయింపు పరిమితిని రూ.50 వేలకు పెంచడం, బ్యాంకు డిపాజిట్లపై వచ్చే ఆదాయ పరిమితిని రూ.50 వేలకు పెంచడం వంటి అనేక మార్పులు ప్రకటించారు.

- మోదీ సర్కారు 2014 జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితిని 2 లక్షల నుంచి 2.5 లక్షలకు పెంచారు. ఆదాయ పన్ను నుంచి మినహాయింపునిచ్చే సెక్షన్ 80(సీ) కింద పొదుపు చేసే మొత్తాన్ని రూ.లక్ష నుంచి లక్షన్నరకు పెంచారు.
- ఇంటి రుణంపై వడ్డీకి ఆదాయ పన్ను నుంచి ఇచ్చే మినహాయింపును రూ.1.5లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచారు.
- 2017-18 బడ్జెట్‌లో రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య ఆదాయం కలిగిన వారికి పన్ను రేటును 10 నుంచి 5 శాతానికి తగ్గించారు.
- 2018-19 బడ్జెట్‌లో ఉద్యోగులకు స్టాండర్డ్ మినహాయింపును రూ.40వేలకు పెంచారు.

తాత్కాలిక బడ్జెట్‌ను స్వల్ప కాలానికి మాత్రమే అంటే రెండు ప్రభుత్వాల ఏర్పాటు మధ్య కాలానికే ప్రవేశపెడతారు. సాధారణంగా ఇలాంటి బడ్జెట్లలో పన్నులకు సంబంధించిన చర్యలేవీ తీసుకోరు. కానీ, గతంలో పరోక్ష పన్నుల్లో మార్పులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు 2014 ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం తయారీ రంగానికి ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిర్ణయం 2014 జూన్ 30 వరకు వర్తిస్తుందని తెలిపారు. అంటే ఆ నిర్ణయాన్ని తదుపరి సర్కారు ప్రవేశపెట్టే పూర్తి బడ్జెట్‌లో సమీక్షించే అవకాశం ఉంటుంది.

28 లక్షల కోట్ల భారీ బడ్జెట్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం రూ.27.84 లక్షల కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 1తో మొదలయ్యే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొద్ది నెలలకే ఈ మధ్యంతర బడ్జెట్ వర్తించినప్పటికీ మొత్తం 12 నెలలకు అంచనా వేయడం ఆనవాయితీ. ఇక్కడా అదే చేశారు. జూన్‌లో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. గడుస్తున్న ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలను రూ.24.57 లక్షల కోట్లుగా ఖరారు చేశారు. తాజా బడ్జెట్‌లో 6.84 శాతం పెరుగుదల కనిపించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ ఆదాయం రూ.17.05 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన రెవెన్యూ ఆదాయం కన్నా 2.20 లక్షల కోట్లు ఎక్కువ. అయితే, 2019-20లో రెవెన్యూ లోటు 4.70 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ద్రవ్యలోటు ఏకంగా 7.03 లక్షల కోట్లు అంచనా వేస్తున్నారు.



బడ్జెట్‌ను సమర్పించిన అనంతరం రాష్ట్రపతి కోవింద్‌తో పీయూష్ గోయల్ కరచాలనం.

10 లక్షలు వచ్చినా పన్ను పడకూడదంటే!

పన్ను శ్లాబులు యథాతథమన్న మంత్రి గోయల్ ప్రకటన నేపథ్యంలో చూస్తే.. పన్ను విధించదగ్గ ఆదాయం రూ.5 లక్షలకు పైగా ఉన్న వారికి చెప్పుకోదగిన ఊరట ఏమీ ఉండదు. కానీ ఇంటి రుణం, 80సీలోని బీమా వంటి పొదుపు ద్వారా రూ.10 లక్షల స్థూల ఆదాయమున్నా పన్ను భారం నుంచి తప్పించుకోవచ్చన్నది ఐటీ నిపుణుల మాట. దానికి ఓ చిన్న ఉదాహరణ..

వివరం	మొత్తం
జీతం	10,00,000
80సీ మినహాయింపులు	(-) 1,50,000
ప్రామాణిక తగ్గింపు	(-) 50,000
ఇంటి రుణంపై వడ్డీ	(-) 2,00,000
ఎన్‌పీఎస్‌లో పొదుపు	(-) 50,000
ఆరోగ్య బీమా, వైద్య ఖర్చులు	(-) 50,000
పన్ను పడే ఆదాయం	5,00,000
రూ.2.5 లక్షల ప్రాథమిక మినహాయింపు పోగా మిగతా 2.5 లక్షలపై పడే పన్ను	12,500
సెక్షన్ 87(ఎ) రిబేటు	12,500
నికర పన్ను	000

నాలుగేళ్లలో పన్ను ఆదాయం రెట్టింపు

- 6.38 లక్షల కోట్ల నుంచి 12 లక్షల కోట్లకు వసూళ్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగేళ్ల హయాంలో ప్రత్యక్ష పన్ను వసూళ్ల ఆదాయం రెట్టింపైంది. ఈ విషయాన్ని పార్లమెంటు సాక్షిగా బడ్జెట్ ప్రసంగంలో సాక్షాత్తూ ఆర్థిక మంత్రి పీయూష్ గోయలే ప్రకటించారు. నాలుగేళ్ల కిందట 3.79 కోట్లు ఉన్న పన్ను రిటర్నులు 2018-19 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి 6.85 కోట్లకు చేరాయని తెలిపారు. ఇక, 2013-14లో పన్ను వసూళ్లు 6.38 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ, 2018-19 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి ఇది రూ.12 లక్షల కోట్లు దాటిందని తెలిపారు.

ఆహార సబ్సిడీ 7.5% పెరుగుదల

- 1.84లక్షల కోట్ల కేటాయింపులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పటిష్ఠం కానుంది. బడ్జెట్‌లో ఆహార సబ్సిడీ కేటాయింపులను 7.5శాతం పెంపును ప్రతిపాదించారు. ఈ మేరకు ఆహార సబ్సిడీకి ఈ దఫా రూ.1.84లక్షల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఇది రూ.1.69 లక్షల కోట్లుగా.. 2017-18లో లక్ష కోట్లుగా ఉంది. ఆహారం, పెట్రోలియం, ఎరువుల సబ్సిడీల్లో 62శాతంతో ఆహార సబ్సిడీ ఎక్కువ వాటాను కలిగివుంది.


అసంఘటిత కార్మికులకు పింఛన్!

- 60 ఏళ్లు దాటిన వారికి నెలకు 3 వేలు
- 29ఏళ్ల కార్మికులు నెలకు 100 చెల్లించాలి
- 18 ఏళ్లకే చేరితే రూ.55 కడితే చాలు
- అంతే మొత్తం చెల్లించనున్న కేంద్రం
- మోదీ సర్కారు సరికొత్త పథకం

అసంఘటిత రంగ కార్మికులు.. వయసు, ఒంట్లో సత్తువ ఉన్నంత కాలం రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటారు. మరి వారికి వయసు పైబడి, పనిచేయడానికి శరీరం సహకరించని పరిస్థితులు ఎదురైనప్పుడు దిక్కెవరు? వారి ఆర్థిక అవసరాలు తీరేదెలా? కుటుంబాలను పోషించుకునేదెలా..? ఈ ప్రశ్నలకు సమాధానమే మోదీ సర్కారు ప్రకటించిన పింఛను పథకం!

తాజా బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం దేశంలోని అసంఘటితరంగ కార్మికులకు తీపి కబురు చెప్పింది. కార్మికులకు వృద్ధాప్యంలో అండగా నిలిచేందుకు పింఛన్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాంధన్(పీఎంఎస్‌వైఎం) పేరిట కార్మికులకు పింఛను పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నెలకు రూ.15 వేల లోపు ఆదాయం కలిగిన అసంఘటిత రంగ కార్మికులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద అసంఘటితరంగ కార్మికులకు 60 ఏళ్లు దాటిన తర్వాత నెలకు రూ.3వేలు పింఛను లభిస్తుంది. పీఎంఎస్‌వైఎంలో భాగంగా కార్మికులు తమ వాటా కింద నెలకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. "మేం ఈ రోజు పీఎంఎస్‌వైఎం పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ పథకం కింద అసంఘటితరంగ కార్మికులు నెలకు రూ.100 చొప్పున చెల్లిస్తే 60 ఏళ్లు దాటిన తర్వాత వారికి కచ్చితంగా నెలకు రూ.3వేలు పింఛను అందుతుంది" అని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. అదేసమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఈ పథకం కిందకు వచ్చే ఒక్కో కార్మికుడికి తన వాటాగా నెలకు రూ.100 చొప్పున చెల్లిస్తుందన్నారు. రాబోయే ఐదేళ్లలో 10 కోట్ల మందికి పైగా అసంఘటితరంగ కార్మికులు లబ్ధి పొందుతారని వివరించారు. అసంఘటితరంగ కార్మికులకు ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద పింఛను పథకం కానుందని మంత్రి పేర్కొన్నారు. దేశం మొత్తం మీద 42 కోట్ల మంది వరకు అసంఘటితరంగ కార్మికులు ఉన్నారని, వీరంతా దేశ ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. పీఎంఎస్‌వైఎం పథకానికి ప్రాథమికంగా రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు వివరించారు. పథకం ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుందన్నారు. నెలకు రూ.15వేల వరకు సంపాదించే ఆటో డ్రైవర్లు వంటి వారు కూడా ఈ పథకం పరిధిలోకి వస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయసువారు ఈ పథకంలో చేరితే నెలకు రూ.55 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. 29 ఏళ్ల వయసు వారు పథకంలో చేరితే 60 ఏళ్ల వరకు నెలకు రూ.100 చొప్పున చెల్లించాలి.







మా పథకాలనే కాపీ కొట్టారు



కేంద్ర ప్రభుత్వం మా పథకాలనే కాపీ కొట్టింది. పశ్చిమ బెంగాల్‌లో మేం ఇప్పటికే అమలు చేస్తున్న వాటిని కేంద్రం కొత్తగా ప్రకటించింది. కేంద్రం నిర్ణయాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. రాష్ట్రాలు చేసిన మంచిని కూడా కేంద్రం తమ గొప్పగా చెప్పుకుంటోంది.

- మమతాబెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

గత ఐదు బడ్జెట్లలోనూ రైతులకు మేలు



ఎన్డీయే సర్కారు ప్రవేశపెట్టిన గత ఐదు బడ్జెట్లలో రైతులకు మేలు చేకూర్చాయి. ఈ సారి బడ్జెట్‌లోనూ వారి సంక్షేమమే ప్రతిబింబిస్తూ.. వారి ఆర్థిక సాధికారతకు దోహదపడేలా ఉంది. ఇది కేవలం మధ్యంతర బడ్జెట్ మాత్రమే. మే నెలలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం జూలైలో పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

- రాధామోహన్ సింగ్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి

భారత్ @ 2030

పది కోట్ల డాలర్ల ఎకానమీగా ఆవిర్భావం!

- అపరిమిత స్టార్టప్‌లు.. అపార ఉపాధి
- సేంద్రియ ఆహారంతో ఆరోగ్య సంరక్షణ
- ఎలక్ట్రిక్ వాహనాలకు అధిక ప్రాధాన్యం
- ప్రజలందరికీ ఇంధన భద్రత
- కనిష్ఠ ప్రభుత.. గరిష్ఠ పాలన
- పది లక్ష్యాలతో విజన్-2030





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంబరాల (2022) నాటికి సరికొత్త భారతాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించిన మోదీ సర్కారు... 'విజన్ 2030' కూడా ప్రకటించింది. అందులోని పది కీలకాంశాలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అవి...

1. పది కోట్ల డాలర్ల (రూ.7,13,85,000 కోట్లు) ఆర్థిక వ్యవస్థగా భారత్. దీనికి అనువైన 'నెక్స్ట్ జనరేషన్' సదుపాయాల కల్పన!
2. అపరిమితంగా స్టార్టప్‌లు... ఉద్యోగావకాశాల కల్పన ద్వారా డిజిటల్ భారత్ నిర్మాణం.
3. పరిశుద్ధ, పర్యావరణహిత, హరిత భారతం ఆవిష్కరణ. ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహిస్తూ చమురు దిగుమతులపై ఆధారపడడం తగ్గించడం! ప్రజలకు ఇంధన భద్రత పెంచడం.
4. పారిశ్రామిక కేంద్రాలుగా గ్రామీణ ప్రాంతాలు! మేకిన్ ఇండియా ద్వారా.. క్షేత్రస్థాయి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు), స్టార్టప్‌లతో లక్ష్య సాధన!
5. నదుల ప్రక్షాళన.. ప్రతి భారతీయుడికి సురక్షిత తాగునీరు, పౌష్టిక జీవనం. సూక్ష్మ సాగు సాంకేతికత వినియోగం. 'నీలి' ఆర్థిక వ్యవస్థ (మత్స్య సంపద అభివృద్ధి), సాగరమాలను సమర్థంగా ఉపయోగించుకోవడానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం అత్యంత కీలకం.
6. సముద్రాలు, సముద్ర తీర ప్రాంతాల వినియోగానికి ప్రాధాన్యం.





7. ప్రపంచానికి భారత్‌ను ప్రయోగ కేంద్రంగా మలచడం. 2022లోగా అంతరిక్షంలోకి భారత వ్యోమగామిని పంపడం ప్రధాన లక్ష్యం.
8. సేంద్రియ ఆహారానికి దన్ను. ఆహార రంగంలో స్వయం సమృద్ధి సాధించడం.. వ్యవసాయ ఉత్పాదకత పెంపు సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడం.
9. ఆరోగ్య భారతం ఆవిష్కరణ. బాధలు, ఒత్తిడి లేని.. సమగ్ర ఆరోగ్య సంరక్షణ విధానం.
10. కనిష్ఠ ప్రభుత.. గరిష్ఠ పాలన. క్రియాశీల, జవాబుదారీ, స్నేహపూర్వక ఉద్యోగస్వామ్యం. 2030లోగా ఎలక్ట్రానిక్ పరిపాలన.



ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలతో భారతీయ యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయుష్ గోయల్ అన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కోటి మందికి పైగా శిక్షణ ఇచ్చి బతుకు దెరువుకు సాయపడ్డట్లు వివరించారు. ముద్రా, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలు యువతకు మేలు చేశాయని చెప్పారు. ముద్రా యోజన కింద 15.56 కోట్ల మందికి రూ.7.2లక్షల కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా భారత్ ఎదిగిందని చెప్పారు.

'రక్షణ'కు పెద్దపీట

వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌లో రూ.35,000 కోట్ల చెల్లింపులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రక్షణ రంగానికి తొలిసారిగా రూ.3 లక్షల కోట్లు పైచిలుకు కేటాయించారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.2,85,000 కోట్లు కేటాయించగా ఈసారి రూ.3,05,000 కోట్లకు పెంచారు. అంటే సుమారు రూ.20,000కోట్లు పెరిగింది. సరిహద్దు భద్రత కోసం మరిన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. "దేశాన్ని కాపాడుతున్న సైనికులు మనకు గర్వకారణం. వారి పట్ల తగిన శ్రద్ధ వహించాలి" అని పేర్కొన్నారు. గత మూడేళ్లలో వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (వోఆర్‌వోపీ) కింద రూ.35,000 కోట్లు చెల్లించామని తెలిపారు. మరోవైపు మొదటిసారిగా హోం శాఖకు బడ్జెట్ కేటాయింపు రూ.లక్ష కోట్ల మార్కు దాటింది. సరిహద్దుల్లో సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మొత్తం రూ.1,03,000 కోట్లు కేటాయించారు. ఇది 2018-19లో కేటాయించిన రూ.99,034 కంటే 4.9 శాతం ఎక్కువ. కేంద్ర సాయుధ దళాలకు మొత్తం రూ.71,618 కోట్లు కేటాయించారు. ఇటు పాక్‌తో, అటు చైనాతో సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఆ ప్రాంతాల్లో వసతులు మెరుగుపరచేందుకు రూ.2,000 కోట్లు ఖర్చు పెట్టాలని ప్రతిపాదించారు.



మోదీ ప్రగతి నివేదిక

ఐదేళ్లలో అద్భుతాలు!

సమర్థ, స్వచ్ఛ పాలన.. ప్రపంచ ఆర్థికానికి భారత్ ధ్రువతార

- 2022 నాటికి సరికొత్త భారతావని
- 98 శాతం గ్రామాలు 'స్వచ్ఛం'
- అన్ని ఇళ్లకూ విద్యుత్తు 'వెలుగు'
- జీఎస్టీ సవరణలతో 80 వేల కోట్ల ఊరట
- బడ్జెట్ ప్రసంగంలో విజయాల ఢంకా!




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: "నిర్ణయాలు తీసుకోలేని నిస్సహాయత దేశాన్ని ఆవరించిన తరుణంలో మేం అధికారంలోకి వచ్చాం. దేశ గతిని మార్చేశాం. ఈ దేశపు ఆత్మవిశ్వాసం ప్రజ్వలంగా వెలిగేలా చూడడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రధాని మోదీ నాయకత్వంలో సుస్థిరమైన, స్వచ్ఛమైన, సమర్థ పరిపాలనను అందించాం. దేశంలో కీలకమైన నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రపంచ ఆర్థికంలో ఇపుడు భారత్ ధ్రువతార" అని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. "స్వతంత్ర భారతావని 2022లో వజ్రోత్సవంలోకి అడుగుపెడుతోంది. అప్పటికి నవ భారతాన్ని ఆవిష్కరించే దిశగా కదులుతున్నాం. ఈ సరికొత్త భారతంలో అందరి ఇళ్లకూ విద్యుత్తు ఉంటుంది. మరుగుదొడ్లు ఉంటాయి. మంచినీరు అందుతుంది. రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. ఉగ్రవాదం, మతతత్వం, కులతత్వం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం వంటి జాడ్యాలకు చోటు ఉండదు!" అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఎన్నికల-వరాల' బడ్జెట్‌లో గత ఐదేళ్లలో తాము సాధించిన విజయాలను ఏకరువు పెట్టారు.

> హేట్సాఫ్ టు టాక్స్‌పేయర్స్: పన్ను చెల్లింపుదారులు 3.79 కోట్ల నుంచి 6.85 కోట్లకు పెరిగారు. అంటే టాక్స్ బేస్‌లో 80 శాతం వృద్ధి

> ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌ను యథాతథంగా కొనసాగిస్తూనే... ఆర్థిక బలహీన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్ కల్పించాం. -జాతీయ విద్యా సంస్థల్లో సీట్లను 25 శాతం పెంచాం.

ఇదీ మా ఘనత

- 1991 తర్వాత మరే ప్రభుత్వమూ సాధించనంత సగటు వృద్ధి రేటు నమోదైంది.
- 2013-14లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ది 11వ స్థానం. ఇప్పుడు ఆరో స్థానానికి చేరుకున్నాం.
- 2009-14 మధ్య సగటు ద్రవ్యోల్బణ రేటు 10.1 శాతం. దానికి మేం కళ్లెం వేసి 4.6 శాతం వద్ద నిలిపివేశాం.
- ఆహారం, ప్రయాణం, ఇతర నిత్యావసరాలు, గృహాలపై ప్రజలు పెట్టే వ్యయాన్ని 35 నుంచి 45 శాతం తగ్గించగలిగాం.
- గత ఐదేళ్లలో భారత్‌కు 23,900 కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి.
- ఉత్పత్తి వ్యయం కంటే 1.5 రెట్ల మద్దతు ధరను 22 పంటలకు ఇచ్చాం.
- కనీస పెన్షన్ రూ 1000 చేశాం.
- స్వాతంత్ర్యం తర్వాత అతి పెద్ద పన్ను సంస్కరణ.. జీఎస్టీని అమలులోకి తీసుకొచ్చాం.
- 35 లక్షల చిన్నవ్యాపారులకు జీఎస్టీ ద్వారా లబ్ధి.
- పేద, మధ్యతరగతి వర్గాల వారు వాడే అనేక సరుకులు ఇపుడు 0- 5 శాతం శ్లాబులోనే ఉన్నాయి.
- జీఎస్టీ రేట్లు క్రమేణా తగ్గించడం వల్ల వినియోగదారులకు 80,000కోట్ల మేర ఊరట.
- ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ 6.38 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు పెరిగాయి.
- 2008-14 మధ్య ఇష్టానుసారం రుణాలివ్వడం వల్ల బ్యాంకుల బకాయిలు 18 నుంచి 52 లక్షల కోట్లకు పెరిగాయి. రికగ్నిషన్, రెసొల్యూషన్, రీక్యాపిటలైజేషన్, రీఫామ్స్.. '4ఆర్'ల ద్వారా పరిస్థితిని మార్చేశాం. ఎన్‌పీఏల్లో 3 లక్షల కోట్లు వసూలయ్యాయి.
- మొబైల్ కాల్స్, డేటా ఇపుడు ప్రపంచదేశాలన్నింటి కంటే భారత్‌లోనే చౌక.
- స్వచ్ఛ భారత్ ఇపుడు మహోద్యమం. 98% గ్రామాల్లో స్వచ్ఛ లక్ష్యాలు సాధించాం. 5.45 లక్షల గ్రామాలు బహిరంగ మల విసర్జన రహితంగా మారాయి.
- గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య ఆర్థిక వ్యత్యాసాన్ని తగ్గిస్తున్నాం.
- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) ద్వారా 17.84 లక్షల గ్రామీణ ఆవాసాల్లో 15.80 లక్షల ఆవాసాలను పక్కా రోడ్లతో అనుసంధానించాం.
- 2014వరకు కూడా సుమారు 2.5 కోట్ల కుటుంబాలు చీకట్లో మగ్గిపోయేవి. సౌభాగ్య యోజన పథకం ద్వారా ప్రతి ఇంటికీ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చాం.
- ప్రపంచంలోనే అతిపెద్దదైన ఆరోగ్య పథకం 'ఆయుష్మాన్ భారత్'లో ఇప్పటికే 10 లక్షల మందికి లబ్ధి.
- దేశంలో 21 ఎయిమ్స్ ఉన్నాయి. 22వ ఎయిమ్స్ హరియాణాలో ఏర్పాటు.



రాష్ట్రాలకు కేంద్రం నుంచి మరిన్ని నిధులు రానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.83 వేల కోట్లు అదనంగా సమకూరనున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు కేంద్రం రూ.6,73,005 కోట్లు ఇచ్చింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దానిని రూ.7,61,454 కోట్లకు పెంచింది. వచ్చే (2019-20) ఆర్థిక సంవత్సరంలో రూ.8,44,605 కోట్లను కేటాయించింది. ఇక, కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రాంట్లు అన్నీ కలుపుకొంటే ఈ మొత్తం రూ.13,70,620 కోట్లకు చేరనుంది. కాగా, రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళ్లే పన్ను ఆదాయం కూడా అదే స్థాయిలో పెరుగుతుండడం గమనార్హం.

రాహుల్ కౌంటర్... పీయూష్ ఎన్‌కౌంటర్

ఆ 5 అంశాలపై బడ్జెట్‌లో మోదీ సర్కార్ జవాబు





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎక్కడికి వెళ్లినా ఐదు అంశాలను లేవనెత్తుతూ మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. రైతులు, నిరుద్యోగులతో పాటు నోట్ల రద్దుతో సామాన్యులను, జీఎస్టీ అమలుతో వ్యాపారులను మోదీ మోసం చేశారని విరుచుకుపడ్డారు. తాజా బడ్జెట్ ద్వారా మోదీ సర్కారు ఆయనకు కౌంటర్ ఇచ్చింది.

వ్యవసాయం-రైతులు

విమర్శ: వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్నా రైతుల గురించి మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నది రాహుల్ విమర్శ. అధికారంలోకొస్తే దేశవ్యాప్త రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

జవాబు: తెలంగాణ తరహాలో రైతుబంధు పథకం ప్రకటన. 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరుతో 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఏటా రూ.6 వేలు నేరుగా బ్యాంకు ఖాతాలో వేస్తామని వెల్లడి.

కనీస ఆదాయం

విమర్శ: మోదీ సర్కారు కేవలం 15 మంది ధనవంతుల లబ్ధి కోసమే పనిచేస్తున్నారని రాహుల్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుపేదలకు కనీస ఆదాయ పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటన.

జవాబు: 'ప్రధాన మంత్రి శ్రమ్ జ్యోతి మన్‌ధన్' పేరుతో అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు నెలకు రూ.3వేల పింఛను ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. 10 కోట్ల మందికి లబ్ధి.

నిరుద్యోగం

విమర్శ: ఏటా 2 కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న మోదీ మాట నిలబెట్టుకోలేదని రాహుల్ ఆరోపణ.

జవాబు: ఈపీఎఫ్‌వోలో గత రెండేళ్లలో 2 కోట్ల మంది కొత్తగా చేరారు. భారతీయ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూసే స్థాయి నుంచి స్టార్టప్‌ల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదిగింది.

జీఎస్టీ- వ్యాపారులు

విమర్శ: మోదీ జీఎస్టీని అమల్లోకి తెచ్చినప్పటి నుంచి గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని రాహుల్ విమర్శ.

జవాబు: జీఎస్టీని క్రమంగా తగ్గిస్తున్నాం. ఫలితంగా వినియోగదారులకు రూ.80 వేల కోట్లు లబ్ధి చేకూరింది. పేద, మధ్యతరగతి ప్రజలు ఉపయోగించే వస్తువులు దాదాపుగా 0-5 శాతం శ్లాబులోనే ఉన్నాయి.

నోట్ల రద్దు- ఆదాయ పన్ను

విమర్శ: నరేంద్ర మోదీ నోట్ల రద్దు చేయడం వల్ల చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. సామాన్య ప్రజలు ఏటీఎంల వద్ద రోడ్లపై క్యూలో నిలబడాల్సి వచ్చింది. ధనవంతులు మాత్రం లాభపడ్డారు.

జవాబు: 2017-18లో ప్రత్యక్ష పన్నుల రాబడి 18 శాతం పెరిగింది. 1.06 కోట్ల మంది పన్నుల పరిధిలోకి వచ్చారు. నోట్ల రద్దు తర్వాతే.. కోటి మంది మొదటిసారి ఐటీ రిటర్న్స్ ఫైల్ చేశారు.



'సామాజిక న్యాయం'

అరకొరే

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు 2019-20 బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2 శాతానికంటే తక్కువ పెంపుతోనే బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. 2019-19లో రూ.7,750 కోట్లు కేటాయించగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేవలం 0.6 శాతం పెంపుతో రూ.7,800 కోట్లు కేటాయించింది. దివ్యాంగుల సాధికారత కోసం ఈ బడ్జెట్‌లో రూ.1,144.90 కోట్లు, ఎస్సీలకు రూ.76,801 కోట్లు, 5 జాతీయ కమిషన్లకు రూ.39.87 కోట్లు, ఎస్సీ, ఓబీసీ, ఈబీసీలకు నేషనల్ ఫెలోషిప్ కింద రూ.390.50 కోట్లు కేటాయించింది.



రాష్ట్ర బడ్జెట్ 2.40 లక్షల కోట్లకుపైనే

కేంద్ర బడ్జెట్‌నూ పరిగణలోకి తీసుకొని కసరత్తు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఆంధ్ర బడ్జెట్ రూ.2.10 లక్షల కోట్లకు పైనే ఉంటుందని మంత్రి యనమల రామకృష్ణుడు శుక్రవారం తెలిపారు. ప్రీ బడ్జెట్ సమావేశాల నుంచి రూ.2.40 లక్షల కోట్లకు ప్రతిపాదనలు వచ్చాయి. ప్రతిపాదనలు రాష్ట్ర ఆర్థిక సామర్థ్యానికి మించి ఉండడంతో వాటిని తగ్గించాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్ర ఆర్థిక వనరుల ప్రకారం రూ.2.10 లక్షల కోట్ల వరకు బడ్జెట్ ప్రతిపాదన చేయవచ్చని అధికారులు వివరించారు. ఇటీవల పెన్షనర్లకు, డ్వాక్రా మహిళలకు, బీసీ వర్గాలకు ప్రకటించిన సంక్షేమ భారాన్ని కూడా జోడించి బడ్జెట్ సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. దీనిపై అధికారులు ప్రస్తుతం కసరత్తు చేస్తున్నారు. శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌తో ఆర్థిక శాఖ అధికారులకు మరింత స్పష్టత వచ్చింది. కేంద్రం నుంచి ఏ మేరకు నిధులు వస్తాయన్న అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకొని ఆంధ్ర అధికారులు బడ్జెట్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు.

రైల్వే కొత్త ప్రాజెక్టులకు

మొండిచేయి

- ప్రస్తుతం కొనసాగుతున్న వాటికే నిధులు
- రైల్వే బడ్జెట్ 2019-20 విశేషాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రకటించిన రైల్వే బడ్జెట్ దక్షిణ మధ్య రైల్వేకు నిరాశే మిగిల్చింది. అయితే.. ప్రస్తుతం కొనసాగుతోన్న (ఆన్‌గోయింగ్) ప్రాజెక్టులకు మాత్రమే నిధులు కేటాయించారు. అవి కూడా ఆశించినంత స్థాయిలో లేకున్నా.. గత ఏడాదితో పోలిస్తే.. కొంత మెరుగ్గా ఉన్నాయి. కొత్త ప్రాజెక్టుల ఊసే లేకుండా పోయింది. మొత్తంమీద దక్షిణ మధ్య రైల్వేకు తాజా బడ్జెట్‌లో రూ. 5,924 కోట్లు కేటాయించారు. కిందటి సంవత్సరం చేసిన కేటాయింపులు రూ. 5,572 కోట్ల కంటే.. ఈ ఏడాది రూ. 352 కోట్లు అదనంగా దక్కాయి. ఆయా వివరాలిలా ఉన్నాయి..

ప్రాజెక్టు	కేటాయించిన నిధులు (రూ. కోట్లలో)
ఓబులవారిపల్లి-కృష్ణపట్నం కొత్త లైను	30
గుంటూరు-తెనాలి డైను విద్యుద్దీకరణ	5
కాజీపేట-బలార్షా థర్డ్ లైను ప్రాజెక్టు	265
నడికుడి-కాళహస్తి కొత్త లైను	700
కడప-బెంగళూరు కొత్త లైను	210
గుంతకల్-కల్లూరు డబుల్ లైను	15
గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ లైను	280
విజయవాడ-భీమవరం-నిడదవోలు డబ్లింగ్	175
కోటిపల్లి-నర్సాపూర్ కొత్త లైను	200
గుత్తి-ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్టు	126
కాజీపేట-విజయవాడ మూడోలైన్ ప్రాజెక్టు	110
విజయవాడ-గూడూరు మూడో లైను	350
కర్నూలులో మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ ఫ్యాక్టరీ	80
తిరుపతి స్టేషన్‌లో సెకండ్ ఎంట్రీ అభివృద్ధికి	12.45
ట్రాక్‌ల పునరుద్ధరణకు	657
రైళ్లలో భద్రతకు	72.5
ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ పనులు	23.4
టీఆర్‌జీ అండ్ హెచ్‌ఆర్‌డీ పనులకు	16.4
డబ్లింగ్ పనులకు	1,905
కొత్త లైన్ల నిర్మాణానికి	834
ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదలకు	138
మౌలిక వసతుల అభివృద్ధికి	229

రైల్వేజోన్ ప్రస్తావనేదీ?!

- సభలోనే పీయూష్‌ను ప్రశ్నించిన అవంతి
- పట్టించుకోని కేంద్ర మంత్రి
- బయటకు వచ్చి నిరసన తెలిపిన టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటును ప్రకటిస్తారని జోరుగా ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ తన ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్థావించకపోవడంపై టీడీపీ ఎంపీలు ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ క్రమంలో ఎంపీ అవంతి శ్రీనివాస్ కేంద్ర మంత్రి ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. తన స్థానంలో నిలబడి "రైల్వే జోన్ ఏమైంది? ఎందుకు ప్రకటించడం లేదు?" అని నిలదీశారు. అయితే, ఈ వ్యాఖ్యలను పట్టించుకోకుండానే కేంద్ర మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగించారు. మరోవైపు, ఏపీకి న్యాయం చేయాలని టీడీపీ ఎంపీలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. నల్లదుస్తుల్లో పార్లమెంటుకు వచ్చిన ఎంపీలు సుజనా చౌదరి, అశోక్ గజపతి రాజు, కొనకళ్ల నారాయణ, మాగంటి బాబు, సీఎం రమేశ్, తోటా సీతారామలక్ష్మి, మురళీ మోహన్, గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్, నిమ్మల కిష్టప్ప, శ్రీరాం మల్యాద్రి, కేశినేని నాని, బుట్టా రేణుకా గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులు పట్టుకొని.. బ్యానర్ ప్రదర్శిస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైల్వే జోన్ ప్రకటించాలని, అమరావతికి నిధులు, ఉక్కు పరిశ్రమ, దుగరాజుపట్నం పోర్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఏపీ ప్రజల శాపం తగులుతుంది

ఈ బడ్జెట్ ఏపీ ప్రజలను తీవ్ర నిరాశ పరిచిందని ఎంపీ అవంతి శ్రీనివాస్ అన్నారు. ఇప్పుడు ఎన్నికలకు వస్తున్నాయి కాబట్టి ప్రకటనలు చేశారని విమర్శించారు. "ఏపీలో రైతు రుణ మాఫీ చేస్తామంటే ఎలా చేస్తారని హేళన చేశారు. ఇదే మోదీ ఉత్తరప్రదేశ్‌లో రుణ మాఫీ చేశారు. ఎన్నికలు వస్తేనే రైతులు గుర్తుకు వస్తారు. ప్రజలు అమాయకులు కాదు" అని వ్యాఖ్యానించారు. ఏపీలో చిన్న పిల్లల నుంచి ప్రతి ఒక్కరు ఆందోళన చేస్తుంటే దున్నపోతుపై వర్షం పడ్డట్టు కేంద్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఏపీల ప్రజల శాపం బీజేపీకి తగులుతుందన్నారు.

బీజేపీ మేనిఫెస్టోలా

కేంద్ర బడ్జెట్: సుజనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ ప్రభుత్వ బడ్జెట్‌లా లేదని, బీజేపీ మేనిఫెస్టోలా ఉందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత సుజనా చౌదరి విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం నాటి రాష్ట్రపతి ప్రసంగంలో ఉన్న అంశాలు 90 శాతం బడ్జెట్ ప్రసంగంలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే పలు వరాలు ప్రకటించారని, ఈ వరాలు గత ఐదేళ్లలో ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. రెండు నెలల్లో రైతులకు ఆర్థిక సహకారం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. రైల్వే జోన్ ప్రస్తావనే లేదని వాపోయారు. లెక్కలేనితనంగా అహంభావంతో దేశాన్ని నడిపిస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని విమర్శించారు. ఎంపీ తోట నరసింహం మాట్లాడుతూ... ప్రకటించిన తాయిలాలు ఏ విధంగా అమలు చేస్తామన్న ఆలోచన లేకుండా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. ఇటీవలి ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ నేతల్లో భయం పట్టుకుందన్నారు. ఏపీకి న్యాయం చేస్తారన్న నమ్మకం తమకు లేదని చెప్పారు.





ఢిల్లీలో పార్లమెంట్ ముందు ప్రత్యేక హోదా కోరుతూ ఆందోళన చేస్తోన్న టీడీపీ, వైసీపీ ఎంపీలు

ఆంధ్రకు శూన్యమే

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం తన బడ్జెట్ రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోలేదు. ఫలితంగా 2019-20 మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో కనీసం ఆంధ్ర ప్రదేశ్ ప్రస్తావనే లేదు. పెండింగ్ ప్రాజెక్టులపై ఊసే ఎత్తకపోగా... ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టులకూ నిధులు కేటాయించలేదు. నూతన రాజధాని అమరావతి... దుగరాజుపట్నం.. కడప స్టీల్ ప్లాంట్... విశాఖ రైల్వే జోన్ వంటి ప్రాజెక్టుల గురించి బడ్జెట్‌లో ప్రతిపాదనలే లేవు. మరీ ముఖ్యంగా గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ నిధులపై కేంద్రం నుంచి స్పందన లేదు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు వడ్డీ రాయితీలు ఇవ్వాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉంది. గతేడాది ఈ మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి రూ. 100 కోట్లు కేటాయించారు. కానీ ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కాగా, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న విద్యాసంస్థల్లో కేవలం మూడింటికే నిధులు కేటాయించింది. అవి కూడా అరకొర నిధులు కావడం గమనార్హం. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ. 13 కోట్లు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీకి(ఐఐపీఈ) రూ. 31.82 కోట్లు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గిరిజన విశ్వవిద్యాలయం కోసం ఉమ్మడిగా రూ. 8 కోట్లు కేటాయించారు. అలాగే, మనరాష్ట్రంలోని పలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు, విదేశీ సంస్థల ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టులకు సాయం కోసం కొన్ని నిధులు కేటాయించింది.

వేల కోట్ల రూపాయల అంచనా వ్యయాలతో స్థాపిస్తున్న విద్యాసంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లకు కేటాయింపులు చేయలేదు. కాగా, మొదటి దశలో రూ. 450 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే కేంద్రీయ విశ్వవిద్యాలయానికి కేటాయించిన నిధులు కేవలం రూ. 13 కోట్లే. ఈ రకమైన కేటాయింపులు చేస్తే విద్యాసంస్థలు అందుబాటులోకి రావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందని ఆయా పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పన్నుల్లో వాటా

గతేడాదితో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నులు, సుంకాల్లో వాటా దాదాపు రూ. 3573.23 కోట్లు పెరిగింది. 2019-20 సంవత్సరానికి రాష్ట్రానికి పన్నులు, సుంకాల్లో దక్కిన వాటా రూ. 36360.26 కోట్లు. గతేడాది పన్నుల వాటాగా రాష్ట్రానికి రూ. 32787.03 కోట్లు లభించాయి. ఇందులో కార్పొరేషన్ పన్నులపై రూ. 11775.31 కోట్లు, ఆదాయపన్ను రూపేనా రూ. 9893.51 కోట్లు, కేంద్ర జీఎస్టీ మొత్తం రూపేనా రూ.11004.42 కోట్లు, కస్టమ్స్ రూ. 2284.72 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ సుంకం రూ. 1402.62 కోట్లు లభించాయి. మొత్తం పన్నుల సుంకాల్లో కేంద్రం నుంచి 4.3 శాతం లభించింది. అయితే, గతేడాది ఆంధ్ర ప్రదేశ్‌కు సమీకృత జీఎస్టీ కింద రూ. 904.05 కోట్లు వస్తాయని అంచనా వేసిన కేంద్రం, ఆ నిధులను ఇవ్వలేదు. మనకే కాకుండా ఏ రాష్ట్రానికీ ఈ నిధులు విడుదల చేయలేదు.

రాష్ట్రానికి కేటాయింపులివే..

సెంట్రల్ యూనివర్సిటీ	- 13 కోట్లు
ఐఐపీఈ	- రూ.31.82 కోట్లు
ఏపీ, టీఎస్ గిరిజన యూనివర్సిటీలు	- రూ.8 కోట్లు

కేటాయింపులు లేవు

ఐఐటీ, ఐఐఎం, నిట్, ఐఐఎస్ఈఆర్, ఐఐఐటీ

రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో..

విశాఖ ఉక్కు పరిశ్రమ	- రూ.1400 కోట్లు
విశాఖ పోర్టు ట్రస్ట్	- రూ. 131.12 కోట్లు
హిందుస్థాన్ షిప్ యార్డు	- రూ. 4.84 కోట్లు
డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా	- రూ. 20 కోట్లు
విశాఖపట్టణం - చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం	- రూ. 250 కోట్లు
24 గంటల విద్యుత్తు సరఫరా ప్రాజెక్టు	- రూ. 675.61 కోట్లు
ఏపీ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టు	- రూ. 350 కోట్లు
ఏపీ గ్రామీణ సుస్థిర వృద్ధి ప్రాజెక్టు	-రూ. 150 కోట్లు

మోదీకి మనమంటే అసూయ

- సాయం చేస్తే ఎదుగుతామనే!
- హోదా, రైల్వే జోన్ ఇచ్చాకే ఆయన రాష్ట్రానికి రావాలి
- ఆ ముగ్గురిదీ ఒకటే ఎజెండా
- తప్పుడు రాజకీయాలపై అప్రమత్తం
- ప్రజలకు చంద్రబాబు పిలుపు

అమరావతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'కొంత సాయం చేసినా నవ్యాంధ్ర ఎదిగిపోతుందని ప్రధాని మోదీకి అసూయ. ఆ మాట రెండు, మూడుసార్లు అన్నారు కూడా' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆయన శుక్రవారం అసెంబ్లీలో ప్రసంగించారు. మోదీ రాష్ట్రానికి వస్తారని చెబుతున్నారని.. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ ఇచ్చాక ఆయన ఇక్కడకు రావాలని డిమాండ్ చేశారు. 'ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీ సంపూర్ణ ద్రోహి. దానికి సహకరించిన వైసీపీ కూడా ద్రోహే. ఆంధ్రకు ప్రత్యేక హోదా వద్దన్న కేసీఆర్.. పోలవరం పనులు అడ్డుకుంటామన్న హరీశ్‌రావు ఉన్న టీఆర్ఎస్ పార్టీ నేత కేటీఆర్‌తో జగన్ మంతనాలు జరుపుతారు. ఈ ముగ్గురి ఎజెండా ఒక్కటే. మోదీకి మనమంటే కోపం. ఆంధ్ర బాగుపడితే తన అసమర్థత తెలిసిపోతుందని కేసీఆర్ భయం. జగన్‌కు కేసుల నుంచి విముక్తి కావాలి. రాష్ట్ర ప్రజలు న్యాయంగా రావలసిన వాటి కోసం ఎంత పోరాటం చేసినా, ప్రత్యేక హోదాపై నిరసనలు వ్యక్తం చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వైసీపీని పట్టుకుని తప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. ఇలాంటి తప్పుడు రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి. లాలూచీ రాజకీయాలను తిప్పికొట్టాలి. ఈ గడ్డపై పుట్టిన ప్రతిఒక్కరూ సంఘటితం కావాలి' అని ప్రజలకు పిలుపిచ్చారు. నిధులు ఎప్పుడో ఇస్తామంటే.. అప్పటిదాకా చావాలా.. బతకాలా అని నిలదీశారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

తిరుపతి సభలో ఏమన్నారు..?

'ఎన్నికల ముందు తిరుపతి సభలో మోదీ ఏం చెప్పారు? స్కామాంధ్ర కావాలా? స్వర్ణాంధ్ర కావాలా? అవినీతిపరుల్ని వదిలిపెట్టం. జగన్ ఆ కోవలోకే వస్తారని అన్నారు. కానీ ఇప్పుడు వారిద్దరూ కవలలు. అవినీతి ఉచ్చులో బీజేపీ పడింది. సాక్షాత్తూ మోదీయే అవినీతి ఉచ్చులో పడిపోయారు. అందుకే కేసీఆర్‌కు మెచ్యూరిటీ ఉంది.. నాకు లేదన్నారు. మెచ్యూరిటీ అంటే మీ దృష్టిలో ఏదీ అడక్కుండా ఊడిగం చేయడమా? జీవితంలో అది చేయలేను.'

నాది రైట్ టర్న్..

'నాది యూటర్న్ అని బీజేపీ నేతలు అంటున్నారు. యూటర్న్ కాదు. నాది రైట్ టర్న్. ధర్మపోరాటం. మీది అధర్మపోరాటం. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది. కేంద్రంపై పోరాటానికి వైసీపీ కలిసిరావడం లేదు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసి.. మళ్లీ పుండుమీద కారం చల్లేలా మాట్లాడుతున్నారు. తెలుగు గడ్డ మీద పుట్టిన వారెవరూ ఊరుకోరు.'

విశాఖలో సమావేశమట!

'రాష్ట్రానికి మోదీ వస్తున్నారని అంటున్నారు. విశాఖలోనే సమావేశం పెడతామంటున్నారు. విశాఖలో బీజేపీ వాళ్లను కూడా ఎంపీ, ఎమ్మెల్యేగా గెలిపించారు. కానీ రైల్వేజోన్ ఇవ్వలేదు. ఇవ్వకుండా మోసం చేసి మళ్లీ విశాఖ వచ్చి సమావేశం పెడితే అక్కడి ప్రజలు వస్తారా? రైల్వేజోన్ ఇచ్చి, ప్రత్యేక హోదా ప్రకటించి రాష్ట్రానికి మోదీ రావాలి. కడప ఉక్కు కర్మాగారం పెట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వమే శంకుస్థాపన చేసింది. కోడికత్తి కేసును ఎన్‌ఐఏకిచ్చారు. తేల్చిందేమిటి? కోడిగుడ్డుపై ఈకలు పీకారు. సిట్ చెప్పిందే ఎన్‌ఐఏ చెప్పింది.'

అండర్‌గ్రౌండ్ కేబుళ్లకు చాలదు

'అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.1500 కోట్లే ఇచ్చింది. అది విద్యుత్, అండర్‌గ్రౌండ్ కేబుళ్లు వేయడానికి కూడా సరిపోదు. గుంటూరు-విజయవాడ నగరాల్లో భూగర్భ డ్రైనేజీలకు ఇచ్చిన వెయ్యికోట్లను కూడా అమరావతి కోటాలో వేశారు. ఎంత నీచం! ఒక్క పైసా అడక్కుండా 33వేల ఎకరాలు రైతు లిచ్చార అమరావతికి ఇలాగే నిధులిస్తే పూర్తవడానికి 50 ఏళ్లు పడుతుంది. 50 ఏళ్లు ఇలాగే చావాలా? ప్రపంచంలో ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతి నిలుస్తుందని మోదీకి నాపై కోపం. వీళ్లకు కొంత చేస్తే దూసుకెళ్లిపోతారని.. అందుకే అడ్డుపడుతున్నారు.'

వెంకయ్య, దత్తాత్రేయలను పంపేశారు..

'మోదీ, బీజేపీ దక్షిణ భారతదేశానికి ఏం చేశాయి? కనీసం మంత్రి పదవులూ ఉంచలేదు. వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉండేవారు. ఆయన ఆ హోదాలో అన్ని రాష్ట్రాలకు వెళ్తూ కనిపించేవారు. మంత్రిపదవి తీసేసి ఆయన్ను ఉపరాష్ట్రపతి చేశారు. అది ప్రమోషనా.. పనిష్మెంటా? దత్తాత్రేయను కేంద్ర మంత్రి పదవినుంచి తీసేశారు. కర్ణాటక నుంచి ఉండే అనంతకుమార్ చనిపోయారు. ఇప్పుడు సదానంద గౌడ మాత్రమే ఉన్నారు. 'వెనుకబడిన ఏడు జిల్లాలకు ఏటా రూ.350 కోట్లు ఇస్తామన్నారు. మూడో ఏడాది డబ్బులేసి వెనక్కి తీసేసుకున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం జోక్యంతో ఇలా చేశారు. మీ ఖాతాలో ఎవరైనా డబ్బులేస్తే.. మళ్లీ మీ అనుమతి లేకుండా తీసుకోగలరా అని విష్ణుకుమార్‌రాజు, మాణిక్యాలరావులను ప్రశ్నిస్తున్నా.'

జనసేన మహిళా అధ్యక్షురాలిగా రేఖ

- వివిధ విభాగాలకు మహిళా సారథులు
- తొలిజాబితా విడుదల చేసిన పవన్

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జనసేన మహిళా విభాగాల సారథులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం నియమించారు. జనసేన 'వీర మహిళ' విభాగం అధ్యక్షురాలిగా సీఏ ఆఖరి సంవత్సరం చదువుతున్న రేఖ జవ్వాజికి బాధ్యతలు అప్పగించారు. ఈ కమిటీలో నలుగురు ఉపాధ్యక్షులున్నారు. కనుమూరి కవిత సింధూరి (భీమవరం), షేక్ జరీనా (నరసరావుపేట), నూతాటి ప్రియా సౌజన్య (రాజమహేంద్రి), జి. శ్రీవాణి (హైదరాబాద్) నియమితులయ్యారు. అదేవిధంగా పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా వీరమహిళ కన్వీనర్లు, కో కన్వీనర్లు, కోఆర్డినేటర్లను కూడా నియమించారు. పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సుజాత పాండాను నియమించారు. పాలసీ వింగ్ చైర్మన్‌గా కంబాల యామినీ జ్యోత్స్నను నియమించారు. పార్లమెంటరీ ఎగ్జిక్యూటివ్ కమిటీలు, వర్కింగ్ కమిటీల్లోనూ మహిళకు చోటు కల్పించారు. పార్టీ ప్రచార విభాగం చైర్మన్‌గా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పెద్దిశెట్టి ఉషశ్రీని నియమించారు. పార్టీ ఐడియాలజీ వింగ్, సోషల్ మీడియా విభాగాలూ ఏర్పాటయ్యాయి. వీటితోపాటు ప్రెసిడెంట్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రజా ప్రయోగ కౌన్సిళ్లు, కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు తొలివిడతగా 22 మహిళా




విభాగాలకు చోటు కల్పించారు. పార్టీ కోసం పనిచేసి మద్దతుగా నిలిచేవారికి సముచిత స్థానం ఇవ్వాలని నిర్ణయించామని పవన్ వెల్లడించారు.

ఆ విద్యార్థులను విడుదల చేయించాలి

అమెరికాలో ఇమిగ్రేషన్ అధికారుల అదుపులో ఉన్న భారతీయ విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయం అందించి విడుదల చేయించేందుకు అవసరమైన చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చేపట్టాలని పవన్ కోరారు. అరెస్టయినవారిలో ఎక్కువ మంది తెలుగువారే ఉన్నట్లు వార్తలు రావడం బాధ కలిగిస్తోందని తెలిపారు.

రైతులను అవమానించే బడ్జెట్

- కార్పొరేట్ శక్తులకు మూడున్నర కోట్ల లబ్ధి
- అన్నదాతలకేమో రోజుకు 17 రూపాయలేనా?: రాహుల్
- ఆదాయం రెట్టింపు చేస్తామని నాడు చెప్పి నేడు రైతులను మోసం చేశారు : చంద్రబాబు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రైతులను అవమానించేదిగా ఉందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... ఒకవైపు 15 కార్పొరేట్ శక్తులకు మూడున్నర లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం... రైతులకు మాత్రం రోజుకు రూ.17 ఇస్తామనడం వారిని అవమానించడం కాదా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన వారు... అన్నదాతలను మోసం చేశారని అన్నారు. వ్యవసాయ వృద్ధి రేటు 2.4 శాతం ఉందని, ఈ నేపథ్యంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలంటే ఇరవై ఏళ్లు పడుతుందని చెప్పారు. దేశంలో ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులు తీవ్ర బాధపడుతున్నారని, గత 45 సంవత్సరాల్లో ఇంతకంటే అధ్వాన పరిస్థితి నిరుద్యోగులు ఎన్నడూ ఎదుర్కోలేదని నేషనల్ శాంపిల్ సర్వే చెప్పిందని చంద్రబాబు అన్నారు.

నడ్డి విరగ్గొట్టి.. సాయం చేస్తున్నట్లు నటన

- కేంద్ర బడ్జెట్‌పై సోమిరెడ్డి వ్యాఖ్య



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఒకవైపు నుంచి రైతుల నడ్డి విరగ్గొట్టి మరోవైపు సాయం చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నటిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి విమర్శించారు. 'ఎరువుల ధరలు ఈ నాలుగేళ్లలో రెట్టింపు చేశారు. పురుగు మందుల ధరలు పెరిగిపోయాయి. ఇవన్నీ పెంచి ఇప్పుడు హెక్టారుకు రూ.6వేలు ఇచ్చి రైతులకు చాలా సాయం చేసినట్లు కబుర్లు చెబుతున్నారు. ఎరువుల ధరల పెంపు వల్ల రైతులపై పడిన భారంతో పోలిస్తే ఇప్పుడు ఇస్తున్న సాయం ఒట్టి కంటి తుడుపు చర్య' అని ఆయన వ్యాఖ్యానించారు. విభజనలో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ఈ చివరి బడ్జెట్లో కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి గుండు సున్నా

- 10న మోదీకి నల్ల రిబ్బన్లతో నిరసన
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని పలువురు మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకర్లతో మంత్రి జవహర్ మాట్లాడుతూ తప్పు చేశానని ఒప్పుకున్నాకే మోదీ రాష్ట్రంలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న రాష్ట్రానికి వచ్చే మోదీకి నల్ల రిబ్బన్లతో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంపై వివక్ష చూపిన మోదీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపి, బీజేపీ కళ్లు తెరిపిస్తామని హెచ్చరించారు. మండలిలో ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ గుండు సున్నాలా ఉందన్నారు. రైతులకు ఏదో చేస్తానని అంగవస్త్రం ఊడదీసి తలపాగా చుట్టినట్లు మోదీ చేశారన్నారు. శాసనసభలో ప్రభుత్వ విప్ కూన రవికుమార్ మాట్లాడుతూ కేంద్రం చివరి బడ్జెట్ ఎన్నికల బడ్జెట్టేనన్నారు. కౌలు రైతులకు మొండి చేయి చూపిందని మండిపడ్డారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అవినీతి కేసుల నుంచి బయట పడేందుకు జగన్ రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీకి తాకట్టు పెట్టినందునే కేంద్రం ఏపీకి అన్యాయం చేసిందని ఆరోపించారు. బీజేపీ ఏవిధంగా మోసం చేసిందో ప్రజలకు వివరిస్తామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలిపారు.

ప్రధాన సమస్యలు విస్మరించారు: యనమల



అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కేంద్ర బడ్జెట్ విస్మరించిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. శుక్రవారం ఆయన సచివాలయంలోని తన చాంబర్లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి చట్టపరంగా రావాల్సిన హామీలను నెరవేర్చే ఉద్దేశాన్ని ఈ బడ్జెట్‌లో కూడా కేంద్రం వ్యక్తపర్చలేదని, బీజేపీ నేతల వద్ద మాటలు తప్ప పనులు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మధ్య తరగతికి ఆదాయపు పన్ను రాయితీలు ఇవ్వడం సమంజసమేనని, తామూ ఏదో ఒకటి చేయాలనుకొంటున్నామని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర శాసన సభలో తాను ఈసారి పదకొండో బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నట్లు యనమల తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో తానే ఎక్కువ సార్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టానని, ఇది అరుదైన అవకాశంగా భావిస్తున్నానని చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో మాత్రం.. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య 15 సార్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినట్లు వివరించారు.

కేంద్ర బడ్జెట్.. ఎన్నికల జిమ్మిక్కు: వామపక్షాలు

అమరావతి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సార్వత్రిక ఎన్నికల జిమ్మిక్కేనని, తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని వామపక్ష పార్టీల నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్ 'ఓట్ ఆన్ అకౌంట్'లా లేదని 'అకౌంట్ ఫర్ ఓట్స్'గా ఉందని అభివర్ణించారు. విభజన చట్టంలోని హామీల అమలు, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు, రాజధాని నిధులు, పోలవరం సవరించిన అంచనా నిధులు వంటి వాటి ఊసుకానీ, తెలంగాణ ఉక్కు పరిశ్రమ, రైల్వే ఫ్యాక్టరీ వంటి అంశాల ప్రస్తావన లేకపోవడం బాధాకరమని రామకృష్ణ అన్నారు. బడ్జెట్ రోజునే ఏపీ ప్రజలు బంద్ పాటించినా కేంద్ర పాలకుల్లో కనికరం లేకుండా పోయిందన్నారు. బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గాలకు, ఉద్యోగులకు పెద్ద ఊరట కల్పించినట్లు చెప్పడం మోదీ ఎన్నికల జిమ్మిక్కుగా దుయ్యబట్టారు. రైతులను ఆదుకునే చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. ప్రత్యేక హోదా ప్రస్తావన లేదని, విభజన హామీల అమలుకు ఒక్క పైసా కూడా కేటాయించలేదని మధు మండిపడ్డారు. రాష్ట్రానికి విభజన హామీల అమలు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు, రైల్వేజోన్, కొత్త రైల్వే లైన్ల గురించి ప్రస్తావన లేదన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు.

బడ్జెట్ నిరాశ మిగిల్చింది: బొప్పరాజు



విజయవాడ(రామవరప్పాడు), ఫిబ్రవరి 1: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగులకు ఆశాజనకంగా లేదని జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు సంబంధించి ఏ విధమైన సానుకూల నిర్ణయాలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై రాష్ట్రంలో ఆందోళనలు జరుగుతున్నా ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. కొత్త పింఛన్ విధానం రద్దుపై దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తుంటే, ప్రభుత్వం చెల్లిస్తున్న వాటాను 14%కి పెంచుతున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు.




ఐదుగురికి మూడు రూపాయలా??



ఒక రైతుకు నెలకు రూ. 500 ఇస్తామంటూ కొత్త పథకాన్ని ప్రకటించారు. ఒక రైతు కుటుంబంలో ఐదుగురు సభ్యులుంటే.. ప్రభుత్వం రోజుకు ఒక్కొక్కరికీ ఇచ్చేది మూడు రూపాయలేనా?? బడ్జెట్ వాస్తవ దూరంగా ఉంది. ఎన్డీయే సర్కారు వాగ్దానాలేమయ్యాయి? 10 కోట్ల కొత్త కొలువులు ఏమయ్యాయి? రైతుల ఆదాయం రెట్టింపు హామీ మాటేమిటి? ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15లక్షల డిపాజిట్ ఏమైంది? *- సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి*

రైతులు, పేదల బడ్జెట్



రైతులు, పేదల పక్షపాత బడ్జెట్‌ను పియూష్ గోయల్ ప్రకటించారు. మధ్యతరగతిలో కొనుగోలు శక్తిని పెంచే బడ్జెట్ ఇది. 2014 నుంచి ప్రతి బడ్జెట్ మధ్యతరగతికి సాంత్వననిస్తూ వచ్చింది. విపక్షాలు నిరుద్యోగితపై మాట్లాడుతున్నాయి. ఎలాంటి ఉపాధి కల్పించకుండానే గడిచిన ఐదేళ్లలో 7.5% సగటు వృద్ధిని సాధించామా? ఈపీఎఫ్ఓ గణాంకాలను పరిశీలిస్తే ఉపాధి కల్పన ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. *- అరుణ్‌జైట్లీ, కేంద్ర మంత్రి*



ఐదేళ్లలో లక్ష డిజిటల్ గ్రామాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే ఐదేళ్లలో లక్ష పల్లెను డిజిటల్ గ్రామాలుగా మారుస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. పౌరులకు డిజిటల్ సేవలు అందించేందుకు మూడు లక్షల కన్నా కామన్ సర్వీసెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మొబైల్ డేటా వినియోగంలో ఇప్పటికే ప్రపంచంలోనే అగ్రస్థానం సాధించిన దేశంగా భారత్ అవతరించిందని, ఐదేళ్లలో నెలవారీ మొబైల్ డేటా వినియోగం 50 రెట్లు పెరిగిందని చెప్పారు.



ఉపాధి హామీకి 60 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: మోదీ సర్కారు.. ఈసారి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపును గణనీయంగా పెంచింది. గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు 2019-20లో రూ.60 వేల కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో దీనికి రూ.55 వేల కోట్లు కేటాయించింది. అవసరాన్ని బట్టి దీనిని మరింత పెంచే అవకాశం కూడా ఉందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. దేశంలో ప్రతి ఒక్కరికీ ఆహారం లభించాలని, ఏ ఒక్కరూ పస్తులుండకూడదన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.



3 రెట్లు పెరిగిన గ్రామీణ రోడ్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: గ్రామీణ రహదారుల నిర్మాణం తమ హయాంలో మూడు రెట్లు పెరిగిందని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద వీటిని నిర్మించినట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద 2014 నుంచి ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 1.53 కోట్ల ఇళ్లను నిర్మించామన్నారు. 2.5 కోట్ల ఇళ్లకు కొత్తగా విద్యుత్తు సౌకర్యం కల్పించామని, విద్యుత్తును ఆదా చేసేందుకు 143 కోట్ల ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశామన్నారు.





చిన్నరైతుకు 6,000

మోదీ పెట్టుబడి సాయమిది.. ఐదెకరాల్లోపు రైతులకు లబ్ధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలపై మోదీ సర్కారు వరాలు కురిపించింది. చిన్న, మధ్య తరహా రైతులకు చేయూతనిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతు బంధు' తరహాలో పెట్టుబడి సాయం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకాన్ని బడ్జెట్లో ప్రకటించింది. ఈ పథకం కింద ఐదెకరాల్లోపు (2 హెక్టార్లు) రైతులకు ఏడాదికి రూ.6000 చొప్పున సాయం అందిస్తారు. అంటే, అరెకరం ఉన్న రైతుకైనా.. ఐదెకరాలున్న రైతుకైనా ఏడాదికి రూ.6000 సాయమే అందుతుంది. ఈ సొమ్మును కూడా మూడు విడతలుగా, ఒక్కో విడతకు రూ.2000 చొప్పున నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో వేస్తారు. ఈ పథకంతో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతారు. ఏటా రూ.75 వేల కోట్ల వ్యయమయ్యే పీఎం-కిసాన్ ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. దీనిని 2018 డిసెంబరు ఒకటో తేదీ నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. తద్వారా, మొదటి విడత సాయాన్ని మార్చి 31వ తేదీలోపు నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తామని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం పీఎం-కిసాన్ పేరిట చరిత్రాత్మక పథకాన్ని ప్రకటిస్తోందని, దీనితో కష్టాల్లో ఉన్న రైతు కుటుంబాలకు లబ్ధి కలగనుందని లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. "కష్టపడి పని చేసే మన రైతులు తాము ఉత్పత్తి చేసిన ఉత్పత్తులకు సరైన ధరను పొందడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ఉద్దేశంతో, చరిత్రలో తొలిసారిగా, మా ప్రభుత్వం 22 పంటలకు ఉత్పత్తి ఖర్చు కంటే 50 శాతం అదనంగా మద్దతు ధరలు ప్రకటించింది. మా ప్రభుత్వం అనుసరించిన రైతు అనుకూల విధానాలతో రికార్డు స్థాయిలో ఉత్పత్తులు సాధించారు. అంతర్జాతీయ మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గడం, ఆహార ద్రవ్యోల్బణం తగ్గిపోవడం కారణంగా రైతుకు ఆదాయం తగ్గిపోయింది. భూ కమతాలు చిన్న చిన్న ముక్కలు కావడం కూడా రైతు కుటుంబ ఆదాయాన్ని తగ్గించింది. అందుకే, పేద రైతుకు ఆదాయ మద్దతు కల్పించాల్సిన అవసరాన్ని కేంద్రం గుర్తించింది. విత్తనాలు, ఎరువులు, పరికరాలు, కూలీలు తదితరాలను సమకూర్చుకునేందుకు రైతుకు నిర్మాణాత్మక సాయం అవసరం. అప్పుల ఊబిలో కూరుకుపోకుండా, అప్పులోళ్ల గుప్పిట్లో చిక్కుకోకుండా వారికి పెట్టుబడి సాయం అందించాలి. చిన్న, మధ్య తరహా రైతుకు పెట్టుబడి సాయం భరోసా అందించేందుకే పీఎం-కిసాన్ పథకాన్ని ప్రవేశ పెడుతున్నాం" అని ప్రకటించారు. గౌరవప్రదంగా జీవించేందుకు, అందుకు తగిన ఆదాయం పొందేందుకు ఈ పథకం మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. కాగా, రెండు హెక్టార్లలోపు భూమి ఉన్న రైతులు 86.21 శాతం ఉంటారని అంచనా. ఇక, మత్స్య పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని పీయూష్ చెప్పారు.

ఎన్నికల్లో లబ్ధికి స్కెచ్

పీఎం-కిసాన్ పథకం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మోదీ సర్కారు స్కెచ్ వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాల్సిన పథకాన్ని ఇప్పుడే ప్రారంభించింది. నిజానికి, ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకూ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. బడ్జెట్‌లో ప్రకటించే పథకాలన్నీ ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తాయి. అయితే, పీఎం-కిసాన్‌ను 2018 డిసెంబరు నుంచే అమలు చేస్తామని ప్రకటించారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ పథకాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేస్తే, జూలైలోపు మొదటి విడత నగదు బదిలీ చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో.. లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. కోడ్ కారణంగా అది సాధ్యంకాదు. ఎన్నికలనాటికే రైతులకు లబ్ధి చేకూరితే తప్ప ఓట్లు రాలవు. అంతేనా, బడ్జెట్లో ఇందుకు రూ.75 వేల కోట్లు కేటాయించిన మంత్రి.. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తున్నామని 2019-20 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించడం విశేషం.

గోమాతకు జై!

- రాష్ట్రీయ కామధేను ఆయోగ్ ఏర్పాటు
- మేలు జాతి ఆవుల రక్షణకు కృషి
- గోకుల్ మిషన్‌కు రూ.750కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రైతులు, మధ్యతరగతి ప్రజలకు మధ్యంతర బడ్జెట్‌లో పెద్దపీట వేసిన కేంద్రం.. గోమాతకు 'జై' కొట్టింది. గోవుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్న మోదీ సర్కారు అదే పంథాను కొనసాగించింది. బడ్జెట్‌లో గోవులకు ప్రత్యేకంగా చోటు కల్పించింది. గోవుల పరిరక్షణ, పాల ఉత్పత్తుల ప్రోత్సాహకానికి 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్- నేషనల్ కౌ బోర్డు'ను ఏర్పాటుచేసింది. గో సంరక్షణ చట్టం అమలుతో పాటు వాటి కోసం ఉద్దేశించిన పథకాలను ఈ కమిషన్ పర్యవేక్షిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు రూ.750 కోట్లు కేటాయించింది. మేలు జాతి ఆవుల సంతతని పెరగడంతో పాటు ఆవుల ఉత్పత్తి, ఉత్పాదకత వృద్ధికి ఇది దోహదపడుతుందని భావిస్తోంది. 'గోమాతను గౌరవించేందుకు ఈ ప్రభుత్వం ఎప్పుడూ వెనకడుగు వేయదు' అని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.



రూపాయి రాక (పైసల్లో)

కార్పొరేట్ పన్ను	21
ఆదాయపు పన్ను	17
కస్టమ్స్ సుంకం	04
కేంద్ర ఎక్సైజ్ సుంకం	07
వస్తు సేవల పన్ను(జీఎస్టీ)	21
పన్నేతర ఆదాయం	08
రుణేతర మూలధన వసూళ్లు	03
రుణాల ద్వారా	19

రూపాయి పోక (పైసల్లో)

కేంద్ర పథకాలకు	12
వడ్డీ చెల్లింపులకు	18
రక్షణకు	08
సబ్సిడీలకు	09
ఆర్థిక సంఘం, ఇతర బదిలీలకు	08
కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా	23
కేంద్ర ప్రాయోజిత పథకాలకు	09
పింఛన్లు, ఇతర ఖర్చులకు	13

ప్రకృతి విపత్తులకు గురైతే 2% వడ్డీ రాయితీ

ప్రకృతి విపత్తుల్లో నష్టపోయిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు మరో 3 శాతం అదనంగా వడ్డీ రాయితీ కల్పిస్తారు. అలాగే, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణం పొందిన పశు సంవర్ధక, మత్స్య శాఖ రైతులకు కూడా 2 శాతం వడ్డీ రాయితీని బడ్జెట్లో ప్రకటించారు.


ఎన్నికలవైపు చుక్ చుక్

రైలు చార్జీల పెంపులేదు.. రైల్వేలకు 64,587 కోట్లు

- మూలధన వ్యయ కేటాయింపులు 1.58లక్షల కోట్లు
- కాపలాలేని రైల్వే క్రాసింగ్స్‌లు ఉండవు
- ఇంజన్లు, కోచ్‌లు, వ్యాగన్లు 64% పెంపు
- మెట్రోకు కేటాయింపులు 23% పెరుగుదల
- గత ఏడాది 15,600 కోట్లు.. ఈ దఫా 19,152 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రధాని మోదీ రైలు ఎన్నికల కూత పెట్టింది. ఊహించినట్లుగానే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రైలు చార్జీల పెంపు జోలికి పోలేదు. బడ్జెట్‌లో రైల్వేలకు రూ.64,587కోట్లు ప్రతిపాదించారు. మొత్తానికి రైల్వే మూలధన వ్యయానికి రూ.1.58లక్షల కోట్లు కేటాయించారు. రైల్వేలకు ఇంత పెద్ద మొత్తంలో మూలధన వ్యయాన్ని కేటాయించడం ఇదే తొలిసారి. గత ఏడాది బడ్జెట్‌లో ఇది రూ.1.48 లక్షల కోట్లుగా ఉంది. 2018-19 సంవత్సరం భారత రైల్వే చరిత్రలోనే అత్యంత భద్రమైనదిగా నిలిచిందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తన ప్రసంగంలో అభివర్ణించారు. రైల్వే పరంగా పలు విధానపరమైన నిర్ణయాలను ఆయన ప్రకటించారు. దేశంలో కాపలాలేని బ్రాడ్‌గేజ్ రైల్వే క్రాసింగ్‌లు అంటూ ఉండవు. అన్ని చోట్ల కాపలా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 96.2గా ఉన్న రైల్వే ఆపరేటింగ్ నిష్పత్తిని వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి 95శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2014తో పోల్చితే ప్రణాళిక వ్యయం 148% పెరగనుంది. కొత్త లైన్ల నిర్మాణానికి రూ.7,255 కోట్లు, గేజ్‌ల మార్పిడికి రూ.2,200 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ.700కోట్లు, సిగ్నలింగ్‌కు రూ.1750 కోట్లు కేటాయించారు. ప్రయాణికుల సదుపాయల కల్పనకు రూ.3,422కోట్లు కేటాయించారు. రోలింగ్ స్టాక్ (ఇంజన్లు, కోచ్‌లు, వ్యాగన్లకు)ను 64% పెంచుతూ 6,114.82 కోట్లు కేటాయింపులు జరిపారు. గత ఏడాది బడ్జెట్‌లో ఇది 3,724.93 కోట్లుగా ఉంది. మెట్రో రైల్ రవాణా వ్యవస్థకు 23శాతం నిధులను పెంచుతూ రూ.19,152 కోట్లు కేటాయించారు. గత ఏడాది ఇది రూ.15,600 కోట్లుగా ఉంది. ప్రస్తుతం దేశంలో ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ సహా 10 నగరాల్లో 566కిలోమీటర్ల మేర మెట్రో లైన్లు వేశారు. కాగా దేశీయంగా అభివృద్ధి చేసిన సెమీ హైస్పీడ్ ట్రెయిన్ 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' ప్రయాణికులకు వేగంలో ప్రపంచ స్థాయి అనుభూతిని ఇస్తుందని మంత్రి గోయల్ పేర్కొన్నారు. రైల్వే ఇంజనీర్లు అభివృద్ధి పరిచిన సాంకేతిక పరిజ్ఞానం మేక్ ఇన్ ఇండియాకు, ఉద్యోగాల సృష్టికి గొప్ప ప్రేరణనిస్తుందన్నారు.





అంకెల్లో కేటాయింపులు

- **6,000** — ఐదు ఎకరాల్లోపు రైతులకు ఏడాదికి..
- **2%** — మత్స్య, పశుసంవర్ధక శాఖకు అదనపు పన్ను రాయితీ
- **3,000** — 60 ఏళ్లు దాటిన వారికి పింఛను కింద నెలకు
- **500 కోట్లు** — అసంఘటిత రంగ కార్మికుల పెన్షన్‌కు..
- **6 కోట్లు** — ఇచ్చిన ఉచిత గ్యాస్ కనెక్షన్లు..
- **750 కోట్లు** — గో సంరక్షణకు..
- **35,000 కోట్లు** — ఓఆర్ఓపీ కింద సైనికులకు..
- **1330 కోట్లు** — మహిళా సాధికారత, భద్రతకు..

రైతు చుట్టూ రాజ్యం!

అన్నదాతల అనుగ్రహంతోనే అధికారం.. తెలంగాణలో మొదలైన 'రైతుబంధు'

- ఆంధ్రప్రదేశ్‌లో మరింత మెరుగ్గా...
- బెంగాల్, ఒడిసా, జార్ఖండ్‌లోనూ అమలు
- ఇప్పుడు కేంద్రానిదీ అదే బాట

రైతే రాజు... నిత్య నినాదం! రైతు చుట్టూ 'రాజ్యం'... నేటి రాజకీయం! అధికారాన్ని ఆశిస్తున్న, అధికారంలో కొనసాగాలనుకుంటున్న పార్టీలన్నీ నేడు 'రైతు నామ స్మరణ' చేస్తున్నాయి. వ్యవసాయమే ప్రధాన వ్యాపకమైన దేశంలో ఇప్పటి దాకా రైతులకు సబ్సిడీలు, పంట బీమా, ఉచిత విద్యుత్తులాంటివి మాత్రమే అందుతున్నాయి. ఎన్నికల ఏడాది వచ్చినప్పుడు 'రుణ మాఫీ' హామీలు వెల్లువెత్తుతాయి. అలాకాకుండా... సాగుకు ప్రతి ఏటా సాగు బాగుకు నగదు రూపంలో మద్దతుగా నిలిచే ట్రెండు ఇప్పుడు జోరందుకుంది.

తెలంగాణతో మొదలు...

కేంద్రం తాజా బడ్జెట్‌లో 'కిసాన్ సమ్మాన్' గురించి ప్రకటించింది. ఇలా సాగు పెట్టుబడికి నేరుగా నగదు అందించే పథకం 'రైతు బంధు' పేరిట మొట్టమొదటి సారిగా తెలంగాణలో పురుడు పోసుకుంది. ఎన్ని ఎకరాలున్నా, ఎంత పెద్ద రైతయినా సరే... ప్రతి ఎకరాకు ఖరీఫ్‌లో రూ.4 వేలు, రబీలో రూ.4 వేలు చెల్లిస్తామని టీఆర్ఎస్ సర్కారు ప్రకటించింది. ఇప్పటికి రెండు దఫాలుగా నగదు చెల్లింపులు జరిగిపోయాయి. టీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవడంలో 'రైతు బంధు'ది కీలక పాత్ర అనే విశ్లేషణలు వెలువడ్డాయి. ఇదే పథకానికి మరిన్ని మెరుగులు దిద్ది అమలు చేయాలని నిర్ణయించుకుంది. సీజన్‌కు రూ.2500 చొప్పున ఎకరాకు ఏడాదికి రూ.5వేలు చెల్లించాలని భావిస్తోంది. ఏపీలో కౌలు రైతులకూ లబ్ధి కలిగేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. ఇక... బెంగాల్, ఒడిసా, జార్ఖండ్ రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి ప్రకటనలు చేసేశాయి. తెలంగాణలో ఏడాదికి రూ.8వేలు అందిస్తుండగా... ఒడిసాలో ఏకంగా రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకానికి 'కాలియా' అని పేరు పెట్టారు. అయితే, ఇక్కడ చిన్న, సన్న కారు రైతులకు మాత్రమే లబ్ధి కలుగుతుంది. బెంగాల్‌లో 'కృషక్ బంధు' పేరిట ఎకరాకు ఏడాదికి రూ.5వేల చొప్పున ఇస్తామని బెంగాల్ సీఎం మమత ప్రకటించారు. ఈ మొత్తాన్ని రెండు విడతల్లో చెల్లిస్తారు. ఇక... జార్ఖండ్‌లో ఎకరాలోపు పొలం ఉన్న రైతులకు ఏడాదికి రూ.5 వేలు చెల్లిస్తున్నారు.

ఎంతమందికి తెలుసు?

ప్రభుత్వం ఘనంగా ప్రకటిస్తున్న పథకాల గురించి కనీస అవగాహన లేని రైతులు ఎందరో ఉన్నారు. సీఎస్‌డీఎస్ సర్వే ప్రకారం...

- **70%** — 'ప్రత్యక్ష నగదు బదిలీ' గురించి తమకు తెలియదని చెప్పిన రైతులు
- **27%** — భూసేకరణ చట్టాన్ని బలోపేతం చేసినట్లు తెలిసిన రైతులు
- **83%** — ఒక్కసారి కూడా 'కిసాన్ సెల్'కు ఫోన్ చేయని వారి సంఖ్య

ఎంతైనా చేయొచ్చు...

నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు, అనావృష్టి, అతివృష్టి... ఇన్ని ప్రతికూలతల మధ్య కష్టాల సాగుతో నష్టాల దిగుబడి సాధిస్తున్న రైతును ఎంత ఆదుకున్నా తక్కువే అనే వాదన ఉంది. మనది వ్యవసాయ ఆధారిత దేశం. సుమారు 50 శాతం మంది వ్యవసాయ-అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే... కష్టనష్టాల నేపథ్యంలో మెల్లమెల్లగా వ్యవసాయానికి దూరమవుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. 'మరో గత్యంతరంలేకే నాగలి పట్టాం. మెరుగైన జీవనోపాధి దొరికితే వ్యవసాయం వదిలేస్తాం' అని గత ఏడాది సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఒక సర్వేలో 76 శాతం మంది రైతులు పేర్కొనడం గమనార్హం. వరుస నష్టాలు, కష్టాలే దీనికి కారణమని తెలిపారు. నగరాలు, పట్టణాలకు వలస వెళితే జీవనోపాధితోపాటు మంచి విద్య, వైద్యం, ఇతర సదుపాయాలు లభిస్తాయని 61 శాతం మంది తెలిపారు. నిజంగానే 76 శాతం మంది రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తే... ఆహార సంక్షోభం తలెత్తడం ఖాయం. అందుకే... దేశానికి అన్నం పెట్టే రైతును ఎంతైనా ఆదుకోవచ్చు! కానీ... ఇది ఎన్నికలు, రాజకీయాలతో ముడిపడి జరుగుతుండటమే విషాదకరం!

45 కోట్ల మందికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే బడ్జెట్

- ఈ బడ్జెట్‌తో నవ భారతం
- దేశాభివృద్ధిలో మధ్య తరగతి

కృషి కీలకం, వారికి సెల్యూట్: మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తాత్కాలిక బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ బడ్జెట్‌తో 45 కోట్ల మందికి ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని, ఇది ప్రజలందరి బడ్జెట్ అని ఆయన తెలిపారు. భారత్‌ను అభివృద్ధి పథం దిశగా నడిపించే బడ్జెట్ ఇదని వ్యాఖ్యానించారు. 'నయా మధ్య తరతి' ఆవిర్భవిస్తోందని, వారి కలలు కూడా సాకారమవుతున్నాయని తెలిపారు. ఎప్పటికపుడు పన్నులు కడుతూ దేశాభివృద్ధిలో సుస్థిరంగా కీలక పాత్ర పోషిస్తున్న మధ్యతరగతి కుటుంబాలకు సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. ప్రజలకు ఈ బడ్జెట్ సాధికారత చేకూరుస్తుందని, 12 కోట్ల మంది రైతులు, వారి కుటుంబాలు, మూడు కోట్ల మంది వేతన జీవులు, వారి కుటుంబాలు, అసంఘటిత రంగాల్లో ఉన్న 30-40 కోట్ల మంది కార్మికులు ఈ బడ్జెట్‌తో లబ్ధి పొందుతారని ఆయన వివరించారు. రూ.5 లక్షల్లోపు పన్ను విధించదగ్గ ఆదాయం ఉన్నవారికి పూర్తిగా పన్ను మినహాయింపు ఇచ్చామని, చిన్నసన్నకారు రైతులకు ఏడాదికి రూ.6 వేలు నేరుగా వారి ఖాతాల్లోకే జమ చేస్తామని వెల్లడించారు. ఇంతకుముందు ఉన్న ప్రభుత్వాలు చిన్నసన్నకారు రైతులను పట్టించుకోలేదని, వారి కోసం ఎన్నో పథకాలు ప్రారంభించినా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసిన కృషి వల్ల పేదరికం గణనీయంగా తగ్గుతోందని అన్నారు. చాలా మంది పేదలు పేదరికం సంకెళ్ల నుంచి విముక్తి కావడం ఆనందంగా ఉందని అభివర్ణించారు.

రెండు నెలల్లో మోదీపై సర్జికల్ స్ట్రైక్

- రైతులకు రోజుకు 17 రూపాయలేనా?
- కేంద్రానిది ఆఖరి మోసం: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తాత్కాలిక బడ్జెట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శలు సంధించారు. రాబోయే రెండు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీపై తమ పార్టీ సర్జికల్ స్ట్రైక్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తన చేతకానితనం, అహంకార ధోరణితో రైతుల బతుకులను నాశనం చేసిందని ఆరోపించారు. రైతులకు ఏడాదికి రూ.6000 ఇస్తామని ప్రకటించారని, అంటే రోజుకు రూ.17 మాత్రమేనని, ఇది రైతులను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. కేంద్రానిది ఆఖరి మోసం (ఆఖ్‌రీ జుమ్లా) అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. ఈవీఎంలపై ఈనెల 4న విపక్ష నేతలందరూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తారని ఆయన తెలిపారు.

బడ్జెట్‌పై రాహుల్ చేసిన విమర్శలకు బీజేపీ దీటుగా సమాధానమిచ్చింది. బడ్జెట్ గురించి రాహుల్‌కు ఏమీ అర్థం కాలేదని ఎద్దేవా చేసింది. రైతులకు రోజుకు రూ.17 మాత్రమే ఇవ్వడంపై రాహుల్ విమర్శలు చేశారని, అయితే గంటకు 70 పైసలే ఇస్తున్నారని ఆయన ట్వీట్ చేయలేదని చురక అంటించింది. రైతులకు రూ.6000 తాత్కాలిక ఊరట అని, దీంతో పాటు వారి సంక్షేమం కోసం ఇప్పటికే ఎన్నో పథకాలు అమలు చేశామని తెలిపింది.

ముందే బడ్జెట్ లీక్

- లోక్‌సభలో ప్రతిపక్షాల ఆరోపణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, నిరసనలు, విమర్శలు ప్రతి విమర్శలతో లోక్‌సభ దద్దరిల్లింది. బడ్జెట్ ముందే మీడియాలో లీకైందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు సభలో ఆందోళన చేపట్టాయి. స్పీకర్ సుమిత్రా మహాజన్ సభలో అడుగుపెట్టగానే కాంగ్రెస్, వామపక్షాలు పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. రైతులకు ఆర్థిక సహకారం అందిస్తామని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించగానే 'జై కిసాన్' అంటూ బీజేపీ ఎంపీలు నినాదాలు చేశారు. ఆదాయ పన్ను పరిమితిని పెంచుతున్నట్లు ప్రకటించినప్పుడూ వారు 'మోదీ.. మోదీ..' అంటూ మూడు నిమిషాల పాటు బల్లలు చరుస్తూ హర్షధ్వానాలు చేశారు. బడ్జెట్ ప్రసంగం ప్రారంభించే ముందు సభలో ఉన్న పలువురు బీజేపీ పెద్దలకు గోయల్ పాదాభివందనం చేశారు. అమెరికాలో చికిత్సపొందుతున్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయన ప్రసంగం ప్రారంభించారు. ప్రసంగం ముగిశాక గోయల్‌ను మోదీ, రాజ్‌నాథ్ సింగ్, ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషితో పాటు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు అభినందించారు.

బడ్జెట్‌పై తెలుగు నేతల ఆసక్తి

కేంద్ర బడ్జెట్‌పై తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు ఆసక్తి ప్రదర్శించారు. రాజ్యసభ ఎంపీలు సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్, సీఎం రమేశ్, సంతోష్, లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్ ముదిరాజ్, జీవీఎల్ నరసింహారావు, సుబ్బిరామి రెడ్డి తదితరులు గ్యాలరీలో కూర్చొని వీక్షించారు.

వేగుచుక్కగా నిలిపాం!

ఐదేళ్లలో వ్యవస్థను దారికి తెచ్చాం.. వేతన జీవులకు స్పష్టత కోసమే తాత్కాలిక బడ్జెట్‌లో ఐటీ ప్రతిపాదనలు

బ్యాంకింగ్ వ్యవస్థను ప్రక్షాళించాం.. 3 లక్షల కోట్లు వసూలు చేశాం: గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: నాలుగున్నరేళ్ల క్రితం దయనీయమైన ఆర్థిక పరిస్థితుల మధ్య పాలనా పగ్గాలు చేపట్టిన తాము దేశాన్ని ప్రపంచానికే వేగుచుక్కగా నిలిపామని తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఎన్నికల సంధికాలంలో ఏప్రిల్ 1 నుంచి మూడు నెలల పాటు ప్రభుత్వం నడపడానికి తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన గోయల్ ఏకంగా పూర్తి స్థాయి బడ్జెట్ రేంజ్‌లో పథకాలను ప్రకటించారు. ముగిసిపోతున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూడా కొత్త బడ్జెట్లో ప్రకటనలు చేయడం గమనార్హం. గోయల్ శుక్రవారం లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆయన బడ్జెట్ ప్రసంగం గంటన్నర పాటు సాగింది. దాదాపు 45 కోట్ల మందికి మేలు కలిగించే నిర్ణయాలు ప్రకటించారు. తాత్కాలిక బడ్జెట్లో ఆదాయ పన్ను ప్రతిపాదనలు ప్రకటించడం సంప్రదాయం కాకపోయినా మధ్య తరగతి, వేతన జీవులు, పెన్షనర్లు, వృద్ధులను ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనూ అస్పష్టతలో ఉంచడం సరి కాదనే భావనతో కొన్ని నిర్ణయాలు ప్రకటించినట్లు గోయల్ తెలిపారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో అమెరికాలో చికిత్స చేయించుకుంటున్న విషయాన్ని గోయల్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఆయన ఆరోగ్యం గురించి ప్రార్థించాలని సభ్యులను కోరారు. గోయల్ లోక్‌సభలో మాట్లాడుతున్నపుడు సభ్యులు బల్లలు చరిచి మద్దతు తెలిపారు. మోదీ మోదీ అంటూ నినాదాలు చేశారు.



బడ్జెట్ ప్రసంగం చదువుతున్న పీయూష్ గోయల్

ప్రసంగంలో ముఖ్యాంశాలు

- 2022 నాటికి భారత ప్రజాస్వామ్యానికి 75 ఏళ్లు నిండుతాయి. అప్పటికల్లా నవీన భారతదేశాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ఐదేళ్లలో సుస్థిర వృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలకు పునాదులు వేశాం.
- ఐదేళ్ల క్రితం 11వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.
- ఐదేళ్లలో భారీ సంస్కరణలతో సుస్థిర, నీతివంతమైన పాలన అందించాం.
- బ్యాంకింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేశాం. మేం వచ్చే సరికి 5.4 లక్షల నిరర్థక ఆస్తులున్నాయి. బ్యాంకులకు నిధుల కొరత తీర్చాం. 2.6 లక్షల కోట్లు అందించాం. 3 లక్షల కోట్ల మొండి బకాయిలు వసూలు చేశాం. త్వరలో బ్యాంకులన్నీ కోలుకుంటాయి. బ్యాంకింగ్‌లో పారదర్శకతను తెచ్చాం. ఇప్పుడు కోటి రూపాయల వరకు రుణం 59 నిమిషాల్లో మంజూరవుతుంది.
- సంచార జాతుల కోసం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశాం.
- ఎస్సీలకు కేటాయింపులు 35.6%, ఎస్టీలకు కేటాయింపులు 28% పెంచాం.
- ద్రవ్యలోటును జీడీపీలో 3.3%కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకొని 3.4%కి తగ్గించాం. 2017-18లో 5.95 లక్షల కోట్లు అప్పు తెచ్చారు.
- దేశ వనరుల్లో తొలి వాటా పేదలదే. గ్రామాల్లో పట్టణాల స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నాం. వాటి మధ్య వ్యత్యాసాలను తొలగిస్తున్నాం.
- 98% గ్రామాల్లో 100% మరుగుదొడ్లు నిర్మించాం. మార్చి కల్లా కొత్తగా 2.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ అందిస్తాం.
- ద్రవ్యోల్బణాన్ని 4.6%కి తీసుకొచ్చాం. 2009-14లో ద్రవ్యోల్బణం 10.1%. ద్రవ్యోల్బణం అలాగే ఉంటే, ఇప్పుడు ధరలు 40% పెరిగేవి.
- ఆయుష్మాన్ భారత్ పథకం కింద 10 లక్షల మందికి వైద్యం అందింది.
- హైవేలను రోజుకు 27 కిలోమీటర్ల చొప్పున వేగంగా నిర్మిస్తున్నాం.
- దిగుమతుల భారం తగ్గేందుకు ప్రత్యామ్నాయ ఇంధనానికి ప్రోత్సాహం.
- కొత్తతరం రైలు, సముద్రం, మెట్రో రవాణా సదుపాయాల అభివృద్ధి.
- ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కేటాయింపులను రూ.19 వేల కోట్లకు పెంచుతాం.
- రైల్వే అభివృద్ధి మీద రూ.1.58 లక్షల కోట్లు ఖర్చు పెడతాం.

గోయల్ గారి పద్దు

బ.అం. - బడ్జెట్ అంచనా
స.అం. - సవరించిన అంచనా

వివరం	2017-18 వాస్తవ	2018-19 (బ.అం)	2018-19 (స.అం)	2019-20 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	14,35,233	17,25,738	17,29,682	19,77,693
ఎ)పన్ను ఆదాయం	12,42,488	14,80,649	14,84,406	17,05,046
బి) పన్నేతర ఆదాయం	1,92,745	2,45,089	2,45,276	2,72,647
2) మూలధన వసూళ్లు	7,06,742	7,16,475	7,27,553	8,06,507
ఎ) రుణ వసూళ్లు	15,633	12,199	13,155	12,508
బి) ఇతర వసూళ్లు	1,00,045	80,000	80,000	90,000
సి) రుణాలు	5,91,064	6,24,276	6,34,398	7,03,999
3) మొత్తం వసూళ్లు	21,41,975	24,42,213	24,57,235	27,84,200
4) మొత్తం వ్యయం	21,41,975	24,42,213	24,57,235	27,84,200
5) రెవెన్యూ లోటు	4,43,602	4,16,034	4,10,930	4,70,214
6) ద్రవ్య లోటు	5,91,064	6,24,276	6,34,398	7,03,999



మోదీ జోష్... రాహుల్ నిర్వేదం

ప్రతీ వాక్యానికీ బల్ల చరిచి ప్రధాని ఉత్సాహం.. మౌనంగా మొబైల్‌తో గడిపిన రాహుల్



- ఐటీ లిమిట్ పెంచగానే బీజేపీ నినాదాల హోరు
- ప్రసంగానికి నాటకీయత జోడించిన పీయూష్
- సుదీర్ఘంగా సాగిన స్పీచ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆర్థికమంత్రి ప్రసంగిస్తున్నంత సేపూ ప్రధాని మోదీలో ఉత్సాహం ఉరకలెత్తింది. పీయూష్ గోయల్ చదివిన ప్రతీ వాక్యానికి బల్ల చరిచి సంతోషం వ్యక్తం చేస్తూ అధికార పక్షంలో ఉత్సాహం నింపారు. అనంతరం అడ్వాణీ మినహా బీజేపీ సభ్యులంతా ప్రతీ వాక్యానికి బల్లలు చరిచారు. చివర్లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచుతున్నట్లు గోయల్ ప్రకటించగానే సభ హోరెత్తింది. ఆయన మాటను పూర్తికానివ్వకుండానే బీజేపీ ఎంపీలంతా "మోదీ.. మోదీ" అంటూ హర్షధ్వానాలు చేశారు. "సర్జికల్ స్ట్రైక్" అంటూ నినదించారు. 'ఓట్ల వేటలో విపక్షంపై జరిపిన మెరుపుదాడి' అని అర్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. హోరు 2 నిమిషాలు సాగడంతో గోయల్ ప్రసంగాన్ని ఆపేశారు. ఎన్నికలకు ప్రజల్లోకి ధీమాగా వెళ్లడానికి, మేమిది చేశామని చెప్పుకోడానికి ఈ బడ్జెట్ వీలు కల్పించిందని చాలా మంది ఎంపీలు మీడియాతో అన్నారు. మోదీ ముఖంలోనూ ఎప్పుడూ ఉండే గంభీరం, ముభావం స్థానే చిరునవ్వు కనిపించింది. ఉజ్వల్ పథకం, ఆయుష్మాన్ భారత్‌ల ద్వారా ప్రజల వెతలు తీర్చామని చెప్పినప్పుడు కూడా మోదీ చాలాసేపు బల్ల చరిచి ఆమోదం తెలిపారు. బడ్జెట్ ప్రసంగం సాగుతున్నంతసేపూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మొబైల్‌తోనే గడిపారు. అధికార పక్షంవైపు గానీ, గోయల్ వైపు గానీ చూడనే లేదు. గోయల్ రాయితీలు ప్రకటిస్తున్నప్పుడు విపక్షం నుంచి 'మత్‌దాన్ రాజ్‌నీతి' (ఓట్ల కోసం చేస్తున్న రాజకీయం) అని రన్నింగ్ కామెంటరీ వినిపించింది. ప్రసంగం మధ్యలో రాహుల్ కాసేపు బయటికెళ్లిపోయారు. అది చూసి కొందరు బీజేపీ ఎంపీలు.. రాహుల్ బాబా భాగ్ గయే(రాహుల్ పారిపోయారు) అని కామెంట్ చేశారు. తిరిగొచ్చాక కూడా రాహుల్ ఎవరితోనూ మాట్లాడలేదు. నిర్వేదంగా కనబడ్డారు. యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ విప్ జ్యోతిరాదిత్య సింధియా, డిప్యూటీ స్పీకర్ తంబిదురై సభకు హాజరుకాలేదు.

పీయూష్ పంచ్!

గోమాతను గౌరవించడంలో మా సర్కారు వెనుకడుగు వేయనే వేయదు!

మహిళా సాధికారత దశ నుంచి మహిళల నాయకత్వంలో సాధికారత అనే స్థాయికి వచ్చాం.

మా పరిపాలనలో అభివృద్ధి.. ఒక ప్రజా ఉద్యమం!

మా ఉద్దేశాలు స్పష్టం... మా నీతి స్వచ్ఛం... మా నిష్ఠ నిత్యం!

ఒకప్పుడు ఉద్యోగాలు ఆశించే వారే... ఇప్పుడు ఉద్యోగాలు సృష్టించేవారిగా మారారు!

గంటన్నర సేపు... నాటకీయత

దాదాపు గంటన్నర సేపు పీయూష్ గోయల్ తన ప్రసంగం సాగించారు. లోక్‌సభ చరిత్రలో తాత్కాలిక బడ్జెట్ ప్రసంగం ఇంత సేపు సాగడం ఇదే ప్రథమం. నిజానికి పూర్తిస్థాయి బడ్జెట్‌కు తీసుకునేంత సమయాన్ని ఆయన ఈ పద్దు కోసం తీసుకోవడం విశేషం. హిందీ, ఇంగ్లిషు రెంటినీ మేళవించి ఆయన తన ప్రసంగాన్ని దట్టించారు. సాధారణంగా ఆర్థిక మంత్రులు తమ బడ్జెట్ ప్రసంగాన్ని యథాతథంగా చదవడం ఆనవాయితీ. ప్రతీ ఒక్క అంశాన్నీ నొక్కి వక్కాణించి, నాటకీయత జోడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే (కరెంట్ ఫైనాన్షియల్ ఇయర్) వర్తిస్తాయి అని ఆయన పదేపదే చెప్పడం ఎన్నికల అవసరాన్ని చెప్పకనే చెప్పింది. ప్రసంగం మధ్యలో తృణమూల్ సభ్యులు కొందరు పదే పదే అరుస్తూ అడ్డుతగులుతున్నపుడు ఆయన విసుగు చెంది ఇది రామాయణాన్ని (రామ్ లీలాను) తలపిస్తోందని వ్యాఖ్యానించారు. పరోక్షంగా నిరుడు మోదీ- రేణుకా చౌదరిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యను గుర్తుచేశారు.

వెల్‌డన్.. : మోదీ ప్రశంస

దాదాపు పది నిమిషాల ముందే సభలో ప్రవేశించిన పీయూష్ గోయల్ తొలుత పార్టీ సీనియర్లయిన ఉమా భారతి, శాంత కుమార్, నితిన్ గడ్కరీల పాదాలకు మొక్కి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రసంగం ముగియగానే గోయల్ ప్రధాని వైపు చూసి ముకుళిత హస్తాలతో తన గౌరవాన్ని ప్రదర్శించారు. మోదీ లేచి ఆయన వద్దకు వచ్చి వెల్‌డన్ అని ఆయనను ప్రశంసిస్తూ వెన్ను తట్టారు. అనేక మంది బీజేపీ సభ్యులు ఆయనను అభినందించారు. వెళుతూ వెళుతూ ఆయన గ్యాలరీలో ఉన్న తన కుటుంబసభ్యుల వైపు చేయి ఊపారు. ఆయన భార్య సీమా గోయల్ అభినందనపూర్వకంగా థమ్స్ అప్ చూపి చీర్స్ చెప్పారు.

బడ్జెట్లో 'యూరీ'

భవిష్యత్ అజెండాను ఆవిష్కరిస్తూ పీయూష్ గోయల్ ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'యూరీ' గురించి ప్రస్తావించారు. "ఆ సినిమా చూస్తుంటే ఏం జోష్ వచ్చిందీ.. వాహ్.. ఆ ఎనర్జీ ఇప్పుడు కూడా నాకు వస్తోంది" అని వ్యాఖ్యానించారు. గోయల్ తన ప్రసంగంలో 'జోష్ 'అనే పదాన్ని మూడు సార్లు వాడారు. విశేషమేమంటే యూరీ గురించి గోయల్‌కు ఆయన పక్కనేకూర్చున్న బీజేపీ అగ్రనేత అద్వాణీ గుర్తు చేశారు. వికీ కౌశల్ అద్భుతంగా నటించిన ఈ చిత్రాన్ని ప్రధాని మోదీ, రక్షణమంత్రి నిర్మలా సీతారామన్, త్రివిధ దళాధిపతులు చూసి మెచ్చుకున్నారు. 2016లో ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత దళాలు జరిపిన మెరుపుదాడుల ఆధారంగా నిర్మించిన దేశభక్తి ప్రబోధాత్మక చిత్రం మొదటి 4 రోజుల్లోనే 200 కోట్లు రాబట్టి బ్లాక్ బస్టర్ అయింది. తన కుమార్తె ప్రతిభతో కలిసి అద్వానీ కూడా ఈ సినిమా చూసొచ్చారు. అందులో వికీ కౌశల్ వాడిన 'క్యా జోష్' పదం పాపులర్ అయింది. అదే మాటను పీయూష్ గోయల్ అన్నారు. బీజేపీ ఎంపీలు బల్లలు చరిచి ఉత్సాహంగా స్పందించారు. వారిలో ఈ సినిమాలో నటించిన బీజేపీ ఎంపీ పరేశ్ రావల్ కూడా ఉన్నారు. యామీ గౌతమ్, మోహిత్ రైనాలు కూడా నటించిన ఆ చిత్రానికి ఆదిత్య ధర్ దర్శకుడు.



డేవిస్ కప్ రెండో రోజు
భారత్ x ఇటలీ
ఉ. 10.30 నుంచి
-డీడీ స్పోర్ట్స్‌లో...

వెస్టిండీస్ x ఇంగ్లండ్
రెండో టెస్ట్-మూడో రోజు
రా. 7.30 నుంచి
సోనీ టెన్-1లో...

ఆస్ట్రేలియా x శ్రీలంక
రెండో టెస్ట్-రెండో రోజు
ఉ. 5 గం. నుంచి
సోనీ సిక్స్‌లో...

విండీస్‌కు ఆధిక్యం

నార్త్‌సౌండ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో వెస్టిండీస్‌కు ఆధిక్యం లభించింది. ఆటకు రెండోరోజైన శుక్రవారం కడపటి సమాచారం అందేసరికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 5వికెట్లకు 196 రన్స్ చేసింది. బ్రాత్‌వైట్ 49, క్యాంప్‌బెల్ 47 రన్స్‌చేశారు. తొలిరోజు ఇంగ్లండ్ 187 పరుగులకే ఆలౌటైంది.



ట్రోఫీతో జట్టు కెప్టెన్లు

ప్రొ.బ్యాడ్మింటన్, ప్రొ.కబడ్డీ, ప్రొ.రెజ్లింగ్.. ఇవిగాక ఫుట్‌బాల్.. దేశ క్రీడా రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తూ, ఆయా ఆటలను అభిమానులకు మరింత చేరువ చేస్తూ ఉర్రూతలూగిస్తున్న జాబితాలో వాలీబాల్ కూడా చేరింది. దేశం నలుమూలలా ప్రాచుర్యం పొందిన ఈ క్రీడ క్రేజ్‌ను మరింత పెంచడమే లక్ష్యంగా ప్రొ.వాలీబాల్ లీగ్ అభిమానుల ముందుకు వచ్చేసింది.



వచ్చేసింది వాలీ లీగ్

● నేటినుంచే ప్రొ.వాలీబాల్ ● ఆరు జట్లు అమీతుమీ ● బరిలో హైదరాబాద్ హాక్స్
● కొచ్చి వేదికగా తొలి అంచె ● ఆరంభ మ్యాచ్‌లో స్ట్రైకర్స్‌తో యు ముంబా ఢీ

రాత్రి 7 నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-3లో

ప్రొ వాలీబాల్ లీగ్ షెడ్యూల్

(మ్యాచ్‌లన్నీ రాత్రి 7 గంటల నుంచి జరుగుతాయి)

తేదీ	మ్యాచ్
ఫిబ్రవరి 2	కొచ్చి బ్లూ స్పైకర్స్ x యు ముంబా వాలీ
ఫిబ్రవరి 3	కాలికట్ హీరోస్ x చెన్నై స్పార్టన్స్
ఫిబ్రవరి 4	అహ్మదాబాద్ డిఫెండర్స్ x బ్లాక్‌హాక్స్ హైదరాబాద్
ఫిబ్రవరి 5	కాలికట్ హీరోస్ x యు ముంబా వాలీ
ఫిబ్రవరి 6	కొచ్చి బ్లూ స్పైకర్స్ x అహ్మదాబాద్ డిఫెండర్స్
ఫిబ్రవరి 7	చెన్నై స్పార్టన్స్ x బ్లాక్‌హాక్స్ హైదరాబాద్
ఫిబ్రవరి 8	కొచ్చి బ్లూ స్పైకర్స్ x బ్లాక్‌హాక్స్ హైదరాబాద్
ఫిబ్రవరి 9	కొచ్చి బ్లూ స్పైకర్స్ x కాలికట్ హీరోస్
ఫిబ్రవరి 10	కాలికట్ హీరోస్ x బ్లాక్‌హాక్స్ హైదరాబాద్
ఫిబ్రవరి 11	కొచ్చి బ్లూ స్పైకర్స్ x చెన్నై స్పార్టన్స్
ఫిబ్రవరి 12	యు ముంబా వాలీ x బ్లాక్‌హాక్స్ హైదరాబాద్
ఫిబ్రవరి 13	కాలికట్ హీరోస్ x అహ్మదాబాద్ డిఫెండర్స్
	(పై మ్యాచ్‌లన్నీ కొచ్చిలో జరుగుతాయి)
ఫిబ్రవరి 16	చెన్నై స్పార్టన్స్ x యు ముంబా వాలీ
ఫిబ్రవరి 17	చెన్నై స్పార్టన్స్ x అహ్మదాబాద్ డిఫెండర్స్
ఫిబ్రవరి 18	యు ముంబా వాలీ x అహ్మదాబాద్ డిఫెండర్స్
ఫిబ్రవరి 19	**తొలి సెమీఫైనల్**
ఫిబ్రవరి 20	**రెండో సెమీఫైనల్**
ఫిబ్రవరి 22	**ఫైనల్**

(పై మ్యాచ్‌లన్నీ చెన్నైలో జరుగుతాయి)

కొచ్చి: వాలీబాల్.. దేశ గ్రామీణ ప్రాంత యువతలో అత్యంత ఆదరణ పొందిన క్రీడ. ఈ ఆటకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు భారత వాలీబాల్ సమాఖ్య (వీఎఫ్ఐ) రూపొందించిన ప్రొ. వాలీబాల్ లీగ్ తొలి సీజన్ మొదటి అంచెకు శనివారం తెరలేవనుంది. కొచ్చితోపాటు చెన్నైలో జరిగే ఈ లీగ్‌లో ఆరు జట్లు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. లీగ్‌లో మొదటి 12 మ్యాచ్‌లు ఇక్కడ జరగనుండగా, సెమీఫైనల్, ఫైనల్ సహా ఆరు పోటీలకు చెన్నై (జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం) ఆతిథ్యమివ్వనుంది. ఫైనల్ ఈనెల 22న జరగనుంది. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో తలపడే అవకాశం ఈ లీగ్ ద్వారా భారత ఆటగాళ్లకు లభించనుందని కొచ్చి బ్లూ స్పైకర్స్ కెప్టెన్ మోహన్ ఉగ్రపాండ్యన్ చెప్పాడు. జాతీయ మాజీ ఆటగాడు పీవీ రమణారావు కుమార్తె, స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తుండడం విశేషం.

కొచ్చితో ముంబా ఢీ: రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో కొచ్చి బ్లూ స్పైకర్స్-యు ముంబా వాలీ జట్ల మధ్య పోరుతో లీగ్ ప్రారంభం కానుంది. జాతీయ జట్టు కెప్టెన్ మోహన్ ఉగ్రపాండ్యన్ నేతృత్వంలోని కొచ్చి...సొంత ప్రేక్షకుల నడుమ శుభారంభం చేయాలని తహతహలాడుతోంది. మూడు ఆసియా క్రీడల్లో పాల్గొన్న అనుభవజ్ఞుడైన ఉగ్ర.. దశాబ్దకాలంగా దేశ వాలీబాల్‌కు మూలస్తంభంగా నిలుస్తున్నాడు. ఇతని సారథ్యంలోని కొచ్చి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 28 ఏళ్ల దీపేష్ సిన్హా కెప్టెన్సీలోని యు ముంబా..తొలి పోరులోనే సత్తా చూపాలని ఆరాటపడుతోంది. జాతీయ జట్టులో మేటి బ్లాకర్‌గా ఎదిగిన దీపేష్ ఆధ్వర్యంలోని ముంబా ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చే అవకాశముంది.

విదేశీ స్టార్లు: ఒలింపిక్ మాజీ గోల్డ్‌మెడలిస్ట్ డేవిడ్ లీ, నోవికా జెలికా (అహ్మదాబాద్ డిఫెండర్స్), కార్సన్ క్లార్క్ (హైదరాబాద్ బ్లాక్ హాక్స్), పాల్ లోట్మన్ (కాలికట్ హీరోస్), రూడీ వెరోయిఫ్ (చైన్నై స్పార్టన్స్) లీగ్ బరిలో దిగుతున్న విదేశీ స్టార్లు.

జనరంజకంగా మ్యాచ్‌లు: లీగ్‌ను జనరంజకంగా మార్చి, ప్రేక్షకులను ఉర్రూతలూగించేందుకు రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ఐదు సెట్లపాటు నిర్వహిస్తున్నారు. మొదట 15 పాయింట్లు సాధించే జట్టు సెట్ గెలుస్తుంది. విజేతగా నిలిచిన జట్టుకు రెండు పాయింట్లు లభిస్తాయి. ఏదైనా జట్టు 5-0తో మ్యాచ్ గెలిస్తే 'వైట్‌వాష్'గా పేర్కొంటారు. వైట్‌వాష్ చేసిన జట్టుకు మూడు పాయింట్లు దక్కుతాయి. ప్లేఆఫ్‌లలో ఒక్కో సెట్ 25 పాయింట్లపాటు ఉంటుంది. లీగ్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చేందుకు 'సూపర్ సర్వ్', సూపర్ పాయింట్ విధానాలను ప్రవేశపెట్టారు. చక్కటి ఏస్ సర్వ్ చేసిన జట్టుకు రెండు పాయింట్లు కేటాయిస్తారు. దీనిని 'సూపర్ సర్వ్'గా పిలుస్తారు.



ప్రైజ్‌మనీ

విజేత: రూ. 50లక్షలు
రన్నరప్: రూ. 30 లక్షలు
3,4 స్థానాలకు పదేసి లక్షలు

టోర్నీ ఇలా..

రౌండ్ రాబిన్
లీగ్‌లో ఒక్కో జట్టు ఇతర జట్లతో తలపడుతుంది. లీగ్ దశలో మొత్తం 15 మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

ప్లేయర్లు

ఒక్కో జట్టులో 12మంది ఆటగాళ్లుంటారు. ఇందులో ఇద్దరు విదేశీయులు. ఇద్దరు భారత్ అండర్-21 ప్లేయర్లు తప్పనిసరిగా ఉండాలి.

అహ్మదాబాద్ సారథి.. చాలా కాస్ట్లీ..

అహ్మదాబాద్ డిఫెండర్స్ కెప్టెన్ రంజీత్ సింగ్ రూ. 13 లక్షల ధరతో లీగ్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. కొచ్చి బ్లూ స్పైకర్స్ ఆటగాడు ప్రభాకరన్ రూ. 12 లక్షలతో రెండోస్థానంలో ఉన్నాడు.

క్రీడలకు రూ. 214 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈసారి క్రీడలకు ప్రాధాన్యం పెంచింది. 2019-20కి గాను అదనంగా రూ. 214.20 కోట్లను పెంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడలకు రూ. 2216.92 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది (రూ. 2002.72) కన్నా రూ. 214.20 కోట్లు అధికం. ఇందులో భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్)కు అదనంగా రూ. 55 కోట్లు కేటాయించారు. సాయ్ పద్దు రూ. 395 కోట్ల నుంచి రూ. 450 కోట్లకు పెరిగింది. ఇక, జాతీయ క్రీడా అభివృద్ధి నిధి కేటాయింపులను ఏకంగా రూ.2 కోట్ల నుంచి రూ. 70 కోట్లకు పెంచారు. క్రీడాకారులకిచ్చే ప్రోత్సాహకాలు, పురస్కారాల నిధులు రూ. 63 కోట్ల నుంచి రూ. 89 కోట్లకు పెరిగాయి. జాతీయ క్రీడా సమాఖ్యల కేటాయింపులను రూ. 245.13 కోట్ల నుంచి రూ. 245 కోట్లకు తగ్గించడం గమనార్హం. ఖేలో ఇండియా కోసం రూ. 50.31 కోట్లు అదనంగా కేటాయించారు.

27న కాదు.. 24నే విశాఖ టీ20?

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈనెల 27న జరగాల్సిన రెండో టీ20 మ్యాచ్‌ను 24వ తేదీకి మార్చే అవకాశముంది. వాస్తవంగా సిరీస్ తొలి మ్యాచ్ ఈ నెల 24న బెంగళూరులో జరగాలి. అయితే తొలి మ్యాచ్‌ను విశాఖకు మారుస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈనెల 24న బెంగళూరులో జరగనున్న ఇంటర్నేషనల్ ఎయిర్ షోకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతుండడంతో భద్రతా కారణాల రీత్యా మ్యాచ్‌ను నిర్వహించలేమని బీసీసీఐకి కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ స్పష్టంజేసింది. దీంతో అక్కడ జరగాల్సిన తొలి మ్యాచ్‌ను విశాఖకు, 27న విశాఖలో జరిగే రెండో మ్యాచ్‌ను బెంగళూరుకు మార్చాలని బోర్డు నిర్ణయించినట్టు తెలిసింది.

తొలిరోజు ఇటలీదే

సింగిల్స్‌లో భారత్‌కు నిరాశ
డేవిస్ కప్ క్వాలిఫయర్స్

కోల్‌కతా: ఇటలీతో డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌లో భారత్‌కు తొలిరోజు చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన సింగిల్స్‌లో రెండు మ్యాచుల్లోనూ భారత ఆటగాళ్లు పరాజయం పాలయ్యారు. తొలి సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్ 4-6, 2-6తో ఇటలీ స్టార్ ఆండ్రియాస్ సెప్పి చేతిలో ఓడాడు. అనుభవజ్ఞుడైన సెప్పి ధాటికి యువ ఆటగాడు రామ్‌కుమార్ ఏమాత్రం బదులివ్వలేకపోయాడు. తర్వాత జరిగిన రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేష్ గుణేశ్వరన్ 4-6, 3-6తో ఇటలీ యువ సంచలనం మాటో బెర్రెటిని చేతిలో కంగుతిన్నాడు. దీంతో ఇటలీ 2-0 ఆధిక్యంతో మొదటిరోజే పైచేయి సాధించింది. ఫలితంగా ఇటలీని ఓడించాలంటే శనివారం జరిగే డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీతోపాటు రెండు రివర్స్ సింగిల్స్‌లోనూ భారత్ నెగ్గాలి.

ఖతార్ కొల్లగొట్టింది



అబుదాబి: అనూహ్య ఆటతో తొలిసారి ఫైనల్ చేరిన ఖతార్ జట్టు అంతే అనూహ్యంగా ఆసియా కప్ ఫుట్‌బాల్ టైటిల్‌ను కొల్లగొట్టింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో ఆ జట్టు 3-1తో ఆసియా మేటి జపాన్‌పై సంచలన విజయం సాధించింది. ఖతార్ తరపున అల్మోజ్ అలీ (12వ నిమిషం), అబ్దుల్ అజీజ్ హటెమ్ (27), అక్రమ్ ఆసిఫ్ (83వ) గోల్స్ సాధించారు. జపాన్‌కు ఏకైక గోల్‌ను 69వ నిమిషంలో మినా మినో అందించాడు.

ఆస్ట్రేలియా 384/4

కాన్‌బెర్రా: శ్రీలంకతో రెండో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియాకు అదిరిపోయే ఆరంభం దక్కింది. జో బర్న్స్ (172 బ్యాటింగ్), ట్రెవిస్ హెడ్ (161) భారీ సెంచరీలతో విజృంభించడంతో తొలిరోజైన శుక్రవారం ఆట చివరకు ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 384 పరుగులు చేసింది.

అచ్చం.. అలాగే ఓడారు!

చివరి వన్డేలో భారత మహిళలకు న్యూజిలాండ్ షాక్ ● అయినా.. 2-1తో మిథాలీ సేనదే సిరీస్



200వ మ్యాచ్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మిథాలీ



సిరీస్ ట్రోఫీతో భారత జట్టు

హామిల్టన్: విజయాల్లోనే కాకుండా అపజయాల్లోనూ భారత మహిళలు.. పురుషుల జట్టు బాటనే పట్టారు. ఆక్లాండ్, మౌంట్ మాంగనూలలో కోహ్లీ సేన విజేతగా నిలవగా ఆ వెంటనే అమ్మాయిలు కూడా అక్కడ నెగ్గారు. ఇక సెడాన్ పార్క్‌లో భారత పురుషుల జట్టుకు తొలి షాక్ తగిలినట్టుగానే.. అచ్చం మిథాలీ బృందానికి కూడా న్యూజిలాండ్ ఝలక్ ఇచ్చింది. దీంతో ఆతిథ్య జట్టును క్లీన్‌స్వీప్ చేయాలనుకున్న మహిళల ఆశలకు గండిపడింది. శుక్రవారం జరిగిన ఆఖరి వన్డేలో కివీస్ 8 వికెట్ల తేడాతో ఓదార్పు విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు ఆల్‌రౌండ్ షో కనబరచారు. అయితే ఇప్పటికే రెండు వన్డేలను నెగ్గడంతో భారత్ 2-1తో సిరీస్‌ను దక్కించుకుంది. కెప్టెన్ మిథాలీ రాజ్‌కు ఇది 200వ వన్డే మ్యాచ్. దీంతో మహిళల క్రికెట్‌లో ఈ ఫీట్ సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచింది. అన్నా పీటర్సన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్.. స్మృతి మంధానకు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ దక్కింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 44 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ అన్నా పీటర్సన్ (4/28) సుడులు తిరిగే బంతులకు.. పేసర్ తహుహు (3/26) పదునైన బౌలింగ్ తోడవ్వడంతో భారత్ కోలుకోలేకపోయింది. వీరి ధాటికి దీప్తి శర్మ (52), హర్మన్‌ప్రీత్ కౌర్ (24) మినహా అంతా విఫలమయ్యారు. స్మృతి మంధాన (1) తక్కువ స్కోరుకే పెవిలియన్‌కు చేరడంతో ఆదిలోనే షాక్ తగిలింది. జెమీమా రోడ్రిగ్స్ (12) కూడా విఫలమవడంతో వన్‌డౌన్ బ్యాట్స్‌వుమన్ దీప్తి జట్టుకు అండగా నిలిచింది. అయితే ఆమెకు ఇతరుల నుంచి పెద్దగా సహకారం అందలేదు. తన రికార్డు మ్యాచ్‌లో అద్భుత పోరాటాన్ని ప్రదర్శిస్తుందనుకున్న మిథాలీ (9) నిరాశపరిచింది. తర్వాత హర్మన్ ప్రీత్‌ను పీటర్సన్ అవుట్ చేసింది. దీప్తి.. హేమలతతో కలిసి ఐదో వికెట్‌కు 30 పరుగులు జోడించింది. 38వ ఓవర్‌లో దీప్తి అవుట్ కావడంతో భారత్ భారీ స్కోరుపై ఆశలు వదులుకుంది. అనంతరం ఛేజింగ్‌కు దిగిన కివీస్ టాపార్డర్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. ఓపెనర్ సుజీ బేట్స్ (57), కెప్టెన్ అమీ శాటర్త్‌వెయిట్ (66 నాటౌట్) అర్ధ సెంచరీలు సాధించగా 29.2 ఓవర్లలో 2 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. రెండో వికెట్‌కు ఈ జోడీ 84 పరుగుల భాగస్వామ్యం అందించగా కివీస్ మరో 124 బంతులు ఉండగానే విజేతగా నిలవడం విశేషం.

భారత్: జెమీమా రోడ్రిగ్స్ (సి) కెర్ (బి) తహుహు 12; స్మృతీ మంధాన (సి) డెవిన్ (బి) అన్నా పీటర్సన్ 1; దీప్తి శర్మ (సి) పెర్కిన్స్ (బి) అన్నా పీటర్సన్ 52; మిథాలీ రాజ్ (సి) అన్నా పీటర్సన్ (బి) కాస్పెరెక్ 9; హర్మన్‌ప్రీత్ (బి) అన్నా పీటర్సన్ 24; హేమలత (సి అండ్ బి) కెర్ 13; తన్మయ్ భాటియా (ఎల్బీ) కెర్ 0; శిఖా పాండే (సి) డెవిన్ (బి) అన్నా పీటర్సన్ 8; జులన్ గోస్వామి (నాటౌట్) 12; ఏక్తా బిస్త్ (ఎల్బీ) తహుహు 3; పూనమ్ (సి) బెజుడెన్‌హట్ (బి) తహుహు 1; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 44 ఓవర్లలో 149 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-12, 2-13, 3-39, 4-87, 5-117, 6-117, 7-129, 8-138, 9-146, 10-149. **బౌలింగ్:** తహుహు 9-1-26-3; అన్నా పీటర్సన్ 10-1-28-4; డెవిన్ 3-0-8-0; హడెల్‌స్టన్ 7-0-23-0; కాస్పెరెక్ 5-0-18-1; కెర్ 10-1-43-2.

న్యూజిలాండ్: సుజీ బేట్స్ (బి) పూనమ్ యాదవ్ 57; జోన్ (రనౌట్) 10; శాటర్త్‌వెయిట్ (నాటౌట్) 66; డెవిన్ (నాటౌట్) 17; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 29.2 ఓవర్లలో 153/2. వికెట్ల పతనం:** 1-22, 2-106. **బౌలింగ్:** జులన్ గోస్వామి 8-0-26-0; ఏక్తా బిస్త్ 5-0-29-0; శిఖా పాండే 5-0-24-0; దీప్తి శర్మ 4.2-0-19-0; పూనమ్ యాదవ్ 5-1-31-1; హేమలత 2-0-22-0.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas, *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.***





జబర్దస్త్.. జర్బరా

ఖాళీ స్థలాల్లో పూలపెంపకాన్ని ప్రోత్సహిస్తున్న ఉద్యానశాఖ • ఆదర్శంగా నిలిచిన నంద్యాల గృహిణి వినీతాదేవి

జర్బరా పూల పెంపకంతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని నంద్యాలకు చెందిన గృహిణి వినీతాదేవి నిరూపించారు. గృహాలంకరణ, బొకేలు, పెళ్లిళ్లు, శుభకార్యాల్లో అలంకరణకు ఉపయోగించే ఈ పూలను ఉద్యాన శాఖ సహకారంతో పాలీహౌస్‌లో పెంచి అధిక ఆదాయాన్ని పొందుతున్నారామె.

వైవిధ్యం



కర్నూలు జిల్లా నంద్యాలలోని బొమ్మలసత్రం క్రాంతినగర్‌లో వినీతాదేవి కుటుంబం నివాసం ఉంటున్నారు. ఇంటి ఆవరణలో సుమారు 40 సెంట్లు ఖాళీ స్థలం ఉంది. మొక్కల పెంపకం, గృహ అలంకరణలపై మొదటి నుంచి వినీతాదేవికి మక్కువ అధికం. ఇంటర్నెట్ ద్వారా జర్బరా మొక్కల ప్రాధాన్యతను తెలుసుకున్నారామె. కర్నూలు, నంద్యాల ప్రాంతానికి చెందిన ఉద్యానవన శాఖ అధికారులను వినీతాదేవి సంప్రదించారు. ఉద్యానశాఖ సహకారంతో 40 సెంట్లలో పాలీహౌస్ నిర్మించుకున్నారు. అందుకు రూ. 14 లక్షలు ఖర్చు అయ్యింది. దీనిలో 50 శాతం రూ.7 లక్షలు ఉద్యానవన శాఖ సబ్సిడీగా ఇచ్చింది. జర్బరా మొక్కల నర్సరీ పూణెలో ఉన్నట్లు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకుని ఆ సంస్థను సంప్రదించారు. ఒక్కొక్క మొక్క రూ.37 చొప్పున నంద్యాలకు రవాణా చేశారు. పూణె సంస్థ ప్రతినిధులు ప్రతినెలా నంద్యాలలోని వినీతాదేవి ఫామ్‌ను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై సలహాలు ఇచ్చారు. మొక్కలు, రవాణా ఖర్చు మీద కూడా ఉద్యానవన శాఖ 50 శాతం సబ్సిడీ ఇచ్చింది. పాలీహౌస్‌లో 40 సెంట్ల విస్తీర్ణంలో 9,500 మొక్కలు నాటారు. నాటిన 45 రోజుల నుంచి చెట్లకు మొగ్గలు వచ్చాయి. మొక్కకు బలం చేకూరేందుకు వీలుగా మూడు నెలల వరకు మొగ్గలను తుంచి వేశారు. మూడు నెలల నుంచి పూలు పూస్తున్నాయి. ఒక్కొక్క పువ్వు 4 నుంచి 6 రూపాయల ధర పలుకుతున్నది. ఏడాదికి ఒక్కొక్క మొక్క 40-50 పూలు పూస్తుందని వినీతాదేవి తెలిపారు. వినీతాదేవి వేసిన 9500 మొక్కలకు ఏడాదికి సుమారు రూ.30 లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెప్పారు. బెంగళూరు, తిరుపతి, చెన్నై వంటి నగరాల నుంచి ఈ పూలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు నేరుగా నంద్యాల వస్తున్నారు. వినీతాదేవి నర్సరీని ఆదర్శంగా తీసుకుని పలువురు పాలీహౌస్‌లో జర్బరా పూల సాగుపై దృష్టి పెట్టారు. సాగునీటి వనరులు లేని, వర్షాభావ ప్రాంతమైన రాయలసీమలో ఓ గృహిణి పూల ద్వారా రూ. లక్షల్లో ఆదాయం పొందడం హర్షణీయం. రాష్ట్రంలోని విశాఖ, చిత్తూరు, కడప, అనంతపురం, తూర్పుగోదావరి, ప్రకాశం, నెల్లూరు, విజయనగరంలో ఎక్కువగా; కృష్ణా, గుంటూరులో స్వల్పంగా జర్బరా పూలను సాగు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర నగరాల్లో ఈ పూలకు మంచి గిరాకీ వుంది. కాడ మీటరు పొడవు ఉంటే జర్బరా పూలు ఎగుమతులకు పనికి వస్తాయని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. పాలీహౌస్ ప్రధానంగా పూలు, కూరగాయల పెంపకానికి ఎంతో అనుకూలం. ఒకసారి పాలీహౌస్ ఏర్పాటుచేస్తే దానిలో 15 ఏళ్ళ వరకు వివిధ రకాల పంటలు పండించవచ్చని ఉద్యాన శాఖ అధికారులు చెప్పారు. జర్బరా పూలమొక్కలు ఒకసారి వేస్తే మూడేళ్ళ వరకు పూలు వస్తాయి.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు

మంచి ఆదాయం



ఇంటర్నెట్‌లో జర్బరా మొక్కల గురించి తెలుసుకున్నాను. పూణెలో వున్న సంస్థతో చర్చించి మొక్కలు తెప్పించాను. ఆ సంస్థ వారే నిరంతరం సహకారం అందించారు. ఉద్యాన శాఖ సహకారంతో మంచి ఆదాయం పొందుతున్నాను. విరబూసిన పూల తోటను చూసేందుకు పలువురు రావడం సంతోషంగా వుంది.

- జూపల్లి వినీతాదేవి, పూలతోట యజమాని

సాగులో ఇద్దరు మిత్రులు!

షేడ్‌నెట్‌లో 14 రకాల కూరగాయల సాగు.. ఆధునిక పరిజ్ఞానంతో అద్భుత ఫలితాలు

ఇద్దరు మిత్రుల కలిసి సాగులో నూతన ఒరవడి సృష్టించారు. 2 ఎకరాలలో షేడ్‌నెట్‌లో 14రకాల కూరగాయలు, వివిధ రకాల మొక్కలను సాగుచేస్తూ ఆదర్శంగా నిలిచారు. వ్యవసాయక్షేత్రంలోనే పండిన కూరగాయలను, నర్సరీ మొక్కలను విక్రయిస్తూ అధిక లాభాలు గడిస్తున్న వారి ప్రస్థానం.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన నల్లబోతు వేణుగోపాల్, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముళ్ళపాడు గ్రామానికి చెందిన అంబటి శేఖర్‌రెడ్డి డిగ్రీ వరకు చదువుకొని నాలుగేళ్ల పాటు ఓ విత్తన కంపెనీలో ఉద్యోగులుగా పనిచేశారు. ఇద్దరి మధ్యా మంచి స్నేహం కుదిరింది. ఎంతకాలం ఉద్యోగం చేసినా ఉపయోగం లేదనుకున్నారు. ఇద్దరికీ ఇష్టమైన వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టాలనుకున్నారు. విత్తన కంపెనీలో పనిచేసే సమయంలో వారిద్దరికీ ప్రకాశం జిల్లా రైతులతో విస్తృత పరిచయాలు ఏర్పడ్డాయి. దాంతో ఆ జిల్లాలోనే వ్యవసాయక్షేత్రం ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామం పక్కన ఐదెకరాల భూమిని ఎకరాకు రూ.25వేల చొప్పున పదేళ్ల పాటు కౌలుకు తీసుకున్నారు. అందులో రెండు ఎకరాలలో రూ.70 లక్షల వ్యయంతో షెడ్‌నెట్ ఏర్పాటు చేశారు. షెడ్‌నెట్‌లో క్యాప్సికం, యూరోపియన్ కుకుంబర్, రెడ్ క్యాబేజి, బ్రకోలి, చెర్రీ, టమోటా, పుచ్చ, బేబీకార్న్, క్యాబేజి, క్యాలీఫ్లవర్, బజ్జిమిర్చి, ఉల్లి, బీన్స్, కొత్తిమేర, చామంతి, బంతిపూల తోటలను గత ఏడాది సాగుచేశారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను పండిస్తున్నారు. యూపీకి చెందిన వేస్ట్ డీకంపోజర్, జీవామృతం, ఘనామృతం, వర్మి కంపోస్టు, పశువుల ఎరువులు ఉపయోగించి, స్వచ్ఛమైన, నాణ్యమైన కూరగాయలు పండిస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా షెడ్‌నెట్ కింద పుచ్చ సాగుచేస్తున్నారు. ఇంటర్నెట్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకొని దాన్ని సాగులో ఉపయోగిస్తున్నారు. అలానే ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతున్నారు. పంటలకు నేరుగా బోరు వాటర్ పెట్టకుండా కుంట ఏర్పాటు చేశారు. కుంటకు నీటిని శుద్ధి చేసే ఎలక్ట్రానిక్ వాటర్ సాఫ్టనర్ మిషన్ ఏర్పాటుచేసి మిషన్ ద్వారా మొక్కలకు, పంటలకు నీరు పెడుతున్నారు. ఈ మిషన్‌ను రూ. 60 వేలకు జపాన్ నుంచి తెప్పించారు. ఈ విధానం వల్ల నీటిలో మొక్కలకు హానిచేసే కణాలు చనిపోతాయి. వినూత్న పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను తిలకించేందుకు వివిధ జిల్లాల నుంచి నిత్యం సందర్శకులు వస్తున్నారు. ఇక్కడకు వచ్చిన సందర్శకులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేయడమే కాదు ఆ పంటలను కొని తీసుకువెళుతున్నారు. ఇటీవల రాష్ట్ర మాజీ డీజీపీ సాంబశివరావు దంపతులు వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. విజయవాడకు చెందిన 10 మంది డాక్టర్లు ఇక్కడకు వచ్చి చూసిన తర్వాత ప్రతి వారం ఇక్కడ నుంచే కూరగాయలు తీసుకెళ్తున్నారు. ఒంగోలుకు చెందిన కూరగాయల వ్యాపారులు ఇక్కడ నుంచి తీసుకెళ్లి వ్యాపారం చేసుకుంటున్నారు. రసాయన మందులు, ఎరువులు వాడకుండా పండిస్తున్న కూరగాయలకు విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ తక్కువ ధరలకే విక్రయించడం ఈ ఇద్దరి మిత్రుల ప్రత్యేకత.

రెండేళ్లలో పెట్టుబడి రాక

షెడ్‌నెట్ ఏర్పాటుకు, పంటల సాగుకు సుమారు రూ.70 లక్షలు ఖర్చయింది. ఉద్యానశాఖ ద్వారా రూ.22 లక్షలు సబ్సిడీ వచ్చింది. ఈ ఏడాది నర్సరీ మొక్కల పెంపకం ద్వారా రూ.10 లక్షలు, కూరగాయల సాగు ద్వారా రూ.6 లక్షలు ఆదాయం వచ్చింది. రెండేళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందని ఈ మిత్రులు ధీమా వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి, దర్శి

కొత్తదారిలో నడిస్తేనే లాభాలు





ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటే తప్ప సాగు లాభదాయకం కాదు. 65 సెంట్లలో ఉల్లి సాగు చేసి 10 టన్నుల దిగుబడి సాధించాం. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా షేడ్‌నెట్‌లో పుచ్చకాయలు సాగు చేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయడం ఎంతో సంతృప్తినిస్తున్నది. దిగుబడులు ఆశాజనంగా ఉన్నాయి. షేడ్‌నెట్‌లో తెగుళ్ల మచ్చుకైనా కనిపించడం లేదు. భవిష్యత్‌లో మరింత వినూత్న పంటలు సాగు చేయాలని ఆలోచిస్తున్నాం. ఉద్యాన శాఖ అధికారులు ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నారు.

- నల్లబోతు వేణుగోపాల్, అంబటి శేఖర్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వాతావరణాధారమైన వ్యవసాయ సూచనలు చేస్తున్నారు.

సలహా

మినుములో తెల్లదోమకు చెక్





మినుము, పెసర పంటల్లో తెల్లదోమ ఆకులలోని రసాన్ని పీల్చడమే కాక పల్లాకు తెగులును వ్యాపింపజేస్తుంది. ఈ తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.5 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ 1.0 గ్రా. లేక ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ. లేక ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేక థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేక మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మిథైల్ ఓ డెమటాన్ 2.0 మి.లీ. ఏదైనా ఒక మందును ఒక లీటరు నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలి.

తామర పురుగులు : ఈ పురుగు పైరు తొలిదశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చివేయడమే కాకుండా ఆకుముడత అనే వైరస్‌ను వ్యాపింపజేస్తుంది. దీని నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ., లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఏదో ఒక మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మారుకా మచ్చల పురుగులు : పూత, పిందె దశలో ఉన్న పంటలో 'మారుకా' గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. పంటలో 35 రోజుల వయసులో వేపనూనె/ వేప గింజల కషాయం పిచికారీ చేస్తే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పూత సమయంలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేక క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేక ఎసిఫేట్ 1 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పైరులో గూళ్ళు ఎక్కువగా ఉంటే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లలో ఏదైనా ఒక మందుతో పాటు డైక్లోరివాస్ (నువాన్) 1.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఎక్కువగా ఉంటే కోరాంట్రనిలిప్రోల్ 20 ఎస్.సి., 0.3 మి.లీ., లేక ఫ్లుబెండిఎమైడ్ 0.2 గ్రా. లేక ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. మందులో ఏదైనా ఒక దానిని పిచికారీ చేసుకోవచ్చు.

మరిన్ని సలహాల కోసం రైతులు 1800-425-0430 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

మొబైల్

కూరగాయల స్టాల్స్

- ఎన్నారై ఆర్థిక సాయం
- ఉద్యానవన శాఖ ద్వారా పేదలకు పంపిణీ

కూరగాయలు పండించే రైతుకు మెరుగైన ధర రావడంతో పాటు వినియోగదారునికి తక్కువ ధరకు తాజా సరుకు అందాలి. ఈ రెంటి మధ్య ఉన్న దళారి వ్యవస్థను తొలగించాలనే లక్ష్యంతో ఉద్యానవన శాఖ ఫాంటు హౌస్ అనే నినాదంతో కొత్త పథకం చేపట్టింది.



కొత్తబాట

పొలంలోని కూరగాయలను నేరుగా వినియోగదారుని ఇంటికి చేర్చేందుకు ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి కృషి చేస్తున్నారు. నాబార్డు, స్పైసెస్ బోర్డు, జాతీయ, రాష్ట్ర హార్టికల్చర్ మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా పథకం, ఇతర పథకాల ద్వారా వీటిని అమలు చేస్తున్నారు. పొలంలోని కూరగాయలను అమ్మకాల కేంద్రాలు, గిడ్డంగులకు చేర్చడానికి 50 శాతం సబ్సిడీపై ఆటో ట్రాలీలు సరఫరా చేస్తున్నారు. ఎఫ్‌పివోలకు 75 శాతం సబ్సిడీపై వీటిని అందిస్తున్నారు. దీనిలో భాగంగానే మొబైల్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. చిన్న చిన్న కూడళ్లలో సంచార కూరగాయల కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. కూడళ్లలో చిన్న గొడుగు పెట్టి ఎలా అయితే మొబైల్స్ తదితర వస్తువులను విక్రయిస్తున్నారో అదే రీతిలో కూరగాయల విక్రయశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఒంటరి మహిళలకు జీవనోపాధి కల్పించే లక్ష్యంతో అపార్ట్‌మెంట్‌లు, కూడలి ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసే పథకాన్ని ఉద్యాన శాఖ ప్రవేశపెట్టింది. సంచార విక్రయశాల ఏర్పాటుకు రూ. 8వేల నుంచి రూ.10వేలు ఖర్చవుతుంది. దీనిలో 50 శాతం ఉద్యానవన శాఖ సబ్సిడీగా ఇస్తుంది. ఇప్పటివరకు ఒంటరి మహిళలకు ఆయా జిల్లాల్లో ఉద్యానవన శాఖ ద్వారా వీటిని అమలు చేశారు. తాజాగా తిరుపతికి చెందిన ఒక ఎన్నారై సీఆర్ఎస్‌లో భాగంగా సంచార కూరగాయల విక్రయశాలల్లో 50 శాతం చెల్లించేందుకు ముందుకు వచ్చారు.

అమెరికాలోని కాలిఫోర్నియాలో సుమారు 15 ఏళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన ఎం.సూర్యబాబు పదేళ్ల క్రితం తిరుపతిలో ఫాం డైరెక్ట్ ఇంఫెక్స్ (ఎఫ్‌డిఐ) సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా కూరగాయలను ఎగుమతి చేస్తుంటారు. కార్పొరేట్ రెస్పాన్సిబుల్ స్కీమ్ (సీఆర్ఎస్) ద్వారా సంచార విక్రయశాలలకు 50 శాతం సమకూర్చడానికి ఆయన ముందుకు వచ్చారు. దీంతో ఉద్యానవన శాఖ 50 శాతం, ఫాం డైరెక్ట్ ఇంఫెక్స్ సంస్థ ఛైర్మన్ సూర్య 50 శాతం భరించే విధంగా ఒక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఈ పథకం కింది ఇకపై సంచార కూరగాయల స్టాల్స్‌ను ఉచితంగా లబ్ధిదారులకు అందజేస్తారు. రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న పలు రైతు కుటుంబాలను ఈ పథకం ద్వారా ఆదుకోవాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. ప్రధానంగా ఒంటరి మహిళలు, ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల సభ్యులకు వీటిని ఉచితంగా అందిస్తారు. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యాన పంటలు, అనుబంధ ఉత్పత్తుల ఎగుమతులు చేసే వారి సాయం తీసుకొని సంచార కూరగాయల విక్రయశాలలను ఏర్పాటు చేస్తారు. ఈ విక్రయశాలలకు సబ్సిడీపై ఇచ్చిన ట్రాలీ ఆటోల ద్వారా కూరగాయలు చేరే విధంగా ప్రణాళికలు తయారు చేశారు.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు

లాభాలు రైతులకే...



పదేళ్ల నుంచి కూరగాయలు, అనుబంధ ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాం. తద్వారా వచ్చే లాభాన్ని రైతులకే తిరిగి ఇవ్వాలని సంకల్పించాం. ఉద్యానవన శాఖ సంచార కూరగాయల విక్రయశాలకు 50 శాతం సబ్సిడీ ఇస్తుంది. మా సంస్థ ద్వారా మిగిలిన 50 శాతం సబ్సిడీ ఇస్తాం. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలు, ఒంటరి మహిళలకు ఇది ఎంతో ఉపయోగంగా వుంటుంది.

- సూర్యబాబు, ఎఫ్‌డిఐ డైరెక్టర్

దళారులను తొలగించడానికే



కూరగాయలు పండించే రైతులకు సరైన ధర రావడం లేదు. వినియోగదారుడు మాత్రం ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తున్నది. దళారీ వ్యవస్థను నిర్మూలించి పొలం నుంచి కూరగాయలు నేరుగా వినియోగదారుడికి చేరవేసేందుకు వీలుగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను అనుసంధానం చేస్తున్నాం. సంచార కూరగాయల విక్రయశాలలను పేదల చేత ఏర్పాటు చేయిస్తాం.

- చిరంజీవి చౌదరి, ఉద్యానవన శాఖ కమిషనర్

చలి వేళలో మొక్కలు భద్రం

వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చినప్పుడు మొక్కల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటున్నారు ప్రముఖ మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి.





మిద్దెతోట

ఒక్కోసారి వాతావరణంలో హఠాత్తుగా మార్పులు కలుగుతాయి. ఏదైనా మార్పు క్రమంగా సాగితేనే, దాన్ని తట్టుకునే సామర్థ్యం క్రమంగా పెరుగుతుంది. వాతావరణంలో జరిగే హఠాత్పరిణామాలకు మొక్కలు ఇబ్బంది పడతాయి. గత వారం రోజులుగా తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. చలి తగ్గుముఖం పడుతుందని అనుకుంటున్న వేళ అకాల వర్షాలు కురిసి, చలి తీవ్రత పెరిగింది. మనుషులమైన మనమే దీనికి ఎంతో ఇబ్బంది పడుతున్నాం. ఇక మొక్కల సంగతి చెప్పనక్కరలేదు. జనవరి మధ్య నుండి ఫిబ్రవరి దాకా వేసవికాలపు కూరగాయలను పండించడానికి విత్తుకునే సమయం. చాలామంది విత్తనాలను విత్తుకోవడం, నార్లను నాటుకోవడం చేశారు. అవన్నీ మొలిచి మారాకు దశలో ఉన్నాయి. ఇంతలో తిరిగి చలి పెరిగింది. ఇలా వాతావరణంలో హఠాత్పరిణామాలు జరిగితే మనం ఏం చర్యలు తీసుకోవాలో తెలుసుకుందాం. మిద్దెతోటల వారైనా, పెరటి తోటల వారైనా, చివరకు రైతులైనా సదా అప్రమత్తంగా ఉండాలి. హఠాత్తుగా వర్షాలు ప్రారంభం కాగానే మిద్దెమీదకు వెళ్లి చూడాలి. లేత మొక్కల మీద తగినంత ఎత్తు ఏదైనా పెట్టి పోలిథిన్ షీట్ కప్పాలి. వర్షం ధాటికి మొక్కలు దెబ్బ తినకుండా చూడాలి. మడులు, కుండీల్లో నీరు నిలవకుండా చూడాలి. వాటి డ్రైనేజీ హోల్స్ పూడుకుపోతే క్లియర్ చెయ్యాలి. తీగజాతులు పడిపోకుండా కొబ్బరి నులకతో సపోర్టుగా కట్టాలి. చిన్న చిన్న ట్రేలలో ఉన్న లేత మొక్కలను వర్షం పడకుండా నీడకు తీసుకువచ్చి పెట్టాలి. వర్షం తగ్గగానే తిరిగి బయటపెట్టాలి. చలి తీవ్రత నుంచి లేత మొక్కలకు రాత్రుళ్లు రక్షణ కల్పించాలి. వాటిపై రాత్రిపూట పోలిథిన్ షీట్ కప్పాలి. ఉదయం కాగానే తీసెయ్యాలి. అప్పుడు చలి నుండి వాటికి కొంత ఉపశమనం కలుగుతుంది. రోజూ మొక్కలకు నీరు పెట్టకూడదు. పగలు టెర్రస్ మీదకు వెళ్లి అన్ని మొక్కలను చూడాలి. నీరు అవసరం ఉన్న మొక్కలు వడలి కనిపిస్తాయి. వాటికి మాత్రమే నీరు పెట్టాలి. చలి తీవ్రంగా ఉన్నన్ని రోజులు మొక్కలకు మధ్యాహ్నం నీరు పెట్టడం మంచిది. అలా వీలుకాని వారు, ఉదయం పూట బోర్ వెల్ మోటర్ ఆన్ చేసి డైరెక్టుగా భూగర్భంలోంచి వచ్చే గోరువెచ్చని నీరు పెట్టాలి. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లోని నీరు చల్లగా ఉంటుంది కనుక పెట్టకూడదు. చలి కాలంలో సాయంత్రం నీరు పెట్టకూడదు. అధిక వర్షాలకు, చలికి కొన్ని విత్తనాలు సరిగా మొలవవు. వాటి స్థానంలో విత్తనాలను తిరిగి నాటుకోవాలి. ఎక్కువ రకాలను నాటుకుంటే కొన్ని మొలవకపోయినా మరికొన్ని పనికివస్తాయి.